RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 19 Issue No. 2 (1) Monthly February (1) 2022 ISSN No. : 2456-4702 Rs. : 15/-



## ఆచార్య ఎండ్లూరి సుధాకర్




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 19 - Issue. 2(1) - February 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



**EDITORIAL BOARD**

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San).,
M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil
(Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics
and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.


గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**


Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# ఆచార్య ఎండ్లూరి సుధాకర్

దళిత సాహిత్య వారధి, బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య ఎండ్లూరి సుధాకర్. నిబద్ధతకు మారుపేరు. నిజాయితీ బాటలో నడిచిన ధీశాలి. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం మూర్తీభవించిన వ్యక్తిత్వం ఎండ్లూరి సుధాకర్‌కే సొంతం.

ఆచార్య ఎండ్లూరి సుధాకర్ 1959వ సంవత్సరం జనవరి 21వ తేదీన నిజామాబాద్‌లోని పాములబస్తీలో దేవయ్య, శాంతాబాయి దంపతులకు ప్రథమ సంతానంగా జన్మించారు. హైదరాబాద్ వీధి బడిలో ప్రారంభమైన చదువు విశ్వవిద్యాలయం వరకు హైదరాబాద్‌లోనే సాగింది. నల్లకుంట్ల ప్రాచ్య కళాశాలలో ఓరియంటల్ విద్య, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ., ఎం.ఫిల్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పి.హెచ్‌డి చేశారు. సామాన్యమైన ఉపాధ్యాయ స్థాయి నుండి అసామాన్యమైన విశ్వవిద్యాలయ ఆచార్య స్థాయికి ఎదిగి ఒదిగి నిలిచారు. సికింద్రాబాద్‌లోకి వెస్లీ బాయ్స్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడి గాను, అంచెలంచెలుగా ఎదుగుతూ విశ్వవిద్యాలయం స్థాయికి చేరుకుని సహాయ ఆచార్యులుగా, సహ ఆచార్యులుగా, ఆచార్యులుగా, శాఖాధిపతులుగా వ్యవహరించారు. రాజమండ్రి సాహిత్య పీఠానికి ఆచార్యులుగా, డీన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా పనిచేస్తున్నారు. 2004వ సంవత్సరం నుండి 2011 సంవత్సరం వరకు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించే 'వాఙ్మయి' సాహిత్య పత్రికకు సహాయ సంపాదకుడిగా, సంపాదకుడిగా వ్యవహరించారు.

డా॥. అంబేడ్కర్, జాషువా వంటి ప్రముఖులు అనుభవించిన కుల ఛీత్కారాలే సుధాకర్ అనుభవించి ఉంటారు. అందుకే వీరి రచనలన్నీ దళిత సాహిత్య స్ఫూర్తిని కలిగిస్తాయి. సుధాకర్ రచనపై జాషువా ప్రభావం మెండుగా ఉంది. జాషువా గబ్బిలానికి మారుగా కొత్త గబ్బిలాన్ని సుధాకర్ సృష్టించాడు. తెలుగు దళిత వాద కవిత్వంలో తనదైన ముద్ర వేసుకున్న ఎండ్లూరి సుధాకర్ సుప్రసిద్ధ రచనలు వర్తమానం, కొత్త గబ్బిలం, నా అక్షరమే నా ఆయుధం, మల్లెమొగ్గల గొడుగు, నల్లద్రాక్ష పందిరి, వీర్గకరణీయం, గోసంగి, కథానాయకుడు జాషువా, తొలివెన్నెల మొదలైనవి. నేటికి అనేకమంది సుధాకర్ గారిని అనుసరిస్తూ రచనలు చేస్తున్నారంటే ఆయన ప్రభావం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తోటి కవుల పట్ల సహృదయతే తప్ప అసూయ ఎరగని వ్యక్తిత్వం ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండగలగడం వీరికి మాత్రమే సాధ్యం.

ఎండ్లూరి సుధాకర్ కవిత్వానికి కొత్త వస్తువును, పదజాలాన్ని, ఉపమా ప్రపంచాన్ని మొత్తంగా క్రొత్త దృష్టినిచ్చాడు. ఈయన చేసిన కవితా ప్రయాణం, పరిణామం అర్థవంతమైనది. 'నేనింకా నిషిద్ధ మానవుడే' అన్న స్వస్వరూప జ్ఞానం కలిగిన మనిషి కోరుకునేది విముక్తినే. సంప్రదాయాలను ధిక్కరించడం, హద్దులను అధిగమించడం, బందిఖానాలను బద్దలు కొట్టడం అనివార్యంగా జరగవలసినవే వాటికి రకరకాల వ్యక్తీకరణాలు ఆయన కవితలు. సుధాకర్ దళిత శ్రామిక స్త్రీని కావ్య నాయికగా ప్రతిపాదించిన తీరు స్త్రీల ఆత్మగౌరవ పతాకను ఎగరేసినట్లుగా ఉంటుంది.

సుధాకర్ 2011 సంవత్సరంలో గోసంగి అనే దళజత దీర్ఘకావ్యం ప్రచురించారు. ఆముక్త మాల్యదలోని మాలదాసరి కథగా ప్రసిద్ధమైన దానిని క్రొత్త దళిత అవగాహనలో వచన కావ్యంగా తిరిగి వ్రాశారు. వీరు జాతీయ, అంతర్జాతీయ, విదేశీయ సాహిత్య సదస్సులో పాల్గొన్నారు. అమెరికా తెలుగు అసోసియేషన్‌లో జరిగిన పలు సాహిత్య సభల్లో ప్రసంగించారు. 2011 డిసెంబర్ 8, 9, 10 తేదీల్లో మారిషస్‌లో ప్రపంచ తెలుగు సదస్సుకు హాజరైయ్యారు. 2014 మే లో అమెరికాలోని న్యూజెర్సీ సిటీలో సిలికాన్ ఆంధ్రా ద్వారా మనబడి కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు.

ఎండ్లూరి సుధాకర్ గారి సహధర్మచారిణి ప్రముఖ స్త్రీవాద రచయిత్రి, సమాజ సేవకురాలు స్వర్గీయ పుట్ల హేమలత గారు. వీరు 2019 సంవత్సరంలో భువి నుండి దివికేగారు. అప్పటినుండి సుధాకర్ ఆమెపై వాత్సల్యంతో స్మృతి కావ్యాలే రాస్తున్నారు. సుధాకర్ హేమలత గార్ల సంతానం. ఎండ్లూరి మానస, మనోజ్ఞ, ఎండ్లూరి మానస యువకథా రచయిత్రి. ఆమె రాసిన 'మిళింద' కథా సంపుటికి 2020 సంవత్సరంలో కేంద్ర సాహిత్య యువ పురస్కారం లభించడం విశేషం. మానస తల్లిదండ్రులకు తగ్గ తనయగా పేరు పొందింది.

ఎండ్లూరి సుధాకర్ తన సాహిత్య ప్రస్థానంలో ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు.

- 1980 లలిత కళా పరిషత్ పురస్కారం.
- 1994-95 మ్యాన్ ఆఫ్ ది ఇయర్ రాజమండ్రి.
- కవి కోకిల జాషువా పురస్కారం.
- 2002 అమెరికా తెలుగు అసోసియేషన్ ఎ.టి.ఎ, డల్లాస్.
- 2002 సినారే పురస్కారం.
- 2007 ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘ పురస్కారం.
- 2012 కవి జాషువా సాహిత్యం ఎ.పి ప్రభుత్వం.
- 2007 ఉగాది విశిష్ట సాహిత్య పురస్కారం.

కవి కోకిల జాషువా పురస్కారం.

కేంద్ర సాహిత్య అకాడమీ జ్యూరీ సభ్యుడిగా, తెలుగు సలహా మండలి సభ్యుడిగా, తెలుగు అకాడమీ సభ్యుడిగా, ప్రసిద్ధ హిందీ, ఉర్దూ పద్యాల లఘు చిత్రాల అనువాదకుడిగా, బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అశేష పాఠక జనాన్ని తన కలంతో కట్టిపడేసిన సుధాకర్ గారు ప్రస్తుతం హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా పనిచేస్తూ 2020 సంవత్సరం జనవరి 28వ తేదీన తుదిశ్వాస విడిచారు. గుర్రం జాషువా అనంతరం అంతటి విశాల హృదయం భావుకత సుధాకర్ గారిలోనే కనబడుతుందంటే అది అతిశయోక్తి కాదు.

\- సంపాదకవర్గం

BHAVAVEENA
Vol. 19, Issue. (1), February 2022
ISSN No. 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# Contents (విషయ సూచిక)


| | | |
|---|---|---|
| 1. ముదిగంటి సుజాతారెడ్డి కథలలో మానవీయ విలువలు... | - చింతరెడ్డి భాస్కరరెడ్డి | 6 |
| 2. పోతన 'భాగవతం' భక్తితత్త్వం | - దేవులపల్లి సాయికృష్ణ | 10 |
| 3. పిల్లల కథలు - ప్రయోజనాలు | - డా॥ గెంజి అరుణ | 20 |
| 4. సినారె సాహిత్యం - మానవీయ దృష్టికోణం | - డా॥ జరుపుల రమేష్ | 23 |
| 5. అన్ని రంగాలలోను లింగ వివక్షత | - డా॥ ఇ. కోన ప్రభ &<br>- డా॥ కె. హైమావతి | 31 |
| 6. కథానిక లక్షణాల ఛట్రంలో 'సావుకూడు' కథానిక - ఒక విశ్లేషణ | - డా॥ కొయ్యా శ్రీనివాసులు | 37 |
| 7. తెలుగు నిఘంటువుల్లో భావార్థక నామరూపాల పరిశీలన | - యం. ప్రసాద్ నాయక్ | 42 |
| 8. ఐన్‌స్టీన్ - భారతీయ తాత్త్వికత | - డా॥ మంచికంటి శేషకుమార్ | 46 |
| 9. పోతులూరి వీరబ్రహ్మం కవిత్వం - విశ్వదార్శనికత | - డా॥ పి. విజయకుమార్ | 51 |
| 10. రంగినేని సుబ్రహ్మణ్యం సాహిత్యం - పరిచయం | - కె. ఎల్లప్ప | 54 |
| 11. నవలా రచయిత్రి - చలసాని వసుమతి | - గుమ్మడిదల మురళీకృష్ణ | 58 |
| 12. రమణ మహర్షి ప్రబోధ సాహిత్యం - వ్యక్తిత్వ వికాసం | - పి. రామకృష్ణ | 61 |
| 13. కన్నడ భాషలో భారతేతిహాసం | - డా॥ వి. పళని | 68 |
| 14. నిషిద్ధాక్షి - సామాజిక చైతన్యం | - ఉషారాణి పిల్లి | 75 |
| 15. శ్రీ లోగిశ లక్ష్మీనాయుడు 'మహానద' కథలోని పర్యావరణ... | - శివయ్య రాజులపాటి | 78 |
| 16. గ్రామీణ ప్రజల మానసిక ఉల్లాస క్రీడలు - విశ్లేషణ | - రామావత్ రజిత | 84 |
| 17. 'శ్రీధర్ శతకం'లో చైతన్య స్పృహ | - తిరునగరి శరత్‌చంద్ర | 88 |
| 18. ప్రాచీన సాహిత్యం - మానవతా విలువలు | - ఉల్లెంగ ముత్యం | 91 |
| 19. "వ్యాపార మృగం" కథల సంపుటి - ప్రపంచీకరణ - సామాజికావిష్కరణ | - డా॥ వి. శాంతిలక్ష్మి | 95 |
| 20. తెలుగు భాషను విస్మరిస్తోన్న రాష్ట్ర ప్రభుత్వాలు | - వై. శివకుమార్ | 100 |
| 21. ఎరుకల పుట్టుక - జీవన విధానం | - ఎన్. రాజేష్ కుమార్‌రెడ్డి | 103 |
| 22. సమ్మక్కా - సారక్కా జాతర - విశిష్టత | - డా॥ పెండ్యాల లావణ్య &<br>- డా॥ బూసి వెంకటస్వామి | 114 |
| 23. ఆచార్య యస్వీ జోగారావు సాహితీ జీవితం | - ఆచార్య వెలమల సిమ్మన్న | 123 |
| 24. దిగంబర కవితోద్యమం - నేపథ్యం | - డి. ప్రవీణ్ కుమార్ | 123 |
| 25. పోతన భాగవత దశమస్కంధంలో దశావతారాల ప్రస్తావన | - డా॥ అల్లు గణేష్ | 125 |
| 26. వేదాంగాలు - విషయ వివేచన | - డా॥ డి. ఉదయకుమారి | 129 |
| 27. "ఈ కోతి ఈ డ్రామాకు పనికొస్తుందా?" చూద్దాం రండి | - డా॥ గుండ్లూరు వెంకట రమణ | 135 |
| 28. మాతృదేవో భవ | - డా॥ దేవినేని జ్యోతి | 137 |
| 29. రాయలసీమ రచయిత్రుల జీవన నేపథ్యం | - కోడూరు జయప్రకాష్ | 140 |
| 30. ప్రాచీన పద్యం - స్త్రీ పాత్ర చిత్రణ | - జక్కె పద్మ | 145 |
| 31. పోతన భాగవతము - నవవిధ భక్తి మార్గాలు | - డా॥ జి. శ్రీనివాసరావు | 150 |
| 32. శైవ సాహిత్యంలో అష్టావవరణముల విశిష్టత | - డా॥. మఠపతి మాంతయ్య | 153 |

BHAVAVEENA
Vol. 19, Issue. 2(1), February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ముదిగంటి సుజాతారెడ్డి కథలలో మానవీయ విలువలు - సమగ్ర పరిశీలన

- చింతరెడ్డి భాస్కర్‌రెడ్డి, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా.

మన భారతీయ సంస్కృతి విశ్వంలో ఘనతగాంచింది. ఇందులో నైతిక విలువలు నాగరికత విశిష్టతను ఎత్తి చూపిస్తాయి. మన సంస్కృతి సాహిత్య సంప్రదాయాలలో మానవతా విలువలు వెల్లివిరిసి ప్రతిబింబిస్తాయి. అవి జాతి ఔన్నత్యానికి ఆసరాయై అద్దంపడతాయి. మన సంస్కృతి ఆదినుండీ మానవతా పరిమళాలను వెద జల్లుతూ మానవునిలో మార్పును తీసుకొచ్చే మంచిని పెంచుతూ పంచుతూ ఆదర్శంగా ఆవిష్కృతమై అగ్ర పూజనందుకుంటుంది. కావుననే ప్రపంచంలో అసలైన మానవత్వం ఎక్కడుందని ఎవరైనా ప్రశ్నిస్తే అది ఒక్క భారతదేశంలోనే మిగిలి ఉందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

'అహింసా పరమో ధర్మః' అన్నది మన వేదం. అదే మన వాదం, నాదంగా నిల్చింది. 'ఆత్మవత్ సర్వ భూతాని,.......' అని నినదిస్తాయి మన గీతాది గ్రంథాలు. పరోపకారమే పుణ్యమని, పరులను పీడించడమే పాపమని అష్టాదశ పురాణాల సారాంశం అని వ్యాస మాహర్షి ప్రకటించాడు.

నిరుపేదలకు, నిర్భలులకు, రోగులకు, అనాథలకు ధైర్యం కోల్పోయిన వారికి, ఆపదల్లో కొట్టుమిట్టాడే వారికి కాస్తంత ధైర్యాన్ని, ఆశను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిం చడమే మానవత్వం అని పెద్దలు అంటారు.

మానవుడిలో మానసిక మార్పు తేవడం చాలా ముఖ్యమైనది.

- వేమన

మనుషులు సూదిలా ఉండకూడదని, దారంలా ఉండాలని, సూది పని రంధ్రాలు చేయడమే కానీ దారం ఆ రంధ్రాలను కప్పుకొని వెళ్తుంది.

- తుమ్మల సీతారామమూర్తి చౌదరి

తల్లిదండ్రి లేని బిడ్డను జూచి
కన్నీరు, దానంబు చేయు నేత్రములు నావి
కఠిన చిత్తుల దురాగతముల ఖండించి
కనికరమొలికించు కలము నాది

- మహాకవి జాషువా

'సొంత లాభం కొంతమానుకో, పొరుగువారికి తోడు పడవోయ్'

- గురజాడ అప్పారావు

ఏ కులము వెన్నెలది ? తుమ్మెదలెట్టి జాతికి చెంది నట్టివి అట్టిదే కద మానవత్వము అన్నిటికి ఎత్తైన సత్వము

- సి. నారాయణ రెడ్డి

మానవత్వం మాత్రం ప్రతిరోజు ప్రతిక్షణం పుట్టిచచ్చే వెలుగుకిరణం మానవత లేని లోకాన్ని స్తుతింపలేను మానవునిగా శిరసెత్తి తిరగలేను ఈ నాగరికతారణ్యవాసం భరించలేను.

- చెరబండ రాజు

తెలుగు సాహిత్యంలో ఇతిహాసాలు, పురాణాలు, భాగవతాది గ్రంథాలలో కథా ప్రక్రియ కనిపించినప్పటికి వాటిని కథా కావ్యాలుగా చెప్పలేము. భారతంలోని నలదమయంతి కథ, సతీ సావిత్రి కథ లాంటి వాటిని ఉపాఖ్యానాలు అన్నారు. 12 నుండి 17 శతాబ్ది కాలంలో కథాకావ్యాలు అధికంగా వెలువడ్డాయి. తెలుగులో వెలువడ్డ మొట్టమొదటి కథాకావ్యం తిక్కన శిష్యుడైన కేతన రచించిన "దశకుమార చరిత్ర" దీనిని తిక్కన

గారికే అంకితమిచ్చాడు. మంచన "కేయూరబాహు చరిత్ర" వంటి కథా కావ్యాలు వెలువడ్డాయి

ఆధునిక వచన సాహిత్య ప్రక్రియల్లో "కథ" ఒకటి. ఇతర సాహిత్య ప్రక్రియలన్నింటి కన్నా కథకి ఆధారణ ఎక్కువ. ఈ ప్రక్రియ తెలుగులో మొట్టమొదట గురజాడ 1910 లో రచించిన "దిద్దుబాటు"తో రూపుదిద్దుకుంది. ఈ కథ ప్రక్రియ సంఘటనలను ఆధారంగా, క్లుప్తత ప్రధాన లక్షణంగా కలిగి ఉంటుంది. బండారు అచ్చ మాంబ, ఆచంట వెంకట సాంఖ్యాయన శర్మ వంటి వారు గురజాడకు ముందే తెలుగు కథకు శ్రీకారం చుట్టారు. నేడు ఆచంట వెంకట సాంఖ్యాయన శర్మ గారు రాసిన "లలిత" బండారు అచ్చమాంబ గారు రాసిన 'స్త్రీ విద్య', 'ధన త్రయోదశి' (1902) , కథలను తొలి తెలుగు కథలని భావిస్తున్నారు.

"కథ్" అనే దాతువు నుండి "కథ" అనే పదం పుట్టింది. దీనికి సంభాషించుట చెప్పుట అనే అర్థాలు ఉన్నాయి. అగ్ని పురాణంలో కథానిక ప్రస్తావన ఉన్నదని చెబుతారు. సంస్కృతంలో ఇతివృత్త భేదాన్ని బట్టి కథ, ఆఖ్యాయిక, ఖండకథ, పరికథా అనే భేదాలున్నాయని చెబుతారు. నేడు తెలుగులో "కథ", "కథానిక" అనే పదాలు సమానార్థకాలుగా వాడుచున్నారు. ఆంగ్లంలోని story, short story అనే ప్రక్రియలకు పర్యాయాలుగా ఉపయోగిస్తున్నారు.

కొంత సత్యాంశంతో కూడిన కల్పిత గద్య గ్రంథం కథ

- తెలుగు అకాడమీ నిఘంటువు

"దీర్ఘంగా కాక పొందికగా ఉండడం, ఉదాత్తత కలిగి ఉండడం, సంభ్రమాశ్చర్యాలు కలిగించి కరుణ, అద్భుత రసాలను పోషించడం, ఆనందాన్ని కలిగించడం కథానిక లక్షణాలు ం

- అగ్నిపురాణం

తెలుగు కథ లక్షణాలు తెలుసుకోవడానికి రచయితలు, విమర్శకులు తమ పరిశీలనల అనంతరం కొన్ని లక్షణాలను సూచించడం జరిగింది.

ఒకానొక ఎత్తుగడ, నడకతీరు, ముగింపు, పరిమిత పాత్రలు, ఆ పాత్రకు తగు పోషణ, వస్తు విన్యాస వైశిష్ట్యము, ఒక జీవిత సత్యమును ప్రతిపాదించుట, అన్నింటిని మించి వస్త్వైక్యము నుండి వినోదమో, విజ్ఞానమో, వికాసమో కలిగించగల చిన్న కథ కథానిక.

- జి. నాగయ్య

జీవితంలోని ఒకానొక మహత్తర సత్యాన్ని అద్భుత శిల్ప నైపుణ్యంతో కళ్ళకు కట్టినట్లుగా చూపించి, హృదయాన్ని ఒక మహత్తరమైన అనుభూతితో నింపి పదేపదే చదవాలనిపింపజేసేది కథ.

- పోరంకి దక్షిణామూర్తి

మాయమై పోతున్నడమ్మా ..... మనిషన్నవాడు
ఓ ఓ ఓ .... మచ్చుకైనా లేడు ..... చూడు
మానవత్వము ఉన్నవాడు

అని అందెశ్రీ గారు రాసిన పాట యధార్థం. నేడు సమాజంలో మానవుల మధ్య మానవత్వపు విలువలు నశించి పోతున్నాయి. కాబట్టి రచయితలు తమ రచన లలో మానవీయ విలువలను చేరుస్తూ రచనలు చేస్తున్నారు తద్వార మానవత్వపు విలువలను పెంచుటకు గాను కృషి చేస్తున్నారు ఆ కోవకు చెందినవారు ముదిగంటి సుజాతారెడ్డి గారు. కథను చెప్పే పద్ధతిని "కథాకథనం" అని అనవచ్చు కథను పాఠకునికి హృదయానికి హత్తుకు పోయేలా రాయగలుగుటకు రచయిత ఉపయోగించిన పద్ధతిని "కథాకథనం" అంటారు. ఈ పద్ధతి ఒక్కొక్క రచయితకు ఒక్కొక్క విధంగా ఉంటుంది

సుజాతారెడ్డి గారు కూడా కథను చెప్పడంలో తన కంటూ ఒక ప్రత్యేకతను కలిగి ఉన్నారు. కథను అతి సాధారణంగా ప్రారంభించి తరువాత పాత్రల మనోభావా లను, జీవితపు లోతుల్లోని అంశాలను చక్కగా చిత్రించ

గల సృజనాత్మకత కలిగిన రచయిత్రి సుజాతారెడ్డిగారు. వీరు తన రచనలలోని పాత్రల ద్వారా సమాజంలో మనం ఆచరించవలసిన మానవీయ విలువలను తెలియ జేయడం జరిగింది. ఆ విలువలను పరిశీలించి సమాజా నికి వాటి ప్రాముఖ్యతను తెలియజేయడమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశం.

## ముదిగంటి కథలు - మానవీయ విలువలు :

మనిషి పరిణామక్రమంలో కథ ప్రాధాన్యం అనన్య సామాన్యం. పరిమాణాన్ని బట్టి చిన్నకథ, పెద్దకథ అని ఉంటాయి. కథ ఏదైనా సమాజంలోని చెడును తొలగించి మంచిని పెంచడానికే దోహదం చేస్తాయి. ప్రస్తుత సమాజంలో మానవత్వం నశించిపోతుంది. సుజాతారెడ్డి గారు ప్రముఖ రచయిత్రి తను గ్రామీణ నేపథ్యం నుండి వచ్చినవారు కావడం చేత వారి రచనలలో మానవీయ విలువలు ఎక్కువగా చేర్చి రాస్తుంటారు. ఆ విలువలను ఇప్పుడు తెలుసుకుందాం.

తెలుగు సాహిత్యరంగంలో ముదిగంటి సుజాతారెడ్డి గారికి ప్రత్యేక స్థానం కలదు. వారి రచనలలో ప్రత్యేకత కలదు. వారు స్వతంత్ర మార్గాన్ని అనుసరించి రచనలు చేయడం జరిగింది. ముదిగంటి సుజాతారెడ్డి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో చిన్న పిల్లగా ఉన్న ఆనాటి పరిస్థితులను ఆకళింపు చేసుకొని రచనా వ్యాసంగం చేస్తున్నారు. ఆమె కథలు సమాజాన్ని విస్తృతంగా అధ్య యనం చేశారనడానికి దాఖలాగా కనిపిస్తాయి. సరళమైన శైలి, జీవితం పట్ల స్పష్టమైన అవగాహన ఆమె కథలకు ప్రాణం పోస్తాయి. ఆమె ఇప్పటి వరకు నాలుగు కథా సంకలనాలు వెలువరించారు. "విసుర్రాయి"(1998), "మింగుతున్న పట్నం"(2001), "వ్యాపార మృగం" "మరో మార్క్స్ పుట్టాలే ..!" ఆమె వెలువరించిన కథా సంకల నాలు. కథల సంపుటాలను నిశితంగా పరిశీలిస్తే విసు ర్రాయిలో స్త్రీల సమస్యలు, ముఖ్యంగా తెలంగాణ స్త్రీల సమస్యలను ప్రతిబింబిస్తూ రాసిన కథలున్నాయి. మింగు తున్న పట్నం సంకలనంలో ఆమె ఆలోచనా స్రవంతి మరింత విస్తరించింది. హైదారాబాద్ నగర పరిసరాల్లోని భూమి సమస్యలను, దాని వల్ల తలెత్తుతున్న వివాదాలను, మాఫియా పోషిస్తున్న పాత్రను ఆమె చక్కగా వివరించారు. వ్యాపార మృగంలో కూడా ఆమె విస్తృత భావాలతో రచనను కొనసాగించింది. దీనిలో ప్రపంచీకరణ పేద వాళ్లను మరీ పేదరికంలోకి నెట్టివేయ బడటాన్ని బట్ట బయలు చేస్తుంది. మరో మార్క్స్ పుట్టాలే...! ఈ కథా సంపుటి గడిచిన రెండు దశాబ్దాల సామాజిక జీవన వైవిధ్యానికి అద్దం పడుతుంది.

"విసుర్రాయి కథల" సంపుటిలో "విసుర్రాయి", "జవాబుల్లేని ప్రశ్నలు", "వలాయనం", "దోపిడీ", "స్వేచ్ఛ", "న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి?",

"మింగుతున్న పట్నం" కథల సంపుటిలో "మింగు తున్న పట్నం", "గుడిసెలు! గుడిసెలు", "ఆక్రమణం", "నిశబ్దం! నిశబ్దం!", "ఊరు బాగువడేదెప్పుడు?" "రాజకీయ మంటలు"

"వ్యాపార మృగం" దీనిలో 20 కథలున్నాయి. "న్యూ ఆనంద్ హెూటల్ లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్",

మార్క్స్ పుట్టాలే...! ఈ కథా సంపుటి గడిచిన రెండు దశాబ్దాల సామాజిక జీవన వైవిధ్యానికి అద్దం పడుతుంది.

"విసుర్రాయి" అనాదిగా స్త్రీని పురుష జాతి ఎంతగా దోపిడీ చేసుకుంటూ కాల్చుకు తింటుందో చెప్పడానికి ఈ కథ ఒక నిలువుటద్దం. కథలో సక్కుబాయి శారీరకంగా, మానసికంగా నలిగిపోతున్న స్త్రీ, విసుర్రాయి సక్కుబాయికి సంకేతనామం. విసుర్రాయి తిప్పినంతసేపు తిరుగుతూనే ఉంటుంది. తనకు తిరగాలన్న కోరిక లేకపోయినా విసు ర్రాయి తిరగక తప్పదు. ఈ కథలో రచయిత్రి దేన్నీ గొంతు చించుకొని చెప్పదు, నదిలాగా నిశ్శబ్దంగా మన గుండెల్ని కోస్తు వెళ్తుంది. నిజ జీవితపు దృశ్యాల్ని అంతే సహజంగా పాఠకుడి ముందుంచడం వలన కథ కథలాగా కాక జీవితానికి ఊప నదిలా సాగిపోయింది.

"బేరం" కథ పట్టణీకరణ ఊరి యువకుడిని పెడదారి పట్టించిన తీరును చెబుతుంది. భార్యను అమ్మాడని తెలిసి

మల్లయ్య ప్రతిఘటించకపోవడం తాను కొనాల్సిన రెండెడ్ల కొరకు భార్యను అమ్మినా తప్పులేదని అనుకోవడంతో కథ ముగించడం ద్వారా భద్రన్న కంటే మల్లయ్య వంటి వ్యక్తులే ఎంతో దుర్మార్గులని పాఠకుడికి అర్థం చేయించారు సుజాతారెడ్డి.

“బందీ” భారతీయ సంస్కృతికి, అమెరికా సంస్కృతికి మధ్య ఉండే విభేదాన్ని కళ్ళకు కట్టినట్లు తెలిజేసే కథ. చాలా వరకు నేటి సమాజంలో విదేశీ సంస్కృతి గురించి వారి జీవన విదానం గురించి తెలియక విదేశాల పట్ల మోజులో ఉన్న వారికి అక్కడి వాస్తవిక జీవన విధానాన్ని గురించి చక్కగా వివరించడం జరిగింది. ఎగువ మధ్య తరగతి మహిళ జీవితాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. కూతురి కాన్పుకోసం అమెరికా వచ్చిన అన్నపూర్ణకు తాను బందీ అన్న స్పృహ కలగడంతో కథ ముగించడం ద్వారా ప్రేమ, ఆప్యాయతలు కూడా మనుషుల్ని ఎలా బందీలుగా మారుస్తున్నాయో చెప్పారు. మారిన పరిస్థితులు, ఆచారాలు, పెంపకపు పద్ధతులు చెబుతూనే అన్నపూర్ణ కొత్త పరిస్థితుల్లో బందీ అయిన తీరును వివరించారు.

“సీతయ్య చెల్క” రాజకీయ క్రీడలో భూమిని కోల్పోయిన సీతయ్య కథ. మంత్రులు, రాజకీయ సభలు, సంక్షేమ సభలు ఏర్పాటు చేయడంలో చూపే ఉత్సాహం దాని వెనకున్న అలోచనల డొల్లతనం ఈ కథ వివరిస్తుంది.

“అడవి రాజ్యం” కథ హైదారాబాద్ భూకబ్జాలను భూమోసాలను కళ్ళకు కట్టినట్లు చిత్రిస్తుంది. ఆనందరావు తన పదవీ విరమణ అనంతరం తన పిల్లల కోసం కొంత జాగా కొనాలని భావించి తన వద్ద ఉన్న సొమ్ముతో అడ్వాన్సు ఇచ్చి రిజిస్ట్రేషన్ సమయానికి మిగిలిన డబ్బులు సరి చేసుకొని భూమిని తన సొంతం చేసుకోవడం జరిగింది. కానీ కొద్దిరోజులకే భూకామాంధులు వారి జాగాను లాక్కోవడం జరిగింది. ఆ సమయంలో ఆ కుటుంబం పడిన వేదనను చక్కగా చిత్రించారు.

“స్వేచ్ఛ” కథలో స్త్రీలు, పిల్లలకై పడే తపనను గురించి, భర్త చనిపోతే పిల్లల మీదే పంచప్రాణాలు పెట్టుకొని తమ ఇష్టాయిష్టాలను చంపుకొని, పిల్లలను పెద్ద చేసి ప్రయోజకులను చేస్తే ఆ పిల్లలే వృద్ధాప్యంలో తల్లికి కనీసం నవ్వుకోవడానికి కూడా స్వేచ్ఛ లేదన్నట్లుగా మాట్లాడితే ఆ స్త్రీ మానసిక వ్యధకు గురై చివరకు తను ఓల్డ్ ఏజ్ హోమ్ కు వెళ్లాలని నిర్ణయించుకోవడం ఈ కథలోని ప్రధాన ఇతి వృత్తం.

“న్యూ ఆనంద్ హోటల్ లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్” ఈ కథలో లాలయ్య తనకున్న హోటల్ లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ పెట్టాలని విని తట్టుకోలేక బోరున ఏడ్చిన సంఘటన చిత్రీకరించినది. సమాజంలో అనివార్యంగా వచ్చిన మార్పును మానవ సంబంధాలను ఈ కథలో చెప్పారు.

“కామపిశాచం” కథలో భార్య భర్తలు అత్యంత అనురాగంతో పెట్టుకున్న ముద్దుపేర్లు భార్య ప్రసవ సమయంలో ఆమెకు ఎటువంటి అపకీర్తి తెచ్చిపెట్టిందో తెలియజేయడమే ఈ కథలోని ప్రధాన ఇతివృత్తం.

స్త్రీలు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలను వివిధ కోణాల్లో పరిశీలించి స్త్రీకి స్వేచ్ఛ చాలా అవసరమని, స్త్రీలు అన్ని విషయాల పట్ల చైతన్యం కావాలని, విదేశాల పట్ల మోజు పెంచుకోవద్దు అంటూ, సమకాలీన సమాజంలో భూకొనుగోలు సమయంలో జరుగుతున్న దోపిడీ వలన అనేక కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్న విషయాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించి తన రచనల ద్వారా తెలియజేశారు. ఈ కథలలోని పాత్రల ద్వారా రచయిత్రి వ్యక్తులలో మానవీయ విలువలు అంతరించిపోతున్నాయని వాటిని పెంపొందించుకుంటే సమాజ అభివృద్ధి సాధ్యమని సూచించారు. మనలో మానవీయ విలువలు పెంపొందించుకుందాం వారి ఆకాంక్షను నెరవేర్చుటకు ప్రయత్నిద్దాం.

★★★

# పోతన 'భాగవతం' - భక్తితత్త్వం

- దేవులపల్లి సాయికృష్ణ , కాకతీయ విశ్వవిద్యాలయము.

శ్రీనాథ యుగంలో శ్రీనాథుడి అంతటి అగ్రగణ్యమైన కవి బమ్మెర పోతన. పోతన తల్లి తండ్రులు కేసన, లక్కసానమ్మ. తండ్రి కేసన గ్రామాధికారి. పోతన వంశీకు లది కౌండిన్యస గోత్రం. తల్లిదండ్రుల ఉదార గుణాన్ని పోతన చిన్నతనంలోనే పుణికిపుచ్చుకున్నాడు. చిదా నందుడనే మహర్షి పోతనకు రామతారక మంత్రోపదేశం చేసినట్లు 'పోతన చరిత్రము'లో వానమామలై వరదా చార్యులు చెప్పారు. పోతన కాలం 1420-1480 మధ్య కాలంలో ఉండవచ్చునని విమర్శకుల అభిప్రాయం. ఇందులో ఏకాభిప్రాయం లేదు.

పోతన కాలం విషయం మాత్రమే కాదు జన్మస్థలం విషయంలో కూడా ఏకాభిప్రాయం లేదు. పోతన జన్మ స్థానాన్ని రాయలసీమలోని ఒంటిమిట్టగా కొందరు భావిస్తే, మరి కొందరు ఓరుగల్లుకు సమీపంలోని బమ్మెర గ్రామం అని భావించారు. పోతన తన భాగవతంలో ఒంటిమిట్ట అనిగాని, ఓరుగల్లు అనిగాని చెప్పలేదు. పోతన "ఒక్క రాకానిశాకాలంబున సోమోపరాగాంబు రాకం గని సజ్జనాసుమతంబున సభ్రంకషుశుభ్ర సముత్తుంగ భంగ యగు గంగకుం జని క్రుంకులిడి వెడలి.. మరలి కొన్ని దినంబులకు నేకశిలానగరంబునకుం జనుదెంచి" అని ఏకశిలానగరం అని మాత్రం చెప్పుకున్నాడు. పోతనకంటే ముందు ప్రతాపరుద్రుని ఆస్థానంలో ఉన్న విద్యానాథుడు కూడా తన ప్రతాపరుద్రీయంలో 'ఏకశిలా నగరం' అనే పేర్కొన్నాడు. ఒంటిమిట్టలో ఉన్న కవులు ఒంటిమిట్ట అనే పేర్కొనారు తప్ప ఒక్కరూ కూడా ఏకశిలా నగరం అని చెప్పలేదు. ఈ విషయంపై శేషాద్రి రమణకవులు సమగ్రమైన కృషి చేసి పోతన జన్మస్థానం వరంగల్లు అని నిర్ధారించారు.

దీనికి ముఖ్య కారణాలు - ఏకశిలానగరం అనే పేరు ఓరుగల్లుకే ఉండడం, పోతనతో సంబంధం ఉన్న రాజు సర్వజ్ఞ సింగభూపాలుడు తెలంగాణ ప్రాంతంవాడే కావడం, పోతనతోపాటు భాగవత రచనలో పాలు పంచుకున్న వెలిగందుల నారయ, ఏర్చూరి సింగనల ఇంటి పేర్లు తెలంగాణ ప్రాంతానికే చెంది ఉండడం వలన పోతన తెలంగాణ ప్రాంతానికే చెందాడనే వాదాన్ని బలపరుస్తున్నాయి.

**పోతన 'భాగవతం' :**

పోతన వీరభద్రవిజయం, భోగినీదండకం, నారాయణ శతకం రాసినా అతనికి గొప్ప పేరు తెచ్చిపెట్టిన కావ్యం 'మహాభాగవతం'. భాగవతాన్ని పోతన మాత్రమే కాకుండా 5వ స్కంధాన్ని బొప్పరాజు గంగన, 6వ స్కంధాన్ని ఏర్చూరి సింగన, 11, 12 స్కంధాలను వెలిగందుల నారయలు రాశారు. పోతన భాగవతము పూర్తిగా రాసాడని కొంతకాలం తరువాత కొన్నిభాగాలు శిథిలం అయితే గంగన, సింగన, నారయలు పూరించారని ఒక వదంతి ఉంది. భాగవతం లోని నాలుగు స్కంధాలు శిథిలం అవ్వడానికి గల కారణానికి రెండు కథలు కల్పించబడ్డాయి.

మొదటి కథ - కూచిమంచి తిమ్మకవి తన సర్వలక్షణ సారసంగ్రహంలో "ఘనుడు పోతన మంత్రి మును భాగవతమును రచించి చక్రికి సమర్పించు నెడల సర్వజ్ఞ సింగయక్ష్మావారుండది దనకిమ్మని వేడిన నిడక యున్న నలిగి యా పుస్తకం బవని బాతించిన జివికి యందొక కొంత శితిలమయ్యె గ్రమ్మర నది వెలిగందుల నారప రాజును మరి బొప్పరాజు గంగరాజు మొదలగు కవి వరుల్దేజమెసగ జెప్పిరా గ్రంథముల యందే తప్పులాదవె గాని పోత కవీంద్రుని కవితయందు లక్షణం బెందు తప్పదు దక్షహరణ" అని తెలిపాడు. ఇది అంత నమ్మ శక్యంగా లేదు. ఎందుకంటే సర్వజ్ఞుడు సరసుడు, కవితా

పోషకుడు కావున అలాంటివాడు ఇలాంటి నీచ కార్యానికి పూనుకోడు. ఒకవేళ పోతన తనకు భాగవతాన్ని అంకితం ఇవ్వలేదనే కోపంతో భాగవతాన్ని పాతి పెట్టించినా అందు లోని కేవలం ఆ నాలుగు స్కంధాలు మాత్రమే శిథిలం అవడం మిగిలిన ఎనిమిది స్కంధాలు పూర్తిగా ఉండడం అనేది అంత సమ్మశక్యంగా లేదు. కావున ఈ కథను విమర్శకులు తోసిపుచ్చారు.

రెండవ కథ - పోతనే భాగవతాన్ని పూర్తి చేసి పూజ గదిలో ఒక పెట్టెలో పెట్టి పూజించేవాడట. అతని మరణానంతరం ఆ పెట్టె తెరిచి చూడగా కొన్ని స్కంధాలు శిథిలం అయితే శిథిలమైన స్కంధాలను వెలిగందుల నారాయాదులు పూర్తిచేశారని జనశ్రుతిలో కలదు. మొదటి కథ కంటే ఈ కథ ఇంకా సమ్మశక్యంగా లేదు. ఎందుకంటే పెట్టెలో పెట్టిన భాగవతంలో కేవలం ఆ నాలుగు స్కంధాలే శిథిలం అవడం అనేది హాస్యాస్పదం. ఏ కవి అయినా తాను రాసిన కావ్యాన్ని పదిమంది చదువుకొని ఆనందించా లని అనుకుంటాడు కానీ ఇలా ఎవరు పెట్టెలో బంధించి పెట్టరు. అలాగే పోతన కూడా తన కావ్యాన్ని పలువురు చదివినప్పుడే అతనికి కీర్తి ప్రతిష్టలు వస్తాయని భావిస్తాడు. అంతేకాకుండా అతను తన వీరభద్రవిజయంలో "ఏమి కథ యొనర్చి యిలలోన సత్కీర్తి దనవర్చు" అని తెలి పాడు. దీనినిబట్టి పోతన కీర్తిని ఆశించినవాడే. భాగవతం రాసే నాటికి పోతన ఎంతటి పరిపక్వత చెందినా అతను మోక్షంతో పాటు కీర్తిని కూడా ఆశిస్తాడు. కావున ఈ కథను కూడా సమ్మనవసరం లేదు.

ఏర్చూరి సింగన తన ఆరవ స్కంధంలో మంగళాచరణ సాంప్రదాయం పాటించాడు. అతడు స్కంధాదిలో పోతనను ఈ క్రింది పద్యంలో ప్రత్యేకంగా స్తుతించాడు.

"ఎమ్మెలు సెప్పనేల జగమెన్నగ బన్నగ రాజశాయికిన్
సొమ్ముగ వాక్య సంపదలు నూఱలు చేసిన వాని భక్తిలో
సమ్మెన వాని భాగవత నైష్ఠికుడై తగువాని బేర్మితో
బమ్మెర పోతరాజు గని వట్టపురాజు దలంచి మ్రొక్కెదన్"

(షష్ఠ. స్కం. 12)

ఇది గురుస్తుతి వంటిది. ఈ పద్యం వలన పోతనే వారికి భాగవతరచనలో పాలుపంచాడని అర్థం అవు తుంది. కావున "భాగవతమున గంగయాదులా ప్రవేశము పోతన సమక్షంలోనే అయన సమ్మతి మీదనే జరిగి ఉండునని నా ఊహ ! అట్టి బృహద్గ్రంథము తన జీవితంలో పూర్తి చేయగలనో లేదో అనే అనుమానంతో ఆయననే ఆ కవులను పిలిచి ఆ భాగములను వారికి అప్పగించి ఉండును. లేదా వారే ఆ పుణ్య కార్యమును తమకు కూడా కొంత ప్రవేశము కల్పించండని వేడగా దానికి ఆయన సమ్మతించెను" అని పింగళి లక్ష్మీకాంతం గారి అభిప్రాయం సమంజసంగా అనిపిస్తుంది.

**భాగవతం - భక్తితత్త్వం :**

"గుడులు కట్టించె కంచెర్ల గోపరాజు
రాగములు కూర్చె కాకర్ల త్యాగరాజు
పుణ్యకృతి చెప్పె బమ్మెరపోతరాజు
రాజులీమువ్వురును భక్తి రాజ్యమునకు"

అన్నట్టు గోపన్న కొండల్లో బండల్లో రాముడికి గుళ్ళు కట్టిస్తే పోతన తెలుగు వారి గుండెల్లో కృష్ణుడికి గుళ్లు కట్టించాడు. త్యాగరాజు తన తంబూర తీగెలమీద "శ్రీరామచంద్రుడిని" ఊరేగిస్తే పోతన తన నవపల్లవ కోమల శయ్యల మీద యదుకుల తిలకుణ్ణి ఉయ్యాల లూ గించాడు.

పోతన సహజ పండితుడు. అంటే పుట్టుకతోనే పాండిత్యం కలవాడని అర్థం. ఈయన తన భాగవతంలో ప్రయోగించిన అనుప్రాసాది అలంకారాలు అప్రయత్నంగా వచ్చినవే. ఇది ఈయన సహజ పాండిత్యానికి ఒక నిదర్శనం. సంస్కృత భాగవతానికి తెలుగు భాగవతం కేవలం యథాక్షరానువాదం కాదు. యథోచితానుసరణం అని చెప్పవచ్చు. ఎన్నోచోట్ల పోతన మూలాన్ని పెంచి

వ్రాశాడు. పోతన గజేంద్రమోక్షంలో, వామన చరిత్రలో, ప్రహ్లాద వృత్తాంతంలో, రుక్మిణీ కళ్యాణంలో, నరకాసుర వధలో, కృష్ణలీలల్లో, గోపికా గీతాల్లో, కుచేలోపాఖ్యానంలో తన ప్రతిభా పాండిత్యాలను ప్రకటించి మూలాన్ని పెంచి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాడు. తెలుగు భాగవతం గద్యపద్యాల సంఖ్య సుమారు తొమ్మిదివేలు. పోతన భాగవతం రాసినప్పటినుంచి సాహితీప్రియులని మాత్రమే కాక సాధారణ ప్రజానీకంలోని నిరక్షరాస్యుల్ని కూడా ఉ ర్రూతలూగించిన పోతన కవితకు లభించిన ప్రజాదరణకు కారణాలు అనేకం ఉన్నాయి. పోతన భాగవతం కేవలం రసవత్కావ్యం మాత్రమే కాక భక్తితత్త్వ ప్రబోధకమైన ఆధ్యాత్మిక గ్రంథం కావటం ప్రధాన కారణం అని చెప్పవచ్చు.

పోతన భాగవతంలో ప్రజాసురంజకములైన పద్యాలు మాత్రమే గాక, గంభీర వేదాంత దర్శనాత్మకములైన గద్య పద్యాలు ఎన్నో ఉన్నాయి. ఈ దృష్టితో పరిశీలిస్తే, సంస్కృత భాగవతము కంటే తెలుగు భాగవతం కొన్నిచోట్ల క్లిష్టతరం అని చెప్పవచ్చు. పోతన సంస్కృత భాగవతాన్ని మాత్రమే కాక శ్రీధర వ్యాఖ్యానాన్ని కూడా తెనుగించాడు. ఈ ఘట్టాలు సాధారణ పఠితలకు అర్థం కావు. అంతేగాక అశేష ప్రజానీకం నాలుకలపై నర్తించే పద్యాలు "మందార మకరందమాధుర్య ధురీణములైన" వాటిల్లో కూడా సులభసాధ్యం కాని శబ్దాలు కలవు.

పోతన మహాభక్తుడు. పోతన భాగవతాన్ని రాస్తూ నన్నయ తిక్కనాది కవులు ఇతిహాస పురాణాలు తెలుగులో రాసారనీ, తన పూర్వజన్మ సుకృతం వలన మహా భాగవతాన్ని తెలుగు చేయలేదనీ తెలుపుతూ భాగవతాన్ని పూర్తి చేసి పునర్జన్మ లేకుండా చేసుకుంటానన్నాడు. పోతన భాగవతాన్ని తెలుగు చేస్తూ

"భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు, శూలికైన తమ్మిచూలికైన,
విబుధజనుల వలన విన్నంత కన్నంత తెలియ వచ్చినంత తేటపఱతు"

(ప్రథమ. స్కం.19)

అని భాగవతాన్ని ఆంధ్రీకరించవలెననే తన నిర్ణయం గురించి బమ్మెర పోతన వివరించిన తీరు. తను చేపట్టింది ఎంతో క్లిష్టమైన పని అని తెలుపుతూ, తనకు తెలిసినది తక్కువది కాదు కనుక చక్కగా సాధించగలనని చెప్పటంలో పోతన వినయవివేకాలు తెలుస్తున్నాయి.

భాగవతాన్ని రచించిన పోతన నిమిత్తమాత్రుడననీ, శ్రీరామచంద్రుడే తనచే రాయించాడనే ఐతిహ్యం ప్రచారంలో ఉంది. పోతన కూడా తన భాగవతంలో

"పలికెడిది భాగవతమట, పలికించు విభుండు రామభద్రుండట, నే
బలికిన భవహర మగునట, పలికెద, వేఱొండు గాథ బలుకగ నేలా"

(ప్రథమ. స్కం. 18)

అని చెప్పుకున్నాడు. అంతా శ్రీరామచంద్రుడే అని అంటూ తన భక్తి భావాన్ని తెలుపుకున్నాడు. మోక్షాన్ని పొందేందుకు భాగవతాన్ని సాధనంగా చేసుకున్న తెలుగుల పుణ్యపేటి పోతన. విష్ణు భక్తి ప్రతిపాదకత్వమే భాగవత పురాణం యొక్క విశిష్టత. నారాయణుని అనేక అవతారములలో ప్రసిద్ధమైనవి మత్స్య కుర్మాది దశావతారములు మాత్రమే. వాటిలో చివరి పరిపూర్ణ అవతారమైన శ్రీకృష్ణావతారం కథే భాగవతం యొక్క పరమ లక్ష్యము.

"లలితస్కందము, కృష్ణమూలము, శుకాలాపాభి రామము్మ, మం
జులతా శోభితమున్, సువర్ణ సుమనస్సుజ్ఞేయమున్, సుందరో జ్జ్వలవృత్తంబు, మహాఫలంబు, విమల వ్యాసాల వాలంబు నై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వుర్విన్ సద్విజశ్రేయమై"

(ప్రథమ. స్కం. 22)

ఈ పద్యంలో భాగవతానికి కృష్ణావతరమే మూలము అని నిర్దేశించి ఆ కృష్ణుడే మహావిష్ణువు అని పోతన ప్రతిపాదించాడు. పోతన వైష్ణవమతస్థుడైనా శివద్వేషి మాత్రం కాదు. పోతన దృష్టిలో విష్ణువు, శివుడు వేరు కాదు. పోతన భాగవతం చదివితే శివకేశవుల అభేదం తెలుస్తుంది. అందుకు ఈ కింది పద్యమే నిదర్శనం.

"చేతులారంగ శివుని బూజింపడేని
నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని
దయయు సత్యంబులోనుగా దలపడేని
గలుగనేటికి దల్లుల కడుపు చేటు"

(ప్రథమ. స్కం. 14)

పై పద్యంలో శివకేశవుల అభేదాన్ని చెప్పూ, మనిషై పుట్టిన తరువాత ప్రతిఒక్కరూ భగవంతుని యందు భక్తి కలిగి ఉండాలని, కేవలం భక్తి ఒక్కటే సరిపోదని దయ, సత్యం కూడా ఉండాలని పోతన భావన.

"పురాణం పంచలక్షణం" అని అమరసింహుడు నిర్వచించాడు. వృత్తి, రక్ష, సంస్థలు, హేతువు, అపాశ్రయము అనే ఐదు అదనపు లక్షణాలతో దశ లక్షణాలు కలిగిన పురాణం "మహాభాగవతం". భాగవతాన్ని మోక్షశాస్త్రం అని కూడా అంటారు. శాపగ్రస్తుడైన పరీక్షిత్తు శుక మహర్షి ద్వారా భాగవతాన్ని విని వారం రోజుల్లోనే మోక్షాన్ని పొందాడు. భాగవతంలోని ప్రసిద్ధ ఘట్టాలైన గజేంద్ర మోక్షం, ప్రహ్లాదచరిత్రం, అంబరీషోపాఖ్యానం, వామనావతారం, కృష్ణావతారం పోతనగారు రచించడం తెలుగు వారి అదృష్టం. భక్తులకు భగవంతుడు ఎంత సులభుడో ఈ కథల ద్వారా తెలుస్తుంది. భీష్మ నారదుల జ్ఞానభక్తి, రంతిదేవుని త్యాగభక్తి, దేవకీ యశోదల వాత్సల్యభక్తి, హనుమంతాదుల దాస్యభక్తి, ఉద్ధవార్జునుల సఖ్యభక్తి, గోపికల మధుర భక్తి భాగవతంలో తెలుపబడ్డాయి. భాగవతంలో తెలుపబడిన నవవిధ భక్తులలో దేనిని ఆశ్రయించినా మోక్షం పొందవచ్చునని భాగవతమునందు తెలుపబడింది. భాగవతధర్మాన్ని అవలంబించిన వారిలో కొందరు శుద్ధజ్ఞానాన్ని, మరి కొందరు శుద్ధ భక్తిని అవలంభించి మోక్షాన్ని పొందినట్లు భాగవతంలోని ఉపాఖ్యానాల వలన అర్థం అవుతుంది.

భాగవతం చతుర్థస్కందంలో శ్రీమహావిష్ణువు చేత ఆశీర్వదించబడి అంతరిక్షంలో ఇప్పటికి ధ్రువ నక్షత్రముగా ధ్రువక్షితిలో మనకు కనివిన్నున్న స్వాయంభువ మనువు వంశ రాకుమారుడు ధ్రువుడు. స్వాయంభువ మనువుకి ప్రియవతుడు, ఉత్తానపాదుడు అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో ఉత్తానపాదుడు ప్రముఖుడు. ఉత్తానపాదుడికి సునీతి, సురుచి అనే ఇద్దరు భార్యలు కలరు. సునీతి వలన ధ్రువుడు, సురుచి వలన ఉత్తముడు అనే ఇద్దరు కుమారులు కలిగారు. కాలప్రభావం వలన ఉత్తానపాదుడికి సునీతి కంటే సురుచి అంటే ప్రేమ, అనురాగం ఎక్కువగా ఉండేవి. ఒకరోజు సురుచి కుమారుడైన ఉత్తముడు తండ్రి తొడపై కూర్చొని ఉండగా దానిని ధ్రువుడు చూసి తాను తండ్రి తొడ ఎక్కబోతుండగా సురుచి చూసి వెర్రి నవ్వు నవ్వి 'నీకు తండ్రి తొడపై ఎక్కే అదృష్టం లేదు, అదే కనుక ఉన్నట్లయితే నువ్వు నా సవతి కుమారుడిగా పుట్టి ఉండేవాడివి కాదు అని అవహేళన చేస్తుంది. నీకా అదృష్టం కలగాలంటే శ్రీహరిని ప్రార్థించు ఆయన నిన్ను నా కడుపులో పుట్టేలా చేస్తాడు. అపుడు నీ కోరిక నెరవేరుతుంది' అని చెబుతుంది. ఆ పరుష మాటల విన్న ధ్రువుడు తన తల్లి సునీతి వద్దకు వెళ్ళి జరిగిన విషయం చెబుతాడు. అప్పుడు సునీతి ధ్రువుడితో నాయనా కాలప్రభావం వలన నీ తండ్రి తనను దాసీ కంటే తక్కువగా చూస్తున్నాడని, కష్టం కలిగించే పలుకులైన సవతి సరైన విషయం చెప్పిందని, శ్రీహరి పాదధ్యానము వలన జరగనివి ఉండవని స్వాయంభువ మనువు శ్రీహరిని ధ్యానించి ఉత్తమ గతి పొందాడని చెబుతుంది. అప్పుడు ధ్రువుడు శ్రీహరిని ప్రసన్నం చేసుకోవడానికి రాజధాని నుండి అడవికి బయలుదేరాడు.

అప్పుడు మార్గమధ్యములో నారదుడు కనిపించి ఎక్కడికి వెళ్ళుతున్నావు అని అడుగగా ధ్రువుడు అప్పటి

వరకు జరిగిన వృత్తాంతం తన సవతి తల్లి చేత పొందిన అవమానం చెబుతాడు. నారదుడు ధ్రువుడిని ఓదార్చి రాజధాని నగరం పంపడానికి ప్రయత్నిస్తాడు. కాని ధ్రువుడి పట్టుదలకు మెచ్చి యమునా నది తీరంలో ఉన్న మధువనానికి వెళ్లు. అది హరికి నివాసస్థానం. ఆ ప్రదేశం పవిత్రమైంది.

"ఆ యమునా తటినీ శుభ, తోయములం గ్రుంకి
నిష్ఠతో నచ్చట నా
రాయణునకును నమస్కృతు, లాయతమతి జేసి
చేయు యమనియమములన్"

(చతుర్థ. స్కం. 247)

అని చెప్తాడు. ఆ విధంగా నారదుని వలన వాసుదేవ మంత్రాన్ని ఉపదేశం పొందిన ధ్రువుడు "మధువనం" చేరుకొని తపస్సు చేయడం ప్రారంభిస్తాడు.

"అతడు ననన్యదృష్టిని జరాచర దేహిశరీర ధారణా
స్థితి గల యాశునందు దన జీవితమున్ ఘటియింప జేసి యే
కత గన దన్నిదోధమున గైకొని కంపము నొంది నీశ్వరుం
డతడు చలింప నిజ్జగము లన్నియు జంచల మయ్యె భూవరా"

(చతుర్థ. స్కం. 273)

ఇలా ధ్రువుని తపస్సుకు సమస్త బ్రహ్మాండంలో అల్లకల్లోలం సృష్టించబడి దేవతలు నారాయణుడి వద్దకు వెళ్ళి విషయం విన్నవిస్తారు. అప్పుడు నారాయణుడు ధ్రువుడు తన గురించి తపస్సు చేస్తున్నాడని, వాని వలన ఈ ఉపద్రవం వస్తున్నదని చెప్పి వానికి ప్రత్యక్షం అయ్యి దీక్ష విరమింప జేస్తానని చెబుతాడు.

నారాయణుడు ధ్రువుడికి శంఖ చక్రాలతో ప్రత్యక్షమై
ధ్రువుడి శిరస్సు నిమిరగా, ధ్రువుడు
"వరమతి నార్తబాంధవ! భవద్ఘన బోధనమేతుడై భవ
చ్చరణము బొంది నట్టి విధి సర్గము సుప్తజనుండు బోధమం
దరయగ జూచురీతి గనునట్టి ముముక్షు శరణ్యమైన నీ
చరణములం గృతజ్ఞుడగు, సజ్జనుడెట్లు దలంప కుండెడున్"

(చతుర్థ. స్కం. 281)

నారాయణుడిని పరిపరి విధాలా స్తుతిస్తాడు. దానికి నారాయణుడు ప్రీతి చెంది అంతరిక్షంలో సప్తఋషులు, నిఖిల తారాగణాలు, సూర్యచంద్రులు నిరంతరం ప్రదక్షిణం చేసే ధ్రువక్షితి అనే స్థానం కలిపిస్తున్నానని చెప్పి, ఆ ధ్రువక్షితికి చేరే ముందు కొన్ని రోజులు రాజ్యపరిపాలన చేయమంటాడు. ఆ విధంగా నారాయణుడిని ప్రసన్నం చేసుకొని ఆశీర్వాదం పొందిన ధ్రువుడి తిరిగి రాజధాని చేరుకొంటాడు. రాజధాని చేరుకొనిన ధ్రువుడిని చూసి తండ్రి ఉత్తానపాదుడు సంతోషం పొంది, రాజ్యానికి పట్టాభిషేకం చేసి వాన ప్రస్థాశ్రమమునకు వెళ్తాడు. అలా ధ్రువుడు నిర్మలమైన శ్రీమహావిష్ణువును సదా స్మరిస్తూ జీవనం గడుపుతాడు.

సప్తమస్కంధం పేరు చెప్పగానే పరమ భక్తాగ్రేసరుడైన ప్రహ్లాదుడు స్ఫురణకు వస్తాడు. భాగవతంలోని అన్ని స్కంధాలలో కంటే ఈ సప్తమ స్కంధంలో ఉన్న విశేషమేమంటే ఇందులోని కథలన్నింటినీ నారదమహర్షి ధర్మరాజుకు చెప్పినట్లుగా శుకమహర్షి పరిక్షిన్మహారాజుకు వినిపిస్తాడు. రాజసూయయాగంలో శ్రీకృష్ణుడు తన చక్రంతో శిశుపాలుని శిరస్సును ఖండించిన తర్వాత శిశుపాలుని శరీరంలో నుంచి వెలువడిన తేజస్సు శ్రీకృష్ణునిలో ప్రవేశిస్తుంది. అది చూసి ఆశ్చర్యచకితుడైన ధర్మరాజు సభలో ఉన్న నారదమహర్షిని "ఈ శిశుపాలుడూ, వీని సోదరుడైన దంతవక్త్రుడునూ, నిత్యం కృష్ణుని నిందించే వాళ్లే. ఆ మాటలు వినలేకపోయేవాళ్ళం. అటువంటి పాపాత్ముడు ఈనాడు ఇంతమంది చూస్తుండగా ముక్తి సామ్రాజ్యమైన విష్ణుసాయుజ్యం అందుకోగలిగాడే? ఇలా ఎలా సాధ్యమైంది" అని ప్రశించాడు. దానికి మహర్షి "ధర్మనందనా! కోపంతో కానీ, కోరికతో కానీ, స్నేహంతో కానీ, మోహంతోకానీ, శత్రుత్వంతో కానీ, ప్రీతితోకానీ, భీతితో కానీ ఏవిధంగానైనా సరే హరిని ఏమరకుండా స్మరిస్తున్నట్లయితే సర్వ భూతాత్మకుడైన విష్ణువును పొందుతాడు. భగవంతుడు ఎవరినీ, ఎప్పుడూ పరునిగా చూడడు". అని అంటాడు. ఇంకా

"వైరానుబంధనంబున, జేరిన చందమున విష్ణు జిరతర భక్తిం
జేరగరాదని తోచును, నారాయణ భక్తియుక్తి నా చిత్తమునన్"

(సప్తమ. స్కం. 15)

అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసి, శ్రీహరి ద్వారపాలకులు సనకసనందనాదుల శాపం వల్ల పదభ్రష్టులై మొదటి జన్మలో హిరణ్యకశిపు హిరణ్యాక్షులు గానూ, రెండవజన్మలో రావణ కుంభకర్ణులుగానూ, మూడో జన్మలో శివుపాల దంతవక్రులుగానూ ఉద్భవించారని చెప్పే సందర్భంలో హిరణ్యకశిపుడు - ప్రహ్లాదుని వృత్తాంతం ప్రారంభిస్తాడు.

ప్రహ్లాదుడు హరిభక్తుడు. సమస్తప్రాణులను తనలాగా భావించే సమదర్శి. అతడు పెద్దలు ఎదరైనపుడు గౌరవంతో నమస్కరించే వినయశీలి. గురువులను దైవంగా కొలిచే ఆదర్శ విద్యార్థి. హాస్యానికైనా అబద్ధ మాడని సత్యవంతుడు. అంతేకాక రూపరేఖల విషయంలో, విద్య, ఐశ్వర్యం విషయంలో అధికుడైనా కూడా కొంచెం కూడా గర్వంలేనివాడు ప్రహ్లాదుడు. ప్రహ్లాదుడు పూర్వ జన్మ సంస్కారం వలన నిరంతరం హరిని స్మరిస్తూ ఉండేవాడు. నీరుత్రాగుతున్నా, భోజనం చేసేటప్పుడు ఇలా ఎల్లప్పుడూ హరిని స్మరిస్తూ ఉంటాడు. తన తోటిపిల్లలతో కూడా ఆడుకోకుండా ఎల్లప్పుడూ శ్రీహరిని ధ్యానంలోనే ఉంటాడు. కొడుకు ప్రవర్తనని గమనించిన తండ్రి హిరణ్యకశిపుడు ప్రహ్లాదున్ని చదువుకోసం గురువుల వద్దకు పంపిస్తాడు. ప్రహ్లాదుడు గురువులు ఏవిధంగా చెప్తే ఆవిధంగా చదివేవాడు. తనకు ఇష్టం లేనివి గురువులు బోధించినా, ఈ విద్యలన్నీ అసత్యాలనీ, భ్రమలనీ తెలిసినా కూడా ఆక్షేపించేవాడు కాదు. వారు చెప్పినట్లు విని చదువుకునేవాడు.

కొంతకాలం తర్వాత హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడు నేర్చిన విద్యని పరీక్షించదలచి, ఇంటికి పిలిపిస్తాడు. హిరణ్యకశిపుడు గురువులు చెప్పిన పాఠాలలో నీకు బాగా నచ్చిన, నీకు ఇష్టమయిన ఏవిషయమో చెప్పు అని ప్రహ్లాదునితో అంటాడు. అపుడు ప్రహ్లాదుడు తండ్రితో

"ఎల్ల శరీరధారులకు నిల్లను చీకటినూతిలోపలం
ద్రెళ్ళక వీరు నేమను మతిభ్రమణంబున భిన్నులై ప్రవ
ర్తిల్లక సర్వము న్తతని దివ్యకళామయ మంచు విష్ణుసం
దుల్లము జేర్చి తారడవి నుండుట మేలు నిశాచరాగ్రణీ!"

(సప్తమ. స్కం. 142)

అని తన హరిభక్తి లేకుంటే జీవితం వ్యర్థం అని తెలుపుతాడు. ఈ సందర్భంలో ప్రహ్లాదుడు నవవిధ భక్తి మార్గలను తెలపి, హరిభక్తి ప్రాముఖ్యాన్ని తెల్పే పద్యాలను పోతనగారు అత్యద్భుతంగా రచించారు. ప్రహ్లాదుని మాట లకు హిరణ్యకశిపునికి కోపం వచ్చి తన విరోధి అయిన హరిని స్మరించడం అతనికి నచ్చక ప్రహ్లాదుడుని హరిని స్మరించకూడదు అతడు మన దానవకుల విరోధి అని హెచ్చరిస్తాడు. అయిననూ ప్రహ్లాదుడు హరిస్మరణ మానడు. హరిణ్యకశిపుడు తన కుమారుడుని తన మార్గంలోకి తెచ్చుకోవడానికి విశ్వ ప్రయత్నం చేశాడు. తన కుమారుడిని చంపడానికి కూడా ఎన్నో ప్రయత్నాలు చేశాడు. కాని హరినామస్మరణ మహిమ వలన ప్రహ్లాదుడిని ఏమి చేయలేకపోయాడు. చివరకు హిరణ్యకశిపుడు "ముల్లోకాలలో నేనే బలశాలిని. సైన్యం లేకుండా నేను ఒక్కడినే ఏకైక వీరుడనై గొప్ప గొప్ప బలవంతులను జయించాను. నీవు ఎవడి బలం చూసుకొని నన్ను ఎదిరిస్తున్నావు? ఎవడి ధైర్యం చూసుకొని నాతో విరోధం పెట్టుకుంటున్నావు?" అని ప్రహ్లాదుడిని ప్రశ్నిస్తాడు. అపుడు ప్రహ్లాదుడు

"బలయుతులకు దర్భులులకు, బలమెవ్వడు నీకు నాకు బ్రహ్మాదులకున్
బలమెవ్వడు ప్రాణులకును, బలమెవ్వండట్టి విభుడు బల మసురేంద్రా!"

(సప్తమ. స్కం. 264)

అని హరియే తనకు బలమని చెప్తాడు. తండ్రితో రాక్షస భావాన్ని విడిచిపెట్టమని, నీకు భయపడి అందరూ

నీ మనస్సుకు ప్రియమైనదే చెబుతున్నారు కాని హితం చెప్పటం లేదని అంటాడు.

"లోకములన్నియున్ గడియలోన జయించినవాడ, వింద్రియా
నీకము జిత్తమున్ గెలువ నేరవు! నిన్ను నిబద్ధుజేయు నీ
భీకరశత్రు లార్వుర బ్రభిన్నుల జేసిన బ్రాణికోటిలో
నీకు విరోధి లేడొకడు, నేర్పున జూడుము దానవేశ్వరా!'

(సప్తమ. స్కం. 267)

అంటూ మంచి మనస్సుతో మరొకసారి ఆలోచించు. కర్మబంధాలను త్రెంచివేయి. భేదభావం లేకుండా చక్కని సమదృష్టి అలవర్చుకొని, నిరతంతరం హరిని స్మరించు అపుడు నీకు విరోధి ఎవరూ ఉండరని తండ్రికి హితవు చెప్తాడు. అందుకు హిరణ్యకశిపునికి కోపం వచ్చి "ఈ జగతికి నేనే అధిపతిని, నేను తప్ప మరొకడు లేదు. నా సోదరుడైన హిరన్యాక్షుణ్ణి చంపినపుడు కేశవుని కోసం అనేకసార్లు వెదికాను. కాని అతడు ఎక్కడా లేడు. మరి

"ఎక్కడ గలడే క్రియ నే, చక్కటి వర్తించు నెట్టి జాడను వచ్చున్
జక్కడుతు నిన్ను విష్ణుని, బెక్కులు ప్రేలేదవు వాని భృత్యుని పగిదిన్"

(సప్తమ. స్కం. 273)

అని హిరణ్యకశిపుడు గద్దించగా హరిభక్తుడైన ప్రహ్లాదడు ఎలాంటి సందేహం లేకుండా, అమితమైన ఆనందంతో, విశ్వాసంతో

"కలడంభోధి, గలండు గాలి, గలడాకాశంబునం, గుంభినిం
గల, డగ్నిన్ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలం
గల, డోంకారమునం ద్రిమూర్తుల ద్రిలింగవ్యక్తులం దంతటం
గల, డీశుండు గలండు, తండ్రి! వెదకంగా నేల నీ యా యెడన్"

(సప్తమ. స్కం. 274)

అంటూ పాలలో వెన్నఉన్నట్లు భగవంతుడు ఈ విశ్వమంతటా నిండి ఉన్నాడని విశ్వాసం వ్యక్తం చేస్తూ

"ఇందుగలడందు లేడని, సందేహము వలదు, చక్రి సర్వోపగతుం,
డెందెందు వెదకి చూచిన, నందందే కలడు, దానవాగ్రణి! వింటే."

(సప్తమ. స్కం. 275)

అని అంటాడు. ఈవిధంగా తండ్రీ కొడుకుల సంఘర్షణ అధికమవుతుంది. ప్రహ్లాదుడు భగవంతుడిని త్రికరణశుద్ధిగా నమ్మినవాడు అతనికోసం శ్రీహరియే స్తంభంలోనుంచి నృసింహస్వామిగా ఆవిర్భవించి హిరణ్యకశిపుడిని శిక్షిస్తాడు. తండ్రిచేత పెక్కువిధాల హింసింపబడి కూడా భక్తితో శ్రీహరి దయకు పాత్రుడైనాడు ప్రహ్లాదుడు.

అష్టమస్కంధం అనగానే మనకు గజేంద్ర మోక్షమూ, వామనావతారము స్ఫురనకు వస్తాయి. "శ్రీకైవల్య పదంబు జేరుటకునై చింతిచెదన్" అన్న భాగవత ప్రారంభ పద్యంలోని "భక్తపాలన కళానంరంభకున్" అనే విశేషణానికి విశ్లేషణ రూపమే గజేంద్రుని కథాకలాపం. తెలుగునాట ఈ కథకు అత్యంత ప్రచారం ఉంది. దీనిలోని పద్యాలన్నీ ఆబాల గోపాలానికి కంఠస్థం అనటంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు.

పాలకడలిలోని త్రికూటపర్వతం దట్టమైన అరణ్యంతో నిండి ఉంది. ఆ అరణ్యంలో బాగా తిరిగి తిరిగి అలసిపోయిన ఏనుగు దాహం తీర్చుకోవడం కోసం ఒక పెద్ద మడుగులోకి ప్రవేశించింది. అప్పుడు దప్పిక తీర్చుకుంటున్న గజేంద్రుడిని మకరం పట్టుకుంది. మకర మత్తేభాలకు పెనుగులాట అరభం అయింది. ఆ పోరాటంలో ఆ ఏనుగు బాగా ఆరాటపడి అలిసిపోయింది.

"జీవనంబు దనకు జీవనంబై యుంట, నలవు జలము సంతకంత కెక్కి
మకరమొప్పె డస్సె మత్తేభమల్లంబు, బహులక్ష శీతభాను పగది."

(అష్టమ. స్కం. 61)

ఈ విధంగా క్రమక్రమంగా గజేంద్రుని బలం క్షీణిస్తుంది. బ్రతుకు తెరువులో పడి మోహమనే పెద్దతీగతో కట్టుపడిన పాదాన్ని విడిపించుకోలేక దిక్కుతోచకుండా

సందేహానికి గురియైన జీవునిగా పోతనగారు గజేంద్రుడుని చిత్రించాడు. గజేంద్రుడు ఇక మొసలిని ఓడించలేనని తెలుసుకొని దు:ఖించాడు. పూర్వజన్మ పుణ్యం వలన గజేంద్రుడు

"ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై
యెవ్వనియందు డిందు బరమేశ్వరు డెవ్వడు మూలకారణం
బెవ్వ డనాది మధ్యలయు డెవ్వడు సర్వము దానయైన వా
*డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్*"

(అష్టమ. స్కం. 73)

అని భగవంతుడిని ప్రార్థించాడు. ఇలా గజేంద్రు శ్రీహరిడు స్తుతిస్తూ

"ముక్తసంగులైన మునులు దిదృక్షులు, సర్వభూత
హితులు సాధుచిత్తు
లసదృశ వ్రతాఢ్యులై కొల్తురెవ్వని, దివ్యపదము వాడు
దిక్కునాకు"

(అష్టమ. స్కం. 77)

అని అంటాడు. కాని గజేంద్రునికి,

"కలడందురు దీనుల యెడ కలడందురు భక్త యోగి
గణముల పాలం
గలడందురన్ని దిశలను కలడు కలండనెడు వాడు
కలడో లేడో"

(అష్టమ. స్కం. 86)

అను సందేహం ఉన్నంత వరకు భగవంతుని దర్శనం కలుగలేదు. గజేంద్రుడు తన పూర్తి శక్తిమేరకు పోరాడి ఇక పోరాడే శక్తిలేక

"లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె
బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను మూర్ఛవచ్చె తనువున్ డస్సెన్ శ్రమం
బయ్యెడిన్
నీవే తప్ప నితః పరం బెఱుగ మన్నింపం దగున్ దీనునిన్
రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!"

(అష్టమ. స్కం. 90)

అని ఆక్రోశించటంతో భగవంతడు కదిలి వచ్చాడు. మూల భాగవతంలో గజేంద్రుడిని రక్షించడానికి మహా విష్ణువు రాక సాధారణంగా ఉంటుంది. కానీ ఇంతలా ఆక్రోశించిన భక్తుడి కోసం వచ్చే భగవంతుని రాక సాధారణంగా ఉండడం పోతనగారికి నచ్చక వైకుంఠం నుంచి వచ్చే శ్రీమహావిష్ణువు రాకను భక్త్యావేశంతో చిత్రించాడు. భక్తిరసం మధ్య ఈ శృంగారభావం పోతన స్వంత కల్పనే. గజేంద్రుడు భక్తితో తనను ఆక్రోశించే సమయానికి విష్ణువు లక్ష్మీదేవితో వినోదంలో మునిగిఉ న్నాడు. అలాంటి పరిస్థితిలో ఉన్న భగవంతుడు భక్తుడి ప్రార్థన విని వచ్చే సందర్భాన్ని పోతనగారు ఇలా వర్ణించాడు.

"సిరికిం జెప్పడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపడే
పరివారంబును జీరడభ్రగపతిం బన్నింపడాకర్ణికాం
తర ధమ్మిల్లము చక్కనొత్తడు వివాద ప్రోత్థిత శ్రీకుచో
*పరిచేలాంచలమైన వీడడు గజ ప్రాణావనోత్సాహియై*"

(అష్టమ. స్కం. 96)

గజేంద్రుని మొరవిని శ్రీహరి తాను ఎలాంటి స్థితిలో ఉన్నాడని కూడా చూసుకోకుండా ఉన్నఫలంగా పరిగెత్తు కొచ్చాడు. ఈ పద్యాన్ని చదివి- 'యుద్ధానికి బయల్దేరే వాడు అలా ఎలా ఉన్నఫలంగా బయల్దేరతాడయ్యా' అంటూ పోతనని, శ్రీనాథుడు అపహాస్యం చేశాడని ఐతిహ్యం. ఈ విషయం మీద వాదన జరుగుతుండగానే శ్రీనాథునికి తన పిల్లవాడు బావిలో పడిపోయాడని ఎవ్వరో చెప్పారు. వెంటనే శ్రీనాథుడు హడావుడిగా బావి దగ్గరకు పరుగులెత్తాడు. పిల్లవాడు బావిలో పడలేదనీ, ఆప్తులైన వారు ఆపదలో ఉన్నారని తెలిసినప్పుడు కంగారుపడి పరుగులెత్తడం సహజమనీ శ్రీనాథునికి తెలియచేసేందుకే ఈ నాటకం ఆడామనీ పోతన శిష్యులు చెబుతారు. అలా మహావిష్ణువు వచ్చి మొసలిని సంహరించి గజేంద్రునికి విముక్తినిస్తాడు.

లౌకిక, వేదాంత విషయాలు రెండూ మేళవించి రచించిన గాథ కుచేలోపాఖ్యానం. కుచేలం అంటే చిరిగిన

వస్త్రం. కుచేలుడి అసలు పేరు సుదాముడు. కుచేలుడు అపారమయిన మానాభిమానములు కలిగినవాడు. గొప్ప బ్రహ్మతేజస్సు ఉన్నవాడు. శ్రీకృష్ణుడి మిత్రుడు. ఆయన సంసారబంధాలకు అతీతంగా ఉంటూ నిరంతరమూ భగవంతుడినే స్మరిస్తుంటాడు.

కంసుని యాగ నిమిత్తం బలరామకృష్ణులు మధురకు వచ్చినపుడు కుచేలుడి ఇంటికి వెళతారు. వారిని చూచిన వెంటనే తత్తరపాటుతో తన ఆసనం నుండి లేచి నమస్కారం చేస్తాడు కుచేలుడు. అర్ఘ్య పాద్యాలను, తాంబూలాలను, పూలు, గంధము మొదలైన వస్తువులను ఆనందభరితుడై వారికి ఇచ్చాడు. మిత్రుడి మర్యాదలకు మెచ్చిన శ్రీకృష్ణుడు అతన్ని వరం కోరుకోమనగా

"నీ పాద కమల సేవయు నీ పాదార్చకులతోడి
నెయ్యమును నితాం
తాపార భూత దయయను తాపస మందార నాకు
దయసేయగదే"

(దశమ. స్కం. పూ. 1270)

అంటూ భగవంతుని పాదసేవ చేసే అవకాశాన్నే కోరుకుంటాడు. భగవంతుడు కనబడి నీకేమి కావాలని అడిగితే, అడగడానికి ఏమీ ఉండదు. ఆ ముగ్ధమోహన మూర్తి దర్శనంతో కోరికలన్నీ నశిస్తాయి. ఆ మహాత్ముని పాదాలకు సేవ చెయ్యాలనే కోరిక తప్ప మరేమీ మిగలదని కుచేలుడి భావన.

సుదాముడు తనకు ఏమీలేక ఎంతటి దరిద్రంలో ఉన్నా అన్నీ ఉన్నాయని తృప్తిగా ఉన్నవాడు. ఈశ్వరుడు తనకు ఫలానిది ఇవ్వలేదు అని అనడం తెలియనివాడు. అంతటి మహాభక్తుడు. అటువంటివాడు అంత దరిద్రం అనుభవిస్తున్నా ఎన్నడూ కృష్ణ భగవానుడి దగ్గరకు వెళ్లి చెయ్యి చాపి 'కృష్ణా, నాకు సహాయం చేస్తావా' అని అడగలేదు. కాని ఒకరోజు భార్య కోరికపై కృష్ణుని దర్శించడానికి ద్వారక వెళ్లాడు. కుచేలుడు కృష్ణుడి మందిరానికి వెళ్తుండగా కృష్ణుడే కొంత దూరం నుంచే కుచేలుడిని చూడగానే ప్రేమతో ఎదురు వెళ్ళి కౌగిలించుకొని వెంటబెట్టుకొని వస్తాడు. తన హంసతూలికా తల్పంపై కూర్చోబెట్టి కుచేలుడి కాళ్ళు కడుగుతాడు. కుచేలుడి శరీరం పులకించింది. అది చూసిన అంతఃపురకాంతలంతా

"ఏమి తపంబు సేసెనొకొ యీ ధరణీదివిజోత్తముండు తొల్
బాముస యోగివిస్ఫుర దుపాస్యకుడై తనరారు నీజగత్
స్వామి రమాధినాథు నిజతల్పమునన్ వసియించి యున్నవా
డీ మహనీయమూర్తి కెనయే మునిపుంగవు లెంతవారలున్"

(దశమ. స్కం. ఉ. 985)

అని తమలో తాముఅనుకుంటారు. అనంతరం కృష్ణుడు కుచేలుడితో చిన్నప్పటి సంగతులు ఎన్నెన్నో మాట్లాడాడు. చివరికి శ్రీకృష్ణుడు 'నాకోసం ఏం తీసుకొచ్చావు' అని అడిగి

"దళమైన పుష్పమైన, ఫలమైనను సలిలమైన పాయని భక్తిం
గొలిచిన జనులర్పించిన, నెలమిన్ రుచిరాన్నముగనె
యేనె భుజింతున్"

(దశమ.ఉ.1010)

అని అనగా ఆ మాటలకు కుచేలుడు సంతోషించినా, తను తెచ్చిన అటుకుల మూటను మాత్రం కృష్ణుడికి అర్పించలేకపోతాడు. చివరకు కృష్ణుడే అతనివద్ద ఉన్న అటుకుల మూటను తీసుకొని 'ఇదేమిటి!' అని అడుగుతూ ముడిని విప్పి అటుకులు గుప్పెడు తీసుకొని అటుకుల్ని ఆరగించాడు.

"మురహరుడు పిడికెడడుకులు, గర మొప్పగ
నారగించి కౌతూహలియై
"మఱియును బిడికెడు గొనదత్కర మప్పుడు పట్టె
గమల కరకములన్"

(దశమ.ఉ.1013)

ఇతనికి సకల సంపదలను అందించడానికి ఇందాక మీరు తిన్న అటుకులే చాలు అని రుక్మిణి వారిస్తుంది. ఈవిధంగా శ్రీకృష్ణుడు కుచేలుడిని అనుగ్రహించాడు. అసలైన సఖ్యభక్తికి అపూర్వమైన ఉదాహరణ కుచేలోపాఖ్యానం.

పైన చెప్పిన నవవిధాలైన భక్తులే కాక భాగవతంలో వైష్ణవ మతంలోని ఆళ్వారుల ప్రతిపాదించిన మధురభక్తి కూడా ఉంది. ఇది నవవిధ భక్తుల కంటే కొంత విలక్షణ మైంది. ఇది ప్రాచీన భక్తి విశేషం. ఇందులోని ప్రధానతత్త్వం పరమాత్మ మధురభక్తికి ఉదాహరణగా దశమస్కంధంలోని శ్రీకృష్ణుని రాసక్రీడల్ని పేర్కొనవచ్చు.

"నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబుపై
జల్లెడువాడు మౌళిపరిసర్పిత పింఛమువాడు నవ్వు రా
జిల్లెడు మోమువా డొకడు చెల్వల మానధనంబు దోచెనో
*మల్లియలార మీ పొదల మాటున లేడుగదమ్మ చెప్పరే"*
(దశమ. స్కం. పూ. 1011)

విరహవేదనతో గోపికలు కృష్ణుని వెదకు సందర్భంలో పోతనగారు దివ్యావేశంలో వ్రాసిన ఈ పద్యం భక్తి శృంగార భావ పరిపోషణములు కలది.

**ముగింపు :**

పోతన తీర్చిదిద్దిన 'ఆంధ్ర మహాభాగవతం' సార్వ కాలిక విలువ కలిగినది. ఇందులోని విష్ణు కథలు ఎన్నో ఏళ్లుగా తెలుగు వారిని ఉత్సాహపరుస్తూనే ఉన్నాయి. ఇప్పటి తరాలకు కూడా ప్రహ్లాద చరిత్రం, గజేంద్ర మోక్షం, శ్రీకృష్ణావతారం లాంటి ప్రసిద్ధ కథలను, భాగవతపద్యాలు వినని తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఏదేమైనా పోతన చెప్పినట్లు భాగవతాన్ని పోతన రాయడం ఆయన చేసుకున్న పుణ్యం మాత్రమే కాదు, తెలుగు జాతి యావత్తూ చేసుకున్న పుణ్యం.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. కరుణశ్రీ, (సం.) భాగవత వైజయంతి దీపిక, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కళాభవన్, సైఫాబాద్, హైదరాబాద్, 1983.
2. పోతన బమ్మెర, శ్రీ మహాభాగవతం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కళా భవన్, సైఫాబాద్, హైదరాబాద్, 1983.
3. లక్ష్మీకాంతం పింగళి, ఆంధ్ర సాహిత్య చరిత్ర, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కళా భవన్, సైఫాబాద్, హైదరాబాద్, 1974.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2(1), February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# పిల్లల కథలు - ప్రయోజనాలు

- డా॥. గెంజి అరుణ, అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ లింగ్విస్టిక్స్, ఎస్.వి. యూనివర్శిటి, తిరుపతి.

పూర్వం పల్లెల్లో ఆరుబయట మంచాలు వేసుకొని అవ్వాతాతల దగ్గర కథలు చెప్పించుకొంటూ పిల్లలు నిద్రపోయేవాళ్లు. కథ చెప్పకపోతే మారాం చేసేవాళ్లు. మా చిన్నప్పుడు మా అమ్మకూడా మాకు చిన్న చిన్న కథలను చెప్పేది. ఇప్పటికాలంలో ఉరుకులు పరుగులు. ఎవరి దారి వారిది. పెద్దలు వ్యాపారాలు, ఉద్యోగాలతో పిల్లలు పాఠశాలలు, ట్యూషన్లతో యాంత్రిక జీవనం సాగిస్తున్నాం.

కథలు మానవ మేధస్సుకు పదును పెడ్తాయి. జీవిత పాఠాలను నేర్పుతాయి. బిడ్డకు తల్లి వద్దనుంచే బాలసాహిత్యం మొదలవుతుంది. తల్లిదండ్రులు లేదా గురువులు చెప్పే మాటలు పిల్లలు బాగా వింటారు. ఇప్పుడు పాఠశాలల్లో కథలు చెప్పేవారే కరువయ్యారు. పిల్లలకు కథలంటే చాలా మక్కువ. పాఠాలకన్నా కథలను పిల్లలు బాగా వినడానికి ఆసక్తి చూపుతారు. అందుకే కథలరూపంలో పాఠాలను పిల్లలకు చెప్పాలి. సైన్సు, పర్యావరణ శాస్త్రాలను కూడా కథలరూపంలో చెబితే వారిలో సృజనాత్మక శక్తి పెరుగుతుంది.

ప్రతి కథలోను అంతర్గతంగా నీతి దాగి ఉంటుంది. పిల్లల కథల్లో ఎక్కువగా జంతువులు, పక్షులు ఉంటాయి. వాటిమధ్య కథ సాగడం జరుగుతుంది. జంతువులు, పక్షులు మాట్లాడటం ఈ కథల్లో కనిపిస్తుంది.

పిల్లలు కథలు వినడం వల్ల, చదవడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి.

### పిల్లల కథలు - ఉపయోగాలు :

**మంచి నడవడికను అలవరచుకొంటారు** : కథలు వినడం, చదవడం వల్ల పిల్లలు మంచినడవడికను అల వరచుకొంటారు. కథల్లోని పాత్రలో వారు మమేకమవు తారు. రాజు, రాణి కథలు చెప్తున్నప్పుడు మగపిల్లలయితే రాజుగా, ఆడపిల్లలయితే రాణిగా ఊహించుకొని ఆ కథలో వారు చేసే మంచిపనులను స్వయంగా వీళ్లు చేయాలని అనుకొని చేస్తారు.

**ఉత్సాహాన్ని కలిగిస్తాయి** : కథలు పిల్లలకు ఉత్సాహాన్ని నింపుతాయి. కథలోని పాత్రలను పిల్లలు ఎంతో ఇష్టంగా చదవడం, వినడం వల్ల వారిలో ఉత్సాహం రెట్టింపు అవుతుంది.

**ఆలోచనాశక్తిని పెంచుతాయి** : కథ చదవడం, వినడం వల్ల ఆలోచనాశక్తి పెరుగుతుంది. వాళ్లు ఎలా, ఎందుకు చేశారు దాన్ని, అలా ఎందుకు అయింది. ఇలా చేస్తే బాగుండేది కదా అని ఆలోచనావిధానాన్ని కల్పిస్తాయి.

**జ్ఞానాన్ని కలుగజేస్తాయి** : కథలు పిల్లలకు జ్ఞానాన్ని కలుగజేస్తాయి. కథలు సృజనాత్మకత, కల్పితాలు, వాస్తవాలు అన్నీ కలిగి ఉంటాయి. కాబట్టి వాటిని ఆలో చించి జ్ఞానాన్ని పెంపొందేందుకు కథలు ఉపయోగ పడుతాయి.

**మానసిక ఉల్లాసం** : ఒక మంచి కథ చదివినప్పుడు మనస్సు తేలిక అవుతుంది. చదవడం, వినడం చేసే టప్పుడు ధ్యాస అంతా కథపై ఉంటుంది. మనస్సులో ఏదన్నా బాధ ఉంటే అది మరచిపోయేటట్లు చేసి మనస్సును ఉల్లాసంగా ఉంచేటట్లు చేస్తాయి.

**ఏకాగ్రత పెరుగుతుంది** : కథలు చదవడం వల్ల పిల్లల్లో ఏకాగ్రత పెరుగుతుంది. ఏకాగ్రత పెరగటం వల్ల చదువుపై వారికి శ్రద్ధ కూడా పెరుగుతుంది.

**ప్రశ్నించే గుణాన్ని కలుగజేస్తాయి** : కథలు పిల్లల్లో ప్రశ్నించే గుణాన్ని కలుగజేస్తాయి. కథ వినేటప్పుడు, చదివేటప్పుడు కలిగే ఆలోచనల వల్ల వారిలో ఎలా, ఎందుకు, ఏమిటి అనే ప్రశ్నలు ఉదయించి దానికి జవాబులు అడుగుతారు. అలా వారి తరగతి గదిలో

కూడా వారి అనుమానాలను, ప్రశ్నలను అడిగి జవాబులు తెలుసుకొనే ధైర్యం వారికి కలుగుతుంది.

సమస్యలను పరిష్కరించే సామర్థ్యం అలవడుతుంది : పిల్లల్లో కథల్లోని సమస్యలు వాటి నివృత్తి చేసే విధానాన్ని తెలుసుకోవడం వల్ల వాస్తవ జీవితంలో వారికి ఏదయినా సమస్య వచ్చినప్పుడు వాటిని పరిష్కరించుకొనే సామర్థ్యం కలిగి ఉంటారు.

**ఉదా** : పాఠశాలలో పిల్లలను జంతుప్రదర్శనశాలకు పిక్‌నిక్ తీసుకొనివెళ్తారు. అందులో ఒకరు తప్పిపోతారు. వాళ్లు భయపడకుండా ఆ పిక్‌నిక్‌లో ఉన్న పార్కు నిర్వాహకుడి దగ్గరకు వెళ్లి ఫోన్ నెంబర్ ఇచ్చి వారితో మాట్లాడటం, పలానాచోట ఉన్నాం అని తెలుపడం వంటివి చేస్తారు. ఇవి కథలో వాళ్లు ఎప్పుడో విని ఉంటారు. అందుకే ఆ పిల్లవాడు అలా ధైర్యంగా చేస్తాడు.

**తెలియని పదాలకు అర్థాలు** : కథ చదవడం, వినడం వల్ల తెలియని పదాలకు అర్థాలు తెలుస్తాయి. కథ సాగుతున్నప్పుడు కథానుగుణంగా దాని అర్థాలు తెలిసే అవకాశం ఉంటుంది.

**వ్యాకరణం తెలుసుకొంటారు** : కథలు చదవటం వల్ల అందులోని నామవాచకాలు, సర్వనామాలు, విశేషణాలు, క్రియలు, కామాలు, చుక్కలు, ఆశ్చర్యార్థకపు గుర్తులు, సంభోధనాంశాలు జంటపదాలు, సామెతలు వంటివి ఎన్నో తెలియకనే తెలుసుకొంటారు.

**భాష సరళత ఏర్పడుతుంది** : కథలు చదవటం వల్ల పిల్లల్లో భాష సరళత ఏర్పడుతుంది. కథ ఎలా చదవాలి అనేది కూడా పిల్లలు నేర్చుకుంటారు.

## పిల్లలు కథలు చదవటానికి తీసుకోవలసిన చర్యలు :

**పుస్తకాలు కొని ఇవ్వాలి** : పిల్లలకు వారికి నచ్చిన పుస్తకాలు కొని ఇవ్వాలి. దానివల్ల నచ్చిన పుస్తకం కొన్నప్పుడు తప్పకుండా దాన్ని ఆసక్తిగా చదువుతారు. పుస్తకాలు పెన్నులు, పెయింటింగ్ రంగులు, పేపర్లు వంటివి పిల్లలు ఆశపడి కొనుక్కోవాలని అనుకొంటారు. కొంతమంది తల్లిదండ్రులు దానికి ఇష్టపడరు. సంవత్సరంలో కొత్త బట్టలు ప్రతి పండుగకు వేలు ఖర్చుపెట్టి కొనిపెడతారు. వాటిని సంవత్సరానికి ఒకటి రెండు సార్లకంటే ఎక్కువ తొడగరు. వేలు ఖర్చుపెట్టి విహార యాత్రలకు, వినోదయాత్రలకు వెళ్తారు. సినిమాలు, హోటళ్లకు వెళ్లి భోజనాలు చేసి ఖర్చుపెడతాము. కాని యాభై, వంద రూపాయలు పెట్టి పిల్లలకు పుస్తకం కొనిపెట్టం. తల్లిదండ్రుల మనసు మారాలి. పిల్లలకు పుస్తకాలు కొనిపెట్టాలి.

**పిల్లలు అడిగితే కథ తప్పక చెప్పాలి** : తల్లిదండ్రులను పిల్లలు కథ చెప్పమని అడిగితే వాళ్లు తెలియదు, సమయం లేదు, ఇప్పుడు కాదు అని దాటవేయకూడదు. వారికి కథ తెలియకపోతే కథలను చదువుకొని, తెలుసుకొని కథలను పిల్లలకు చెప్పాలి. ఒక వాణిజ్య ప్రకటనలో ఒక పిల్లవాడు వాడి తల్లిని రాత్రి నిద్రపోయేటప్పుడు కథ చెప్పమని అడుగుతాడు. తనకు కథలు తెలియదు. అందుకు వెంటనే పిల్లవాడి నాన్నమ్మకు, ఫోనుచేసి పిల్లవాడికి కథ చెప్పిస్తుంది. అప్పుడు కథ విని పిల్లవాడు నిద్రపోతారు. ఎంత విచిత్రమో చూడండి. ఇప్పటి తరాలవారికి నిజంగా కథలు తెలియవు. తెలుసుకోవాలనే సమయం వారికి ఉండదు.

**తీరిక సమయాలు** : తీరిక సమయాల్లో పిల్లలకు కథలు చెప్పాలి లేదా పిల్లలకు తీరిక సమయాల్లో వారికి నచ్చిన కథను సొంతంగా రాయమని చెప్పాలి. అలా చేయడం వల్ల వారిలో సృజనాత్మకశక్తి అలవడుతుంది. ఆలోచనలో పడతారు.

అలా కథల గురించి అన్ని పుస్తకాలు తిరగేస్తున్నప్పుడు ఒక పుస్తకంలో పాఠశాల విద్యార్థులు రాసే కథల్లో కాల్పనికతకన్నా సృజనాత్మక శక్తి మరియు వాస్తవికత రెండూ కనిపించాయని ఉంది. అందుకు నేను మా పాపతో నీ సొంతంగా ఒక కథను నీకు నచ్చిన విధంగా రాయమని

చెప్పాను. మా పాప ఇప్పుడు ఏడవ తరగతి చదువుతోంది. తాను కాసేపు ఆలోచించి కథ రాయడం మొదలుపెట్టి, కథ రాసి నాకు ఇచ్చింది. ఆ కథపేరు 'ప్రయత్నం' అని పెట్టింది. అందులోని పాత్ర ఒక పక్షి. వస్తువు ఇల్లు కట్టుకోవాలనే కోరిక. కథ ఇలా సాగింది -

ఒక ఊరికి దగ్గర ఒక చిన్న అడవి. అందులో ఓ పక్షి ఒక చెట్టుపై నివసిస్తూ ఉండేది. ఆ పక్షికి ఒకరోజు గూడు కట్టుకోవాలి అనే కోరిక కలిగింది. గూడు కడదామని అనుకొనేలోపే ఆ పక్షి కాలికి ఒక సన్నని కొమ్మ గుచ్చుకొని పెద్ద దెబ్బ తగిలింది. ఏమి చెయ్యాలో తెలియని స్థితిలో ఆ పక్షి చాలా బాధపడింది. అప్పటికే చాలాకాలం గడి చింది. వానాకాలం రాబోతుంది. బాధపడి ప్రయోజనం లేదని చిన్నచిన్నగా అడుగులు వేసింది ఆ చిన్నపక్షి. అలా కొద్దిరోజులకు అది బాగానే నడుస్తున్నది. ఇప్పుడు ఎగురటానికి మొదలుపెట్టింది. కాలినొప్పికి మొదటిసారి ఎగరలేకపోయింది. రెండోసారి ప్రయత్నించింది. అడుగు వేసి చిన్నగా రెక్కవిప్పింది. రెండోసారి కూడా కిందపడింది. అలా ఇరవైసార్లు ప్రయత్నించింది. ఇప్పుడు ఇరవై ఒకటోసారి ఎగరటానికి ప్రయత్నించింది. ఈసారి కింద పడకుండా పైకిలేచి ఎగిరింది. పక్షి సంతోషానికి అవధులు లేవు. తాను అనుకొన్న విధంగా కొద్దిరోజులకు గూడు కట్టుకుంది. ప్రయత్నం చేస్తే తప్పులేదు. ప్రయత్నం ఎప్పుడూ ఓడిపోదు. ఈ పక్షి మంచిగా పట్టుదలతో ప్రయ త్నించి ఆత్మస్థైర్యం కోల్పోకుండా విజయం సాధించింది. అలాగే మనంకూడా కష్టాలు కలిగినప్పుడు ధైర్యంగా ఎదుర్కొని అనుకొన్న పనిని వదలకుండా ప్రయత్నించి గెలవాలి.

**నీతి** : ప్రయత్నం చేయగా సాధించవచ్చు. ప్రయత్నం ఎప్పుడయినా గెలుస్తుంది.

ఇలా తన కథను రాసి నాకు చూపించింది. ఆ కథలో తన సృజనాత్మక శక్తితోపాటుగా వాస్తవికతను జోడించి చెప్పడంతో నాకు ఆశ్చర్యం కలిగింది.

**సెల్‌ఫోన్లు చూడటం మాన్పించాలి** : సెల్‌ఫోన్ రేడియేషన్ వల్ల పిల్లలు అనారోగ్యపాలవుతారు. మోనిటర్‌లో వచ్చే వెలుగువల్ల కంటి సమస్యలు రావచ్చు. పుస్తకాల వల్ల అలాంటి ఇబ్బంది కలగదు. కథల పుస్తకాలు చదవటం ఇష్టపడితే పిల్లలు వారి పాఠ్యపుస్తకాలు చదవడానికి కూడా బాగా ఇష్టపడతారు. పాఠ్యపుస్తకాలు చదవడం వల్ల వారికి వారి సబ్జెక్ట్‌లో జ్ఞానం బాగా పెరుగుతుంది.

**గ్రంథాలయం** : వీలయితే కొన్ని ఇష్టమయిన పుస్తకా లను కొని ఇంటిలోనే గ్రంథలయాన్ని పెట్టుకొని ఇష్టం వచ్చినప్పుడు వాటిని చదివే అలవాటు పిల్లలకు చేయాలి. లేదా పాఠశాలలో ఒక పీరియడ్ గ్రంథాలయానికి తీసుకొని వెళ్లాలి. ఇంకా తల్లిదండ్రులు పిల్లలను బయటి గ్రంథా లయాలకు కూడా తీసుకొని వెళ్లి అక్కడ ఉన్న పుస్తకాలను వారికి పరిచయం చేయవచ్చు.

**నిద్రపోయేటప్పుడు** : పిల్లలు నిద్రపోయేటప్పుడు, టి.వి. సీరియల్స్, సెల్‌ఫోన్ గేమ్స్ ఆడటం కంటే ఒక పుస్తకం చదివే అలవాటు చేస్తే వారు ప్రశాంతంగా నిద్రపోతారు.

**ఆధారగ్రంథాలు** :

1) చిన్ని చిన్ని కథలు - ఎమ్.వి.వి. సత్యనారాయణ.
2) పంచతంత్ర కథలు - యువమిత్ర
3) పిల్లల నీతికథలు - వాగుమూడి లక్ష్మీరాఘవరావు
4) మర్యాదరామన్న కథలు - శీతం రాజు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2(1), February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# సినారె సాహిత్యం - మానవీయ దృష్టికోణం

- డా॥. జరుపుల రమేష్, హెడ్ & అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ఎస్.ఆర్. & బి.జి.యన్.ఆర్. ప్రభుత్వ, అర్ట్స్ & సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి), ఖమ్మం.

వేయ్యేళ్ళ తెలుగు సాహిత్యం అనేకానేక మంది కవులను, రచయితలను, రచయిత్రులను తయారు చేసింది. తెలుగు నేల సువర్ణ నేలగా ఖ్యాతిని గడిచింది. ఎందరో మహనీయులు ఈ తెలుగు నేల కోసం కృషి చేసారు. సాహితి సంపదను మన తెలుగు జాతికి అందిచారు. అందని వారికి అందేటట్లు చేసారు. అటువంటి నేలలో పుట్టిన మహనీయుడు డా. సి. నారాయణ రెడ్డి (1931 - 2017). ఆచార్య సి.నారాయణ రెడ్డి గారు ఒక అధ్యాపకుడిగానే కాకుండా, ఆచార్యుడిగానే కాకుండా, కవిగా, సినీ కవిగానే కాకుండా, రాజకీయపుటంచులను కూడా అందుకున్న విరాట్మూర్తి. సాహితీ లోకంలో ఒక పక్క సారస్వతం, మరోపక్క రాజకీయం రెండింటిని కూడా నిలిపినటువంటి సవ్యసాచి సినారె. సి. నారాయణ రెడ్డి రాసిన సాహితి సంపదను అనేక సంపుటాలుగా ప్రచురించడం జరిగింది. వాటిలో నాలుగోవ సంపుటిలో ఉన్న 'అక్షరాల గవాక్షాలు, మధ్య తరగతి మందహాసం, మరో హరివిల్లు' మూడు రచనల్లో మానవీయ దృష్టికోణాన్ని పరిశీలించడం ఈ వ్యాసం యొక్క ఉద్దేశం.

## మానవత వాదం :

అధునిక సాహిత్యంలో మానవత్వం అనేది ఒక ప్రక్రియ కాదు. ఒక రూపం మాత్రమే. అది సాహిత్యంతో పాటే అంతర్నిగూడమై ఉంటుంది. తెలుగులో అధునిక సాహిత్యం అంతా మానవ సాహిత్యమే. మానవుడే ప్రధాన కేంద్ర బిందువు. మానవుడు కేంద్ర బిందువులేని సాహిత్యం కూడా ఉంటుంది. 19వ, 20 శతాబ్ది నుండి వస్తున్న సాహిత్యం మనిషి మనిషిని చూడటానికి, మాట్లాడడానికి, గౌరవించడానికి, ఉన్నతిని కాంక్షించడానికి, సమాజ బాధ్యతను దిశానిర్దేశం చేయడానికి వచ్చిన, వస్తున్న సాహిత్యంగా పరిగణించవలసిన అవసరం ఉంది.

"అధునిక కాలంలో మానవతావాదం ముఖ్యంగా మనుష్యులందరూ సమానులేనని ఒక మనిషి వేరొక మనిషి పై పెత్తనం చేయటం అమానుషమనీ, ఒక మనిషి తన స్వార్థ ప్రయోజనాలను నెరవేర్చుకొనేందుకు సాటి మనుష్యులను పరికరాలుగా ఉపయోగించ కూడదనీ, ప్రతి మనిషి జీవన లక్ష్యం ఆనందంగా గడపడమే నన్న విషయాలను నొక్కి చెప్తుంది. అణచివేత పీడనలను నిరసిస్తుందని" నేతి అనంతరామశాస్త్రి అన్నారు.

మానవతావాదాన్ని ఆంగ్లంలో Humanism అంటారు. Humanism అనే పదాన్ని మొట్టమొదటి సారిగా అక్స్ఫర్డ్కి చెందిన F.C.S. షిల్లర్ సమకూర్చాడు. షిల్లర్ ప్రతిపాదించిన వ్యవహారికవాద రూపాంతరమే మానవతా వాదంగా భావించబడింది.

వివిధ నిఘంటువులను పరిశీలిస్తే నిష్ప్రవ character or quality being human, devotion to human interests" n" (The oxford English Dictionary)లో చెప్పడం జరిగింది.

గ్రీకు తత్త్వవేత్త ప్రొటాగరస్ "Man is measure of all things, of things that are that they are, and of things that are not they are not" అనే భావనను క్రీస్తుపూర్వం 5 వ శతాబ్దిలో వెలువరించారు. సోక్రటీస్ 'నిన్ను నీవు తెలుసుకో' అంటాడు. ప్లేటో 'మానవ జీవితం హేతువు ఆధారంగా సాగుతుందని పేర్కొంటాడు. గ్రీకు మానవతావాదుల వల్ల రోమన మానవతావాదుల ప్రభావితులయ్యారు. వీరిలో పేర్కొనదగినవారు సిసిరో, సెనెకా, మార్కస్, అరిలియస్ మొదలైనవారు.

"Iam a man, and nothing human is foreign to me" అని రోమన్ నాటక కర్త 'టెరెన్స్' చెప్పిన మాటలను

రోమస మానవతావాదులు తరుచుగా ఉపయోగించు కుంటారు. భారతీయ సమాజంలో ఈ విధానం తక్కువేమి కాదని నిరూ పించింది.

భారతీయ సమాజంలో మానవతావాదం ఉద్యమంగా గాక ధర్మ పరిరక్షణగా, నైతిక విలువల పరిరక్షణగా నిలస్తూ వచ్చింది. ఈ వాదం భారతీయ సంస్కృతిలో ధార్మిక ప్రాధాన్యాన్ని కలిగి ఉంది. భారతదేశం భిన్న సంస్కృతు లకు, మతాలకు ఆలవాలమైంది. ఈ భిన్నత్వంలోనే అంతర్లీనంగా ఏకత్వం కూడా గోచరిస్తుంది. భారతదేశంలో గల మతాల్లో కొన్ని ఇక్కడే ఉద్భవించగా మరికొన్ని ప్రచారం ద్వారా వాచ్చాయి. పాశ్చాత్య సమాజంలో మతం ముఖ్యంగా మధ్యయుగాల్లో ప్రాచుర్యంలోకి రాగా భారతీయ సమాజంలో ప్రాచీన, మధ్య, ఆధునిక యుగాలన్నింటిలోను మత ప్రభావం విశేషంగా కని పిస్తుంది.

మానవతావాదాన్ని భారతీయ నేపథ్యంలో మతం నుండి విడదీసి చూడటం కష్టం. నిజానికి మతాలు, మత గ్రంథాలు, ప్రబోధాలు మానవతావాద సూత్రాలను రూప కల్పన చేసి విశిష్టతను పొందాయి. "భారతీయుల మానవతా దృక్పథం పాశ్చాత్యుల దృక్పథాని కంటే వ్యతిరిక్తమైనది కాదు. కానీ మానవతావాద అనుశీలన లోనూ, అవగాహన పద్ధతులల్లోనూ భేదసాదృశ్యాలు లేకపోలేవు. ప్రాచ్య మానవతాదృక్పథం ఆధ్యాత్మిక భావంలో మేళవించి రూపుదిద్దుకొంది. ఆధ్యాత్మిక సాధన మానవతకు మార్గమని భారతీయ తత్త్వదర్శనం విశ్వ సిస్తుంది" అని ఆచార్య జి. అరుణకుమారి గారు అభిపాయపడ్డారు.

## సినారె రచనలు - మానవతా దృష్టికోణం :

"Patriotism cannot be our final spititual shelter, my reguge is humanity. I will not buy glass for the price of diamonds, and i will never, allow patriotism to triumph over humanity as long as live"

(Ravindranath Tagore)

"The diversity of the phenomena of nature is so great, and the treasures hidden in the heavens so rich, precisely in order that the human mind shall never be lacking in fresh nourishment"

(Johannes Kepler)

దేశకాల పరిస్థితుల్లోని మార్పులను బట్టి మానవతా వాదం అనేక అవతారాలు ధరిస్తూ వచ్చింది. అయినా మానవాభ్యుదయమే దాని అంతిమ లక్ష్యం. ఈ కోణంలో డా. సి. నారాయణ రెడ్డి రాసిన 'అక్షరాల గవాక్షాలు, మధ్యతరగతి మందహాసం, మరో హరివిల్లు'లో ప్రతి ఫలించిన మానవత కోణాన్ని పరిశీలిద్దాం.

## అక్షరాల గవాక్షాలు :

మానవునిని గూర్చి, మానవతావాదాన్ని గూర్చి సినారె ప్రవచించని కవితా సంకలనం ఒక్కటి కూడా లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతి దానిలోనూ కొత్త కొత్త దృక్కోణంతో మనిషిని పరిశీలించి కవిత్వంగా మలిచాడాయన. 'నవ్వని పువ్వు నుండి మొదలు పెట్టి నా రణం మరణం పైనే' కవిత సంకలనం వరకు తనదైన శైలిలో తెలుగు సాహిత్యంలో ఒక చెరగని ముద్ర సినారెది.

'అక్షరాల గవాక్షాలు' కవిత సంకలనం డిశెంబర్ 1965లో వెలువడింది. ఇందులో మొత్తం 53 కవితలు ఉన్నాయి. 'మధ్యతరగతి మందహాసం' కవితా సంపుటి డిశెంబర్ 1968లో ప్రచురించడబడింది. ఈ కవితా సంపుటిని శ్రీ అల్లాడి పెంటయ్యకు అంకితం ఇవ్వడం జరిగింది. ఇందులో 40 కవితలు ఉన్నాయి. 'మరో హరివిల్లు' కవితా సంపుటి డిశెంబర్ 1969 లో సాహితీ ప్రపంచంలోకి వచ్చింది. ఇందులో 41 కవితుల ఉన్నాయి. ఈ మూడు కవిత సంపుటాలు డిశెంబర్ నెలలో ప్రచురణ కావడం యాదృచ్ఛికమైన సంఘటన.

'ఓమ్' అనే 'మానవగీతం'లో 'నిన్ను గూర్చి పాడు కొందు/ నన్ను గూర్చి పాడుకొందు/ నిన్ను నన్ను గన్న తల్లి / నేల గూర్చి పాడుకొందు/ నేల పైన మెరిసిన క / న్నీటి చుక్క లేరుకొందు/ ధూళిలోన విరిసిన హృద/ యాల

గాథ లేరుకొంద...అంటూనే 'సురలకన్న కరుణా త్ముడు / నరుడుగాక ఇంకెవ్వడు/ మందిర మెరుగని దేవుడు/ మనిషిగాక యింకెవ్వడు అని మనిషి అసలు స్వరూపాన్ని చిత్రించాడు.

జీవితంలో ప్రతి నిమిషం చాలా విలువైనది. కానీ మనిషి మాత్రం తన మనుగడ సాగించడానికి, అవసర మైతే తను ఏ స్థాయిలో నుండి వచ్చాడనే విషయాన్ని మరిచిపోయి జీవిస్తూంటాడు. తన జీవితమే శ్వాశత మనుకుంటాడు. సాటి మనిషిని, కన్న తల్లిని, నేలను మరిచిపోతుంటాడు. నిత్యం తప్పులను చేస్తున్న మనిషిలో నిజమైన మనిషి ఉంటాడని, మానవత్వం ఎలప్పుడే నిలువెత్తు ఉంటుందని, దేవుడి కంటే మనిషి మాత్రమే ఎక్కువ ప్రేమను చూపగలడని సినారె విశ్వసం.

'విషపానం' కవితలో 'నన్ను త్రాగనిండు విషము/ నా కదియే జీవరసము /ఎల్లరి కీ విషము మృత్యు / హేతు వనుట వెర్రిమాట/ గుండె గట్టిదూన కాల / కూట మమృతమైపోదా/ నా కెందుకు ముద్దగట్టి / నట్టి యీ పసిండిబ్రతుకు? / ప్రతిక్షణము దీపశిఖా/ ప్రతినిధిగా జీవింతును.. అంటూ మధ్యతరగతి జీవితాన్ని అద్దంలో చూపించాడు. చిరకాలం నుంచి సుఖాలకు మరిగి పర వశుడై ఉన్న ఒక అసామన్యజీవి ఒక్కమాటు త్రుళ్ళిపడి చేసుకున్న ఆత్మవిమర్శ ఈ కవితలో కనిపిస్తుంది. 'జాతస్య మరణం ధృవం' అన్నారు పెద్దలు. పుట్టిన మనిషికి మరణం తప్పదు. కానీ బతికున్న కాలంలోనే మధ్యతరగతి కుటుంబాన్ని చెందిన వ్యక్తులు చిన్న నమస్యకే ఆత్మ హత్యలు చేసుకునే ధోరణి నుండి బయటికి రావల్సిన అవసరాన్ని, మనవ జన్మ చాలా గొప్పదని, దాని కోసం గుండె గట్టిగా చేసుకోవల్సిన అవసరం ఉందని ప్రతీ కాత్మకంగా చెప్తూనే 'జీవనకేళి' కవితలో దానిని కొనసాగిస్తూ.. 'ఓహో ఈ బ్రతుకేమిటి / ఊహల వైకుంఠ పాళి / విద్యుత్ కౌముదిలో గో / పికలు లేని రానకేళి' అని హెచ్చరించాడు.

'శరణ్యం' కవితలో 'కన్నీళ్లతో తడిసియున్న నా బ్రతు కార / వేయుటకు నీ కంటివెలుగే శరణ్యమ్ము' వెలుగులు లేని చీకటి బ్రతుకుల జీవితాన్ని స్పృశించాడు. 'కన్నీటి తెరలు' కవితలో ' కన్నీటి తెరలు నా / గళము కడ్డమునిల్వ / ఏమి పల్కుదును నే / నెటుల పల్కుదును? కన్నీటి జాలు నా కలములో చొరబడిన ఏమి వ్రాయుదును నే/ నెటుల వ్రాయుదును?/ నరము నరమున బాష్ప / ఝరము త్రుళ్ళింత లిడ/ ఏమి పయనింతు నే / నెటుల శయనింతు? / గుండెయే ఒక అశ్రు / భాండమై తొణకగా / ఏమి భావంతు నే / నెటుల జీవింతు?/' అంటూ బాధను వ్యక్తం చేశాడు.

వ్యక్తులు మూడు రకాలుగా ఉంటారు. 1. ప్రశ్నించే వాళ్ళు 2. ప్రశ్న వేయాలనుకునేవాళ్ళు 3. ప్రశ్న ఉంటుందని తెలియని వాళ్ళు. ఈ విధానంలోనే మనకు మనుష్యులు కనిపిస్తుంటారు. ఏదైనా నమస్య వచ్చినా నమాజాన్ని ప్రశ్నించే వర్గం వెంటనే స్పందిస్తుంది. మరి కొంతమంది మనసులో అనుకుంటుంటారు, కానీ ప్రశ్న వేయలేరు. మరికొందరు ఆ విషయంలో ఒక ప్రశ్న ఉంటుందని తెలియని వాళ్ళు ఉంటారు. అవసరాన్ని బట్టి పై విధానంలో మార్పులు జరుగుతుంటాయి. పై కవితలో 'గుండెయే ఒక అశ్రు భాండమై తొణకగా' అనడంలో కింది తరగతి జీవితాలు, మధ్య తరగతి జీవన కోణాలు కనిపిస్తున్నాయి. ప్రజాస్వాయ్య భారతదేశంలో వ్యక్తులు, కవులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసుకోలేని సందర్భాలు ఉన్నాయని, అటువంటి పరిస్థితి ఉండ కూడదని ఈ కవిత ద్వారా తెలుస్తోంది. అందుకే 'కన్నీరే కావలెనా, పన్నీరే కావలెనా, కన్నీరే కావలెనని అన్నానొక నాడు' మనిషి నిత్యం బాధను కోరుకుంటునాడని తెలు స్తోంది. వారి జీవితాల్లో ఇటువంటి విషయాలు చాలా సాధారణీకం. అక్కడ నుండి మార్పు రావలసిన అవసరం ఉంది. 'అందం' కవితలో ' చావలేక బ్రతుకలేక / సాగలేక ఆగలేక / అటుమటించు జీవితాల / కందమేది? అర్థమేది?' అనుకుంటూ ముందుకు పోవడమే తప్ప గత్యతరం లేని పరిస్థితి.

'కాలం పిలుస్తున్నది' కవితలో "కాలం కేలెత్తి పిలుస్తున్నది/ కంకాళం లేచి నడుస్తున్నది/ పొగచూరిన బ్రతుకులతో పొగిలిన నరజాతి ధరా / గగనాలకు వంతెన కడుతున్నది.... శ్రమశక్తికి విలువ పెరుగుతున్నది/ జన హృదయం బలం పుంజుకున్నది/ గిరిజనుడే పురజనుడై ధరాఛత్రమును తిప్పే తరుణారుణకాలం వస్తున్నది" (పుట:57) అంటూ గిరిజనుడి హృదయాన్ని నూతన కోణంలో ఆవిష్కరింపజేశారు.

భారతదేశాన్ని అనేక మిత్ర దేశాలతో సత్సంబంధా లున్నాయి. 1959 సంవత్సరంలో అప్పటిదాకా మిత్రదేశం ఉంటూ వచ్చిన చైనా ఒకేసారి మన సరిహద్దుల పై దాడి చేసినప్పుడు సినారె స్పందించిన తీరు అమోఘనీయమైనది. తెలియకుండానే ఆలోచించేలా చేశారు. 'ఎవడురా' కవితలో "ఎవడురా నా తల్లి హిమగిరికిరీటమ్ము/ పై చేయిసాచ సుంకించె/ ఎవడురా నా పువ్వుటెడదలో నిప్పుర/ వ్వలు రాల్చగా సాహసించె....అంటూ పచ్చినెత్తుటి తోడ ప్రమిద వెల్గించుటకు / పట్టుబట్టిన వెర్రివాడా!/ పదిలపరచితి స్నేహభాండమ్ము నీ కొరకు/ అందుకో పాత చెలికాడా!" (పుట:60,61) అంటూ శత్రువును సైతం మన హృదయంలోకే ఆహ్వానం పలికించడం చాలా అద్భుత మైనది. వ్యక్తి నుండి వ్యక్తుల వరకు, ప్రాంతం నుండి రాష్ట్రం వరకు, రాష్ట్రం నుండి దేశం వరకు, దేశం నుండి ప్రపంచం వరకు ఎవరైనా మానవత్వంతో మెలగ గలిగితే అనేక సమస్యలు అదిలోనే త్రుంచుకోపోతాయి అనే భావన సినారె సాహిత్యం చదివిన వారికి కలుగుతుంది. ఇంతకుముందే చెప్పినట్లుగా మనిషిని మానవత్వంతో వేరుగా చూడలేము. కానీ వారి ప్రదర్శించే తీరును బట్టి మానవత్వం అనేది ఏ స్థాయిలో ఉన్నదో తెలుస్తుంటుంది. అందుకే "కోతియుగమా కాదు, రాతియుగమా కాదు / బ్రతుకు బ్రతుకెల్లి కప్రము వోలె వెచ్చింది/ పోయిన మహాత్మునికి పుట్టినిల్లిది సుమా!" అంటూ భారతదేశం యొక్క గొప్పతనాన్ని, దేశం యొక్క ఔన్నత్యాన్ని చెప్తూనే ఏ యుగంలోనైనా భారతదేశం మానవత్వంలో ఇతర దేశాలకీ ఆదర్శంగానే నిలిచిందని ఈ కవిత ద్వారా తెలు స్తోంది. మహాత్ముడి ఆశయాలు ఉన్నత వరకు ఈ దేశంలో మానవత్వానికి తిరుగులేదని "పలిగిలన అద్దమ్మువంటి/ వర్తమానమున స్వజాతి/ నిండుమొగము శతసహస్ర/ ఖండాలుగ కనిపించెను" (పుట:77) నని దేశ గొప్పతనాన్ని చాటి చెప్పారు.

## మధ్యతరగతి మందహాసం :

సాహిత్యానికి సామాజిక దృక్పథం ఉండాలి, సాంస్కృతిక పుష్టి ఉండాలి, రమణీయత ఉండాలి, సంక్షిప్తత ఉండాలి, అప్పుడే కవిత్వం ప్రజల హృదయాల్లోకి చొచ్చుకో పోతుంది. పాఠకుల్లో చైతన్యం తీసుకోస్తుంది. అందుకే సినారె కవిత్వంలో ఒక మానవతా స్పర్శ, ఒక విజ్ఞత, ప్రాజ్ఞత గోచరిస్తాయి. ఆయన ఏ ప్రక్రియ తీసుకున్న అందులో ఈ మార్గం ఉంటుంది. సినారె మనిషిని చిత్రించడంలో, మనిషి భావాల్ని చిత్రించడంలో, మనిషిలో వున్న భావోద్వేగాలను చిత్రించడంలో, మనిషిలో వున్న ఘర్షణలను చిత్రించడంలో ఆరితేరినవాడు. మనిషిలో ఉన్న ఏ భావావేశాన్ని ఆయనదాచలేదు.

సినారె మధ్యతరగతి కుటుంబంలో పుట్టినకవి. అందుకే ఆ భావజాలం బాగా తెలుసు. 'మధ్యతరగతి మందహాసం' కవితా సంపుటిలో ఆ తరగతి స్వభావాన్ని చిత్రించారు. ఈ కవిత సంపుటిలోని కవితలన్నీ 1965 నుండి 1968 మధ్యకాలంలో రాయబడినవే. ప్రపంచ వ్యాప్తంగా విప్లవాత్మకమైన మార్పులు వస్తున్న కాలమిది. భారతదేశంలో అందునా తెలుగు సాహిత్యంలో అభ్యుదయ సాహిత్యం సంక్షోభానికి గురై పునరుజ్జీవనం పొందు తున్న తరుణం. దిగంబర, చేతనావర్త కవులు దుసుకొస్తున్న సందర్భంలో ఈ కవితలను రాయడం విశేషం.

'పెరిగిపోతున్న ధరల్ని చూసి/ పెదవి విరవడం మాను కున్నాను/ కడివెడన్ని కలల్ని తాగేసి/ కడుపు నింపడం నేర్చుకున్నాను/ నవుతున్న జీవచ్ఛవానికి / రవ్వల హారంలా వున్నాను/ మధ్యతరగతి మనస్తత్వానికి / మాయని గాయంలా వున్నాను" అని సినారె మధ్యతరగతి జీవితాన్ని,

ఊహాల్లో తేలియాడే జీవితాన్ని అద్దం పట్టారు. మధ్యతరగతి జీవితాలు అటు చావుకి, ఇటు బ్రతకు మధ్య కొట్టుమిటాడుతుంటారు. హృదయంలో మాయని గాయంతోనే జీవచ్ఛంగా, స్తబ్ధంగా పడి ఉన్న జీవితాన్ని తట్టిలేపడాన్ని, వారి హృదయంలో ఉన్న భావాల్ని వెలికి తీయడాన్ని ప్రయత్నించాడు. ఆ ఉద్దేశంతోనే మధ్యతరగతి జీవితాన్ని 'జీవచ్ఛంగా' అనీ కవిత్వీకరించాడు.

'నన్నజాజీ పూలా బాలా' కవితలో 'నన్నజాజులు పలికే సన్నాయి పాటలు/ చిన్నకుర్రాడి కేం దెలుసు/నన్నజాజులు పరిచే వెన్నెలబాటలు/ అన్నార్తుడి కేందెలుసు?/ నన్నాజాజీ పూలామాలా/ మిన్నుల్లో ప్రతిధ్వనించింది ఆర్తగీతం/ తల్లీ కొడుకుల శవాల పైన / అల్లా కురిపించాడు అశ్రుజల పాతం" అనే ఆర్తిని తనదైన గొంతుకతో వినిపించాడు. పూలను కొనడం ఒకరి వంతు అయితే, అమ్మడం ఇంకొకరి పరిస్థితి. పూలు అమ్మిన డబ్బుతో జీవితాలను బతికించుకోలేక మరణించిన తల్లి కొడుకుల శవాలతో వారి పేదరిక జీవితాన్ని చిత్రించారు.

'దీపం ముట్టిస్తున్నావా పాపా?/ పాపచ్ఛాయలు సోకని పాలవ్రేళ్ళతో/ దీపం ముట్టిస్తున్నావా పాపా?/ ముట్టించు నీవైనా ముట్టించు/ మట్టిదీపమైనా సరే మనసారా ముట్టించు/ మంచిని వెలిగించలేని భీరవులం మేము" అంటూ చైతన్య స్ఫూర్తిని కలిగించాడు. దేశంలో చాలా మందికి జాతీయత తగ్గిపోతున్న తరుణంలో పేద గొంతుకతో ఈ భావాన్ని పలికించాడు.

'ఎక్కడికి పోతున్నాం మనం?' కవితలో అప్పటికి ప్రపంచీకరణ ప్రారంభమవ్వలేదు. దిగంబరం దశ నుండి బట్టలు వేసుకునే దశకు వచ్చిన ఈ లోకం మళ్ళీ ఎక్కడికీ పోతుందటూ ఆత్మవిమర్శ చేసుకునే సందర్భం వచ్చిందని, మంచితనాన్ని అందరికి చాటి చెప్పాలని, పేదవాడికి సహాయం పడాలనీ అటువంటి ప్రాంతంలో ప్రయణించవలసిని ఆవశ్యకత ఉందని ఈ సమాజాన్ని ప్రశ్నించాడు. ప్రశ్నలు రావడం సహజమే! కానీ ఆ ప్రశ్నలో సమాధానం వెతుకోవడం, దానిని కవిత్వీకరించడం కొందరికే మాత్రమే సాధ్యమౌతుందని చెప్పాలి. "ఎక్కడికి పోతున్నాం మనం? / కోతియుగం నుంచి రాతియుగంలోకి దూకి/ రాతి యుగంలోంచి రాకెటుయుగంలోకి ఎగబ్రాకి/ మళ్ళీ వెనక్కి నడుస్తున్నామా' అన్నది కవి ప్రశ్న. కాలం మారింది, కాలంతో పాటు మనుషులు మారాలి, కానీ కాలం మారింది కానీ, మనిషి మారలేదు, మనిషిలోని ఆలోచన మారలేదు, అది మారవలసిన అవసరం ఉంటుంది. 'మంచులో దిగబడిన మంచితనం/ మంటలా ప్రజ్వలిస్తున్న రోజు/ ప్రమాణం చేయాలి ఇందరం/ పశుత్వానికి గోరీకడదమని' వ్యవస్థని, వ్యవస్థలో ఉన్న లోపాలని పాతి పెట్టించే రోజులు ఎంతో దూరం లేదని ఈ కవితలో తెలియజేశాడు.

'దండలోని దారం'లో 'జీవితం కటికచేదు/ ఆ మాత్రం నాకూ తెలియకపోదు/ చేదుపొరల నడిమి నిజాన్ని/ చేదుకుంటే దాహం ఉండబోదు/ రంగుల చూసి మురిసి పోవద్దు/ అంతరంగాన్ని తలపోసి మూర్ఛపోవద్దు/ బహిరంతరాలను కలిపికుట్టే / పరమాత్మ సంగతి మరిచి పోవద్దు' జీవిత విలువలను తెలియజేశాడు. ఎమర్సన్ అన్నట్టు 'జీవితంలో ఆలోచనలు ఉండాలి, ఆలోచనలను ఆచరణలో పెట్టాలి, ఆచరణలో పెట్టని ఆలోచన ఆలోచనే కాదు' అన్నట్టుగా ప్రకృతి రహస్యాలు ప్రకృతికే తెలియనట్టుగా, జీవిత రహస్యాలు జీవితానికే తెలియనట్టు రంగుల ప్రపంచాన్ని చూసి మూరిసిపోవద్దని, వాస్తవ జీవితంలో జీవించాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందని తెలుస్తోంది.

'జీవితం! ఓ జీవితం'లో 'ఏం మనుషులు మీరు/ తేనెపూసిన కత్తులు/ పైకి పత్తివిత్తులు / లోపల విషపు తిత్తులు' మనిషిలో విభిన్న కోణాన్ని ఆవిష్కరింపజేస్తాడు. అందుకే 'జాగ్రత్త'లో 'మనిషిలోని రాక్షసతత్వం/ కొనఊపిరి విడుస్తున్నది/ అణుగోళమా జాగ్రత్త!' అంటూ నెలువెత్తు మనిషిని చూపించాడు. 'పువ్వు! ముల్లు'లో 'చీకట్లో నిల్చొని వెలుతుర్ని చూడు/ జీవితం విచ్చుకుంటుంది/ వెలుతుర్లో

నిల్చొని చీకటిని చూడు / విధి గుచ్చుకుంటుంది' ప్రకృతి వాస్తవాన్ని చెప్పాడు.

## మరో హరివిల్లు

ఇక మూడో కవిత సంపూటి మరోహరివిల్లు. ఈ కవిత సంపూటిలో కవితలు కూడా 1965 నుండి 1969 మధ్య కాలంలో రాసినవే. అభ్యుదయ కవి నిరంతర ప్రతిపక్ష కవి. అంతమాత్రాన నిరాశావాది కాదు. అభ్యుదయ కవి అసంతృప్తి సామాజిక పరమైనదే. ప్రతి రచనలో దానిని వ్యక్తం చేయడాన్ని ప్రయత్నిస్తాడు. ప్రపంచంలో మేధావు లందరూ కూడా తమ అసంతృప్తిని రచనల్లో వెలువరించిన వారే. ఇటువంటి ధోరణి అక్కడక్కడ సినారె రచనల్లో కనిపిస్తుంటుంది.

'మానవుడు' కవితలో ' విశ్వంభరలో మానవసృష్టి విచిత్రం/ పరిణామ క్రమంలో అతనిపాత్ర / అతి విచిత్రం/ అన్నిటిని తలదన్నినవాడు జీవుడు/ అతడే ఈ పృథ్వికి / ఒక రకంగా దేవుడు / అఖిల ఫలాలను అనుభ వించే/ మహానుభావుడు/ అజాండం లాగే/ అంతుపట్టని వాడు ఈ నరుడు/ ఆకృతిలో ప్రవరుడు/ అంతరంగంలో వానరుడు...అసంపూర్ణతకాదు అతని దు:ఖహేతువు/ అదే నిజానికి అభ్యుదయసేతువు/ ఏది పూర్ణత?/ ఏది న్యూనత/ ఎందుకీ వ్యర్థ మీమాంస?/ మానవతా మానస కాసారంలో/ అసంపూర్ణత ఔనేమో రాజహంస" అని భారతదేశ చరిత్రను వింగడిచ్చారు.

వేల సంవత్సరాల నుండి ప్రపంచానికి అనేక విద్యా లను భారతదేశం నేర్పింది. అందరు ఈ దేశంలో పాతుకో పోయిన భిన్నత్వంలోని ఏకత్వాన్ని ఆచరించడానికి ప్రయత్నించిన వారే. కానీ వారు దానిని అనుసరించిన పద్ధతులు వేరు. ఒక్కప్పుడు భారతదేశం వజ్రాలతో, రత్నపు రాసులతో నిండి ఉండేదని చరిత్ర పుస్తకాలు తెలుపు తున్నాయి. కానీ మనిషి 'ఎవరీ మనిషి?/ రెండుకాళ్ళ మృగం/ శిశుత్వం పశుత్వం చెరిసగం/ ఎగబ్రాకితే దేవతల కంటె అనూనం/ దిగజారితే పశువుల కంటె హీనం/ మానవుని అంతరంగం/ విభిన్న శక్తుల రణరంగం' మనిషి లోని రకాలను ప్రతీకరించారు. మనిషి రెండు గుణాలను పోలి ఉంటాడు. 1. మానవత్వ గుణం 2. రాక్షస గుణం

మనిషిలో బుద్ధికి, హృదయానికి నిత్యం ఘర్షణ జరుగుతుంటుంది. తాను ఎప్పుడు ఇతరులకు చెడు చేయాలని పై వాటిలో ఒకటి ప్రయత్నిస్తే, మరొకటి నియంత్రిస్తుంది. అది సరైన పద్ధతి కాదు. మన దేశం పై దండయాత్ర చేసిన వారు, ఇతర దేశంలో అ పోలికలు ఉన్న వారు 'చెంఘిజ్ ఖాన్, తైమూర్, ముసోలినీ, హిట్లర్ వీరిలో రాక్షస గుణం ఎక్కువ పాళ్ళలో ఉండడం వాళ్ళ వారు జయాపజాయాలు సాధించారు. వీరందరు కూడా రెండో రకానికి చెందినవారు.

గాంధీ, క్రీస్తు, బుద్ధుడు, అశోకుడు వీరు హృదయం లోని వెలువడిన సంఘర్షణ నుండి మానవత గుసం వెలువడి, దేశానికి ఆదర్శలు అయ్యారు. అందుకే 'మనిషే మనిషిని సాధిస్తాడు/ మనిషే మనిషిలోని/ అనురాగ మధువును ఆస్వాదిస్తాడు/ ఇది ముమ్మాటికీ తథ్యం/ పఢ్ధానరే పొరపఢ్ధానరే/ మనిషి మనిషి అనుబంధం నిత్యం/ మనిషి నశించినా/ నశించదు మానవత్వం' దీన్ని కోసం మనిషి ఒక శతాబ్ది పాటు కష్టపడతాడు. చివరికి అదే సాధించకూండానే మరణిస్తాడు. తన జీవితంలో మమాతానురాగాలు, ప్రేమనుబంధాలు, ద్వేషాను రాగాలు తమవి కావని తెలిసిన, అవే తమవెంట రావని తెలిసిన వాటి కోసం కష్టపడతాడు. అవే తమ మరణంతోనే అంతమౌతాయి. మరణం తరువాత నిత్యం ఉండి పోయిది 'మనిషి నశించినా, నశించదు మానవత్వం' ఒక్కటే అనే నిజం తెలుసుకోలేకపోతున్నారు. అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం, ఆత్మ తృప్తికై మనుషులు ఆడుకునే ఒక వింత నాటకం.

'సంతృప్తుని సంగీతం'లో 'నేను నడుస్తున్నాను/ నిన్ను విడుస్తున్నాను/ నిట్టూర్పుల పంచాంగ విప్పితే/ నిలు వెత్తుగా జడుస్తున్నాను/ అందేకే నేను నడుస్తున్నాను/ అనుకున్న నగ్న సత్యాలకు/ అక్షరాకృతి కలిగిస్తున్నాను' ఒకరి ప్రావీణ్యం ఉంటే మరొకరు తట్టుకోలరు. నిజ

జీవితంలో అటువంటి లక్షణాలు మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాలం తన పనిని తాను చేసుకుంటూ వెళ్ళిపోతుంది. ఎవరి కోసం నిలువదు. అదే జీవితం. మనం దానిని ఆపినా అది నిలువదు. కానీ మారాల్సిన అవసరం వస్తే ఆలోచనల్లో మార్పు రావాల్సిన అవసరం ఉంటుంది. అందేకే కవి నేను నడుస్తున్నాను అంటూనే 'క్షతి లేని సత్యం వైపు/ మృతి లేని స్వప్నం వైపు' తన పనిని తాను పూర్తి చేయించాడు.

'వెలుగును మింగిన చీకటి'లో 'జీవితం ఏం పసందుగా వుంది! చితికిన పసికందులా వుది' అంటూనే ఈ దేశంలో మానవత్వం కరువైపోతుందని మళ్ళీ బాపూ లాంటి వ్యక్తుల అవసరం ఉందని సూచించాడు. 'ఒకే ఒక్కటి'లో ' మంచు కొండలు పెరుగుతున్నవి/ మహీ రుహములు పెరుగుతున్నవి/ పెరుగలేనిది ఒకే ఒక్కటి/ పిరికి మానిసి జీవితం/కడలి తరగలు కదలుతున్నవి/ కాంతి సురుగులు కదలుతున్నవి/ కదలలేనది ఒకే ఒక్కటి కలుషమతి ఆలోచనం/ ఉక్కుతీగలు పాడుతున్నవి/ ఉత్త వెదురులు పాడుతున్నవి/ పాడలేనిది ఒకే ఒక్కటి/ పురుషబుద్ధి హృదంతరం'' అంటూ కవిత్వీకరించాడు.

'జీవనసత్యం'లో 'మృత్యువులోనే జీవిత / సత్యమున్న దని తెలిపెను' మనిషికి నిజం తెలిసెదే మరణంలోనే అంటూ ఒక జీవన సత్యాన్ని ఆవిష్కరింప జేశాడు. 'నాలో స్పందించిన ఆనంద తంత్రి ఒకటే కద! అనాటికి నేటికి నా అంతరంగ మొకటే కద! అని మానవుడు అభివృద్ధిని సాధిస్తూ వున్నాడే కాని మానవత్వాన్ని మరచిపోతూ వున్నడు అని హెచ్చరించారు. అందుకే ఆయన రాసిన కావ్యాల్లో ప్రత్యేకత మానవుడే దాని కేంద్రబిందువు. సృష్టిని ప్రతిసృష్టి చేయగలడు, చేస్తున్నాడని మనం నమ్ము తున్నాము. ఆ మానవుడ్ని పట్టించుకోకపోతే దానికి అర్థమే ఉండదు. ''ఆయన కావ్యాలన్నింటికీ ప్రధాన కావ్య నాయకుడు మానవుడు. కులం, మతం, ప్రాంతం, భాష, వర్ణం, వర్గం వంటి అచ్ఛాదనలు లేనటువంటి మానవుడు' అని ఆచార్య ఎస్వీ సత్యానారాయణ అభిప్రాయ పడ్డారు.

ఈ మూడు కవిత సంపుటిలో మూడు నాలుగు రకాలైన ధోరణిని ప్రదర్శించారు. ఒకటి స్మృతి మనసంలో మనవాళ్ళు, రెండోది ప్రపంచ స్థాయి అంశాలు, మూడవది మనిషి తన స్థానం, నాలుగు కాలంతో కూడిన విలువలు. ఈ అంశాలను పరిశీలిస్తున్నడు ఒక్కొక్క కోణంలో ఒక్కొక విధంగా తనదైన శైలిలో ధైర్యంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన సందర్భం అమోఘ నీయమైనది. సినారె నిత్యం కొత్తదనాన్ని కోరుకున్నారు. తాను ఎప్పుడు ఉన్నదానిని తిరిగి రాయడానికి ప్రయత్నిం చలేదు. లేని అంశాలను, ఎవరు స్పృశించిన అంశాలనే మనను లోతుల్లోకి వెళ్ళి రాయగలిగాడు. అందుకే అంతమంది మహనీయులున్న కాలంలో కూడా తన దంటూ ఒక బాణీని, మార్గాన్ని కొనసాగించాడంటే అదే తనకే దక్కిన గొప్ప గౌరవంగా భావించాల్సిన అవసరం ఉంది.

కె. శివారెడ్డి గారు అన్నట్లు ''ఆధునిక కాలంలో ప్రపంచమంతా పోరాటాలు జరుగుతున్న దశలో ఒక ప్రాంతంలో ఒక స్తబ్ధత ఉన్నా అంతర్గీనంగా పరోక్షంగా ఒక రచన మీద ఎలా ప్రతి ఫలిస్తుంది. ఈ జీవన తాత్వికతే అభ్యుదయ మానవతావాదం అన్నా ఒక సమైక్య దృష్టి అన్నా తర్వాత తర్వాత ఆయన రచించిన వచన కవితల్లోనూ, వచన కావ్యాల్లోనూ ప్రతిఫలించింది. ఒక బ్రాడ్ డెమోక్రటిక్ స్పిరిట్ అంతర్వాహినిగా వుందని'' (అక్షర బాటసారి సినారె. పుట:15) అని అన్నారు. ఆయన కవిత సంపుటాలకి పెట్టిన పేర్లు కూడా ఒక విధానాన్ని తెలుపుతున్నాయి. ఆయన రాసిన మూడు కవిత సంపు టాలు అర్థ శతాబ్ది దాటిన ఇంకా వాటిలో కవి చిత్రించిన సామాజికాంశాలు వస్తువు నిత్యనూతనంగా ఉందంటే ఇంకా మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

''మానవతావాదం సామాన్య మానవునికి సార్వ భౌమత్వం ప్రసాదించింది. కుల మత భేదములను కూకటి వేళ్ళతో పెల్లగించుటకు ప్రయత్నించింది. మానవు

లందరికి సామ్యము, స్వామ్యము ఉండాలని ఎలుగెత్తి చాటినది. వ్యక్తి స్వేచ్ఛను బలవరిచినది. అంధ విశ్వాసములకు స్వస్తిచెప్పి విజ్ఞాన ఛక్షుస్సునందించినది. దీని ప్రాబల్యము వలన మానవుల మధ్యనున్న కృత్రిమమైన కుడ్యములు ఎల్లలు చెదిరిపోయినవి'' అని డా. సి. నారాయణరెడ్డి అన్నారు.

మాహమ్మద్ దార్విన్ అన్నట్టు The truth is character in the poem, I always humamise the other, I will continue to humamise the enemy" (అక్షర బాటసారి సినారె. పుట:15) అన్న మాటలు డా. సి. నారాయణరెడ్డి గారికే వర్తిస్తాయి. 'తనయుల మెందరి మైనా/ తల్లినేల ఒక్కటే' అంటూ ప్రపంచమంతా సమతను చూస్తాడు. సమస్త నేలకు తల్లినేల ఒకటే అంటూ ప్రపంచ వర్ధిల్లాలి అని భావించాడు. సంభావమీ యుగే యుగే అన్నట్లు యూగానికి ఒకడు పూడతాడు. ఈ మాటలు సినారెకు అక్షరాల వర్తిస్తాయి.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. అక్షర బాటసారి సినారె. నృత్యంజలి. 2017: నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్. హైదరాబాదు.
2. అనంతరామశాస్త్రి, నేతి. 2006. ఆధునిక తెలుగు సాహిత్యం పై లౌకిక విలువల ప్రభావం. అరుణ పబ్లికేషన్స్: గుంటూరు.
3. అరుణకుమారి, జి. 1987. ఆధునిక తెలుగు కవిత్వలో మానవతావాదం విభిన్న ధోరణులు. హైదరాబాదు.
4. డా. సి.నారాయణ రెడ్డి సమగ్ర సాహిత్యం. నాలుగో సంపుటి:2000.విశ్వంభరా విజన్ పబ్లికేషన్స్: హైదరాబాదు.

★★★

# అన్ని రంగాలలోను లింగ వివక్షత

- డా॥. ఇ. శోన ప్రభ
రీసెర్చ్ అసోసియేట్, మహిళా అధ్యయన కేంద్రం,
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

- డా॥. కె. హైమావతి
రీడర్, మహిళా అధ్యయన కేంద్రం, శ్రీ పద్మావతి
మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

స్త్రీలు, పురుషులు ఇద్దరూ సమానులే. సమాన శక్తి కలవారు. సమాజంలో స్త్రీ, పురుష బేధం లేకుండా పౌరులందరూ సమానమని రాజ్యాంగం, చట్టాలు చెబుతున్నప్పటికీ స్త్రీలను మాత్రం కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా ప్రత్యేక వర్గంగా చూస్తూ వివక్షతతో అణచివేస్తున్నారు. ఈ లింగ వివక్షత కారణంగా స్త్రీకి, స్త్రీగా జన్మించే హక్కు లేకుండా పోతున్నది. తల్లి గర్భంలో రూపం ఏర్పడక ముందు నుంచి మొదలై, చనిపోయే వరకు గల అన్ని దశలలోనూ, అడుగడుగునా లింగ వివక్షత స్త్రీలను వెంటాడుతూ వున్నది.

## లింగ వివక్షత - నిర్వచనం

'స్త్రీ, పురుషుల మధ్యగల సామాజిక, సాంస్కృతిక పరమైన తేడా వలన స్త్రీలు పురుషులకన్నా తక్కువ స్థాయి కలవారని, స్త్రీలు కొన్ని పనులను చేయడానికి మాత్రమే పరిమితమని, స్త్రీలు ఇలాగే వుండాలి, అలా ఉండరాదనే ఆంక్షలు, వ్యత్యాసాలను చూపే అనాగరిక భావనలతో స్త్రీ, పురుషుల మధ్య చోటుచేసుకున్న అసమానతలే లింగ వివక్షత.

## లింగ వివక్షతకు కారణాలు :

- స్త్రీ పై సర్వాధికారాలు పురుషుడివే అంటూ తర తరాలుగా వస్తున్న పితృస్వామ్య వ్యవస్థ.
- స్త్రీ పుట్టినప్పటి నుండి చనిపోయేంత వరకు తన జీవితాన్ని శాసిస్తూ, నియంత్రిస్తూ వున్న సామాజిక కట్టుబాట్లు, ఆచారాలు.
- సమాజంలో నిక్షిప్తమై స్త్రీలను చులకనగా చూపిస్తున్న సామెతలు, భావజాలం మొదలైనవి లింగ వివక్షతను పెంచి పోషిస్తున్నాయి.

## వివిధ రంగాలలో లింగ వివక్షత :

సమాజం, కుటుంబం, పోషణ, ఆరోగ్య సంరక్షణ, విద్య, ఉద్యోగ, రాజకీయ, పాఠ్య పుస్తకాలు, ప్రసార సాధనాలు మొదలైన అన్ని రంగాలలో స్త్రీలు లింగ వివక్షతకు గురౌతున్నారు. వాటిని పరిశీలిస్తే

**సమాజంలో..**

- లింగ వివక్షత కారణంగా సమాజంలో స్త్రీలకు, పురుషులతో సమానమైన గుర్తింపు, హెూదా, గౌరవం, ప్రాధాన్యత, స్వేచ్ఛ ఉండుట లేదు. స్త్రీలు కేవలం ఇంటిపని, పిల్లలని కని, పెంచడం వరకే పరిమితం అనే భావనలు సమాజంలో ఎప్పటి నుంచో పాతుకుపోయి వున్నాయి.
- మాట్లాడడం, తినడం, కూర్చోవడం, నవ్వడం మరియు ప్రవర్తన ఇలా ప్రతివిషయంలో స్త్రీలు వివక్షతను ఎదుర్కొంటున్నారు.
- సమాజంలో స్త్రీకి స్వంత గుర్తింపు లేదు. పుట్టినప్పటి నుండి చనిపోయేంత వరకు పురుషుడి పేరు మీదే గుర్తించబడుతున్నది. చిన్నతనం నుండి తండ్రి ఇంటిపేరుతో, వివాహం అవగానే భర్త ఇంటిపేరుతో గుర్తించబడుతున్నది. వివాహం అయినట్టు తెలిపే చిహ్నాలను స్త్రీలు మాత్రమే ధరించాలి. భర్త చేసే తప్పులను మౌనంగా భరించాలే తప్పా, నిలదీసే స్త్రీలను సమాజం వ్యతిరేకిస్తుంది. తన తప్పులేకుండా భర్తతో విడాకులు తీసుకున్న స్త్రీని సమాజం చాలా చులకనగా చూస్తుంది. కానీ తప్పుచేసిన

పురుషుడిని మాత్రం రెండో వివాహానికి ప్రోత్స హిస్తున్నది.

- భర్త చనిపోగానే సంప్రదాయం, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాల ముసుగులో పుట్టుకతో వచ్చిన బొట్టు, గాజులు, పువ్వులు తీసివేయడం, వితంతువులను శుభకార్యాలకు ఆహ్వానించక పోవడం, మూఢనమ్మకాలతో వితంతువులను అశుభ సూచకంగా చూడడం, సూటి పోటి మాటలతో వారిని మానసికంగా బాధించడం, ఇంకా సమాజంలో వయసు మీరిన మహిళల పట్ల వున్న నిరాదరణ, నిర్లక్ష్యత ఇవన్నీ లింగ వివక్షతకు నిదర్శనాలు.

**కుటుంబంలో..**

- పురుషుడిదే అధికారం. స్త్రీ కుటుంబ నిర్వహణ వరకే పరిమితం. కుటుంబ విషయాలు, ఆర్థిక పరమైన వ్యవహారాలలో, పిల్లల్ని కనాలా, వద్దా, ఎప్పుడు కనాలి, ఎంతమందిని కనాలి, కుటుంబ నియంత్రణ చేయించుకోవడం వరకు స్త్రీలకు నిర్ణయాధికారం వుండడం లేదు.
- స్త్రీలు ఉద్యోగం చేస్తూ సంపాదిస్తున్నప్పటికీ, ఆర్థిక స్వాతంత్ర్యం లేదు మరియు ఇంటిపని భారం, పిల్లల సంరక్షణ స్త్రీలకు తప్పడం లేదు. ఉద్యోగం పురుష లక్షణం అనే సూక్తి మహిళలు కూడా ఉద్యోగం చేస్తూ ఉద్యోగం మనిషి లక్షణంగా మారినప్పటికీ ఇంటిపనులు మాత్రం మగ పనులు కాలేదు. పురుషులు రోజుకు కేవలం 8 నుంచి 10 గంటల పాటు పనిచేస్తుంటే స్త్రీలు మాత్రం రోజుకు 15 గంటల నుండి 17 గంటల పాటు పనిచేస్తున్నారు. అయినా సమాజంలో, కుటుంబంలో వారి శ్రమకు తగిన గుర్తింపు లేదు. చిన్నపిల్లల్లో కూడా మగపిల్లల కంటే ఆడపిల్లలే ఎక్కువగా ఇంటిపని చేస్తున్నారు.
- ఆస్తులన్నీ కేవలం పురుషుడి పేరు మీదే వుంటాయి. స్త్రీ పేరుతో ఏదైనా ఆస్తివున్నా దానిపై అధికారం, అనుభవం పురుషుడిదే అవుతున్నది.

**ఆడ పిల్లల పట్ల వ్యతిరేకత :**

- ఆడ పిల్లలను భారంగా, ఖర్చుగా భావిస్తూ, మగ పిల్లలను వంశోద్ధారకులుగా, తమ సంరక్షకులుగా, ఆదాయంగా భావించి మగ పిల్లలకు మాత్రమే ప్రాధాన్యత నిస్తున్నారు. కుటుంబ సభ్యులు బాలబాలికలను పెంచే విధానంలో, వేషధారణలో, వారి పోషణలో, ఆటపాటలలో మరియు వారికి కొనిచ్చే బొమ్మలలో, వారి చదువులలో, వారికి చెప్పే పనులలో, వారిపై చూపే ఆప్యాయతానురాగాలలో లింగ వివక్షత కొనసాగుతూ వుంది.
- లింగ నిర్ధారణ పరీక్ష చేయించి, పుట్టబోయేది ఆడపిల్ల అని తెలియగానే, తల్లికి ప్రాణాంతకమని తెలిసినా భ్రూణహత్యలకు పూనుకుంటున్నారు. జనాభా లెక్కల ప్రకారం 0-6 సంవత్సరాల మధ్య గల శిశు లింగ నిష్పతి చూస్తే 2001లో దేశంలో ప్రతి 1000 మంది మగ శిశువులకు 927 మంది ఆడ శిశువులుండగా 2011 నాటికి ఆ సంఖ్య 914 కు పడిపోవడం ఆడపిల్లల పట్ల వున్న లింగ వివక్షతకు తార్కాణంగా చెప్పవచ్చు.
- బాలికల పట్ల వివక్షతతో చట్టవిరుద్ధమైనప్పటికీ బాల్య వివాహాలను జరిపిస్తున్నారు. దీని వలన బాలికలు విద్య, ఉపాధి, అభివద్ధి అవకాశాలను కోల్పోవడమే కాకుండా అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.

**పోషణలో..**

పోషణలో కూడా బాల్యం నుండి లింగ అసమానతలు న్నాయి. మగ పిల్లలకు చనుపాలను ఇచ్చినంత ఎక్కువ కాలం ఆడ పిల్లలకు ఇవ్వటం లేదు. ఆడ పిల్లలకు

ఎక్కువ కాలం తల్లి పాలు పట్టించడం వల్ల వారిలో మొండితనం అభివృద్ధి చెందుతుందనే అపోహ వలస ఆడపిల్లలు తల్లి పాలను కూడా సంపూర్ణకాలం త్రాగలేక పోతున్నారు. ఆడ పిల్లలకు, మహిళలకు మగవారి కంటే తక్కువ పోషకాహారం అందుతున్నది. దీనికి నిదర్శనంగా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే - 5 (ఎన్‌ఎఫ్‌హెచ్‌యస్ - 5, 2019-21) గణాంకాల ప్రకారం 15- 49 ఏళ్ళ వయస్సున్న వారిలో పురుషులు 25 శాతం మంది రక్తహీనతతో వుండగా, మహిళల్లో 57 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. దీనికి కారణం కుటుంబంలో పురుషుడు తినే ఆహారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం, పురుషుడితో సమానమైన హెూదా స్త్రీలకు లేకపోవడం.

**ఆరోగ్య సంరక్షణలో..**

మహిళల ఆరోగ్యం పట్ల వివక్షత, నిర్లక్ష్యం అడుగడుగునా మనం గమనించవచ్చు. కుటుంబంలో పురుషుల ఆరోగ్య రక్షణకు పెట్టినంత ఖర్చును, తీసుకొనేంత శ్రద్ధను ఆడ పిల్లలు, మహిళల పరంగా చూపడం లేదు. పురుషులలో రోగ సూచనలు కనిపించగానే మహిళలే వారిని అధిక ఖర్చులతో కూడిన ఆధునిక వైద్య చికిత్సకు ప్రోత్సహిస్తున్నారు. స్త్రీలు మాత్రం తమ అనారోగ్య నివారణకు గృహ వైద్య విధానాలను, చిట్కాలను పాటిస్తున్నారు. దాదాపు ప్రాణాపాయ స్థితిలో చికిత్సకు వెళుతున్నారు. ఆరోగ్యంపై అశ్రద్ధ, నాణ్యతగల చికిత్స లేకపోవడం, అధిక పని భారం, తగిన పోషకాహారం తీసుకోక పోవడం వల్ల గర్భకోశ వ్యాధులు, కేన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులు, మరణాలకు మహిళలు అధిక సంఖ్యలో గురౌతున్నారు.

బాల్య వివాహాల వలస మరియు అవగాహనా రాహిత్యంతో చిన్న వయస్సులో వచ్చే గర్భధారణల కారణంగా మాతృమరణాలు సంభవిస్తున్నాయి. అంతే కాకుండా శిశు మరణాలలో కూడా మగ పిల్లల కంటే ఆడ పిల్లలే ఎక్కువగా వుంటున్నారు. దీనికి సమాజంలో, కుటుంబంలో, మహిళల ఆరోగ్యం పట్ల వున్నటువంటి వివక్ష, సామాజిక సమస్యలైన వరకట్నం, పేదరికం, నిరక్షరాస్యతలే కాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి ఆరోగ్య సంరక్షణ పథకాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మహిళలకు అందుబాటులో లేకపోవడం కారణంగా చెప్పవచ్చు.

**విద్యా పరంగా..**

అభివృద్ధికి మూలమైన అక్షరాస్యతలో కూడా లింగ వివక్ష కొనసాగుతూనే వుంది. పురుషుల కంటే స్త్రీలలోనే నిరక్షరాస్యత ఎక్కువగా వున్నది. గతంతో పోలిస్తే బాలికల అక్షరాస్యత శాతం క్రమంగా పెరుగుతున్నప్పటికీ ఉన్నత విద్యకు వచ్చేసరికి ఆ సంఖ్య తగ్గుతోంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే - 5 (ఎన్‌ఎఫ్‌హెచ్‌యస్ - 5, 2019-21) లోనూ ఇదే విషయం వెల్లడైంది. ఆ గణాంకాల ప్రకారం పురుషుల అక్షరాస్యత 84.4 శాతం ఉంటే, స్త్రీల అక్షరాస్యత 71.5 శాతంగా వుంది. 10 లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలు పాఠశాల విద్యను కలిగి వున్న వారిలో 50.2 శాతం మంది పురుషులు వుండగా స్త్రీలు మాత్రం 41 శాతం మాత్రమే వున్నారు. బాల్య వివాహాలు, ఇంటి పని భారం, బాలికల పట్ల వివక్షత, సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడం, పాఠశాలల్లో మౌళిక సదుపాయాలైన ప్రత్యేక మూత్రశాలలు లేకపోవడం, సరైన రక్షణ లేకపోవడం ఇందుకు కారణాలుగా చెప్పవచ్చు.

**ఉద్యోగ అవకాశాలలో..**

ఉద్యోగ అవకాశాలలో కూడా స్త్రీ, పురుషుల మధ్య అసమానత వున్నది. నిరుద్యోగం పురుషులలో కన్నా స్త్రీలలోనే ఎక్కువగా వుంటున్నది. స్త్రీలకు, పురుషులకన్నా తక్కువ ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. మహిళలు నర్సులుగా, ఉపాధ్యాయులుగా, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, లాయర్లుగా స్థిరపడుతున్నప్పటికీ ఉన్నత ఉద్యోగాలలో మాత్రం మహిళలు తక్కువగా వుంటున్నారు. ఇదే విషయాన్ని గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ 2021 వెల్ల

డించింది. ఈ నివేదిక సీనియర్ మరియు మేనేజిరియల్ ఉద్యోగ స్థానాల్లో మహిళల వాటా తక్కువగా వుంది. ఈ విభాగాల్లో మహిళలు 14.6 శాతం మంది మాత్రమే వున్నారు. మరియు దేశంలో కేవలం 8.9 శాతం సంస్థలు మాత్రమే అత్యున్నత మహిళా మేనేజర్లను కలిగి వున్నాయని పేర్కొంది.

వీటికి కారణం మహిళలకు ఉన్నత విద్యావకాశాలు అందుబాటులో లేకపోవడం, తల్లిదండ్రుల ప్రోత్సాహకం లేకపోవడంతో సరైన నైపుణ్యాలను పెంపొందించుకోలేక పోవడం వల్ల ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారు. అంతే కాకుండా పురుషులు, స్త్రీలను తమకంటే ఉన్నతాధికారులుగా అంగీకరించక లేకపోవడం కూడా కారణాలుగా చెప్పవచ్చు. మరియు మహిళలు ఉద్యోగాలను తాము నివసిస్తున్న ప్రాంతాలలోనే కావాలను కోవడం కూడా మహిళల నిరుద్యోగానికి ఒకానొక కారణంగా పేర్కొనవచ్చు.

ఇక శ్రామికుల విషయానికి వస్తే సమాజంలో వున్న లింగ వివక్షత, స్త్రీ అణచివేత, అవకాశాల లేమి, నిరక్షరాస్యత కారణంగా అధిక శ్రమ, ఎక్కువ పని గంటలు, తక్కువ గుర్తింపు, తక్కువ ప్రతిఫలం లభించే పనులను స్త్రీలకు కేటాయిస్తున్నారు. అంతే కాకుండా పురుషుల కంటే ఎక్కువ పని గంటలు పని చేస్తున్నా, పురుషుల వేతనాలకన్నా స్త్రీల వేతనాలు తక్కువగా వుంటున్నాయి. వ్యవసాయ రంగంలో కూడా మహిళలకు పురుషులతో సమానమైన కూలీ వుండటం లేదు. యు.యన్.డి.పి నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా మొత్తం శ్రమలో మూడింట రెండు వంతుల శ్రమను స్త్రీలు చేస్తున్నారు. అయితే ఈ శ్రమ విలువను స్థూల జాతీయ ఆదాయంలో చూపెట్టడంలేదు. స్త్రీల శ్రమను గుర్తించటం లేదు.

**రాజకీయ అవకాశాలలో..**

రాజకీయ రంగంలో పురుషులతో సమానమైన అవకాశాలు స్త్రీలకు లభించడం లేదు. చట్ట సభలలో స్త్రీలకు పురుషులతో సమానమైన అవకాశాలు లేవు. 17వ లోక్ సభ (2019) లో మహిళల ప్రాతినిధ్యం 14.39 శాతానికి పెరిగింది. కానీ 50 శాతం మహిళలు రాజకీయాలలో క్రియాశీలకంగా వున్నపుడే సమ సమాజ స్థాపన సాధ్యపడుతుంది. చట్ట సభలలో మహిళల శాతం పెరిగినప్పుడే మహిళలకు గౌరవం మరియు అభివృద్ధి, నిర్ణయాధికారంలో సమానతకు అవకాశం వుంటుంది. ఇక దేశంలోని సుప్రీంకోర్టు మరియు హైకోర్టుల్లోని న్యాయమూర్తులలో కూడా మహిళా న్యాయమూర్తులు తక్కువ సంఖ్యలో వున్నారు. దీనికి కారణం పురుషుల ప్రాధాన్యత, స్త్రీల పట్ల వివక్షత.

**పాఠ్యపుస్తకాలలో..**

పాఠ్యపుస్తకాలు పిల్లల భావి జీవితానికి ఆధారాలు. అయితే ప్రాథమిక స్థాయి పాఠ్యపుస్తకాలను పరిశీలించి నట్లయితే చిత్రాలు, ఉదాహరణలు, అభ్యాసాలు, పాఠ్య పుస్తకాల రూపకల్పనలో పాల్గొన్న రచయితల సంఖ్యలో, పాఠ్యాంశాలలోని పాత్రల చిత్రీకరణలో లింగ వివక్షత ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. పాఠ్య పుస్తకాలలో తల్లి వంట చేస్తున్న చిత్రాలు, వివరణలు వుంటాయి. తండ్రి పేపర్ చదువుతూ వుంటాడు. అమ్మాయి ఇంటి పనులలో సహాయ పడుతుంటుంది, మగ పిల్లవాడు మాత్రం ఆడుకుంటూ వుంటాడు మరియు పాఠ్య పుస్తకాలలో అమ్మాయిలు, అబ్బాయిలు ఆడుకునే ఆటలలో వ్యత్యాసం కనబడుతుంది. ఇలాంటి మూసధోరణులు లింగ వివక్షతకు నిదర్శనం.

**ప్రసార సాధనాలలో..**

సినిమాలలో, టి.వి.లో ప్రసారమయ్యే వివిధ కార్యక్రమాలు ముఖ్యంగా సీరియల్స్ లో మరియు వ్యాపార ప్రకటనలలో స్త్రీని ఆట బొమ్మగా, అశ్లీలంగా, వ్యాపార వస్తువుగా, వ్యక్తిత్వం లేనివారుగా చిత్రీకరించి వారికి తగిన గుర్తింపు, గౌరవం లేకుండా చూపుతున్నారు. ఇలాంటి ధోరణులు స్త్రీలకు తగిన గుర్తింపు, గౌరవం లేకుండా వారిపై హింస పెరగడానికి కారణమౌతున్నాయి.

## లింగ వివక్షత - నష్టాలు :

- చిన్నతనం నుండి లింగ వివక్షత ఎదురవడం వలన బాలికలు, మహిళలు ఆత్మనూన్యతా భావంతో అత్మ విశ్వాసాన్ని , ధైర్యాన్ని కోల్పో తున్నారు.
- సమాజంలోను, కుటుంబంలోను స్త్రీల పట్ల వున్న చులకన భావం వల్ల వారు ఇంటా, బయటా తీవ్రమైన శారీరక,లైంగిక, మానసిక వేధింపులకు గురౌతున్నారు. మహిళలపై, బాలికలపై జరుగు తున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, గృహహింస మొదలైన వాటికి ప్రధాన కారణం లింగ వివక్షతే.
- ఇంటి పని భారం, పిల్లల పెంపకం మరియు కుటుంబ సభ్యుల ఆలనాపాలనా కారణంగా ఉన్నత చదువులు చదువుకున్నా చాలామంది స్త్రీలు ఉద్యోగాలు చేయలేక ఇంటికే పరిమితం అవుతున్నారు. మరియు ఈ బాధ్యతల వల్ల ఉద్యోగాల్లో మరింత శిక్షణ పొంది ప్రమోషన్లు తీసుకోవడానికి ఆటంకం కలుగుతున్నది.
- ఇంటి పని భారం, ఒత్తిడి కారణంగా ఎక్కువ మంది స్త్రీలు థైరాయిడ్, ఊబకాయం మరియు వివిధ రకాలైన మానసిక సమస్యలకు గురౌ తున్నారు.
- పోషణ, ఆరోగ్య రక్షణలో వివక్షత కారణంగా స్త్రీలు రక్త హీనత, అయోడిన్ లోపం మరియు వివిధ రకాల తీవ్ర అనారోగ్యాలకు, మరణాలకు గురౌ తున్నారు.
- స్త్రీల విద్యా అవకాశాలలో వివక్షత కారణంగా కుటుంబ, సమాజ అభివృద్ధి కుంటుబడుతున్నది. స్త్రీల ఆర్థికాదాయార్జనకు, సమాజంలో నిర్ణ యాత్మక పాత్రా నిర్వహణకు కూడా లింగ వివక్షత అడ్డుపడుతున్నది.
- నైతిక విలువలు దిగజారి, మానవ సంబంధాలు అనారోగ్యకరంగా తయారవుతున్నాయి.
- మహిళల పట్ల ఉద్యోగ, రాజకీయ రంగాలలో వున్న వివక్షత కారణంగా మహిళలు వారి నైపుణ్యం, ప్రతిభా పాటవాలను వినియోగించక లేకపోతున్నారు. దీని వలన దేశ ఆర్థికాభివృద్ధి కుంటు పడడమే కాకుండా దేశ సమగ్ర అభివృద్ధి ఆశించినంత మేర జరగడం లేదని స్పష్టంగా చెప్పవచ్చు.

## లింగ సమానత్వం ఎప్పుడు సాధ్యమౌతుంది :

- సమాజం, కుటుంబ వ్యవస్థలలో, స్త్రీల పట్ల వున్న ఆలోచనా దృక్పథంలో మార్పు రావాలి. తల్లి దండ్రులు బాలబాలికలిద్దరూ సమానమనే భావన పిల్లల్లో కలిగేలా పెంచాలి.
- స్త్రీ, పురుషులలో ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనే భావన పై అధార పడిన పితృస్వామ్య వ్యవస్థను వ్యతిరేకించాలి. స్త్రీ, పురుషుల అస మానతలను చూపుతున్న ఆచార వ్యవహారాలను, కట్టుబాట్లను వ్యతిరేకించాలి. బాల్యవివాహాలను, భ్రూణ హత్యలను అరికట్టాలి.
- పాఠ్యపుస్తకాలలో కనిపిస్తున్న లింగ వివక్షతపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకొని, తమ బోధనా విధానంలో లింగ సమానత్వ పరమైన మార్పులను చేసుకొని పాఠాలను బోధించాలి.
- స్త్రీ విద్యను ప్రోత్సహించుటకు తగిన ఉపకార వేతనాలు, మౌలిక వసతులు మరియు ఉచిత రవాణా సౌకర్యాలను కల్పించాలి. స్త్రీ లకు పురుషునితో సమానంగా ఉద్యోగ అవకాశాలను కల్పించాలి.
- కార్మిక రంగంలో మహిళా కార్మికులకు వివిధ కార్మిక చట్టాలపై అవగాహన కల్పించి పురుషు లతో సమానంగా వేతనాలను అమలు చేయాలి.

- రాజకీయ, ఆర్థిక రంగాలలో మహిళలకు పురుషులతో సమానమైన అవకాశాలు మరియు అధికారం ఉండాలి.
- స్త్రీలను అసభ్యంగా చిత్రీకరించి చూపే మీడియా వారి ప్రసార దృక్పథంలో మార్పు తీసుకు రావాలి.
- లింగ వివక్షతకు వ్యతిరేకంగా సమగ్రమైన చట్టాలను రూపొందించి వాటిని చిత్త శుద్ధితో అమలు పరచాలి. అందుకై ప్రభుత్వ, ప్రభుత్వేతర, ప్రజా సంస్థలతో చైతన్యవంతమైన భాగస్వామ్యం తీసుకురావాలి.
- మహిళల పట్ల వున్న అన్ని రకాల వివక్షతను రూపుమాపి వారికి అన్ని రంగాలలో పురుషుడితో సమానమైన అవకాశాలను కల్పించాలి.
- గృహ నిర్వహణలో, ఇంటి పనులు, పిల్లల పెంపకం మరియు అన్ని విషయాలలో పురుషుడు స్త్రీకి సహకారం అందించాలి.
- స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం తీసుకు వచ్చే వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో మహిళలను కార్యోన్ముఖులుగా తీర్చిదిద్దే కార్యచరణను చేపట్టాలి.
- పోషణ, ఆరోగ్య సంరక్షణలో స్త్రీకి పురుషునితో సమానమైన ప్రాధాన్యత వుండాలి మరియు అన్ని విషయాలలో స్త్రీలకు నిర్ణయాధికారం వుండాలి.
- స్త్రీలకు గల హక్కులు, రక్షణ చట్టాలు మరియు అభివృద్ధి పథకాల గురించి, శిశు రక్షణ పథకాల గురించి, స్త్రీలకు అవగాహన కల్పించి చైతన్య వంతం చేయాలి.

పై అంశాలన్నీ సమగ్ర కార్యాచరణతో అమలు జరిపినప్పుడే లింగ సమానత్వం సాధ్యపడుతుంది.

**ఆధార గ్రంథాలు :**

1. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే -5 (ఎన్ఎఫ్హెచ్యస్-5, 2019-21) నివేదిక.
2. స్త్రీ - పురుష అసమానతా సమస్యలు - కె.యస్.రెడ్డి.
3. లింగ వివక్ష లేనపుడే దేశ పురోగతి సాధ్యం - భూమిపుత్ర - డిసెంబర్ 13, 2021.
4. ఆకాశంలో ఆమె ఎక్కడ....?- డా.జి.లచ్చయ్య - భూమిక, ఫిబ్రవరి 1, 2012 .
5. గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ 2021 : వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్, ఏప్రిల్ 1, 2021.
6. తగ్గుతున్న జనాభా....పెరుగుతున్న రక్తహీనత - దర్వాజ, నవంబర్, 25, 2021.

★★★

# కథానిక లక్షణాల ఛట్రంలో 'సావుకూడు' కథానిక – ఒక విశ్లేషణ

– డా॥. కొయ్యా శ్రీనివాసులు, తెలుగు విభాగాధిపతి, యస్.టి.యస్.యన్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కదిరి.

ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులో అనేక నూతన సాహిత్య ప్రక్రియలు వెలువడ్డాయి. ఆ విధంగా వెలువడిన నూతన ప్రక్రియల్లో ఒకటి కథానిక ఆధునిక కాలంలో క్రీ.శ.1850 ప్రాంతం నుండి తెలుగు సాహిత్యంలో వచనములో కథాసాహిత్యం ప్రారంభమవుతుంది. పరవస్తు చిన్నయసూరి, కందుకూరి వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం నాయుడు, వేదం వేంకటరాయశాస్త్రి మొ॥వారు సంస్కృత సాహిత్యం నుండి అనేక కథలను అనువదించారు, అనుకరించారు. సంపూర్ణ ఆధునిక కథానిక లక్షణాలు కలిగిన రచన 1910 నుండే ప్రారంభమైందని చెప్పవచ్చు. గురజాడ 'దిద్దుబాటు' కథానిక మొదలుకుని తెలుగు సాహిత్యంలో ఈనాటి దాకా కొన్నివేల కథానికలు వచ్చాయి. ఇవి అన్నీ అనంత వైవిధ్యంతో కూడుకున్నవి. సాంఘిక, చారిత్రక, పౌరాణిక, రాజకీయ, ఆర్థిక, జానపద, దేశభక్తి, శృంగార, సంఘ సంస్కరణ, వినోదాత్మక, అధిక్షేప, స్త్రీవాద, దళితవాద, హేతువాద, వైజ్ఞానిక మొ॥ ఇలా వివిధ రకాల బేధాలతో అనేక కథానికలు తెలుగు సాహిత్యంలో వచ్చినప్పటికీ సంపూర్ణ కథానిక లక్షణాల ఛట్రంలో నిలబడే కథలు కొన్ని వందలు మాత్రమే ఉండవచ్చు. ఆవిధంగా సంపూర్ణ కథానిక లక్షణాల ఛట్రంలో ఒరిగే ఒక కథానిక 'సావుకూడు' ఈ కథానిక సంపూర్ణ కథానిక లక్షణాల కోణంలో విశ్లేషణ చేయడమే ఈ వ్యాసం ఉద్దేశం.

'సావుకూడు' అనే కథానికను రచించినది బండి నారాయణ స్వామి గారు అనంతపురం పట్టణంలో 1952 జూన్ నెల 3న జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు హొన్నూరప్ప, పోలేరమ్మలు ఉపాధ్యయుడుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఈయన నలభైదాకా కథానికలు, నాలుగు నవలలు రచించారు. ఈయన రచించిన కథానికలలో వానరాలె, నడక, తెల్ల దయ్యం, సావుకూడు మొ॥ కథలు స్వామి గారికి ఎంతో మంచి పేరు తెచ్చిపెట్టాయి. ఈయన రచించిన 'శప్తభూమి' నవలకు తానా సంస్థ 2017లో నిర్వహించిన నవలల పోటీలో బహుమతి పొందడమే గాక, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం కూడా లభించింది. ఈయన అనేక సాహితీ పురస్కారాలు అందుకున్నాడు. ఈయన రచనలపైన వామపక్ష భావజాలం, దళిత బహుజనవాదం ప్రభావం ఉంది.

కథానిక ప్రక్రియను పాశ్చాత్యులు, తెలుగు కవులు, సాహితీ విమర్శకులు మొ॥వారు నిర్వచించారు. ఆ నిర్వచనాలను పరిశీలించిన మీదట కథానికలో సర్వ సంపూర్ణంగా ఉండవలసిన లక్షణాలు ఆరు 1.సంక్షిప్తత, 2.ఏకాంశ వ్యగ్రత, 3.నిర్భరత, 4.స్వయం సమగ్రత, 5.ప్రతిపాద్య ప్రవణత, 6.సంవాద చాతుర్యం. ఈ ఆరు లక్షణాలను దృష్టిలో పెట్టుకుని కథకుడు కథానిక రాయాలి. ఇందులో ఏ ఒక్కదాన్ని ఉపేక్షించినా కథ రక్తి కట్టదు.

కథకుడు ఈ లక్షణాల్ని దృష్టిలో పెట్టుకుని కథ రాస్తే ఆ కథ మంచి కథ అవుతుంది. ఆ కథకుడు మంచి కథకుడు అవుతాడు.

బండి నారాయణ స్వామి గారు 'సావుకూడు' కథానికను సర్వ సంపూర్ణ కథానిక లక్షణాల ఛట్రంలో బిగించి రచించాడు. ఈ కథానికలో అనంతపురం ప్రజల జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో వారి జీవన విధానం ఎలా ఉంటుందో అనంతపురం జిల్లా మాండలికంలో కళ్యాణదుర్గం యాసలో రచించాడు.

**'సావుకూడు' కథానికలో 'సంక్షిప్తతా' లక్షణం :**

సంక్షిప్తంగా వుండటం కథానిక ప్రధాన లక్షణం వస్తువు

లోనూ, సంఘటనల్లోనూ, పాత్రల్లోనూ, సంవాదాల్లోనూ, విస్మృతి లేకుండా స్వామి గారు 'సావుకూడు' కథానికను హృద్యంగా తీర్చిదిద్దాడు.

అనంతపురం జిల్లాలో కరువు వచ్చింది. ప్రజలు గంజి తాగి, కలబంద గడ్డలు తవ్వుకుని తిని బతుకుతున్నారు. గడ్డికి, గింజలకు కరువు వచ్చింది. మనుషులకు పనులు లేవు. రెండేళ్ళ నుంచి వానలు లేవు. మూడేళ్ళ నుంచి పంటలు లేవు. మంచి బట్టలు లేవు, పిల్లలకు పెళ్ళిళ్ల లేవు. ఆకలికి ఆగలేక ఆడవాళ్ళు మానం అమ్ము కుంటున్నారు. డొక్కల్లోకి మోకాళ్ళు ముడుచుకుని కూర్చుంటున్నారు.

ఈ కథానికలో స్వామి గారు పెద్దప్పయ్య కుటుంబం గురించి వివరించాడు. ఒక రోజు పెద్దప్పయ్య చని పోయాడు. చనిపోవడమంత అదృష్టం లేదనుకున్నారు. ఊరిలో కొందరు, కానీ పెద్దప్పయ్య తన కోరిక తీర కుండానే చనిపోయాడు. బతుకంతా కష్టపడి, ముగ్గురు కొడుకులను పెంచి, పెద్ద చేసిన పెద్దప్పయ్య తన కడసారి కోరిక తీరకుండానే చనిపోయాడు.

పెద్దప్పయ్య కోడుకులు ముగ్గురు, పెద్దకొడుకు పేరు మారెప్ప, రెండో కొడుకు నాగన్న, పెద్దప్పయ్య వారిద్దరికీ చెరొక ఐదెకరాల పొలం ఇచ్చాడు. తాను తన భార్య చిన్న కొడుకు దగ్గర ఉండాలని అనుకొని అతనికి ఇంకొక ఐదెకరాలు అదనంగా ఇచ్చాడు. వాళ్ళింట్లోనే ఉంటు న్నాడు.

పెద్దప్పయ్య మంచాన పడ్డాడు. పెద్దప్పయ్యకు మాంసం పైన, 'కల్లు' పైన మనసు పోయింది. పెద్దప్పయ్య వయసులో మంచి తిండి పుష్టి కలవాడు. ఈ విషయాన్ని స్వామి గారు పెద్దప్పయ్య పాత్రలో అనాటి ప్రజల తిండి పుష్టిని ప్రతిబింబింపజేశాడు.

పెద్దప్పయ్యను చూసి పోవడానికి వచ్చిన పెద్దకొడుకు మారెప్పతో చాలాసార్లు అడిగి నాలుగు రూపాయలు ఇప్పించుకుని సారాతాగాడు. ఈ విషయం తెలిసిన మారెప్ప పెండ్లాము నానాగొడవ చేసింది. రెండో కొడుకు నాగన్నతో మంసం తినాలని అడిగితే ఆ కోరిక తీర్చలేక పోయాడు.

ఈ కథానికలో పెద్దప్పయ్య తిండి పుష్టి గురించి, అయన ముగ్గురు కొడుకుల దీనావస్థ గురించి వివరించి కరువు పరిస్థితులలో అనాటి ప్రజలందరూ చాలామటుకు పెద్దప్పయ్య కుటుంబం లాంటివే నని స్వామి గారి భావన. కరువు సమయంలో పెద్దప్పయ్య ఆఖరి కోరిక తీరక చనిపోయాడు. మాంసం అంటే బెమ్మెత్తి చని పోయాడు.

పెద్దప్పయ్య కర్మకాండలో కొడుకులు ముగ్గురు మూడు నూర్లు పెట్టి గొర్రి కోసి పెద్దకర్మను పూర్తి చేశారు. చివరలో పెద్దప్పయ్య పెండ్లాము భర్తపోయిన బాధకంటే, ఎవరెవరో వచ్చి గొంతు వరకు తిన్నారు. నాకు మాత్రం పులును పోశారు తప్ప నాలుగు ముక్కలు వేయలేదు. మీయమ్మ కడుపు కాలా అంటూ శాపనార్థాలు పెట్టింది. ఆకలి, కోరికలు మానవ సంబంధలను కూడా మరచి పోయేలా చేస్తాయన్న విషయాన్ని చాలా హృద్యంగా సన్నివేశ కల్పన చేశాడు బండి నారాయణ స్వామి గారు.

ఈ కథానికలో పెద్దప్పయ్య, పెద్దప్పయ్య కొడుకులు, కరువు చిత్రణ,పెద్దప్పయ్య రెండో కొడుకు నాగన్న పెండ్లాము ఆరోగ్యం బాగా చేయిస్తానంటే వేరే వాడితో లేచిపోవడం పెద్దప్పయ్య మాంసం కోనం బెమిని పోవడం, కడసారి కోరిక తీరకపోవడం, పెద్దప్పయ్య చనిపోయిన తర్వాత పెద్దమనుసుల సూచనతో మారెప్ప పెద్ద కర్మకు ఖర్చు పెట్టడం, పెద్ద కర్మ రోజున గొర్రి కోయడం, పెద్దప్పయ్య పెండ్లాము మొగుడు పోయి నాడని బాధపడకుండా, నా మొగాన నీళ్ళు చారు పోసినారు. ముక్కలంతా ఎవరెవరో తినిపోయినారు అని శాపనార్థం పెడుతుంది.

బండి నారాయణ స్వామి గారు 'సావుకూడు' కథానికలో అనవసర విషయాల జోలికి పోకుండా కథను నడిపించాడు. సంక్షిప్తత కథానికకు ప్రధాన లక్షణం

అందుకే కథానిక రచయితకు చాలా సంయమనం అవసరం.

**'సావుకూడు' కథానికలో 'ఏకాంశ వ్యగ్రత' :**

మొత్తం కథానిక అంతకూ ఒకే ప్రధానాంశం లక్ష్యంగా ఉండాలి. దీన్నే వస్త్వైక్యం అంటారు. ప్రారంభంలో కథకుడు ఈ విషయం మీద ప్రధానంగా దృష్టిపెడతాడో అదే విషయాన్ని దారి మళ్ళించకూడదు. కథలో అక్కడక్కడ ఇతర విషయాలు వచ్చినా ప్రధాన విషయం మరుగున పడి పోకుండా చూసుకోవడం కథకుడి ప్రధాన లక్ష్యం కావాలి.

'సావుకూడు' కథానికలో వస్త్వైక్యం ఉంది. కరువు వలన కుటుంబాలు ఎలా చితికి పోతాయో, మానవుడు ఆకలికి, అవసరాలకు ప్రాముఖ్యం ఇచ్చినట్లుగా మానవ సంబంధాలకు ప్రాధాన్యం ఇవ్వడని తెలియజెప్పడమే కథానిక ఉద్దేశం. కరువు చిత్రణ ద్వారా కరువులో పెద్దప్పయ్య లాంటి వ్యక్తులు కడసారి కోరిక తీరకుండానే చనిపోవడం, తండ్రి అంత్యక్రియల సమయంలోనూ, పెద్ద దినము నాడు పెద్దప్పయ్య కుటుంబ సభ్యుల ప్రవర్తన, ఆనాటి కరువు మానవ సంబంధాలను ఎంత దారుణంగా దెబ్బతీసిందో రచయిత స్వామి గారు కరువు చిత్రణ మీద మాత్రమే తన దృష్టిని వుంచి 'సావుకూడు' కథానికలో వస్త్వైక్యాన్ని సాధించాడు.

**'సావుకూడు' కథానికలో 'నిర్భరత' :**

కథానిక చదివేటప్పుడు రెప్పపాటు కానీ, రాసేటప్పుడు మనస్సుకు ఏమరుపాటు కానీ రానీయని లక్షణాన్ని నిర్భరత అంటారు. రచయిత కథ చెప్పేటప్పుడు మనస్సులో మరో అంశానికి చోటు ఇవ్వకూడదు. కథ చదివేటప్పుడు పాఠకుడు విసుగు చెందకుండా ఉండాలంటే కథలో 'నిర్భరత' ఉండాలి.

సావుకూడు కథానికలో స్వామి గారు నిర్భరత లక్షణాన్ని వందశాతం పాటించాడు. కథను ఆసాంతం చదివేలా చేస్తుంది. పాఠకున్ని 'సావుకూడు' కథానిక ఏకబిగిని చదివిస్తుంది. ఆలోచింపచేస్తుంది. పెద్దప్పయ్య తిండి పుష్టి కలవాడు. కొత్తగా పెళ్ళయిన రోజుల్లో పెద్దప్పయ్య తన పెండ్లాము ఎన్ని ముద్దలు పెడితే అన్ని ముద్దలు తానే తినేవాడు. పెండ్లాము ఆకలిని గమనించని తిండిపోతు పెద్దప్పయ్య. పెద్దప్పయ్య పెండ్లాము బానకడుపోనికి ఇచ్చి చేశారని, పెళ్ళానికి కూడు ఎయ్యని మొగునితో కాపురం ఎట్లా చేసేదని ఎక్కిళ్ళు పెట్టింది, పుట్టింటికి వెళ్ళిపోయింది.

పెద్దమనుషులు పెద్దప్పయ్యని పంచాయితీకి పిలిపించారు. 'పెండ్లానికి కూడు ఎందుకు పెట్టలేదని' ప్రశ్నించారు. పెద్దప్పయ్యకి అర్థం కాలేదు. తనకు తెలియదని అది పెట్టింది తాను తిన్నానని, తాను తినొద్దు అనలేదని పెద్దప్పయ్య బదులు చెప్పాడు. చివరకు పెద్దమనుషులు 'కరువులో పుట్టాము. ఎంత తిన్నా కడుపులు నిండవు, కడుపునిండా తినడానికి కుబేరులకు కాము, కడుపు ఎండగట్టలేనోడివి పెండ్లాన్ని ఎల పోషిస్తావు? పిల్లలు పుడితే ఎలా సాకుతావు' అంటూ హితవు చెప్పారు. ఈ అంశమే గాకుండా పెద్దప్పయ్య అనారోగ్యంతో మంచం మీదున్నాడు. మాంసం గురించిన కలవరింత పాఠకులను కథను ఆసాంతం చదివేలా జీవితాంతం గుర్తుకు పెట్టుకొనేలా చేస్తుంది.

**'సావుకూడు' కథానికలో 'స్వయం సమగ్రతా లక్షణం':**

కథలోని వస్తువు దానికదే సమగ్రంగా వుండాలి. అవసరమైందేదో కొరవడినట్లు కానీ, అనవసరమైంది చోటు చేసికున్నట్లుగా పాఠకునికి అనిపించకూడదు. కథానిక పరిమాణంలో నవల కన్నా చాలా చిన్నది కానీ స్వయం సమగ్రత అనేది కథానికలో ఖచ్చితంగా ఉండాల్సిన లక్షణం.

'సావుకూడు' కథానికలో వస్తువు స్వయం సమగ్రంగా ఉంది. కరువు చిత్రణ, పెద్దప్పయ్య సంసారం, అతని సంతానం, పెద్దప్పయ్య కడసారి కోరిక నెరవేరక పోవడం.

పెద్దప్పయ్య చనిపోయిన తర్వాత అంత్యక్రియలు, పెద్దప్పయ్య పెద్దదినము నాడు ముసలి గొర్రెను కోయడం, పెద్దదినము అయిన మూడు రోజులకు పెద్దప్పయ్య పెండ్లాము ఏడవడం మొదలు పెట్టింది. 'ఎవరెవరో వచ్చి గొంతు వరకు తిన్నారు. నామగాన నాలుగు తునకలు వెయ్యలేదు, పులుసు పోశారు, మీయమ్మ కడుపుకాలా' అంటూ శాపనార్థాలు పెట్టింది. ఈ విధంగా సావుకూడు కథానికలో 'స్వయం సమగ్రత' అనే కథానిక లక్షణం పుష్కలంగా ఉంది.

**'సావుకూడు' కథానికలో 'ప్రతిపాద్య ప్రవణత' :**

ప్రతిపాదించదలచుకొన్న అంశాన్ని దృష్టిలో పెట్టుకొని దాని వికాసానికి అనుగుణంగా రచన సాగించాలి. సావుకూడు కథానికలో అనంతపురం జిల్లా గ్రామీణ జీవనాన్ని కరువు ఏ విధంగా దెబ్బతీసిందో, మానవత్వాన్ని కూడా ఏవిధంగా మంట కలిపిందో చాలా అద్భుతంగా చిత్రించాడు బండి నారాయణ స్వామి గారు. కరువు సీమలో ప్రజల జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో, వారి జీవన విధానం ఎలా ఉంటుందో స్వామి గారు 'సావుకూడు' కథానికలో పాఠకుల మనోనేత్రాల ముందు నిలిపారు. ఆకలి మనుషులను ఎలా శాసిస్తుందో, మారుస్తుందో ఈ కథలో ప్రతిపాదించారు. తను ప్రతి పాదించదలచుకున్న కరువు చిత్రణను పెద్దప్పయ్య పాత్ర ద్వారా, అతని కుటుంబ సభ్యులు, పెద్దమనుషులు, బంధువులు, పాత్రల ద్వారా సావుకూడు కథానికా వికాసానికి అనుగుణంగా రచన సాగించాడు.

**'సావుకూడు' కథానికలో 'సంవాద చాతుర్యం :**

సంభాషణా రూపంలో సాగే వాక్యాలు ఒకానొక ప్రధా నాంశాన్ని ఆవిష్కరించేటట్లుగానో, ఒకానొక పాత్ర వ్యక్తిత్వాన్ని ప్రదర్శించేటట్లు గానో ఉండాలి. ప్రతి సంభాషణ కథకు ప్రయోజనం కలిగించే విధంగా వుండాలి. కథలో సంభాషణలు క్లుప్తంగా, నిత్యజీవిత వ్యవహారానికి దగ్గరగా వుండాలి. ఈ సంభాషణలు ప్రజా జీవనాన్ని ప్రతిబింబించాలి. భాష సరళంగా, సుందరంగా వుండాలి. భాషా శైలి పాఠకుల్ని ఆకట్టుకొనే విధంగా వుండాలి. ఈ విషయాల్లో కథకుడు జాగ్రత్త వహిస్తే కథ రక్తికట్టుతుంది.

సావుకూడు కథానికలో కథకుడు బండినారాయణ స్వామి గారు సంవాద చాతుర్యాన్ని తనదైన శైలిలో రచించి కథకు ప్రాణం పోశాడు. దానికి కొన్ని ఉదాహరణలు చూద్దాము.

"ఇప్పటికి నెలదినాల కిందట - ముద్ద పెట్టి సాకే సిన్న కొడుకు ఇంట్లో మంచమెక్కె ముసిలోడు. అప్పుడు పెద్దకొడుకు మారిప్ప నాయనను చూసి మాట్లాడించి పోదమని వచ్చె. ఎట్లుంది నాయనా పానానికి?" అని అడిగె

"ఇంక ఎక్కువనాల్లు బతకన్రానేను" అనె ముసిలోడు

"అవేం మాటలు నాయనా?" అంటూ మనసు నొచ్చుకొనే కొడుకు

"నిజ్జం నాయనా! నా శరీరం బాధ నాకు తెలుసు" అంటూ కంటతడి పెట్టుకుని. రొవంత నుస్తీ సేసి పైనురుకు లేస్తే అమెరికాకు పొయ్యేవాల్లు ఉండారు. పానం మీదకి వస్తే పక్క ఊరికి బస్సెక్కిపోయి ఒక సూది వేయించుకునే దానికి దుడ్లు లేవు. వయసు పానమైతే. ఎట్లబ్బా రోగ మొచ్చింది. మందులకు దడ్లు లేవు" అని సింత చేయ్యెచ్చు.

"ముసలి పానములే ఈ పొద్దు కాకపోతే రేపన్నా పొయ్యేది" అంటూ సాగే సంభాషణ సావుకూడు కథా నికను పాఠకుడు ఊపిరిబిగబెట్టి చదివేలా చేస్తుంది.

"ఈ పొద్దో రేపో సచ్చిపోతాడనుకున్న ముసిలోడు కడుపులో కల్లు పడేటప్పటికి లేచి కూర్చుండె."

"బోలె గట్టి పానమబ్బా ముసిలోనిది! మనం సావ ల్సిందే గాని ముసిలోడు సావడు" అని ఊర్లో అంతా నవ్వుకుండిరి!"

"ముసిలోడు నిజ్జంగా సచ్చిపోతాడనుకుని ఊరకే

నాలుగు రూపాయలు ఇస్తేనే? బుద్ధిలేని నా కొడుకుని ఎనకా ముందూ ఆలోచించకుండా తొందరపడితి'' అనుకుండె పెద్దకొడుకు మారెప్ప.

కథకుడు స్వామి గారు సంభాషణ చాతుర్యంతో కథకు ప్రాణం పోశాడు. అనంతపురం జిల్లా మాండలిక శైలిలో సాగే సంభాషణలు కథలో చెప్పదలచుకున్న కరువు ప్రజల జీవితాలను ఎలా ఆడుకుంటుందో, ఆకలి మనుషులను ఎలా శాసిస్తుందో, మారుస్తుందో, మానవ సంబంధాలపై ఎలాంటి మార్పు చూపిస్తుందో చక్కగా నాటకీయతతో పాఠకులపై ముద్రవేశాడు. తెలుగు కథానిక ప్రక్రియలో నూటికి నూరు శాతం కథానిక లక్షణాలు కలిగిన కథలు చాలా తక్కువ. ఏదో ఒక లక్షణం లోపిస్తుంటుంది కానీ స్వామి గారి సావుకూడు కథానికలో పొల్లు పోకుండా అటు పాశ్చాత్యులు, ఇటు తెలుగు సాహితీ విమర్శకులు అంగీకరించిన కథానిక లక్షణాలు అన్నీ వున్న సంపూర్ణ కథానిక ఇది. పాఠకులు ఎన్నో కథలను చదువుతుంటారు. సంపూర్ణ కథా లక్షణాలతో వచ్చిన కథానికలు పాఠకుల మనోఫలాకాలపై ముద్రితమై ఉంటాయి. ఆవిధంగా సావుకూడు కథానిక సంపూర్ణ కథానిక లక్షణాలు కలిగి వుండడం వల్ల తెలుగు సాహితీ కథానిక చరిత్రలో గుర్తించుకోదగ్గ కథగా పాఠకుల మదిలో నిలిచిపోతుంది.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య చరిత్ర - ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న
2. 'సావుకూడు' కథానిక - బండి నారాయణ స్వామి (సాహితీసందనం నుండి)
3. బండి నారాయణ స్వామి - వికీపిడియా
4. కథానిక స్వరూప స్వభావాలు - పోరంకి దక్షిణామూర్తి.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2(1), February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తెలుగు నిఘంటువుల్లో భావార్థక నామరూపాల పరిశీలన

– యం. ప్రసాద్ నాయక్, సహాయ ఆచార్యులు, భాష అధ్యయన శాఖ (లింగ్విస్టిక్స్), ద్రావిడ విశ్వవిద్యాలయం.

భాషలోని వివిధ భాషా భాగాలుంటాయి. భాషా భాగాల్లోని నామం, క్రియ, విశేషణం మొదలైన రూపాన్ని అకారాది క్రమంలో ఇవ్వడం నేటి నిఘంటువుల్లో చూడ వచ్చు. నిఘంటువులు భాషకు అత్యంత ఉపయుక్తమైన విలువైన పుస్తకాలు. నిష్పన్నరూపాల్లో ఒక రకం భావార్థక నామ రూపాలు నిఘంటువుల్లో భావార్థక నామరూపాల ప్రస్తావన కొద్దో గొప్పో ఉండటం మనం చూడవచ్చు.

భావార్థకమనగా దాతువు యొక్కనహజమైన అర్థమును నూచించు క్రియారువమును భావర్థక మందురు. ఉదా: చదువుంటొ చదువుట,

వ్రాయుంట = వ్రాయుట,

గ్రాథిక భాషలో ధాతువునకు 'ట' చేర్చుట వలన భావార్థక మేర్పడుసు. ఉదా: చదువుంట = చదువుట.

శిష్టవ్యావహారిక భాషలో భావార్థకము దాతువునకు 'అటం' గాని 'అడం' గాని చేర్చటం వలస ఏర్పడుసు. ఉదా: వ్రాయుంఅడం = వ్రాయడం, చేయుంఅటం = చేయటం

మూడక్షర దాతువులకు 'అటం' 'అడం' లు పరమగు నపుడు రెండువ అక్షరమునకు అకారము వచ్చును. ఉదా: చదువుంఅడం = చదవడం, అడుగు ంఅడం = అడగడం.

వ్యతిరేకభావార్థకము అనగా భావార్థకమ యొక వ్యతిరేక రూపమును వ్యతిరేక భావార్థకమందురు. ఉదా: చేయమి, కొట్టమి.

గ్రాంథిక భాషలో వ్యతిరేక భావార్థకము భాషలో దాతువునకు 'అమి' చేర్చుట వలన వ్యతిరేక భావార్థక మేర్పడుసు. ఉదా: చదువుంఅమి = చదువమి, చేయుంఅమి = చేయమి.

శిష్టవ్యావహారిక భాషలో భావార్థకము దాతువునకు 'అటం' గాని 'అకపోవడం' చేర్చటం వలన ఏర్పడుసు. ఉదా : చదువుంఅకపోవడం = చదవకపోవడం, చేయుం అకపోవడం = చేయకపోవడం

తెలుగు నిఘంటువుల్లో నిష్పన్న రూపాలు కన్పిస్తు న్నాయి. క్రియకు నిష్పన్న ప్రత్యయం చేరి ఏర్పడేవి క్రియాధాతు మూలక నిష్పన్న నామరూపాలు. అన్ని క్రియలకు భావార్థక ప్రత్యయం చేరి భావార్థక నామ రూపాలు ఏర్పడతాయి. భావార్థక నామరూపాలు ఏక ప్రత్యయ ప్రతినిధ్యం కలవి. తెలుగులో - ట/డు - అటము/అటం/అడము/అడం అనే భావార్థక ప్రత్యయాలు కన్పిస్తున్నాయి. తెలుగు నిఘంటువుల్లో భావార్థక నామరూపాల్ని సేకరించి నిఘంటువుల్లో వాటి విస్తృతిని పరిశీలించడం జరిగింది. తెలుగు నిఘంటువుల్లో భావార్థక నామరూపాల వాడకం పరిపూర్ణ స్థాయిలో లేకపోవడం పరిశోధనలో తేలిన అంశం. భావార్థక నామ రూపాలనన్నింటిని కూడా తెలుగు నిఘంటువుల్లో ఇవ్వవలసిన అవశ్యకత ఎంతైనా ఉంది. తెలుగు భాషకు విస్తృతిస్థాయి. మహా నిఘంటువులో సర్వ భావార్థక నామరూపాల్ని నిఘంటువుల్లో చిరస్థాయిగా నిలుపుతున్న వాళ్ళమవుతాం.

ఏ బాషకైనా నిఘంటువులు ప్రత్యేకమైన, అత్యంత విలువైన పుస్తకాలు. భాషలోని పదాలకు అర్థాలకు తెలిపే పుస్తకాన్ని 'నిఘంటువు' అని వ్యవహరించవచ్చు. నేటి నిఘంటువుల్లో పదాలు 'అకారాది' క్రమంగా ఉండడం మనం చూడవచ్చు.

భాషలో అర్థవంతమైన కనిష్ట రూపాల్ని ధాతువులు, ప్రత్యయాలుగా వర్గీకరించవచ్చు. ప్రత్యాయాల్ని వాటి ప్రవృత్తిని బట్టి-నిష్పన్న ప్రత్యయాలుబీ సంయోజన

ప్రత్యయాలుగా పేర్కొనవచ్చు. నిష్పన్న ప్రత్యయాలు నామ, క్రియా, విశేషణ రూప నిష్పన్నాలు.

తెలుగు భాషలో నామరూప నిష్పతి (క్రియా) ధాతు మూలకంగానుబీ (నామ/విశేషణ) ప్రాతిపదిక మూలకం గాను ఉంది. క్రియాధాతుమూలక నామరూప నిష్పత్తిలో క్రియాధాతువుల నుంచి నామరూపాలు నిష్పన్నమవు తాయి. అంటే క్రియాధాతువులకు నామ నిష్పన్న ప్రత్యయం చేరడంవల్ల నామరూపాలు ఏర్పడతాయి. నిర్దిష్ట (కొన్ని) క్రియాధాతు మూలక రూపాలు కృదంత రూపాలుబీ అనిర్దిష్ట(న్వర లేదా అన్ని) క్రియాధాతువు మూలక రూపాలు భావార్థక నామ రూపాలు.

తెలుగు భాషలోని భావార్థక నామ రూపాల్ని - కేవలం; వ్యతిరేక-భావార్థక నామ రూపాలుగా వర్గీకరించవచ్చు. భాషలో భావార్థక నామరూపాలు ఏకప్రత్యయ ప్రాతినిధ్యం కలవి. తెలుగులోని కేవల బావార్థక నామ రూపాల్లో - ట/డు; - అకము; -అటము/అటం/ఆటము/అడము/ అడం/ఆడము-అనే కేవల భావార్థక నామ ప్రత్యయాల్ని చూడవచ్చు. వ్యతిరేక భావార్థక నామరూపాల్లో - అమి/ మి అనే (ప్రాచీన) వ్యతిరేక భావార్థక ప్రత్యయాన్ని చూడవచ్చు. ఆధునిక తెలుగులో వ్యతిరేక భావార్థక నామం-(అ)క పోవడం అన్న నిర్మాణాన్ని (చదువుంఅక పావడం, చేయుంఅకపొవడం)కలిగి ఉండడం మనం చూడవచ్చు.

ప్రస్తుత పత్రంలో తెలుగు నిఘంటువుల్లోని భావార్థక నామరూపాల్ని పరిశీలించడం జరిగింది. అందుకుగాను రెండు నిఘంటువుల్ని ఎంచుకోవడం జరిగింది. ప్రస్తుత పత్రానికి ఆధారమైన నిఘంటువులు-సూర్యరాయాంధ్ర నిఘంటువు, తెలుగు-ఇంగ్లీష్ నిఘంటువు (బ్రౌన్ నిఘంటువు). ఈ నిఘంటువుల్లోని భావార్థక నామరూపాల విషయ సేకరణ పరిశీలనకు కాలం అధిక వ్యయం. కష్టం అధికం. అయినా ఫలితం స్పష్టం. అలోచనీయం. ఈ నిఘంటువుల్లో కన్పించే భావార్థక నామరూపాల కోసం పట్టికలు 1,2,3 చూడవచ్చు.

ఆధార నిఘంటువుల్లోని భావార్థక నామరూపాల రూపనిర్మాణం కింది విధంగా ఉంది. భావార్థక నామరూప నిర్మాణం సామాన్యంగా సానుబంధాత్మకం. ఆధార క్రియా ధాతువులకు భావార్థక నామ ప్రత్యాయాలు చేరడం సానుబంధాత్మక ప్రక్రియ. భావార్థక నామరూప నిర్మాణాన్ని ఆధార నిఘంటువుల్లోని ఉదాహరణలతో కింది పరి శీలనలో చూడవచ్చు.

1) ఆధార క్రియాధాతువు, భావార్థక నామ ప్రత్యయం రెండింటిలోనూ ఎలాంటి మార్పు లేకపోవడం.
   అ - ట/డు : చిరుగు-చిరుగుట; త్రవ్వు -- త్రవ్వుట;
   పోరు -- పోరుట; సమకూరు - సమకూరుట;
   ఎక్కు - ఎక్కుడు; పొంగు --పొంగుడు
2) ఆధారక్రియా ధాతుగాతాచ్చు లోపం చెందడం
   అ - ఉ లోపం.
   అ) - చల్లు : అకము - చల్లకము; తవ్వు - తవ్వకము.
   ఆ) - అటము/అటం/ఆటము/అడము/అడం/ ఆడము : కుట్టు - కుట్టడము; తవ్వు - తవ్వటము/తవ్వడం; చల్లు -- చల్లడం/ చల్లాడము
   ఇ) అమి : ఒప్పు - ఒప్పమి; పలుకు -- పలుకమి
3) - ఆధార క్రియాధాతువు సంపూర్ణంగా ఆదేశం చెండడం
   అ - 'వచ్చు' కు 'రా' ఆదేశం
   1)- అడము : వచ్చు -- రావడము
   2)- మి : వచ్చు - రామి
   i) 'కలుగు' కు 'లే' ఆదేశం
   'కలుగు' క్రియాధాతువుకు వ్యతిరేకరూపం 'లే'
   కలుగు - లేమి

ప్రస్తుత పత్రంలో ప్రధానంగా ఆధార నిఘంటువుల్లోని భావార్థక నామరూపాల్ని పరిశీలించడం, వాటికోసం ప్రత్యేక

నిఘంటు నిర్మాణం అవసరాన్నిబీ మాహానిఘంటు నిర్మాణంలో సర్వ భావార్థక నామాల చేరికను గురించి చెప్పడం లక్ష్యం.

ప్రస్తుత పత్రం కోసం మన నిఘంటువుల్లో ప్రధానమైన సూర్యరాయాంధ్ర నిఘంటువులు, బ్రౌన్ తెలుగు-ఇంగ్లీష్ నిఘంటువుల్లోని భావార్థక నామరూపాల పరిశీలనవల్ల తెలుసుకున్న అంశాలు ఇవి.

1. సూర్యరాయాంధ్ర నిఘంటువు, బ్రౌన్ నిఘంటువు రెండింటిలోనూ సామాన్యంగా కన్పించే భావార్థక నామ రూపాలు 63. అందులో - కేవల భావార్థక నామ రూపాలు 56. వ్యతిరేక బావార్థక నామ రూపాలు 7 ఉన్నాయి. (చూడు. పట్టిక - 1)
2. కేవలం సూర్యరాయాంధ్ర నిఘంటువులో కన్పించే భావార్థక నామ రూపాలు (బ్రౌన్ నిఘంటువులో లేనివి) 4. అవి కేవల భావార్థక నామరూపాలు మాత్రమే. ((చూడు. పట్టిక - 2)
3. కేవలం బ్రౌన్ నిఘంటువులో కన్పించే భావార్థక నామరూపాలు (సూర్యరాయాంధ్ర నిఘంటువులో లేనివి) 58. అందులో కేవల భావార్థక నామ రూపాలు 43; వ్యతిరేక భావార్థక నామరూపాలు 15 ఉన్నాయి. (చూడు. పట్టిక -- 3)
4. కేవలం సూర్యరాయాంధ్ర నిఘంటువులో 49 భావార్థక నామరూపాలకు ప్రయోగాలు కన్పిస్తు న్నాయి. బ్రౌన్ నిఘంటువులో ఎలాంటి భావార్థక నామరూప ప్రయోగాలు లేకపోవడం చూడవచ్చు. (చూడు. పట్టిక -- 4)
5. సూర్యరాయాంధ్ర నిఘంటువు, బ్రౌన్ నిఘంటువు రెండింటిలో ఉన్న మొత్తం భావార్థక నామరూపాలు 125. అందులో కేవల భావార్థక నామరూపాలు 103బీ వ్యతిరేక భావార్థక నామరూపాలు 22 ఉన్నాయి. (చూడు. పట్టికలు -- 1, 2, 3)

తెలుగు బాషలో విస్తృతంగా ఉన్న బావార్థక నామ రూపాలు ప్రస్తుత ఆధార ప్రధాన నిఘంటువులైన సూర్య రాయాంధ్ర నిఘంటువు, బ్రౌన్ నిఘంటువుల్లో ఎక్కువగా కన్పించక, క్వాచిత్కంగా గోచరిస్తున్నాయి. అలాగే మిగతా నిఘంటువుల్ని కూడా పరిశీలించడం వల్ల ఈ విషయం బోధపడవచ్చు.

ప్రత్యేకంగా బావార్థక నామరూప నిఘంటు నిర్మాణా నికి; తెలుగు భాషా మహా నిఘంటువు నిర్మాణంలో సర్వ భావార్థక నామరూపాలను సంపూర్ణంగా చేర్చడం గురించి -- భావి పరిశోధకులకు, ముఖ్యంగా నేటి నిఘంటువు నిర్మాతలకు ప్రస్తుత పత్ర సూచనాప్రాయమైన చిన్న పరిశీలన మాత్రమే.

## పట్టికలు (1-4) :

### పట్టిక- 1 :

సూర్యరాయాంధ్ర నిఘంటువులోనూ, బ్రౌన్ నిఘంటువులోనూ సామాన్యంగా కన్పించే భావార్థక నామరూపాలు; (63)

**i) కేవల భావార్థక నామ రూపాల పట్టిక : (56)**

చంపుడు, చిమ్ముడు, చిరుఉగుడు, చిలుకుడు, N ఉదుడు, చీరుడు1; చీరుడు2, జరుగుడు, జాఱుడు, డిగుడు/డిగ్గుడు, తగులుడు, తప్పుడు, తఱుముడు, తలఉగుడు, తాఉకుడు, తిరుగుడు, తెగుడు, తెరలుడు, తెలుపుడు/తెల్పుడు, తొక్కుడు/త్రొక్కుడు, తొలఉగుడు, తోఉడుడు, తోముడు, త్రాగుడు/త్రావుడు, త్రిప్పుడు, త్రుంగుడు, త్రొక్కుడు, త్రోపుడు, దబ్బుడు, దంపుడు, దిద్దుడు, దూఉకుడు, దెప్పుడు, దోఉకుడు, దోఉపుడు, నామపుడు, నెమకుడు, పాఱుడు, పులుముడు, పెరుఉ గుడు, పేరుడు, పొంగుడు, పొసఉగుడు, ప్రాముడు, ప్రేలుడు, ముడుఉగుడు, మ్రింగుడు, రాపుడు, రుద్దుడు, వడుకుడు, వేఉపుడు/వ్రేఉపుడుబీ చల్లకము, తవ్వకము, తోమకము, వంపకము, మారకము/ మార్కము/ మాఱకము.

**ii) వ్యతిరేక భావార్థక నామ రూపాల పట్టిక: (7)**

చాలమి, తగులమి/తవులమి, నేరమి, పలుకమి, లేమిబీ చూపోపమి, పోరామి.

**పట్టిక - 2 :**

కేవలం సూర్యరాయాంధ్ర నిఘంటువులోనే కన్పించే భావార్థక నామరూపాలు : (4)

i) కేవల భావార్థక నామరూపాల పట్టిక : (4)

వడుకుడు, వాఉగుడుబీ సమకూరుట; వాడకము

**పట్టిక - 3 :**

కేవలం బ్రౌన్ నిఘంటువులోనే కన్పించే భావార్థక నామరూపాలు : (58)

**i) కేవల భావార్థక నామరూపాల పట్టిక : (58)**

ఇంకుడు, ఇరుగుడు/ఇరువుడు, ఎక్కుడు, ఏంగుడు, ఒత్తుడు, కప్పుడు, కాఉగుడు, కాఉవుడు, కావుడు, క్రుంగుడు, గిల్లుడు, గుసుకుడు, గుప్పుడు, చేపుడు, త్రుంపుడు, దంపుడు, దాఉవుడు, సరకుడు/సరకుడు, సలుగుడు/సల్లుడు, నిక్కుడు, నూకుడు, నొక్కుడు, పొదుగుడు/పొదువుడు, ప్రాకుడు, మగ్గుడు, ముసుగుడు, మొక్కుడు/మ్రొక్కుడు, రోఉజుడు/రోంజుడు, వంగుడు, వాగుడు, వెదకుడు/వెసుకుడు, సోకుడుబీ కావుట, చిరుగుట, త్రవ్వుట, పోరుటబీ కలపడము, కుట్టడము, కేరడము,చిరువడము/చిరువడము, చల్లాడము/చల్లాడము, తవ్వటము/తవ్వాటము/తవ్వటము, రావడము.

**ii) వ్యతిరేక భావార్థక నామరూపాల పట్టిక : (15)**

అఱుగమి, ఒంటమి, ఒప్పమి, ఒల్లమి, ఒప్పమి, ఓటమి, ఓపమి, ఓరుపమి/ఓర్వమి, తోవమి, పోరమి, పోలమి, బొంకమి, రామిబీ కొరగామి, విని విసమి.

**పట్టిక - 4 :**

కేవలం సూర్యరాయాంధ్ర నిఘంటువులోనే కన్పిస్తున్న ప్రయోగాలతో ఉన్న భావార్థక నామరూపాలు.

**i) కేవల భావార్థక నామరూపాల పట్టిక : (41)**

చంపుడు, చిరుఉగుడు, జరుగుడు, జాఱుడు, డిగ్గుడు, తగులుడు, తఱుముడు, తలఉగుడు, తాకుఉడు, తిరుగుడు, తెల్పుడు, త్రొక్కుడు, తొలఉగుడు, తోడుడు, తోముడు, త్రాగుడు/త్రావుడు, త్రిప్పుడు, త్రురగుడు, త్రొక్కుడు, దోఉకుడు, దెప్పుడు, నామపుడు, నెమకుడు, పాఱుడు, పలుకుడు, పెరుఉగుఉడు, పేరుడు, పొంగుడు, ప్రాముడు, ప్రేలుడు, ముడుఉగుడు, రుద్దుడు, పడుకుడు, వాఉగుడు, ప్రేఉగుడుబీ సమకూరుటబీ చెక్కడము, త్రొక్కటము, త్రిప్పటము, ప్రేలడము, మెత్తడము.

**i) వ్యతిరేక భావార్థక నామరూపాల పట్టిక : (8)**

చాలమి, తగులమి/తవులమి, నేరమి, పలుకమి, లేమిబీ చూపోపమి, పోరామి, వినినిసమి.

**ఉపయుక్త రచనలు :**

1. Krishnamurti,Bh and Gwyann, J.P.L. 1985. A Grammar of Modern Telugu. Delhi: Oxford University Press.
2. పి.యస్. సుబ్రమణ్యం.2006. ద్రావిడా భాషలు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాదు.
3. పి.వి.కె.ప్రసాద్ రావు, శ్రీ మహాలక్ష్మి.2008. శ్రీ మహాలక్ష్మి బుక్ కార్పొరేషన్ విజయవడ.
4. జయంతి రామయ్య పంతులు.1936. సూర్యరాయాంధ్ర నిఘంటువు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కళాభవన్, హైదరాబాదు (సంపుటలు: 1,2,3,4).
5. డా. వై. రెడ్డి శ్యామల.2007. ప్రసద్ధ తెలుగు నిఘంటువు- లక్షిత ప్రయోజనాలు, భార్గవ్ పబ్లికేషన్స్, హైదరాబాదు.
6. Brown, C.P, 1854. Telugu- English Dictionary, Victory Publications Vijayawada.
7. Subbaraydu, Mahakali.1963

★

BHAVAVEENA
Vol. 19, Issue. 2(1), February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ఐన్‌స్టీన్ - భారతీయ తాత్వికత

- డా॥. కుంచకంటి శేషుకుమార్, అధ్యక్షులు భౌతిక శాస్త్ర విభాగాధిపతి, శ్రీసాధన డిగ్రీ కళాశాల, మార్కాపురం

నేను భగవద్గీత చదివినప్పుడు మరియు దేవుడు ఈ విశ్వాన్ని ఎలా సృష్టించాడో ఆలోచిచేటప్పుడు మిగతావన్ని చాలా నిరుపయోగంగా అనిపిస్తాయి.

- ఐన్‌స్టీన్

భగవద్గీత నాకు స్ఫూర్తిని ప్రేరణని కలిగిస్తుంది. నా శాస్త్రీయ పరిశోధన మరియు సిద్ధాంతాల నిర్మాణంలో భగవద్గీత నాకు మార్గదర్శనం గా ఉండేది.

- ఐన్‌స్టీన్

నేటి ఆధునిక యుగంలో సైతం అద్భుతంగా అనిపించే ఆవిష్కరణలు, సిద్ధాంతాలు ప్రతిపాదించిన ఐన్‌స్టీన్ మహాశయునికి భగవద్గీత ప్రేరణట. చార్లెస్ వికిన్స్ ద్వారా 1787లో జర్మన్ బాషలోకి అనువాదం చేయబడిన భగవద్గీత 1856 లో జర్మన్ బాషలోకి మాక్స్‌ముల్లర్ ద్వారా అనువాదం చేయబడ్డ వేదాలు ఐన్‌స్టీన్ కు నిత్య పఠనీయ గ్రంధాలట. భౌతికశాస్త్రంలో సైద్ధాంతిక శాస్త్రవేత్త ఐన్‌స్టీన్‌కు కేవలం ఆధ్యాత్మిక గ్రంధాలుగా ప్రస్తుతం భావిస్తున్న భగవద్గీత, వేదాలకు సంబందం ఎమిటి? ఐన్‌స్టీన్ సిద్దాంతాలలో ఉన్న భారతీయతాత్వికతను ఈ వ్యాసంలో పరిశీలిద్దాం.

2000 సంవత్సరంలో నూతన శతాబ్ధి, సహస్రాబ్ధి ఉత్సవాల సందర్భంగా అప్పటి వరకు ఉన్న మానవజాతి చరిత్రలో అతిగొప్ప ఆవిష్కరణ ఏది? అత్యంత ప్రతిభా వంతుడైన వైజ్ఞానికుడు ఎవరు అని అంతర్జాతీయంగా సర్వే నిర్వహించగా, అత్యంత ప్రతిభావంతుడైన వైజ్ఞానికునిగా ఐన్‌స్టీన్, ఆవిష్కరణగా ఆయన ప్రతిపాదించిన ప్రత్యేక సాపేక్షతా సిద్ధాంతములో $E = mc^2$గా ప్రఖ్యాతి వహించిన శక్తి - ద్రవ్యరాశి సంబంధం ప్రధమ స్థానం పొందింది.

## శక్తి ద్రవ్యరాశి సంబంధము- అద్వైతం :

ఆకారం, పరిమాణం, రంగు, రుచి, వాసన, ద్రవ్యరాశి వంటి లక్షణాల ద్వారా మాత్రమే గుర్తించగలిగే పదార్థానికి (Matter), ఈ లక్షణాలలో వేటి ద్వారానూ, గుర్తించడానికి వీలు కాని శక్తి (Energy) ఈ రెండూ వేరు వేరు భౌతిక రాశులని అప్పటి వరకూ వైజ్ఞానిక ప్రపంచం భావిస్తూ వస్తుంది. ఐన్‌స్టీన్ గారి శక్తి - ద్రవ్యరాశి సంబంధం ఈ భావనలను సమూలంగా మార్చివేస్తూ శక్తి -ద్రవ్యరాశి రెండూ ఒకే భౌతికరాశి యొక్క వేరువేరు స్థితులని, శక్తి ద్రవ్యరాశి గాను, మరియు ద్రవ్యరాశి శక్తి గానూ రూపాంతరం చెందుతాయని గణిత సమీకరణాల రూపంలో ప్రతిపాదించారు. పరమాణు కేంద్రంలో గమనించిన ద్రవ్యరాశి లోపం (Mass deffect) కేంద్రకాణువులను బంధించి ఉంచే బంధక శక్తిగా రూపాంతరం చెందుతుందని తెలిపే ప్రయోగం ద్రవ్యరాశి శక్తిగా రూపాంతరం చెందుతుందనే, ఐన్‌స్టీన్ భావనను నిరూపించింది. ఇదే విధంగా పూర్తి శక్తి రూపమైన గామాఫోటాన్ భారకేంద్రకం దగ్గరగా వెళ్ళినప్పుడు ఎలక్ట్రాన్ మరియు పాజిట్రాన్ అనే రెండు ద్రవ్యకణాలుగా రూపాంతరం చెందుతుందనే ప్రయోగపూర్వక పరిశీలన శక్తి-ద్రవ్యరాశిగా రూపాంతరం చెందుతుందనే ఐన్‌స్టీన్ భావనను నిరూపించింది. ఎటువంటి ప్రయోగ పరికరాలు, ప్రయోగశాల లేకుండానే కేవలం పెన్సిల్‌తో పేపర్‌పై గణితాత్మకంగా, సైద్ధాంతికంగా వివరించిన ఇలాంటి ఐన్‌స్టీన్ సిద్ధాంతాలు ఆనాటి వైజ్ఞానికులనే కాక, 100 సంవత్సరాల తరువాత నేటి ఆధునిక సాంకేతిక ప్రపంచాన్ని కూడా అశ్చర్య పరచే అద్భుత ఆవిష్కరణలు.

భారతీయ తాత్వికత ప్రకారం పంచేంద్రియాలు (కన్ను, ముక్కు, చెవి, నాలుక మరియు చర్మం) ద్వారా అభి

వ్యక్తమయ్యే పంచభూత (భూమి, గాలి, నీరు, నిప్పు మరియు ఆకాశం) నిర్మితమైనదే ప్రపంచం. దీనినే ప్రకృతి అంటారు. పంచేంద్రియాల ద్వారా గుర్తించడానికి వీలు కాని పంచభూతాలకు అతీతమైన శుద్ధ చైతన్యాన్ని పరమాత్మ అంటారు. దీనినే మధ్వాచార్యులు ద్వైతం అన్నారు. అనగా సృష్టి మొత్తం ఈ రెండింటి చేత నిర్మిత మైనది అనగా పంచభూత నిర్మితమైన ప్రకృతి, మరియు పంచభూతాలకు అతీతమైన శుద్ధ చైతన్య స్వరూపమైన పరమాత్మ.

క్రీస్తుకు పూర్వం 500 సం॥ క్రితం కేరళలోని కాలడిలో జన్మించిన శంకరాచార్యులు, సృష్టిలో రెండుగా వ్యక్త మవుతున్న ప్రకృతి, పరమాత్మ వాస్తవానికి రెండుకావని, ఇవి రెండు ఒకటి మరొకటిగా నిరంతరం రూపాంతరం చెందుతుంటాయాని చెప్పారు. ఈ సిద్ధాతాన్ని అద్వైతం అనగా రెండుకానిది అంటారు.

సరిగ్గా ఇదే విషయాన్ని 2,400 సం॥ల తరువాత ఐన్‌స్టీన్ మహాశయుడు రంగు, రుచి, రూపము, పరి మాణము, ద్రవ్యరాశి వంటి లక్షణాల ద్వారా వ్యక్తమయ్యే పదార్థం (Matter)కి ఈ లక్షణాలలో వేటిద్వారాసూ వ్యక్తం చేయడానికి సాధ్యం కాని శక్తి (Energy)కి సంబంధాన్ని తెలియచేసాడు. ఇదే విషయాన్ని భగవద్గీతలో, విశ్వరూప సందర్శన యోగంలో ఈ సృష్టిమొత్తం అనగా పంచభూత నిర్మితమైన ప్రపంచం శుద్ధ చైతన్యం నుండే సృజించ బడుతున్నదని తిరిగి ఆ శుద్ధచైతన్యం లోనికే విలీన మవుతున్నదని నిరాకారుడు (No Shape), నిర్గుణుడు (No Dimensions), సర్వవ్యాపకుడు (Spreads every where), శాశ్వతుడు (Conserved)గా తనను తాను చెప్పుకున్న శ్రీకృష్ణుడు చెప్పాడు. ఈ లక్షణాలన్నీ భౌతిక శాస్త్రంలో శక్తిని గుర్తించడానికి చెప్పబడ్డాయి.

**కాంతి ద్వస్వభావం - భగవంతుని సగుణ నిర్గుణ తత్వం :**

భౌతికశాస్త్రంలో చర్చించదగ్గ మరియొక విషయం కాంతి స్వభావం. ఎందుకంటే కాంతి యొక్క వ్యతికరణ, వివర్తన ధృవణ ధర్మాలను కేవలం తరంగ స్వభావం మాత్రమే వివరించగలదు. అదేవిధంగా కాంతి-విద్యుత్ ఫలితము, కాంప్టన్ ఫలితం వంటి ధర్మాలను కేవలం కణ స్వభావం మాత్రమే వివరించగలదు. ముందు కణస్వభావమంటే ఏమిటి? తరంగ స్వభావం అంటే ఏమిటి అనేవిషయాలను అర్థం చేసుకుందాం. ఉదా హరణకు నేను 30 మంది విద్యార్థులున్న తరగతి గదిలో ఒక ఉపాధ్యాయుణ్ణి నాదగ్గర ఒక పెన్ ఉంది, దీనిని నేను తరగతిలోని 30మంది విద్యార్థులలో ఎవరో ఒకరికి మాత్రమే ఇవ్వగలను. అదే నేను చెప్పే పాఠాన్ని ఒకేసారి ఒకే సమయంలో 30 మంది విద్యార్థులకు ఇవ్వగలను. ఎందుకంటే పెన్ ఒక కణం. నేను చెప్పే పాఠం ఒక శబ్ద తరంగం అంటే కణం ఒకే సమయంలో ఒకే ప్రదేశంలో మాత్రమే ఉండగలదు, దీనినే స్థానీకరణ (Localised) అంటారు. కాని ఒక తరంగం ఒకే సమయంలో ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాలలో ఉండ గలదు. ఇలా ఉండా లంటే తరంగానికి రెండు ధర్మా లుండాలి. (1) సర్వవ్యాప కత్వం (It spreads every where) అంటే అన్ని ప్రదేశాల లోని మరియు పదార్థాలలోకి ప్రవేశించగలగడం. ఉదాహరణకు మీరు ఈ గదిలో దీపం వెలిగిస్తే, దాని నుండి వెలువడే కాంతి అన్ని మూలలకు వ్యాప్తి చెందు తుంది. ఇక రెండవ ధర్మం (2) అవిచ్ఛిన్నత (Continuity) నిరంతరమైన కదలికలు లేదా కంపనాలు లేకపోతే ఒక తరంగం ఉత్పన్నం కాదు.

అంటే సర్వ వ్యాపకత్వం, అవిచ్ఛిన్నత ధర్మాల ఆధారంగా ఒకే తరంగం ఒకే సమయంలో ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాలలో ఉండగలదు. దీని విపర్యయం కూడా సాధ్యమే. అనగా ఒకే సమయంలో ఒకే ప్రదేశంలో ఒకటి కంటే ఎక్కువ తరంగాలు ఉండటంకూడా సాధ్యమే. దీనినే అధ్యారోపణ నియమము (Principle of Super position)

అంటారు. ఈ Principle of Super position కణాలకు సాధ్యం కాదు. కేవలం తరంగాలకు మాత్రమే సాధ్యం.

ఇంతటి వైరుధ్యం ఉన్నది కాబట్టి కాంతికి తరంగ స్వభావమా? లేక కణ స్వభావమా? అనే చర్చ అప్పటి వైజ్ఞానికులను వేధించింది. దానికి సమాధానంగా, కాంతి-విద్యుత్ ఫలితానికి ఐన్‌స్టీన్ ఇచ్చిన వివరణ, ఆయనకు 1921లో భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతిని తెచ్చి పెట్టింది.

ఐన్‌స్టీన్ వివరణ ప్రకారం, అవిచ్ఛిన్నము (Continuous), సర్వవ్యాపకము (Spreding every where) అయిన కాంతి తరంగం, పదార్థంతో చర్యనొందే టప్పుడు, శక్తి పాకెట్‌లు అయిన ఫోటానులుగా, స్థానీక రించబడి కణ స్వభావాన్ని పొందుతుంది. కణ స్వభావం పొందిన ఈ ఫోటాన్లు, పదార్ధంలోని ఎలక్ట్రాన్లతో తాడనం చెంది, ఎలక్ట్రాన్లచే శోషించబడతాయి. ఎలక్ట్రాన్లచే శోషించబడిన ఈ ఫోటాన్లశక్తి, వాటి గతిజశక్తి (KinetiC energy) గా మారి, కేంద్రక బంధక శక్తి నుండి ఎలక్ట్రాన్లను బయటకు స్వేచ్ఛా ఎలక్ట్రాన్లుగా తీసుకవస్తాయి. ఫోటాన్లశక్తి చే బయటకు వచ్చిన ఈ ఎలక్ట్రాన్లను ఫోటో ఎలక్ట్రాన్‌లని, ఈ చర్యని ఫోటో-విద్యుత్ ఫలితం అని అంటారు.

కాంతి విద్యుత్ ఫలితాన్ని భారతీయ తాత్వికతకు అన్వయించుకుంటే అన్ని సమయాలలో అన్ని చోట్ల ఉండగలిగిన పరమాత్మను తరంగ స్వభావంగాను, ఒక సమయంలో ఒక చోట మాత్రమే ఉండగలిగిన మనిషిని కణ స్వభావంగాను భావించవచ్చు. సర్వ వ్యాపకము, అవిచ్ఛిన్నము లక్షణాలుగా గల తరంగ స్వభావమైన పరమాత్మ - కణ స్వభావం కలిగిన ప్రకృతితోనో, మనుష్యులతోనో చర్య నొందేటప్పుడు, తన సర్వ వ్యాపకత, అవిచ్ఛిన్నత లక్షణాలను వదులుకొని స్థానీక రించబడి (Localised) నప్పుడు మాత్రమే చర్య జరప గలడు. దీనినే అవతారము అని అంటారు. భగవద్గీత లోని శ్లోకాల ఆధారంగా రూప, నామ రహితుడైన పరమాత్మ సృష్టి కార్యంలో పకృతిలోని పదార్థంగానూ లేక ప్రకృతి ధర్మాలకి (Laws of nature) గ్లాని కలిగి నప్పుడు దానిని తొలగించ గలిగిన జీవుల రూపంలోకి అవతరిస్తాడు. అనగా ఎలాగైతే కాంతి యొక్క ద్విస్వభావం (Dual nature) లో కాంతి తరంగ స్వభావాన్ని మరియు కణ స్వభావన్ని కలిగి ఉంటుందో, అలాగే, శుద్ధ చైతన్య స్వరూపమైన పరమాత్మ, ప్రకృతిగాను, ప్రకృతిలోని ఏ జీవరాశిగానైనా అవతరించగలడు. అలాగే ఒక మనిషి తన దేశ కాలమాన పరిస్థితులను అధిగమించి విశ్వ శ్రేయోదాయకమైన ఆచరణ, ఆలోచన చేయగలిగితే ఆవ్యక్తిని దైవం అంటారు. భగవంతుడు-మానవుడుగా అవతరించడం, మానవుడు భగవంతుడుగా ఎదగడం కేవలం భారతీయ తాత్వికత పురాణాలలో మాత్రమే దర్శించదగ్గ విషయం.

## కాల వ్యాకోచం - భారతీయ కాల ప్రమాణం :

ఐన్‌స్టీన్ మరియొక గొప్ప ఆవిష్కరణ "కాలవ్యాకోచం" (Time dilation) ఐన్‌స్టీన్ సాపేక్షతా సిద్ధాంతం ప్రకారం ప్రతి భౌతికరాశి సాపేక్షం. అనగా ఆ భౌతిక రాశి విలువను అటువంటిదే ఇంకోకవస్తువు యొక్క అదేభౌతికరాశితో పోల్చి మాత్రమే చెప్పగలం. దేనితో పోల్చకుండా ఏ భౌతిక రాశిని కొలవలేము. ఉదాహరణకు నా బరువు 60 కిలోలు అంటే, నా బరువును ఒక కిలోరాయి బరువుతో పోల్చి నప్పుడు 60 రెట్లు ఉన్నది అని అర్థం. ఒక వేళ నా బరువును అరకిలో రాయితో పోలిస్తే నా బరువు 120 రెట్లు అవుతుంది. అంటే పోల్చేవస్తువు మారితే ఆ భౌతిక రాశి విలువ మారుతుంది. దీనినే సాపేక్షతా సిద్ధాంతం అంటారు.

ఐన్‌స్టీన్ సాపేక్షతా సిద్ధాంతం ప్రకారం కాలం కూడా ఒక సాపేక్ష భౌతికరాశి. స్థానం, పరిశీలకుడు మారేకొలది కాలం విలువ మారుతుంది. మన భూమి మీద 1 సంవత్సరం అంటే 365 రోజులు అని తెలుసు. ఈ కాల ప్రమాణాన్ని ఎలా నిర్వచించారు అంటే భూగ్రహం, సూర్యుడు చుట్టూ ఒక సారి తిరగడానికి పట్టే సమయం. ఇదే విధంగా బుధ గ్రహం సూర్యుడు చుట్టూ ఒకసారి తిరగడానికి కేవలం 88 రోజులు మాత్రమే సమయం పడుతుంది. అంటే బుధ గ్రహం మీద సంవత్సరం అంటే

కేవలం 88 రోజులు మాత్రమే. దీనికి కారణం భూమితో పోల్చినప్పుడు బుధ గ్రహం సూర్యునికి దగ్గరగా ఉండటం వలన దానివేగం ఎక్కువగా ఉంటుంది మరియు ప్రయాణించ వలసిన దూరం తక్కువగా ఉంటుంది. ఇప్పుడు భూమి మీద బుధ గ్రహం మీద ఇద్దరు పిల్లలు ఒకేసారి పుట్టారు అనుకుంటే భూమిమీద ఉన్న పిల్లవాడికి 25 సంవత్సరాల వయస్సు వచ్చేసరికి బుధ గ్రహం మీద పిల్లవానికి 104 సంవత్సరాలు వయస్సు వస్తుంది. అంటే బుధ గ్రహం మీద ఉన్న పిల్లవానికి అప్పటికే పిల్లలు, మనవళ్లు, మనవరాళ్లు పుట్టి ఈపాటికే అతను ముసలి వాడై చనిపోయి కూడా ఉండవచ్చును.

ఇదేవిధంగా సూర్యుని నుండి భూమికన్నా దూరంగా ఉన్న నెప్ట్యూన్ వంటి గ్రహంలో అదేసమయంలో పుట్టిన పిల్లవాడు ఇంకా అమ్మ దగ్గర పాలు తాగుతున్న రోజుల పిల్లవాడుగా ఉండవచ్చు. అంటే స్థానం మారేకొలది అంటే మన సామాన్య పరిభాషలో లోకం మారే కోలది, వారి జీవన, ఆయు: ప్రమాణం మారవచ్చు. దీనినే కాల వ్యాకోచము అని అంటారు. ఒక వస్తువు యొక్క వేగం మారే కొలది ఆ కణం యొక్క జీవితకాలం ఎలా మారుతుందో ఐన్‌స్టీన్ ఈ సిద్ధాంతం ద్వారా గణితాత్మకంగా వివరించారు. ఈ విషయం ప్రయోగశాలలో కూడా నిరూపితం అయింది. కణ భౌతికశాస్త్రంలో అత్యల్ప జీవిత కాలం గల పై-మీసాన్, $\mu$-మీసాన్, పాజిట్రాన్ వంటి కణాలను Particle accelerateరల సహాయంతో వాటి వేగం పెంచటం ద్వారా వాటి జీవిత కాలాన్ని పెంచ గలిగారు. దీనివలన ఆకణాల యొక్క లక్షణాలు ధర్మాలు తెలుసుకోగలుగుతున్నాము. వీటి సహాయంతో విశ్వ ఆవిర్భావము, కృష్ణ బిలాలు (Black holes), Anti Matter వంటి విషయాల పై పరిశోధించగలుగుతున్నారు.

భారతీయ తాత్వికతలో కాలవ్యాకోచ భావనలు చాలా స్పష్టంగా ఉన్నాయి. భూమి మీద మరణించిన వారు పితృలోకానికి చేరుతారట, ఈ పితృలోకం భూమికి పైన ఉంటుందట. పితృలోకంలో ఒక రోజు అయితే భూమి మీద ఒక సంవత్సరం అవుతుంది.అందువలన పితృలోకంలో ఉన్న పితరులకు ప్రతిరోజు ఆహారం పెట్టాలంటే, భూలోకంలో సంవత్సరానికి ఒకసారి ఆహారం పెడితేచాలు. అందువలనే భారతీయులకు సంవత్సరీకం, అబ్దికం పేరుతో ప్రతి సంవత్సరం పితరులని స్మరించుకునే ఆచారం వచ్చింది. ఈ పితృలోకానికి పైన దేవలోకం దానికి పైన బ్రహ్మలోకం ఉన్నాయట. అందువలనే భూమిపైన 4 యుగాల (కృత, త్రేతా, ద్వాపర, కలి) కాలం బ్రహ్మకు ఒక పగలు. అలాగే బ్రహ్మకు అనేక యుగాల కాలం, బ్రహ్మలోకం పైన ఉన్న విష్ణులోకంలో ఒక పగలుకు సమానం అట. ఆ విష్ణులోకం పైన శివలోకం ఉంటుందట. భారతీయ తాత్వికతలోని ఈ కాలవిభజన , ఐన్‌స్టీన్ గారి కాలం యొక్క సాపేక్షతా సిద్ధాంతానికి అనురూపంగా ఉంది. ఈ కాల సాపేక్షతా సిద్ధాంతం ఆధారంగా ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన" కాలంలోకి ప్రయాణించే యంత్రం" Time Machine భావన భారతీయ పురాణాలలో చాలాచోట్ల గమనించవచ్చు.

**ముగింపు :**

భారతీయ తాత్వికతకు, ఐన్‌స్టీన్ పరిశోధనలకు ఉన్న ఇలాంటి సారూప్యతల వలన భారతీయ తాత్వికతకు ప్రతి రూపాలయిన భగవద్గీత, వేదాలపట్ల ఐన్‌స్టీన్‌కు గొప్ప ఆరాధనా భావం. ఐన్‌స్టీన్ ప్రత్యక్షంగా భారతదేశాన్ని సందర్శించకపోయినా, నాటి భారతీయ తాత్వికులయిన మహాత్మాగాంధి, రవీంద్రనాథ్ ఠాగూర్, సత్యేంద్రనాథ్ బోస్‌వంటి వారితో ఆయనకు మంచి అనుబంధం ఉంది. Photo Electric Effect వివరణకు నోబెల్ బహుమతి వచ్చి 100 సంవత్సరాలయిన - ఈ శతదినోత్సవ వేడుకల సందర్భంగా, ఐన్‌స్టీన్ సిద్ధాంతాలు గుర్తు చేసుకుంటూ అవి భౌతికశాస్త్రంలో ఆయన విజ్ఞానానికి గుర్తింపుగానే కాక, భారతీయ తాత్వికతకు సైద్ధాంతిక నిరూపణగా తెలియచేస్తూ మనదేశ సైన్స్ విజ్ఞానానికి పతాకాలుగా గుర్తు చేసుకుందాము. భారతీయ తాత్విక

గ్రంథాలు, ఐన్‌స్టీన్ ఆవిష్కరణలూ సైన్స్ విద్యార్థులకు నిరంతర ప్రేరణగా నిలుస్తూ ఉండాలని తద్వారా భారతీయ వైజ్ఞానిక రంగం మరింతపరిపక్వమవ్వాలనీ ఆకాంక్షిద్దాం.

**ఆధార గ్రంథాలు :**

1. Relativity : the special and the general theory by Einstein
2. World as I see it by Einstein
3. Out of Later years by Einstein
4. భగవద్గీత
5. ఒక యోగి ఆత్మకథ - పరమహంస యోగానంద
6. దాశరథి రంగాచార్య నాలుగు వేదాలు - 6 వాల్యుమ్స్

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2(1), February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# పోతులూరి వీరబ్రహ్మం కవిత్వం - విశ్వదార్శనికత

- డా॥. పి. విజయకుమార్, తెలుగుశాఖాధ్యక్షులు, ఎస్.ఎమ్.ఎల్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎమ్మిగనూరు.

మనిషి సన్మార్గాన్ని బట్టి, చేసిన సేవలను బట్టి, మహిమలను బట్టి, మహాత్ములుగా పరిగణించబడ్డారు. 'దైవంమానుషరూపేణ' అన్న సుభాషితం బట్టి మనిషి, మనీషిగా, దైవంగా పరిణమించడం కాలక్రమంలో ఒక పరిణామక్రమాన్ని మనం గమనిస్తున్నాం. వారినే అవతార పురుషులుగా కీర్తిస్తున్నాం. మనమధ్యన నాలుగు శతాబ్దాల క్రితం జన్మించి మానవుల ఉత్తమజీవనగమ్యాన్ని తాత్త్వికకోణంలో ప్రచారం చేసిన కర్మయోగి 'శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి'. అవధూతలు, స్వాములు, బాబాలు దేవుళ్ళుగా సజీవకీర్తిని పొందుతున్న వైనాన్ని మనం చూస్తూనే ఉన్నాం. దక్షిణాది రాష్ట్రాల ప్రజలు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని దైవంగా ఆరాధిస్తూనే ఉన్నారు. బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు నేటికీ జరుగుతూనే ఉన్నాయి. కడపజిల్లా కంది మల్లయ్యపల్లె బ్రహ్మంగారి మఠానికి భక్తులు కోకొల్లలుగా వస్తూనే ఉంటారు. బ్రహ్మంగారి కాలజ్ఞానం చాలా విశిష్టమైనది. ఎన్నో సత్యాలను ఆవిష్కరించారు. నేటికీ వారి కాలజ్ఞానంలో చెప్పిన విషయాలు నిరూపితమవుతూనే ఉన్నాయి. బ్రహ్మంగారు ఎన్నో రచనలు చేశారు. వాటిలో చెప్పుకోదగినవి చూద్దాం. సామాజిక ఉద్యమానికి ఆధ్యాత్మికరూపాలుగా బ్రహ్మంగారి రచనలు దర్శనమిస్తున్నాయి.

1. వచన కాలజ్ఞానం; కొంత ద్విపదకాలజ్ఞానం
2. గోవిందవాక్యాలు
3. హంసకాళికాంబా శతకం
4. ప్రజల నాల్కలపై నానుతున్న తత్వాలు
5. జీవైక్యబోధ
6. వీరకాళికాంబా శతకం (సిద్ధప్ప వచనాలనే పేరుతో కనిపిస్తుంది)
7. సిద్ధబోధ
8. ఇంగ్లీషులో జుజూఅర్ శ్రీవం అనబడే 'సౌజన్యపత్రికలు'

బ్రహ్మంగారు, కవి అంటే ఎవరో, కవిత అంటే ఏంటో, కవిత్వ పరమార్థం ఏంటో తెలియజేసి, కలం పట్టిన వారంతా కవులుకాదని రచయితల్ని హెచ్చరించారు.

కవితాకన్యకనెరుగక
కవియగునా? గురులకన్న కవి తానౌనా?
కవితను కాననివారలు
కవులే ? కవి నేర్పులకెల్ల కాళికె సిద్ధా!

కవితాకన్యక ఎరుగకుండా ఎవరన్నా కవి అవుతారా? అని ప్రశ్నిస్తాడు. కవులంటే గురువులే అంటాడు. కవిత్వం చెప్పగలిగినవారు గురుస్థానంలో ఉండాలంటాడు. ఎదుటివారిని ఒప్పించి, శాసించే స్థాయిలో ఉపదేశించ గలిగి ఉంటేనే అదే నిజమైన కవిత. అలాంటివారే నిజమైన కవులు అనే భావన వీరబ్రహ్మంగారు వ్యక్తం చేశారు.

"కవి నిబద్ధతకును కన్నులు సాక్షియా
వారినిబద్ధతకు పరులు సాక్షి
ధర్మబద్ధతకును దైవము సాక్షియౌ
తమ నిబద్ధిసాక్షి ధరణి సిద్ధా !"

వీరబ్రహ్మంగారిలో ఊహించడం, పొగడటం కవిత్వం కాదనే భావన వ్యక్తమవుతుంది. తాను స్వయంగా కన్నులు సాక్షిగా చూసిందే రాయాలని, నిబద్ధతకు విన్నవారే సాక్షిగా ఉండాలని పిలుపునిచ్చారు. చూసిన దానికి, మాట్లాడిన దానికి భౌతిక ప్రపంచం సాక్షిగా ఉంటుందని పేర్కొన్నారు. ధర్మనిబద్ధతకు దైవమే సాక్షిగా ఉంటుందని, అన్నింటికి భూమే సాక్షిగా ఉంటుందని పేర్కొన్నారు.

పట్టులేని కవిత భజియింపరాదంటారు పోతులూరి వీరబ్రహ్మం. దివ్యగురువు పదము పట్టేదే నిజమైన కవిత

అంటారు. కవిత్వానికి లక్ష్యం కూడా వీరబ్రహ్మం గారు నిర్దేశించారు. తీవ్రంగా ఆలోచింపజేసి పరిష్కారానికి గురువు వైపు మానవుణ్ణి నెట్టగలిగేదే అసలైన కవిత అంటారు. మన రచనల ద్వారా ప్రజల్ని జ్ఞానమార్గంలో పయనింపజేయాలన్నదే వీరబ్రహ్మంగారి సంకల్పం. కవి నిజాయితీగా ఉండి రాసే కవిత్వమంతా వాస్తవానికి కంకణబద్ధమై ఉండాలని ఉద్బోధించారు. కవిసూత్రం రెండు గతుల్లో ఉంటుందంటారు వీరబ్రహ్మంగారు. 1. ద్రవియించెడు కవిత, 2. ధన్యత చెందే కవిత. కాలంతోపాటు కరిగిపోయే కవిత ద్రవియించెడు కవిత అని ప్రజలకు ఉపయుక్తమయ్యే కవిత ధన్యతచెందిన కవిత అని ఉద్ఘాటించారు. కవుల్లో కూడా రెండు రకాల కవులున్నారు అంటారు. ఒకరు 'జ్ఞానకవులు' మరొకరు 'నేర్పుకవులు'. భక్తి మార్గాన్ని చూపించి, మోక్షానికి దారి చూపేవారు జ్ఞానకవులని, బ్రతుకనేర్పిన వారు నేర్పుకవులని వీరబ్రహ్మం గారు వెలిబుచ్చారు. కవికి, కవిత్వానికి ఉండే సామాజిక బాధ్యతను కూడా వ్యక్తం చేశారు. ఆధ్యాత్మికవిద్యే కాకుండా, సామాజిక కర్తవ్య బాధ్యతను కూడా తన వాక్కులలో ప్రతిఫలింపజేశారు. కుకవిత్వం రాయనే రాయకూడదని కుకవులని హెచ్చరించిన వైనాన్ని పరిశీలిద్దాం.

"దబ్బర కవులకు నరకపు
దిబ్బను యమధర్మరాజు దెబ్బలు నిజమౌ
యబ్బరపు కవులు వారే
మబ్బున బడినారుగనకు మాయరసిద్ధా !"

సమాజశ్రేయస్సు కంటే వ్యక్తిగత శ్రేయస్సే కీలకంగా భావించే కవులకు హెచ్చరిక చేస్తూ వారి విశ్వాసాల ఆధారంగా యముని దెబ్బలు తప్పవంటారు. రచయిత నిబద్ధతో సామాజిక శ్రేయస్సునుకోరి రచనలు చేయాలంటారు.

"కవితకెల్ల అమృతగణములు పడవలె
విసపువాక్కు కవిత వ్యసనమగును
వ్యసనమైన కవిత రసికులు మెత్తురా?
పసయులేని రుచుల పగిది సిద్ధా!"

కవితకి అమృతగణాలు పడవలెనుగాని విషపుగణాలు వేసి కవితలు రాయకూడదంటారు. వ్యసనమైన కవితను రసికులు మెచ్చుతారా అంటారు.

ఛందము చదివిన కవులకు
నిందలు లేవంతెకాని నిపుణత కలదే ?
కొందరె ఈవులనిత్తురు
కొందరు ఈవియ్యకుండు కుమతులు సిద్ధా !

నైపుణ్యం లేకుండా కొందరు ఛందంలో రాసినా అది కవిత్వం కాదని స్పష్టం చేశారు.

కవులకు ఈవులనిచ్చుట
నవతా ధర్మమ్ము నిచ్చు నన్నెన్నరహో
రవకవులకు రసకవులకు
నవనవగా నిచ్చి పంపు జాణను సిద్ధా!

దానమివ్వడం అంటే ధనకనకాది వస్తువులుకాదని నవతాధర్మాన్నివ్వడం అంటారు ఇలా వీరబ్రహ్మం కవితా ధర్మాన్ని సమాజశ్రేయస్సులో దృష్టిలో ఉంచుకొని ఉన్నతభావాలను బలంగా వక్కాణించారు. కవిగా, గురువుగా, యోగిగా, సంస్కర్తగా నాలుగు కోణాలు కలిసిన ఏకైక రూపంగా విశ్వజనీనుడిగా వీరబ్రహ్మంగారు దర్శన మిస్తారు.

విశ్వజనీనకవి వీరబ్రహ్మం. తమ కాలానికన్నా ముందు నడచిన కర్మయోగి వీరబ్రహ్మం. సాంఘిక, ఆధ్యాత్మిక రంగాలలో ఆధిపత్యాన్ని ధ్వంసంచేసి, మన సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల, మతమౌఢ్యాన్ని కడిగిపారేసిన దార్శ నికుడు వీరబ్రహ్మం.

కులము కులమటంచు గొణిగెడి పెద్దలు
చూడరైరి తొల్లి జాడలెల్ల
మునుల పుట్టువులకు మూలమ్ము లేదంద్రు
కాళికాంబ! హంస! కాళికాంబ.

కులము పేరు చెప్పి పబ్బం గడిపే పెద్దలను ప్రశ్నించాడు. మునుల పుట్టుకకు మూలము లేదంటారు. వీర

బ్రహ్మం ఈ కులం ఎలా వచ్చిందో, ఎలా సృష్టించబడిందో వివేచించాలంటారు.

"మతకర్తలెల్ల దుర్మానమ్ముహీనమ్ము
చాటించి ద్వేషముల్ చాటునాడు
అంగనామణుల స్వేచ్ఛను గంగపాల్సేయు
మాతృవిద్రోహాలు మనలునాడు
తలయెత్తలేని జాతులు విద్యయే లేక
మొఱకుందనమ్ముతో మనలునాడు
పరదాస్యభావబంధుర వినీలాబ్దముల్
చెలరేగి చీకట్లు జిమ్మునాడు
సంఘ సంస్కృతి స్వేచ్ఛ విజ్ఞాన శోభ
లల్లుకున్న మల్లెమొగ్గ పందిళ్ళు వెట్టు
నీ మహాకార్యముల్ నిల్చుచరా ! మహాత్మా
వీర గురువర్య ! మా నమస్కారమార్య"

అని కొండవీటి వేంకటకవి పోతూలూరి వీరబ్రహ్మం గారి గురించి ఉటంకించిన పద్యాన్ని పరిశీలిస్తే తెలుగు సాహితీపుటల్లో చిరస్మరణీయు విశ్వజనీనకవిగా వీరబ్రహ్మం గారిని పేర్కొనాలి.

**ఉపయుక్తగ్రంథాలు :**

1. కర్మయోగి వీరబ్రహ్మం - ఆచార్య ఎన్. గోపి.
2. వీరబ్రహ్మం కవిత్వం : కవిత్వాంశాలు (సం) - ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి.
3. వీరబ్రహ్మం రచనలు సామాజికస్పృహ - డా॥ మూల మల్లికార్జునరెడ్డి.
4. సామాజిక విప్లవకారుడు పోతులూరి వీరబ్రహ్మం (సం) - ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి.

★★★

# రంగినేని సుబ్రహ్మణ్యం సాహిత్యం - పరిచయం

- కె. ఎల్లప్ప , పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా.

తెలుగు సాహిత్యంలో తెలంగాణ కవులకి, కళాకారులకి ఒక ప్రత్యేకమైన స్థానం కలదు. తెలంగాణలో కవులు లేరని కొందరంటే దానికి ధీటుగా సురవరం ప్రతాపరెడ్డి "గోలకొండ కవుల సంచిక"లో దాదాపుగా 354 మంది తెలంగాణ కవులు గలరని నిరూపించారు. బిరుదురాజు రామరాజుగారు కూడ "విస్మృత కవులు" అన్న పేరుతో తెలుగు సాహిత్యం గుర్తించని కవులను సాహిత్య లోకానికి పరిచయం చేశారు. ఆచార్య ఎస్వీ. రామారావుగారు కూడా తెలంగాణాలో గల విస్మృత కవులను వెలికితీసి "తెలంగాణ సాహిత్య చరిత్ర"ను వెలువరించారు. అలాగే "పాలమూరు జిల్లా కవుల చరిత్ర"ను కూడా పుస్తక రూపంలోకి తీసుకు వచ్చారు. తెలుగు సాహిత్యంలో అలాగే తెలంగాణ సాహిత్యంలో జాతిని మేల్కొలిపిన తెలుగు కవులు ఎందరో కలరు. అందులో పాలమూరు జిల్లా కవులకు పుట్టినిల్లు అని చెప్పవచ్చు. ప్రాచీన నుంచి నేటి వరకు ఎందరో కవులు తమ రచనల ద్వారా వివిధ ప్రక్రియలలో తమ తమ శైలిలో రచనలను సమాజానికి అందించారు. అయితే కొందరు కవులు సమాజానికి పరిచయం అయితే మరికొందరు కవులు సాహిత్య లోకానికి పరిచయం కాకుండా తెర వెనుకనే మిగిలిపోయారు. ఇలాంటి కవులను నేటి సాహిత్య క్షేత్రానికి అందించడం నేటి పరిశోధకుల బాధ్యత అని చెప్పవచ్చు. నేను ఈ వ్యాసంలో పాలమూరు జిల్లా కొల్లాపూర్ ప్రాంతానికి చెందిన శ్రీ రంగినేని సుబ్రహ్మణ్యం గారిని అతని సాహిత్యాన్ని పరిచయం చయడానికి ప్రయత్నిస్తాను. రంగినేని సుబ్రహ్మణ్యంగారి రచనలు చదివాక అతనిని సాహిత్య లోకానికి పరిచయం చేయాలని నాకు అనిపించింది.

**రంగినేని పరిచయం :**

రంగినేని సుబ్రహ్మణ్యంగారు 1950 ఆగస్టు 26న ఉమ్మడి పాలమూరు జిల్లా కొల్లాపూర్‌లో జన్మించారు. ఇతని తల్లిదండ్రులు రంగినేని లక్ష్మీదేవమ్మ, తండ్రి రంగినేని రాజన్న. వీరిది కడు పేద కుటుంబం వీరికి పెద్ద కుమారుడిగా రంగినేని సుబ్రహ్మణ్యం జన్మించారు. ఇతని భార్య రంగినేని శారదమ్మ. ఇతనికి ఇద్దరు కుమారులు కలరు. వృత్తిపరంగా ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండితుడిగా పనిచేశారు. దురదృష్టం ఏమిటంటే ఇతను కేవలం 29 సంవత్సరాలు మాత్రమే జీవించారు. ఈ కొద్ది రోజుల్లోనే రచనలు చేశారు. కొన్ని రచనలు వచ్చాయి. ఈయన అనతికాలంలోనే తనకు తెలుగు సాహిత్యంపైన గల అభిమానంతో కొన్ని రచనలు చేశారు.

**రంగినేని రచనలు :**

రంగినేని గారు జీవించింది కొన్ని రోజులైనా జాతి గుర్తించదగ్గ రచనలు చేశారు. ఇతనివి ఐదారు రచనలు మనకు లభిస్తున్నాయి. వీరి సోదరుడు రంగినేని మన్మోహన్ ఈ పుస్తకాలను అన్నపై అభిమానంతో వెలుగులోకి తీసుకొచ్చారు. 1. సిత పుష్పమాల 2. జీవనహేల 3. మనసు గీసిన చిత్రాలు 4. తూర్పు కన్నెర్ర చేస్తే 5. మృగకృష్ణ నవల ఇది అముద్రితం 6. ఆక్రందన కవితా సంపుటి 7. నవమౌక్తికం అనే కవితా సంపుటికి వంశీ ఆర్ట్థియేటర్స్ వారి ద్వితీయ బహుమతి లభించింది. వీరి కలం పేరు "అంజలి".

**సిత పుష్పమాల :**

ఇది భావ కవిత్వ రచన. రంగినేని సుబ్రమణ్యంగారు భావ కవిత్వంలో ఆత్మాశ్రేయ రీతిలో కవిత్వాన్ని మనసుతో ఆస్వాదిస్తూ చెప్పారు. ఈ కావ్యాన్ని తన మాతృమూర్తికి అంకితమిచ్చారు. ఈ కావ్యంలో రంగినేని గారు తెలుగుదనం ఉట్టిపడే కవిత్వాన్ని, పదజాలాన్ని ఇందులో ప్రయోగించారు. మనిషి అనే భావ కవిత

గీతిలో మనిషికి మానవత్వం, ధర్మం, సత్యం ఉండాలని చాటారు. (పుట సంఖ్య. 43, సిత పుష్పమాల)

"మనిషి అనే శిల్పానికి
మానవత్వముంటేనే
జీవమున్న మనసు గల
మనిషిగా రాణిస్తాడు"

ఈ కవిత్వ పాదాలను చదివిన తర్వాత వివేకానంద, గురజాడ అపారావుగారు లాంటి మహనీయులు మనకు గుర్తుకొస్తారు. మానవతావాదంతో ఈ కవిత్వాన్ని మన కళ్ళ ముందు రంగినేని గారు ఉంచారు. చిననత్నంలోనే ప్రజా శ్రేయస్సు కాంక్షించి, మానవతావాదిగా "మానవ సేవయే మాధవసేవ" అనే నినాదాన్ని రంగినేని గుర్తు చేశారు. రంగినేనిగారి కవిత్వంలో తిలక్ మానవతావాదం దర్శనమిస్తుంది. తిలక్‌లోని మానవతావాద భావాలు రంగినేనివారి రచనలో మనకు కన్పిస్తున్నాయి. మచ్చుకు ఒక కవిత్వం.

"మనిషి మంచివాడైతే
మమతా హృదయం వుంటే
మల్లెపూల సౌరభాల
మురిపించును ఇల లోపల"

మానవులకు ఎప్పుడైతే మమతానురాగాలు, మంచి హృదయం ఉంటుందో అతన్ని ఏ విధంగానైనా ఇష్ట పడుతారు. అది ఎట్లా అంటే మల్లెపువ్వు ఇతరులను ఆకర్షించినట్టు. ఇక్కడ గురజాడ అప్పారావుగారి కవిత్వము కానులు గుర్తుకొస్తుంది. "ప్రేమ నిచ్చిన ప్రేమ వచ్చును"....

"మనసులో నిండాలి స్నేహం
హృదిలో ఉండాలి కరుణ
ఎదలో ఉండాలి దయలు
ఏరు కోవాలి సద్గుణ శ్రీలు"

ఈ కవిత్వంలో కవి అంత్యానుప్రాస, మధ్యానుప్రాస ఎక్కువగా ప్రయోగించారు. నారాయణరెడ్డిగారి కవిత్వం ఇక్కడ మనకు గుర్తుకొస్తుంది. రంగినేనిగారి రచనలో పదాల శైలి గాన యోగ్యంగా చెవులకింపుగా ఉంటుంది. మనిషికి కావలసింది స్నేహం, కరుణ, జాలి, దయ ఉంటే ఎప్పుడైనా కీర్తించబడతాడని కవి

ఉద్దేశం. "దివ్య" అనే కవితలో యువతను ఉద్దేశించి రంగినేనిగారు ఈ విధంగా చెప్పారు.

"తమ్ముడా! ఓ తమ్ముడా
దారి తప్పకు తమ్ముడా
చిత్రమైనది బ్రహ్మ సృష్టి
చిన్నలున్నవి వన్నెలున్నవి
బందీవై పడిపోకుము
బాధ్యతలను మరువకుమూ
వనిత పరిష్వంగమున్నా
మునిగి ......మందుడవు గాకుము
పరుల సొత్తుకాశపడకు
స్వార్థమునకు లొంగిపోకు
కుటిల కుత్సితాల వలచి
కుహనా పథమునబోకుము"

యువత నేడు దారి తప్పుతుంది. యువతను దారితప్ప వద్దని కవి ఈ కవిత్వం ద్వారా చెప్పారు. స్త్రీ వ్యామోహంలో పడి జీవితాన్ని నాశనం చేసుకోరాదని, తమ బాధ్యతను మరువద్దని యువతకు రంగినేనిగారు ఉపదేశించారు.

**మనసు గీసిన చిత్రాలు :**

ఇది కూడా భావకవిత్వ కోవకు చెందిన రచన. ఈ కావ్యాన్ని రంగినేని సుబ్రహ్మణ్యం గారు కొత్త వెంకటేశ్వర రావు గారికి అంకితమిచ్చారు. ఈ కావ్యంలోని కవితలు జ్యోతి, భారతి, స్రవంతి, ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి మొదలగు పత్రికలో అచ్చయ్యాయి. ఈ కావ్యంలోని కవిత్వాలూ సంగీతంతో పాడుకోవడానికి అనువుగా ఉంటాయి. కొన్నిటిని లలిత గేయాలుగా స్వీకరించి, కమ్మని సంగీత స్వరాలతో మేళవించి ఆ రోజులలో ఆకాశవాణి

వారు స్వరపరిచి నిర్వహించారు. ఈ కావ్యానికి ఆనాడు మహానుభావులైన పండితులు తమ అభిప్రాయాన్ని ముందుమాటలో పేర్కొన్నారు. వారిలో ముఖ్యులు డా॥ సి. నారాయణరెడ్డి, ముకురాలరామారెడ్డి, తిరుమల శ్రీనివాసాచార్యులు, ఎల్లూరి శివారెడ్డి, కసిరెడ్డి వెంకటరెడ్డి మొదలగువారు ఈ కావ్యాన్ని చదివి హృదయపూర్వకంగా ఈ కవిగారిని ప్రశంసించారు. అంటే ఈ కవిత యొక్క గొప్పతనం ఏమిటో చెప్పవచ్చును.

ఈ కావ్యంలో "దివ్య దర్శనం" అనే కవిత్వాన్ని పరిశీలిస్తాను. (పుట సంఖ్య 16- మనసు గీసిన చిత్రాలు)

"మనిషి కథ పాడుతా
మమత నిల నిలుపుతా!
విశ్వైక ప్రేమనే వెలయించి సాగుతాయి..........."

కవి విశ్వైక ప్రేమను చాటారు. మనము ఇతరులను ప్రేమిస్తే ఇతరులు మనల్ని ప్రేమిస్తారు అన్న గురజాడ అప్పారావుగారి కవిత్వం ఇక్కడ గుర్తుకొస్తుంది.

"చీకటి బ్రతుకన దివ్వెగ
ఆకలి గుండెల కండగా
దివ్యదర్శమునై భూమిని
ముందు కురుగుతా!"

పై కవిత్వంలో కవి విశ్వశ్రేయస్సును కాంక్షించారు. ఇందులో మానవతావాదిగా కవి కవిపిస్తాడు.

"అవమానమపజయము
లను లెక్క సేయకను
అనురాగ పథ విజయ
మనవిలో చాటుతా......" అంటూ ఎన్ని అవమానాలు అయినా సరే నేను విజయాన్ని సాధిస్తాను అంటూ ఆత్మవిశ్వాసాన్ని రంగినేనిగారు ఈ కవిత్వంలో ప్రకటించారు.

**మానవ గీతం :**

మానవ గీతం అనే కవితలో మానవుడు మాధవుడిగా మారే విషయాలను కవి చెప్పారు.

"మాధవుడందించిన
మమతా స్పందనకు ప్రతీకలు కుసుమాలు
కుసుమించిన హృదయాలకు
వైజయంతికలు సుమాలు.
మనిషి దిద్దవలసిన శ్రీకారం
మనిషి చదవలవలసిన పాఠం
మనిషి మరో మనిషికి
నేర్పవలసిన మనవతా గీతం.
మానవుడిలోని దానవుడు తొలగి
మహిలో మానవుడే మాధవుడౌవుతాడు
మాధవుడైతేనే మహిళలో
మనిషికి సార్థకత"

(మనసు గీసిన చిత్రం - మానవ గీతం పుట సంఖ్య. 18)

ఈ కవిత్వంలో రంగనేనిగారు మనిషిలోని రాక్షసుడు తొలగిపోతే మాధవుడు అవుతాడు. అనగా క్రోధం, కోపం, ఈర్ష్యా మొదలగు గుణాలు తొలగిపోయి జాలి, కరుణ అనే గుణాలు ఏర్పడితే దేవుడౌవుతాడని అర్థం. అప్పుడే మనిషి జీవితానికి సార్థకత ఉంటుంది. మనిషికి మరో మనిషి మానవత్వం నేర్పించాలి అప్పుడే ఈ లోకం శాంతంగా ఉంటుందని కవి ఉద్దేశం. ఈ కవిత్వంలో కవి యొక్క మానవతా హృదయం కనిపిస్తుంది.

తూర్పు కన్నులెర్ర చేస్తే: ఈ కావ్య సంపుటిని రంగినేని సుబ్రహ్మణ్యంగారు కీర్తిశేషులు అయిన తర్వాత అతని సోదరుడు సాహితీప్రియులు రంగినేని మోహన్‌గారు అచ్చు వేయించారు. ఇందులో అభ్యుదయ భావాలు కనిపిస్తున్నాయి. కవి హృదయం, కవితా హృహయం, సమాజం లోని ఆర్థిక అసమానతలు, నున్నితపు త్రాసు ఆయన హృదయం. కవి యొక్క మనో దర్పణానికి తూర్పు కన్నెర చేస్తే అను కవితా సంపుటి ప్రతిబింబం. ఇందులో 27 కవితలు గలవు.

"ఆకాశం నిద్దురలేచింది
అవన్నీ తలాన్ని తట్టిలేపింది

తమోభీసరణంలో వేగిస ధాత్రి
ఆకలి వ్యసనానికి ఆత్ర పడుతోంది...
పగలే చుక్కలు మొలిపించే
ధసపతుల మొహర్భానీ
కీర్తించ వలసిస ధాత్రికి నోరెండి
జీరో వోయింది గొంతు.

ఆవేదస చూడలేని తూర్పు
కన్నులు కణకణ లాడించింది
భూభారాన్ని మోసేవాడి వెన్ను తట్టింది
ఎఱ్రగా మండే వ్రేళ్ళతో.....!"

ఈ కవిత్వంలో అభ్యుదయ కవిత్వం కవిపిస్తుంది. ఆకాశం నిద్ర లేపడం, ఆకలి తీర్చడానికి ఆరాట పడడం, ధసపతులసు వదిలించడం మొదలగు అంశాలు అభ్యుదయ కవిత్వ లక్షణాలుగా చెప్పవచ్చు. ఈ కవితలోని పదాల కూర్పు శైలి శ్రీశ్రీ కవిత్వాన్ని గుర్తు చేస్తుంది.

**జీవనహేల :**

ఈ గ్రంథాన్ని తస తండ్రి రంగినేని రాజన్నగారికి అంకితమిచ్చారు. ఇందులో 27 కవితలు గలవు. ఈ కావ్యాన్ని అభ్యుదయ భావాలతో రాశారు. మచ్చుకు ఒక కవిత్వంసు పరిశీలిస్తాసు. (పుట సంఖ్య -19, జీవనహేల)

"శ్రామిక" అసు కవిత్వంలో కవితా ఖండికలు.........

"ఓ శ్రామిక నీవు
ఒకసారి వెసుదిరిగి
నిసు నీవు చూసుకో
నీ శక్తి చాటుకో....

మండుటెండసు మాడి
కండలసు కరిగించి
స్వేదమ్ము పారించి
స్వీయ సుఖముసు మరిచి...

శ్రమయే నీ ప్రియురాలు
శ్రమయే నీ ఇల్లాలు
కట్టబెట్టే లేదు
పొట్టకూటికి లేదు....

ఈ కవితా ఖండికలో కవి శ్రామికుని కష్టం, మససు, తస కష్టాన్ని ఇతరుల కోసం త్యాగం చేయడం అనే వాస్తవ జీవస విధాసం వర్ణించడం జరిగింది. శ్రామికుడు శ్రమసు సమ్ముకొని బతుకుతాడు. శ్రమసు ఇష్టపడుతాడు. అతని ఇల్లు, అతని ఇల్లాలు శ్రమయే. ఒక శ్రామికుడు కష్టాన్ని మసకు సహజ సిద్ధంగా చెప్పారు.

ఈ విధంగా రంగినేని సుబ్రహ్మణ్యంగారు సితపుష్ప మాల, మససు గీసిస చిత్రంలో భావ కవిత్వాన్ని, మాసవతాద కవిత్వాన్ని వివరించారు. అలాగే తూర్పు కన్నెర్ర చేస్తే, జీవసహేలలో అభ్యుదయ కవిత్వాన్ని, శ్రామిక జీవస విధానాన్ని తస కవిత్వం ద్వారా, రచనా శిల్పాన్ని, సంగీత సమ్మేళసంతో కవిత్వాన్ని చెప్పడం జరిగింది. ఇలాంటి కవి చిన్న వయసులోనే ఈ లోకాన్ని విడిచిపెట్టి పోవడం దురదృష్టం. ఇతని గురించి పరిశోధస జరగవలసిస ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పవచ్చు. ఇతని కవిత్వాన్ని నేటి విద్యార్థులకు తెలియజేయాల్సిస బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పవచ్చుసు. విద్యార్థులకు పాఠ్యగ్రంథంగా ఏదో ఒక తరగతికి పెట్టాలని కోరుతూ ముగిస్తున్నాసు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2(1), February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# నవలా రచయిత్రి - చలసాని వసుమతి

- గుమ్మడిదల మురళీకృష్ణ , పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కృష్ణా విశ్వవిద్యాలయం- మచిలీపట్నం.

తెలుగు సాహిత్యాకాశంలో నేను సైతం రచయిత్రినే అంటూ ఎన్నో నవలలు, కథలు, వ్యాసాలు రాసిన సాహితీసుమతి చలసాని వసుమతి. సాహిత్య సృజన చేయడం దేవుడిచ్చిన వరం. సాహిత్యం మీద అభిమానం, భాషపై పట్టు, సామాజిక స్పృహ కలిగి, అమ్మలోని కమ్మదనాన్ని మనందరికీ అందించారు. ఆమె కలం నుండి జాలువారిన ప్రతివాక్యం మనల్ని మళ్లీ మళ్లీ చదివిస్తూ మృదువైన, లోతైన, ఆధునిక తెలుగు సాహిత్యాన్ని మరియు ప్రాచీనసాహిత్యాన్ని ఎంతో మనోరంజకంగా ఉంటుందనడంలో ఏ విధమైన సందేహం లేదు

**విషయ విశ్లేషణ :**

వసుమతి ప్రతి రచన అద్భుతమే. ఆమె రచనల్లో భాషా ప్రయోగం, భావవ్యక్తీకరణ మనకు ఆనందంతో కూడిన ఆశ్చర్యాన్ని కల్గిస్తాయి. ప్రతి నవలలోని ఇతివృత్తం స్త్రీ చైతన్యాన్ని, మహిళాసాధికారతను పట్టిచూపిస్తుంది. కథాకథనశైలి ఆనందానుభూతిని కల్గిస్తుంది. ఆమె కథాసంపుటి "గాజులసవ్వడి" ఎంతో ప్రాధాన్యాన్ని సంత రించుకొని ఆవిష్కృతమైనది. ప్రతి కథను ప్రేమ, స్నేహం, బాంధవ్యం, త్యాగం కర్తవ్యం, దౌర్భల్యం, విషాదం, సౌందర్యం, చైతన్యం,వంటి వైవిధ్యం గల కథావస్తువులతో ఆవిష్కరించగలిగారు. కథలన్నీ చక్కని ఎత్తుగడలతో చకచక నడుస్తూ అనూహ్యమైన ముగింపుతో ఆగుతాయి. ఆ ముగింపులన్నీ మనకు సహృదయత-సంస్కారం-విజ్ఞతలను అందిస్తాయి. ఏ కదైన మనం ఊహించిన ముగింపుతో మాత్రం ఉండదు. కథలను చదివించడం కాకుండా చూపించడం అనే స్థాయిని అందుకున్న అతికొద్ది -మంది రచయిత్రుల జాబితాలో వసుమతి గారిది ప్రత్యేకస్థానం.ఆమె రచనశైలి వినూత్నమైనది, ఆమె రాసిన కథలు సుఖాంతాలైనా, విషాదాంతలైనా వాటిలోని సందర్భాలు, సంభాషణలు, వర్ణనలు ఎంతో అపు రూపంగా మన మనసు- మెదళ్లను స్పృశిస్తాయి. మన సమాజంలో మనచుట్టూ ఉన్నవాళ్లు ఆమె కథలలోని కొన్ని పాత్రల స్వభావాన్ని - ప్రవర్తననూ అందిపుచ్చుకుంటే బాగుంటుంది అని కూడా అనిపిస్తుంది.

ఎనిమిది పదుల వయసులోనూ సాహిత్యాన్ని ఊపిరిగా తీసుకుంటూ రచనలు సాగిస్తూన్న రచయిత్రిగా చెప్పుకోవచ్చు. పూర్వకాలంలోని ఆనాటి సంప్రదాయాలను ఆకళింపు చేసుకొని, తను జీవితంలో పడిన కష్టసుఖాలను అనుభవాలను రంగరించి నేటి తరానికి కూడా చక్కటి సాహిత్యాన్ని అందిస్తూ "టెక్నాలజీ పెరుగుతోంది-వ్యక్తిత్వం దిగజారుతోంది" అనే శీర్షికతో నేటి సామాజిక పోకడను కళ్లకు కట్టినట్లు చూపించారు.

ఆమె విద్యాదాహం, సాహిత్య ప్రవాహం,ఉద్యోగ పర్వాలు ముప్పేటగా సాగడం మన తెలుగు పాఠకుల అదృష్టమే. ఆమె పోరాటం, తపనలు, ఆమె పరిధిని పలు రచనా ప్రక్రియలతో విస్తృతం చేశాయి. ఆమె రాసిన కథలు, కవితలు, వ్యాసాలు, నవలలు వంటివి మనకు లభించడం ఈ సమాజం చేసుకున్న పుణ్యమే. సాధారణంగా ఏ రచయితకైనా జీవిత అనుభవ వైశాల్యం ఎంత ఎక్కువగా ఉంటే అంతపటుత్వమైన కవిత్వం రావటానికి అవకాశం ఉంటుంది. మన వసుమతి గారికి జీవిత వైశాల్యం ఎక్కువ కనుక నవలల్లోని, కథల్లోని కథా వస్తువుల్లో చాలా విస్తృతమైన వైవిధ్యం కనిపిస్తుంది. దానికి తగినట్లు పాత్ర చిత్రీకరణ రూపొందించడంలో ఆమె మంచి నేర్పరి అందుకే మానవ జీవితానికి సంబం ధించిన ఎన్నో మహోజ్జ్వల గ్రంథాలనెన్నింటినో సమాజానికి అందించారు.

కవిగానీ రచయితగానీ జీవితంలో నుంచి నవలకు

సరిపోయే వస్తువును స్వీకరించడం, స్వీకరించబడిన వస్తువుకు తగిన చక్కని రూపాన్ని ఇవ్వడం ప్రధానం. ఈ రెండు ప్రధాన లక్షణాలు చలసాని వసుమతిగారిలో పుష్కలంగా వున్నాయి. గజిబిజిగా అర్ధరహితంగా ఉండే జీవితానికి నవల అనే కళారూపంలో బిగించడం చాలా కష్టసాధ్యమైన విషయమే. అటువంటి కళాత్మకమైన మనసు కవి చలసాని వసుమతి.

ఒక కథను గానీ నవలనుగానీ రాయాలనుకున్నప్పుడు తన మనసులో మెదిలే చక్కటి అనుభూతుల్ని ప్రశ్నావళి రూపంలో తయారుచేసి,సహజమైన, స్వాభావికమైన శైలితో ఇతివృత్తాన్ని ఎంపికచేసుకొని మనోరంజంగా రచించడం వసుమతీగారి ప్రత్యేకత యదార్ధ జీవితంలొని సత్యం ఇంకా గాఢతరమైనది.

కృష్ణాతీరంలోని గ్రామీణసాహిత్యాన్ని అర్థం చేసుకున్న రచయిత్రిగా ఒక వ్యక్తి జీవితాన్ని లేదా ఆ వ్యక్తి జీవితం లోని ముఖ్యభాగాన్ని గురించిగాని, చైతన్య స్రవంతి పద్ధతిలో రాయగలనేర్పు ఆమె ప్రత్యేకత.

చలసాని వసుమతి నవల రచయిత్రిగా ఎంతో పేరు తెచ్చుకుంది. 1965లో ఆమె చెల్లెలు జీవితాన్ని కుంతల నవల నేటికీ ముద్రితమవుతుంది. దీనిలో ఆమె చెల్లెలు క్యాన్సర్ బారిన పడి చనిపోవడం, ఆమె భర్త ప్రవర్తన వంటి ఎన్నో అంశాలతో ఈ నవల పాఠకుల హృదయ లను కదిలిస్తుంది.

దీనితోపాటు ఎన్నో పుస్తకాలను (నవలలను) విశ్లేషించి "గౌతమి" (అహల్య) నవలను రాశారు. ఎంతొమంది రచయితల అహల్య జీవితాన్ని చాలా నీచంగా ఘోరంగా చిత్రించడం చూసి చలించిపొయి

సంస్కారవంతంగా ఉన్నతమైన స్త్రీగా చక్కగా తీర్చి దిద్దారు మరో ప్రతిష్ఠత్మకమైన నవల 'సుమిత్ర' రామా యణంలో ఒక చిన్నపాత్ర తీసుకొని గొప్పనవలగా రాశారు. దీనిలో సుమిత్ర పట్టపురాణి కాదు, ముద్దుల భార్య కాదు కాని ఆమెది బ్రహ్మవాక్కు అందుకే ఏ అవసరానికైనా దశరధుడు సుమిత్రనే సంప్రదించేవాడు, దాని తర్వాత ఆధ్యాత్మకంగా శృంగారం కలగలిపిన మరొక నవల 'చిత్రలేఖ' దీని తదుపరి ఎరుకలవాడు కవిగా అవతరించిన ఒక హింది పండితురాలిగా స్వీయ రచనా నైపుణ్యంతో "భ్రమరగీతం" రాశారు అదే విధంగా కృష్ణునిపై భక్తి భావనతో యశోదకృష్ణను చక్కగా చిత్రీకరించారు. వాటితో పాటు "వసుమతిపథం" కదంబ రచనలో అనాదిగా స్త్రీగా ఎదుర్కొంటున్న రచన గృహ హింస. ఇందులో ఉంది ఇవేకాకుండా ఈ మధ్యకాలంలో "వసుమతి వర్ణమాలిక", "ఎంతో ప్రసిద్ధిని పొందింది. వీటితో పాటు చక్కటి కథలను రాసి "గాజుల సవ్వడి" కథాసంపుటిగా వెలువరించారు. ఈ విధంగా మంచి నవలా కథా రచయిత్రిగా పేరు తెచ్చుకొని సుబ్బిరామిరెడ్డి చేతుల మీదుగా జీవిత సాఫల్య పురస్కారం అందు కున్నారు. సిద్ధార్థ మహిళాపురస్కారం, కృష్ణాజిల్లా రచయితల సంఘపురస్కారాలు, జాతీయ మహిళాభివృద్ధి సంస్థ విశిష్ఠ మహిళా పురస్కారం ఇలా ఎన్నో అవార్డులు అందుకున్నారు.

ఆమె స్వయంగా ఒక సామాజిక సేవకురాలిగా మనం చెప్పుకోవచ్చు అందుకే కీ.శే. మాధవరావుగారైన తన భర్త పేరుమీదుగా "వసుమతీ మాధవ సాహిత్య పురస్కారం" నెలకొల్పి సాహిత్యరంగంలో విశిష్టసేవలు అందించిన ప్రముఖులకు అందిస్తున్నారు. ఈ అవార్డు అందుకున్న వారిలో 1. శ్రీమతి వేదవతి 2. కె.బి.లక్ష్మీ 3. విహారి 4. శీలావీర్రాజు 5. శరశ్చంద్ర మొదలైనవారున్నారు.

**ముగింపు :**

నేటి సమాజంలో స్త్రీల అభ్యుదయం కోసం కృషిచేసే ఒక చక్కటి రచయిత్రిగా శ్రీమతి చలసాని వసుమతి గారిని చెప్పవచ్చు. ఎనిమిది పదులవయసులోనూ ఒక చక్కటి సాహిత్యసేవ చేస్తూ ఎంతో మంది యువ సాహితీవేత్తలకు, కవులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎంతోమంది స్త్రీవాద రచయిత్రులకు ఆదర్శంగా నిలిచి మహిళాభ్యుదయానికి కృషిచేస్తున్న నవలా రచయిత్రిగా పేరు తెచ్చుకుంటున్నారు.

**ఉపయుక్త గ్రంథాలు:**

1. వసుమతీ చలసాని, వసుమతీ వర్ణమాలిక కవితా, వ్యాససంపుటి, పుట:75.
2. వసుమతీ చలసాని, వసుమతీ వర్ణమాలిక కవితా, వ్యాససంపుటి. పుట:196

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2(1), February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# రమణ మహర్షి ప్రబోధ సాహిత్యం - వ్యక్తిత్వ వికాసం

- పి. రామకృష్ణ, పరిశోధక విద్యార్థి, ఉ.వి.

ఒకప్పుడు నవలలు, కథలు రాసిన రచయితలు ప్రస్తుత కాలంలో వ్యక్తిత్వ వికాస సంబంధమైన పుస్తకాలు రాస్తూ, తత్ సంబంధ ఉపన్యాసకులుగా (Motivational Speakers) మారుతున్నారు. అంటే ప్రస్తుత సమాజంలో వీటి అవశ్యకత పెరుగుతుందని తెలుస్తుంది.

నేటి సాంకేతిక యుగంలో మానవుడు జీవితాన్ని ఎంతో సౌకర్యవంతముగా మరియు విలాస వంతముగా గడపాలన్న ఉద్దేశంతో నూతన అవిష్కరణలు చేస్తూ తన భౌతిక వస్తు ప్రపంచాన్ని విస్తృత పరుస్తున్నాడు. కాని తను సృష్టించిన వస్తువులకు తానే బానిసౌతూ మానసికంగా కుంచించుకు పోతున్నాడు. తన రక్షణ కొరకు అల్లుకున్న దారం గూడులో తనే బందియైన పట్టుపురుగు లాంటిదే నేటి మానవుని స్థితి.

మన వేదాంత గ్రంథాలు మొదలు కొని రామాయణ, భారత, భాగవత గ్రంథాలే కాక బుద్ధుని బోధనలు, వివేకానంద సాహిత్యం అంతా వ్యక్తిత్వ వికాసాన్నే వివరిస్తున్నాయి. భగవద్గీత కంటే గొప్పదైన వ్యక్తిత్వ వికాస గ్రంథం లేదని వ్యక్తిత్వ వికాస నిపుణులందరనే మాట. ఇన్ని గొప్ప గ్రంథాలు మనకు అందుబాటులో ఉండగా నేటి యువత మాత్రం ధనాన్ని వెచ్చించి మరీ శిక్షణ తరగతులకు హాజరవుతున్నారు. అంటే విషయాన్ని తనకు తానుగా గ్రహించలేక మరొకరు చెప్తే వినడం. అప్పుడది వేరొకరి జ్ఞానమే అవుతుంది గాని స్వీయ జ్ఞానం ఎలా అవుతుంది. మనకు స్వీయ విశ్లేషణే లేనప్పుడు 'వ్యక్తిత్వ వికాసం' ఎలా వస్తుంది. అందుకే రమణ మహర్షి 'నిన్ను నీవు తెలుసుకో' అంటూ స్వీయవిశ్లేషణకు మొదటి ప్రాధాన్యతనిస్తారు.

**వ్యక్తిత్వ వికాసం పద విశ్లేషణ - నిర్వచనాలు :**

వ్యక్తి + తత్వం కలిస్తే వ్యక్తిత్వం. 'తత్వం ' అంటే స్వభావం. వ్యక్తి యొక్క స్వభావమే వ్యక్తిత్వము అని చెప్పబడుతుంది.

కేంబ్రిడ్జి ఆంగ్ల నిఘంటువు ప్రకారం 'నీ నడవడిక, ఆలోచనా సరళి, భావనలను అభివ్యక్తం చేసేదే నీ వ్యక్తిత్వం' అని చెప్పబడింది. సమకాలీన లాంగ్ మన్ ఆంగ్ల నిఘంటువు 'ఒక వ్యక్తి యొక్క సమగ్ర స్వభావం లేక నడవడే వ్యక్తిత్వ వికాసం' అని తెలుపుతుంది.

పై నిర్వచనాలు సామాన్యార్థంలో చెప్పబడినవి. కాని 'తత్వం' అనేది చాలా విస్తృతార్థం కలది. తత్ = అది, త్వం = నీవు అంటే 'అది నీవు ' అని అర్థం. 'అది' అంటే ఈ సృష్టి, స్థితి, లయలకు కారణమైనదేదో ఆ చైతన్యమని భావన. 'అది నీవు' అంటే 'విశ్వానికి కారణమైన చైతన్యమె నీవు' అని తెలుసుకోవడమే సరియైన వ్యక్తిత్వము. తనలో ఉన్న ఆ చైతన్యాన్ని తెలుసుకున్నప్పుడే వ్యక్తి తన యొక్క నిజమైన స్వభావాన్ని తెలుసుకున్నట్లు. అదే వాస్తవికమైన వికాసం మరియు ఉన్నతి అని విశేషార్థం.

స్వామి వివేకానంద తన ఉపన్యాసాల సారాంశాన్ని గురించి తెలుపుతూ " నా ఆశయాన్ని నిజానికి కొన్ని మాటల్లో చెప్పవచ్చు. అది మానవులకు వారిలోని దివ్యత్వం గూర్చి బోధించి వారి జీవిత ప్రతి కార్య కలాపంలోను దాన్ని ఎలా అభివ్యక్తం చేయాలో ప్రబోధించడమే " అంటారు.

" వ్యక్తి తన యొక్క నిజతత్వాన్ని తెలుసుకున్నప్పుడే పూర్ణానందం సాధ్యము" అని అంటారు. జిడ్డు కృష్ణమూర్తి గారు. నాణానికి రెండు ప్రక్కలు ఉన్నట్లుగానే వ్యక్తిత్వ వికాసం రెండు పార్శ్వాలుగా కనబడుతుంది. తన మేధస్సును ఉపయోగిస్తూ అందరి కంటే మిన్నగా భౌతిక సౌకర్యాలు అనుభవిస్తూ పేరు, ప్రఖ్యాతులు పొందడం

ఒక పార్శ్వమైతే ఈ బుద్ధికి, మేధకు కారణమైనది ఏమిటని విచారించి ఆ మూలమైనది ఏదో తెలుసుకొని శాశ్వ తత్వాన్ని పొందడమే రెండవ పార్శ్వము. మనందరం కూడా మొదటి పార్శ్వమైన భౌతిక వికాసాన్నే నిజమైన వ్యక్తిత్వ వికాసంగా భావిస్తాం తప్ప రెండవ పార్శ్వమే మన నిజమైన వ్యక్తిత్వమని మనం తెలుసుకోలేకుండా ఉన్నాం. మనం చదివే వ్యక్తిత్వ వికాస పుస్తకాలు మరియు శిక్షణా తరగతులు కూడా భౌతిక వికాసాన్ని మాత్రమే వ్యక్తిత్వ వికాసమని చెబుతూ, సామాన్య ప్రయోజనాన్ని మాత్రమే కల్గిస్తున్నాయి తప్ప విశిష్ట ప్రయోజనమైన ఆధ్యాత్మిక ఉన్నతి శూన్యమే. కాని రమణ మహర్షి యొక్క జీవితాన్ని, వారి బోధనలను పరిశీలించినా మనకు సామాన్య మరియు విశిష్ట ప్రయోజనాలు రెండూ చేకూరుతాయని చెప్పడంలో ఎలాంటి సందేహము లేదు.

**మహర్షి జీవితం - వ్యక్తిత్వ వికాసం :**

Simple Living and High Thinking అని ఆంగ్లంలో ఒక సూక్తి ఉంది. మహర్షి జీవన విధానానికి ఈ సూక్తి సరిగ్గా అన్వయమౌతుంది. వారి జీవితం,బోధ రెండూ నిరాండబరమైనవే. మొదటి నుంచి వారు కనీస సౌకర్యాల తోనే జీవనం సాగించే వారు. వారి వస్తువులుగా చెప్పబడేవి కౌపీనం, తుండుగుడ్డ, చేతికర్ర, కమండలం మాత్రమే. భోజనాదుల విషయంలో కూడా వారు దేన్నీ ప్రత్యేకంగా కోరరు. భక్తులందరితో పాటే భుజిస్తారు. మహర్షికై ప్రత్యేక వంటకం గాని, పండ్లు గాని ఎవరైనా తెస్తే అది అందరికి సమంగా పంచాల్సిందే. అలా కుదరనప్పుడు వారు దాన్ని స్వీకరించరు. ఈ సమత్వ భావన మానవులకే పరిమితం కాదు. జంతువుల పట్ల, పక్షుల పట్ల,చివరికి మొక్కల పట్ల కూడా ఈ శ్రద్ధనే చూపేవారు. మహర్షి జీవకారుణ్యం అపారం. ఆశ్రమంలోని ఆవులకు, కుక్కలకు, కోతులకు, నెమళ్ళకు అందరూ తినే ఆహారమే పెట్టాలి గాని పాచిది, తినగా మిగిలింది పెట్టడం నిషేధించారు. ఉడతలకు, పక్షులకు మహర్షి ప్రత్యేకంగా జీడిపప్పు పెట్టేవారంటేనే వారి భూతదయ అర్థం చేసుకోవాలి.

ఆశ్రమ నిబంధనలు పాటించడంలో మహర్షి అందరికీ ఆదర్శంగా ఉండేవారు. భోజనాలకై గంట మ్రోగగానే అప్పుడు పారాయణ జరుగుతున్నా, సంగీతం కొన సాగుతున్నా వారు లేచి నవ్వుతూ "ఆశ్రమం వాళ్ళు మనకి దయతో భిక్షనిస్తున్నారు. మనం ఆలస్యం చేస్తే వాళ్ళు భిక్ష నిరాకరించినా తప్పులేదు. కాబట్టి తొందరగా వెళ్దాం' అనేవారు.

నాయకుడు ఎప్పుడు తను ముందు నడుస్తూ నలుగురిని నడిపించాలి. అనే విధంగా రమణులు తెల్ల వారుజాము మూడు గంటలకే మేల్కొని వంట పనులు చూసేవారు అందరితో పాటు వారు కూడా కూరలు తరిగేవారు, పచ్చళ్ళు రుబ్బేవారు. విస్తర్లు కుట్టేవారు. పుస్తకాలను కుట్టి వాటికి అట్టాలు వేసి జాగ్రత్త చేసేవారు. ఆశ్రమ కట్టడాలను పరిశీలించి తగు సూచనలు చేసే వారు. ఆశ్రమ జంతుజాలం యొక్క ఆహార విహారాలను గమనించేవారు. ఇలా వారి చెయ్యి పడకుండా ఏ పనీ జరిగేది కాదు. ఇలా అన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నప్పటికీ వారు సాక్షి మాత్రంగానే కనిపిస్తూ కర్మయోగిగా జీవించే వారు.

ఎవ్వరూ కూడా సోమరితనంతో జీవించవద్దని, ప్రతి ఒక్కరూ పని చేయడంలోని గొప్పతనాన్ని గుర్తించాలని, శ్రమించే వారికే భుజించే హక్కుని మహర్షి ఈ క్రింది సంఘటన ద్వారా తెలియజేస్తున్నారు. రోజు పచ్చళ్ళు రుబ్బడం వలన మహర్షి చేతుల మీద బొబ్బలు లేచాయి. అది చూసి మహర్షి పరిచారకుడైన విశ్వనాథస్వామి మహర్షిని ఆ వంట పనులు చేయవద్దని వారించాడు. కాని మహర్షి పట్టించుకోలేదు. దానితో ఒకనాడు మహర్షి కంటే ముందే లేచి మహర్షి చేసే పనులన్నీ చేసి వచ్చాడు. అప్పుడు మహర్షి "మొదటి రోజులలో నేను భిక్షకు వెళ్తుండేవాడిని. ఇప్పుడు నాకు ఆశ్రమంలో ఉచితంగా భోజనం లభిస్తుంది. ఆ కారణంగానే నేను వంటింట్లో ఏదో ఒక పని చేస్తుంటాను. ఈనాడు నా పనిని మీరు చేశారు. సరే నాకు మీ ధోవతి నియ్యండి ఉతికి పెడ్తాను"

అన్నాడు. ఈ మాటలు విన్న విశ్వనాథస్వామి చలించి పోయి కన్నీరు కార్చారు!

'వెయ్యి మాటల కన్నా ఒక ఆచరణ మిన్న ' అన్నట్లుగా మహర్షి భక్తుల సందేహాలను ఆచరణ ద్వారానే నివృత్తి చేసేవారు. నెల్లూరు కాలేజీలో తెలుగు అధ్యాపకుడు రంగాచారి ఒకసారి మహర్షిని ' నిష్కామకర్మ ' అంటే ఏమిటని ప్రశ్నించారు. దానికి మహర్షి సమాధానం చెప్పకుండా కొంతసేపటి తర్వాత భక్తులు కూడా వెంట రాగా కొండపైకి వెళ్ళి దారికడ్డంగా పడివున్న ముళ్ళ కొమ్మను తీసుకొని ముళ్ళన్నీ సాపుచేసి, బిరుసైన ఆకుతో దానికి సగిషీ పెట్టి చక్కని కర్ర లాగా తయారు చేశారు.తన కర్రను పోగొట్టుకొని ఆ దారినే వస్తున్న ఒక గొల్లవానికి దాన్ని బహుకరించారు. ఇదంతా చూసిన రంగాచారి బోధనా విధానంలో ఒక కొత్త పాఠాన్ని తాను నేర్చు కున్నానన్నారు.

రమణుల హృదయం ప్రేమ వాత్సల్యాలతో నిండి ఉండేది. వారికి కుల,మత,వర్గ భేదాలు లేవు. వారు అరుణగిరిపై ఉన్న రోజుల్లో కడ జాతి స్త్రీలు వంట కొరకు కట్టెలు ఏరుకొని తిరిగి వచ్చు సమయంలో వారు కొండ పైన ఉన్న కోనేరుల నీళ్ళు తాకకూడదన్న నిషేధం ఉన్నందున మహర్షి వారి కోసం అక్కడ వేచి ఉండి వారి దాహాన్ని తీర్చేవారు. ఎవరు తెచ్చిన ఆహార పదార్థానైనా వారు స్వీకరించేవారు. భోజనశాలలో కూడా వారు బ్రహ్మణేతులతోనే కూర్చునేవారు.

రమణులు అహంకార రహితులు ఒకసారి ప్రణావా నంద స్వామి అనే వృద్ధుడు ఆశ్రమానికి వచ్చారు. అలసి పోయి ఆశ్రమం మెట్ల మీద కూర్చుండి పోయారు. ఈ సంగతి తెలిసి మహర్షి ప్రణావానందుల పాదాల చెంత కూర్చొని, కాళ్ళను మర్దన చేయనారంభించారు. ఆ వృద్ధ స్వామి వారించ బూనినా వ్యర్థమైంది.

గురువుననే భావనను మహర్షి ఏ కోశాన కూడా ప్రకటించరు. శిష్యుడన్న భావనతో ఏ వ్యక్తి పైనా అజమాయిషి చేయరు. తమను శిష్యునిగా స్వీకరించమని ఎవరైనా కోరినా ఈ గురువు, శిష్యుడు అన్న భేదాలెందుకు అందరి హృదయాలలో ఉన్నది ఒకే ఆత్మ. ఆ ఆత్మే గురువు,దైవము. దాన్ని ఎరిగినట్లైన ఈ ద్వయీ భావనలు పొడచూపవు అనేవారు. మహర్షి ఇతరులలో తననూ, తనలో ఇతరులనూ చూసేవారు. నేను జ్ఞానిననుకుంటే అందరినీ జ్ఞానులుగానే భావిస్తాననే వారు. అందుకే దండలు,దండాలు,ఆశీర్వాదాలు,వ్యక్తి పూజలను వారు నిషేధించారు. ఈ బాహ్యాడంబరాలన్నీ నిష్ప్రయోజనం. నిత్య సత్యం "నీవే" కాబట్టి "నిన్ను నీవు తెలును కోవటమే" చేయవలసిన ఏకైక కర్తవ్యమనేవారు.

ఎదుటి వారి తప్పులను క్షమించగలగడం, ఎదుటి వారిలో మంచిని మాత్రమే చూడగలగడం మహోన్నతమై గుణాలుగా చెప్పవచ్చు. ఇవి నిండుగా ఉన్న వారు మహర్షి. ఆశ్రమ వాసియైన రామకృష్ణస్వామి ఊళ్ళో ఒకామెతో చనువుగా మెలిగేవాడు. ఈ విషయం ఆశ్రమ వాసులకు తెలిసి అతన్ని ఆశ్రమం నుంచి పంపించాలని మహర్షికి ఫిర్యాదు చేశారు. అప్పుడు మహర్షి అందరి సమక్షంలోనే అతనితో "నువ్వొక తప్పు చేశావు. కాని తెలివి తక్కువతనం వలన రహస్యాన్ని కాపాడుకోలేక పోయావు. కొందరు ఇంత కన్నా ఘోరాలని చేస్తారు. కాని పట్టుబడ కుండా జాగ్రత్త పడతారు. అట్లా పట్టుబడని వాళ్ళు పట్టుబడినందుకు నిన్ను ఇక్కడ నుంచి పొమ్మం టున్నారు" అన్నారు. చివరికి అతన్ని ఆశ్రమంలోనే ఉండనిచ్చారు.

మరొక సందర్భంలో తిరువణ్ణామలై పట్టణంలో బాగా దుర్మార్గుడుగా పేరు తెచ్చుకున్న ఒక వ్యక్తి మరణించాడని ఒకరు చెప్పారు. అక్కడ ఉన్నవారందరూ ఆ వ్యక్తి అక్రమాల గురించీ, దుష్ట ప్రవర్తన గురించీ చర్చించ సాగారు. అంతా సర్దుమణిగాక, మహర్షి మెల్లగా" అతడు దుర్మార్గుడే కావచ్చు. కానీ ఆ మనిషి రోజుకి రెండు మూడు సార్లు స్నానం చేసేవాడు. ఎప్పుడూ చాలా శుభ్రంగా ఉండేవాడు" అన్నారు.

మానవులకుండవలసిన ఉత్తమ లక్షణాలలో సహనం అతి ముఖ్యమైనది. గాంధీజీ ఒక చెంప కొడితే మరొక చెంప చూపమని చెప్పారు. కాని మహర్షి దీన్ని ఆచరణలో చూపారు. 1924 జూన్ 26 అర్ధరాత్రి ఆశ్రమంలో దొంగలు పడ్డారు. ఆశ్రమ వాసులని కదలనీయకుండా చేయటానికి దొంగలు కర్రలతో బాదారు.

మహర్షిని కూడా ఎడమ తొడపై కొట్టారు. వెంటనే వారు "ఇది మీకు చాలక పోతే రెండవ కాలి మీద కూడా దెబ్బ కొట్టవచ్చు"నన్నారు. ఒక ఆశ్రమ వాసి ఇనుప పనిముట్టు తీసుకొని దొంగలపైకి తిరుగుబాటుకై వెళ్తుండగా మహర్షి గమనించి హింస అనుచితం అని చెప్తూ "మనం సాధువులం మన ధర్మాన్ని విడనాడ రాదన్నారు. నువ్వు వెళ్ళి కొడితే వారిలో ఎవరైనా చని పోవచ్చు. అప్పుడు లోకం మనలనే నిందిస్తుంది గాని దొంగలను కాదు. వాళ్ళు తప్పుదారిన పడినవాళ్ళు, అజ్ఞానం వాళ్ళ కళ్ళని కప్పి వేసింది. కాని ధర్మమేమిటో ఎరిగి, మనం దానికి బద్ధులవుదాం. ఒకోసారి నాలుకను పళ్ళు కరుస్తాయి. అటువంటప్పుడు పళ్ళను ఊడగొట్టు కుంటామా?" అంటూ అతన్ని వారించారు.

మహర్షి సన్యాసియై జీవించినప్పటికి బాధ్యతల నుంచి వైదొలగి ఎప్పుడూ ప్రవర్తించలేదు. నిరాధారమై తన చెంత చేరిన తల్లి అలఘమ్మను, తమ్ముడు నాగసుందరాన్ని సంరక్షించారు.సన్యాస మంటే కుటుంబాన్ని వదలటం కాదు. 'దేహాత్మ భావనను' 'దేహమే నేను' అనే తలంపును వదలటమే నిజమైన సన్యాసమని వారు తరచుగా చెప్పేమాట. చెప్పటమే కాదు వారు అలాగే జీవించారు.

లోకంలో ఏమి జరుగుతున్నా వారి ప్రశాంతిని భంగ పరచదు. ద్వంద్వాతీతులు వారు. అన్నింటినీ ఆ పరమాత్మ స్వరూపంగానే చూస్తారు. వారు సంకల్ప రహితులు. ఎప్పుడూ ఏ పనిని కావాలని చేయలేదు. ఎవరినీ ఏ పనినీ తన కోసం చేయమని అడగలేదు. జ్ఞాన వాశిష్ఠం మరియు భగవద్గీతలో చెప్పిన స్థితప్రజ్ఞుని లక్షణాలన్నీ మనం మహర్షిలో చూడవచ్చు.

శ్రద్ధా విశ్వాసాలతో వారి సన్నిధికి చేరిన వారందరికీ వారి సమక్షాన నెలకొనే ప్రశాంత వాతావరణం అనుభూత మయ్యేది. వారిని ఏవేవో ప్రశ్నలడుగుదామని వెళ్ళిన వారికి, వారు అడగక ముందే సమాధానాలు లభించేవి. వారు ఒక్క మాట ఉచ్చరించపోయినా వికసించిన వారి వ్యక్తిత్వంలో వీరి సంశయాలన్నీ నివృత్తియయ్యి మనస్సు స్వస్థత నొందేది.

## మహర్షి ప్రభోద - వ్యక్తిత్వ వికాసం :

మనమేదైనా ఎలక్ట్రానిక్ వస్తువును కొన్నప్పుడు దానితో పాటు అది వాడాల్సిన విధానం, తగు జాగ్రత్తలు రాస్తారు. దాన్ని తెలుసుకున్నప్పుడే ఆ వస్తువు ద్వారా పొందాల్సిన పూర్తి స్థాయి ప్రయోజనాన్ని పొందగలము. అదేవిధంగా మన గురించి కూడా మనకు సరియైన అవగాహన లేనప్పుడు ఈ జీవితానికి సంపూర్ణత సిద్ధించదు. మరి మన గురించి మనం తెలుసుకోవడానికి ఆధారమేమంటే మహాత్ముల జీవితాలు, వారి బోధనలే. అలాంటి మహాత్ములలో ఎన్నదగిన వారు రమణ మహర్షులు. రమణ మహర్షి అంటే మనందరం వీరొక ఆధ్యాత్మిక వర్గానికి చెందిన వ్యక్తిగా భగవత్ సంబంధమైన బోధనలు చేసే వారని, అదంతా మనకు మింగుడు పడని వ్యవ హారంగా భావిస్తాం. అసలు ఆధ్యాత్మికత అంటేనే అది జీవితంలోని బాధ్యతలన్నీ ముగిసిన తర్వాత కాలక్షేపానికి చేసే చర్యగా మనం చూస్తాం. దీనికి కారణమేమంటే ఆధ్యాత్మికత అన్న భావనను మనం సరిగా అర్థం చేసు కోకపోవడం వలననే.

మనం సాధారణంగా వాడే 'తాపత్రయం' అన్న పదాన్ని ఒకసారి విశ్లేషిస్తే 'తాపం' అంటే దుఃఖం, 'త్రయం' అంటే మూడు. 'తాపత్రయం' అంటే మూడు రకాలైన దుఃఖాలు అని అర్థం. ఏమిటా మూడు దుఃఖాలు అంటే అది దైవిక తాపం,అది భౌతిక తాపం. అది ఆత్మిక తాపం 'అది' అంటే మొదటిది, మూలమైనది అని అర్థం.

1. అది దైవిక తాపం అంటే ప్రకృతి సహజమైన మార్పుల వలన కలిగే అతివృష్టి, అనావృష్టి, భూకంపాలు, సునామి మొదలైన దుఃఖాలు.

2. అది భౌతిక తాపం అంటే ఇతర వ్యక్తుల ద్వారా కాని, జీవరాశుల ద్వారా కాని కలిగే దుఃఖాలు.
3. అది ఆత్మిక తాపం అంటే మనకై మనం కల్పించుకున్న దుఃఖాలు అంటే ఇంద్రియాల ద్వారా కాని, అరిషడ్వర్గాల ద్వారా కాని, మనస్సు ద్వారా కాని సంభవించేవి.

'అది' అంటే 'మూలమైన', 'ఆత్మికత' అంటే 'ఆత్మ సంబంధమైన చైతన్యం ' అని అర్థం. అది+ఆత్మికత కలిసిన రూపమే 'ఆధ్యాత్మికత' మన ఉనికికి మూలమైన చైతన్యాన్ని తెలుసుకోవడమే ఆధ్యాత్మికత కాని కనిపించని దేవున్ని అన్వేషించడమో లేదా మత సంబంధమైన గ్రంథాలను అధ్యయనం చేయడమో ఆధ్యాత్మికత కాదు. పైన పేర్కొన్న మూడు తాపాలలో ఆధ్యాత్మిక తాపమే కీలకమైనది. ఇతరుల వలన కలిగే భౌతిక తాపాలు కూడా మన మీదే ఆధారపడి ఉంటాయి. ఎందుకంటే ఎదుటి వారి పట్ల మన యొక్క ప్రవర్తనను బట్టే వారి స్పందన ఉంటుంది. అదే విధంగా దైవిక తాపాలకు సైతం మనమే కారణం. అడవులను నరకడం, గుట్టలను చదును చేయడం లాంటి కారణంగా ప్రకృతి బీభత్సాలు సంభవిస్తున్నాయి.

కాబట్టి సర్వ అనర్థాలకు కారణం ' మనమే ' అన్నది కాదన లేని సత్యం. అందుకే స్వామివివేకానంద "నీ విధికి నీవే విధాత" అంటారు. కనుక ఆధ్యాత్మిక తాపం పైనే అది దైవిక తాపం,అదిభౌతిక తాపం కూడా ఆధారపడి ఉన్నాయి. ఈ ఆధ్యాత్మిక తాపాన్ని దూరం చేస్తే మిగిలిన రెండు తాపాలు కూడా మన దరి చేరవు. అప్పుడు తాపత్రయమే లేని స్థితిలో ప్రశాంతతను,నిశ్చలతను పొందుతాము.

ఆధ్యాత్మిక సాధన అంటే సన్యాసం స్వీకరించి కాషాయాంబరధారియై నిర్జనమైన ప్రదేశంలో జీవించడం గాని, వేదోపనిషత్తాది గ్రంథాలను వల్లె వేయడంగాని కాదు. మనిషి తన కర్తవ్యాలను, బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ తన వ్యక్తిత్వాన్ని సమున్నతంగా తీర్చిదిద్దుకుంటూ మనీషిగా మారడం కొరకే ఆధ్యాత్మిక సాధన.

"మన సర్వ అనర్థాలకు మనస్సే మూలం" అన్నాడు బుద్ధుడు. అలాంటి మనస్సును వశం చేసుకున్నవాడే 'మనీషి' అంటుంది ఈశావాస్య ఉపనిషత్తు (శ్లో - 8). కాని మనస్సునేది ఆలోచనల సమూహమే తప్ప మరొకటి కాదు. దానికై అన్వేషిస్తే అది అసలు లేదని తెలుస్తుంది అంటారు రమణ మహర్షి. (ఉపదేశ సారం -17) మనం ప్రతి విషయాన్ని కార్యకారణ సంబంధంతో విచారించి, హేతుబద్ధంగా తార్కికంగా తెలుసుకునే ప్రయత్నం చేస్తాం. కాని ఈ దేహం, మనస్సు. ఆత్మ. అన్న విషయాలలో మాత్రం నిర్లిప్తంగా వ్యవహరిస్తాం. అన్నింటిని, వివేచించేది, అన్నింటిని తర్కించేది, అన్నింటిని తెలుసుకునేది ఏమిటని మాత్రం చూడం. దాన్ని గురించి ఆలోచించం. కాని అన్నింటిని తెలుసుకుంటున్న మూలాన్ని తెలుసుకున్నప్పుడే మన వ్యక్తిత్వం పూర్ణత్వాన్ని పొందుతుంది. (ఆత్మవిద్య - కీర్తన) అందుకే మహర్షి అన్నింటికి మూలం 'నీవే ' కాబట్టి "నిన్ను గురించి నీవు తెలుసుకో" అంటారు. వారి బోధనంతా కూడా ఈ 'నేను' కేంద్రంగానే ఉంటుంది.

'నేను ఎవరు?' అన్న ప్రశ్నకు మామూలుగా మన సమాధానం ఈ దేహము మనస్సు అని చెప్పటం జరుగుతుంది. కాని వివేకం చేత విచారించినప్పుడు సత్యం బోధపడుతుంది. మనం ఇప్పుడు ' నేను'గా భ్రమిస్తున్న మనసునుగానీ, దేహం గాని, 'నేను' కావని వీటికి ఆధారభూతమైన మనో దేహం ఉనికికి కారణమైన చైతన్యమే నిజమైన 'నేను' అని విశదమౌతుంది. మనో దేహాలను విశ్లేషించటమే విచారణ మార్గంలో ప్రాథమికాంశం.

మనందరికి సుపరిచితమైన స్వప్న స్థితిని గమనించడం ద్వారా ఈ మనో దేహాల వాస్తవాన్ని గ్రహించవచ్చు. మనం మెలకువతో ఉండి చేసే పనుల్లో మనసు అనేది ఉందన్న విషయమే మరచి దేహంగానే భావిస్తూ పనులు చేస్తాం. స్వప్నంలో ఈ దేహం చలన రహితంగా

ఉండగానే మనసు మాత్రం దేహంగా కర్మలు చేస్తూనే ఉంటుంది. అంటే పగలు దేహంతో ఉండే మనసు స్వప్నంలో కూడా దేహంగా భావించి సంచరిస్తుంది. జాగృతిలో దేహమే మనసుగా ఉంటే స్వప్నంలో మనసే దేహంగా ఉంటుంది. ఈ రెండింటికి విడదీయలేని బంధం వల్లనే అసలు ప్రాణం ఒకటుందని అదే ఈ పనులు చేయిస్తుందని తెలుసుకోలేక పోతున్నాం. ఈ దేహ వ్యవస్థ, మనో వ్యవస్థలను విశ్లేషించి వాటి పూర్తి స్వరూప స్వభావాలు తెలుసుకోవడమే విచారణ మార్గం.

వాహనం నడిచేందుకు ఇంధనం,ఫ్యాన్ తిరిగేందుకు కరెంటు కారణమైనట్లుగా మన దేహం కదలికకు, మనస్సు వ్యక్తమగుటకు కారణమైన శక్తి ఏదో దాని మూలాన్ని అన్వేషించడం ద్వారానే మన వ్యక్తిత్వానికి పూర్ణత్వం లభిస్తుంది.

ఏకాగ్రతకి, వ్యక్తిత్వ వికాసానికి నేడు "ధ్యానం" అనే ప్రక్రియ విస్తృత ప్రచారంలో కొచ్చింది. అసలు ధ్యాన మంటే ఏమిటి? మనల్ని నిరంతరం వెంటాడే శతకోటి ఆలోచనల దృష్టి మరల్చి ఒక్క ఆలోచనపైనే దృష్టి పెట్టడమే ధ్యానం. ఇలా అభ్యాసం చేయగా చేయగా మనస్సుకు శక్తి కలుగుతుంది. కాని రమణ మహర్షి చెప్పే ధ్యానంలో ప్రత్యేకత ఏమంటే ధ్యానించే వాడినే ధ్యానిం చాలి. ధ్యానించేవాణ్ణి 'నేను' కనుక ఈ 'నేను' యొక్క మూలాన్ని పట్టుకోవాలి.

ఇలా మనం చేసే ప్రతి క్రతువులోను చేసేది ఎవడు? అన్న అన్వేషణ కొనసాగించాలి. నీవు పూజ చేస్తున్నవా! ఈ పూజించేది ఎవడు? నీవు కర్మ చేస్తున్నవా! ఈ కర్మలాచరించేది ఎవడు? ఇలా 'నేనెవరు?' అనే విచారణతో మనస్సు అణుగుతుంది. ఈ 'నేను' అనే ఆలోచన మనసులో విచారించే ఇతర ఆలోచనల్నింటిని అణగదొక్కి చివరకు మనసు తన ఉనికిని కూడా కోల్పోయి అణిగిపోతుంది. "నేను" అనే ఆలోచన అన్ని ఆలోచనలను నశింపజేసి తాను కూడా నశిస్తుంది. అప్పుడు పూర్ణ ప్రజ్ఞ కలుగుతుంది. (ఉపదేశసారం - 20)

నిజమైన నేను ఆది అంతం లేని అనంత సాగరం లాంటిది. ఈ అనంత సాగరంలో "మాయా నేనునీటి బుడగలా ఏర్పడుతుంది. ఈ నీటి బుడగనే జీవుడు (మొదటి ఆలోచన) లేదా వ్యక్తిగత ఆత్మ అంటారు. నిజానికి ఈ బుడగ కూడా నీరే, నీరులో భాగమే. ఇది బద్దలైనప్పుడు పూర్ణ సాగరంలో కలిసిపోతుంది. ఈ జీవుడు బుడగగా ఉన్నప్పుడు కూడా సాగరంలో ఒక భాగంగానే ఉంది. ఆత్మజ్ఞాన లబ్ధికి, వ్యక్తిత్వ వికాసానికి "నేను"ను విచారించుటే సూటియైన మార్గం. అన్నింటికి కారణమైన 'నేను'ను విచారించకుండా మనసు, బుద్ధి, ఇంద్రియాలు మొదలైన వాటి గురించి ఆలోచిస్తే లాభం లేదు. "నేను" పోయిందా, 'నేను'ను ఆధారం చేసుకొని బతుకుతున్న ఇవన్నీ ఎగిరిపోతాయి. (ఉన్నది నలుబది - 14)

'నేను' అనే ఆలోచన పుట్టిన తరువాతే క్షణ క్షణం మారే వేల కొలది ఆలోచనలు పుడుతున్నాయి. ఇన్ని ఆలోచనలకు మూలమైన ఈ 'నేనెవరు?' అని నిరంతరం ఆలోచిస్తే ఆ నిజమైన నేను అనుభవమవుతుంది. ఇందుకోసం ఇల్లు విడిచి పెట్టడం గాని సంసార బంధాలు తెంచుకొని అడవులకేగడం గాని, అవసరం లేదు. కావల్సిందల్లా చిత్తశుద్ధి, పట్టుదల. నేను అల్పున్ని నానుంచేమైతది అని అనుకునే వారికి మహర్షి ఒక పిచ్చుక కథ ద్వారా భోద చేస్తున్నారు.

"ఒక పిచ్చుక తన గ్రుడ్లను ముక్కున కరచుకొని ఎగిరిపోతుంటే గ్రుడ్డు జారి సముద్రంలో పడ్డది. అంతే సముద్రం యొక్క లోతెంత, దానిలో ఎన్ని నీళ్ళున్నాయి అని ఏవి ఆలోచించకుండా తన గ్రుడ్డును తీసే ప్రయత్నంతో సముద్రంలోని జలాన్ని ముక్కుతో పీల్చి ఒడ్డున పోయిడ మొక్కటే లక్ష్యంగా చేస్తున్నది. నారదుడు ఆ దారిన పోతు విషయాన్ని గ్రహించి గరుత్మంతునితో నీ జాతి పక్షి పాపం అంత శ్రద్ధతో పని చేస్తుందే నీవు సహాయం చేయవచ్చుగా? అన్నాడట.

గరుడుడామాట విని పరుగున వచ్చి రెండు రెక్కలతో ఒక్కసారి విసిరితే నీరంతా రెండు పాయలై చెదరి గ్రుడ్డు

బయట పడ్డది. పిచ్చుక ఆ గ్రుడ్డును కరచుకొని చక్కా పోయింది. మనలో కూడా ఆ పక్షి కున్న సంకల్ప దీక్షలు ఉంటే దైవ సహాయం తప్పక లభిస్తుంది'' అన్నారు మహర్షి. (శ్రీ రమణాశ్రమ లేఖలు - పుట. 411)

**ఉపసంహారణ :**

జననంతో మొదలై మరణంతో ముగిసే ఈ జీవన ప్రయాణంలో వ్యక్తి నిత్యం చేసే ప్రయత్నాలన్నీ కూడా తనను తాను ఉద్ధరించుకుంటూ, ఆదర్శవంతమైన, ఆనందకరమైన జీవవాన్ని గడపడానికే. ఇలా మన జీవితాన్ని ఆనందదాయకంగా కొన సాగించాలంటే సరియైన వ్యక్తిత్వ వికాసం అనేది అవసరం. మనకు సహజంగా ఉన్న అలవాట్లు, మనం కొత్తగా చేసుకొన్న అలవాట్లు మనని సరిగా సాగనివ్వవు. అందుకే మనిషికి ఒక చక్కని మార్గ దర్శకత్వం కావాలి. మనం ఎలా జీవించాలో, ఎలా జీవిస్తే మనకి దాని పూర్తి ప్రయోజనం అందుతుందో తెలిపేదే సరియైన మార్గదర్శకం.

అన్నింటినీ ఈ పంచేంద్రియాలతో అనుభవించటానికి అలవాటు పడ్డ మనం ఆ చైతన్యాన్ని (దైవాన్ని) కూడా అలానే అనుభవించాలని అనుకుంటున్నాం. అయితే అన్నింటినీ అనుభవింప చేసేది ఆ చైతన్యం కనుక దాన్ని పట్టుకోలేకపోతున్నాం. మన వీపును మనం అద్దంలో చూసుకోలేం కదా! మరో అద్దం సహాయం కావాల్సిందే. అదే గురువు చేసే పని. ఈ ప్రపంచం అనే అద్దంలో నీ వెనుక ఉన్న దైవాన్ని చూసుకోలేవు. మరో అద్దంలా నీ వెనుక నిలబడి నీలోనే ఉన్న దైవాన్ని గురువు చూపు తాడు.

**ఆధార గ్రంథాలు :**

1. వ్యక్తిత్వ వికాసం - స్వామి వివేకానంద
2. బుద్ధ భగవానుడు - పుట్టపర్తి నారాయణాచార్యులు
3. కృష్ణమూర్తి తత్త్వం - జిడ్డు కృష్ణమూర్తి
4. భగవాన్ శ్రీరమణ మహర్షుల దివ్యజీవిత మకరందము - నిమిష కవి పేర్రాజు
5. శ్రీ రమణ గ్రంథమాల - రమణ మహర్షి
6. శ్రీరమణాశ్రమ లేఖలు - సూరి నాగమ్మ
7. శ్రీరమణ గీతా విశ్వరూపము - శ్రీ కావ్య కంఠ గణపతి ముని

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2(1), February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# కన్నడ భాషలో భారతేతిహాసం

- డా॥. వి. పళని, సహాయాచార్యులు, తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

"త్రిదశానాం యథా విష్ణుః ద్విపదాం బ్రాహ్మణో యథా
భూషణానాం చ సర్వేషాం యథా చూడామణిర్వరః
యథాయుధానాం కులిశ మిన్ద్రియాణాం యథా మనః
తథే హ సర్వశాస్త్రాణాం మహాభారత ముత్తమమ్"
(మార్కండేయ పురాణం 1.2-11)

మార్కండేయ పురాణం సర్వశాస్త్రల్లోనూ మహా భారతమే ఉత్తమమని ప్రశంసించింది. మహాభారతంలోని గూఢార్థం వాసుదేవ తత్త్వమే. దండలోపల దారంలాగ, మహాభారత అత్మలో వాసుదేవుడే పరమాత్మ. అందుచేతనే భారతం పాప ప్రక్షాళణా సామర్థ్యాన్ని పొందిందని తత్త్వజ్ఞులు అంటారు.

కన్నడ సాహిత్యంలోని మహాభారతాలను తుల నాత్మకంగా పరిశీలించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.

తెలుగు భారతంతో పోల్చి చూస్తే కన్నడంలో వచ్చిన భారతాలు పూర్తిగా భిన్నమైనవి. తెలుగు భారతాలు వైదిక సాంప్రదాయాన్ని అనుసరించినవైతే, కన్నడ భారతాల్లో జైన మత సాంప్రదాయాన్ని అనుసరించినవి. కన్నడ భాషలో భారతం పూర్తిగా అనువదింపబడలేదు. కన్నడంలో కుమార వ్యాసుని భారతం ఒక్కటే కథావరంగా విస్తారమైంది.

పంప మహాకవి విరచితమైన విక్రమార్జున విజయ, కన్నడంలో లభిస్తున్న మొట్టమొదటి భారతం. పంప క్రీ.శ. పదవ శతాబ్దం పూర్వార్థంలోనివాడు. (క్రీ.శ. 940 ప్రాంతం) ఈయన వేంగిపర్రు అగ్రహారానికి చెందినవాడు. ఇది నేడు సర్సారావుపేట తాలూకాలోని వంగీపురం. పంప తన భారతాన్ని వేములవాడలో రచించాడు. అందులో ప్రతిఫలంగా ధర్మపురి అగ్రహారాన్ని దానంగా పొందాడు. చివరికి బోధన్ పట్టణంలో సన్యాసాన్ని స్వీకరించి తర్వాత సమాధి చెందాడు. ఇవన్నీ ఆంధ్రదేశంలోని ప్రాంతాలే, కన్నడ కవుల్లో ధార్మిక, లౌకిక, కావ్యాలను రెండింటిని రాయడం ఒక సంప్రదాయం కన్పిస్తుంది. పంప కవి 'ఆదిపురాణ' అనే ధార్మిక కావ్యాన్ని కూడా రచించాడు. 'ఆది పురాణమే' పంప తొలి రచన. ఇది జైన తీర్థంకరులలో మొదటివాడైన వృషభ దేవుని చరిత్రను వర్ణించే చంపూ కావ్యం, రెండవది విక్రమార్జున విజయం పంప తన పోషకుడైన వేములవాడ చాళుక్య ప్రభువైన ఇమ్మడి అరికే సరికి, అర్జునునికి అభేదాన్ని పాటిస్తూ రచించిన చంపూ కావ్యం, (విక్ర, 14-14). ఇమ్మడి అరికేసరికి విక్రమార్జును డనే బిరుదు కూడా ఉంది. పంప యుగంలో వెలసిన కావ్యాలలోనే విక్రమార్జున విజయం విశిష్టమైనది. పంపకు ఆదికవి, కవితా గుణార్ణవ అనే బిరుదులు ఉన్నాయి.

పంప భారతంలోని మూలకథ వ్యాస భారతం నుండి స్వీకరించిందే కానీ, చాలా సంక్షిప్తం చేయబడింది. లక్ష శ్లోకాలతో విస్తరిల్లి ఉన్న మూల భారతాన్ని పంప 1609 పద్యాలకు సంక్షేపించి విక్రమార్జున విజయం రాశాడు. కథలోని పట్టు సడలకుండా రాసిన తన భారతాన్ని 'సమస్త భారత'మని పంప చెప్పుకున్నాడు. పంప భారతంలో అర్జునుడే కథానాయకుడు. ద్రౌపది అర్జునునికి మాత్రమే భార్య. ఫలశృతికూడా అర్జునునికే చెప్పబడింది. తుదకు అర్జునుడే పట్టాభిషిక్తుడయ్యాడు. వ్యాసభారతానికి సూత్ర ధారియైన కృష్ణుని పాత్రకు పంప ప్రాధాన్యమియ్యలేదు. తన భారతానికి ఫలశృతిగా పంప చెప్పిన పద్యాన్ని గమనిస్తే ఈ విషయం అర్థమౌతుంది.

"చలదొళ్ దుర్యోధనం నన్నియొళిన తనయం
గండినొళ్ భీమసేనం
బలదొళ్ మద్రేశనత్యున్నతి యొళమర సింధూధ్భవం
చాప విద్యా

బలదొళ్ కుంభోద్భవం సాహనద మహిమెయొళ్
ఫల్గుణం ధర్మదొళ్ని
ర్మల చిత్తం ధర్మపుత్రం మిగిలివర్గళినీ భారతం లోక
పూజ్యం"

అభిమానంలో దుర్యోధనుడు, సత్యవాక్కులో కర్ణుడు, శౌర్యంలో భీమసేనుడు, బలంలో శల్యుడు, ఉన్నతిలో భీష్ముడు, ధనుర్విద్యలో ద్రోణుడు, సాహసంలో అర్జునుడు, ధర్మంలో ధర్మజుడు గొప్పవారు. వీరి వలననే భారతం లోక పూజ్యమైందని దీని అర్థం. భారతానికి పూజనీయత కల్గించిన వారిలో కృష్ణుని పేరును పంప చేర్చకపోవడం విశేషం.

అర్జునుని నాయకుడిగా స్వీకరించడంవల్ల కథనంలో పంపకు కొన్ని ప్రతిబంధకాలు ఏర్పడ్డాయి. తమ్ముడి భార్యను ధర్మరాజు జూదంలో ఓడిపోవడం, కీచకుని చంపమని ద్రౌపది ఏకాంతంలో భీముని ప్రార్థించడం. దుశ్శాసనుని వధానంతరం భీముడు ద్రౌపది కొప్పును ముడవడం. చివరకు ద్రౌపది కాకుండా అర్జునునితోపాటు సుభద్ర సింహాసనారూఢ కావడం వంటి విరుద్ధ విషయాలు కథలో కన్పిస్తున్నాయి. ద్రౌపది అర్జుని పత్ని మాత్రమేనని చెప్పడం వల్ల పంపకవికి ఈ అడ్డంకులు కలిగాయి. మూల విరుద్ధమైన వర్ణనలు కూడా పంప భారతంలో అనేకం ఉన్నాయి. అర్జునుడు సుభద్ర విరహాన్ని సహించలేక వేశ్యావాటికను దర్శించడం అటు వంటి వాటిలో ఒకటి. ఇది అప్పటి కాలానికి సమ్మతమేమో తెలియదు.

విక్రమార్జున విజయం అర్జున, అరికేసరులకు అభేదం చెప్పిన ధ్వని కావ్యం, పంప జైన మతావలంబి కావడం చేత ప్రతి నాయక పాత్రలను కూడా విషాద నాయకులు గానే చిత్రించాడు. జైన మత సంప్రదాయాన్ని అనుసరించి ఎవ్వరూ దుష్టులు కారు. పంప భారతంలోని కర్ణ, దుర్యోధనులిద్దరూ కూడా విశిష్ట వ్యక్తిత్వంతో ప్రకాశిస్తు న్నారు. దుర్యోధనుడు అభిమానధనుడు. తన మిత్రుడైన కర్ణుని నిందించినందువల్లే అతడు పాండవుల్ని ఎక్కువగా ద్వేషించాడు. భీష్మ, ద్రోణాదులపై భక్తి, బంధువులపై ప్రేమ ఉన్నవాడుగా, కర్ణునుని జన్మ రహస్యం తెలిసికూడా అతన్ని అభిమానించిన వాడుగా కన్పిస్తాడు.

కర్ణపాత్రను పంప చాలా ఆదర్శవంతంగా తీర్చి దిద్దాడు. పాండవులు తన సహోదరులు అని తెలిసికూడా సుయోధనుని మైత్రిని విడువక సేవించిన నిస్వార్థ చిత్తుడు. మహాదాత, పరాక్రమశాలి. అతని జీవితం విషాదంతో మొదలై, విషాదంతో అంతమైనది. పంప అర్జునుని నాయకునిగా వర్ణించినప్పటికీ, కర్ణుని ప్రతి నాయకునిగా చెప్పలేదు. అంతేగాక 'అన్నా మహాభారత యుద్ధంలో ఎవరినీ తలచవద్దు, ఏకాగ్రతతో కర్ణునే స్మరించు, కర్ణుని సాటి ఎవరు? కర్ణుని యుద్ధనీతి, సత్య వాక్కు, త్యాగనిరతి వేరెవరికి ఉన్నాయి? ఇవి ప్రతి ఇంటా మనుషులు, మనసులు తలచే మాటలు. అందుకే భారతం అంటే కర్ణరసాయనమే గదా?' (విక్ర కర్ణ పర్వం చరమగీత.. 217) అని కర్ణుని ప్రశంసించాడు.

పంప ప్రభావం నన్నయ మీద ఉన్నదని నిరూపించే ప్రయత్నం తెలుగులో జరిగింది. శ్రీ నిడదవోలు వెంకట్రావుగారు 'ఆంధ్రకర్ణాట సారస్వతాలు' అనే గ్రంథం లోను, పుట్టపర్తి నారాయణాచార్యులు కొన్ని వ్యాసాల్లోనూ ఇందుకు ప్రయత్నించాయి. జాగ్రత్తగా గమనిస్తే నన్నయ పంప భారతాన్ని చూసినట్లు లేదా దాని గురించి విన్నట్టు నిరూపించే స్పష్టమైన ఆధారాలు లేవుగానీ, పంప భారతానికి పూర్తిగా ప్రతి ద్వంది యైన, మూల విధేయమైన వైదిక భారతాన్ని రచించాడని చెప్పడం సమంజసం. పంప భారతం జైన ధర్మావలంబి. నన్నయ భారతం వైదికానుసరణి. పంప పశ్చిమ చాళుక్య రాజాశ్రయుడు. నన్నయ తూర్పు చాళుక్య రాజాస్థాన నిలయుడు. పంపకవి దృష్టిలో భారతం లౌకిక కావ్యం. నన్నయకు అది భారత భారతీ సముద్రం, ధర్మ సంస్థాపనోద్దిష్టము. కాబట్టి పంప నన్నయల భావావేశంలో, వర్ణనా అభినివేశంలో సామ్యం ఉండవచ్చునేమోగానీ దృక్పథంలో లేదు. ఇక, తిక్కన విషయంలో పంప ప్రభావం కొంత కన్పిస్తుంది.

కం॥ 'కరకరి శీకర మదజల
తురంగ లాలాంబు సేకరిందరదుర ది
ర్ధ రజం సరేంద్ర చామర
మరుదభి హతియం తెరళ్దు తొళ్దత్తాగళ్"
(అదిపురాణ)

కం. "కరికర శీకర తురగో
త్కర లాలా జాలరక్తధారాపటలీ
పరిషిక్తంబై సంగర
ధరణీరజ మడగె సద్భుతం చెలరారన్"
(భీష్మపర్వం, ప్రథమాశ్వాసం - 245)

ఇరుపక్షాల సైన్యం యుద్ధంలో తలపడినపుడు రాజులకు వీస్తున్న చామరముల గాలి వల్ల రేగిన ధూళిని ఏనుగుల తొండపు జల్లులు, వాటి మదజలములు, గుర్రాల నోటి నుంచి కారుతున్న చొంగ అణచివేస్తున్నవని పంప కవి వర్ణిస్తే, 'సరేంద్ర చామర మరుదభిహతి" అన్న దళం వల్ల కల్గిన అనౌచిత్యాన్ని తొలగించి, పంప కవి చెప్పిన కరికర శీకర, తురగోత్కర లాలాజలములతోపాటు రక్తధారా పటలీపరిషిక్తంబై ధరణీ రజము అణగెనని చెప్పటం ఔచితీవంతంగా ఉంది.

అదే విధంగా,

"బక కిమ్మీర జటాసురోద్ధత జరాసంధర్కళం నంద కీ
చకరం సూర్పరుమం పదల్వడిసిదీ త్వచ్చండ దోర్దండ ము
గ్ర కురక్ష్మాప మహీరుహ ప్రకరమం మత్తేభ విక్రీడిత
క్కె కరు పొల్వెగెనందు భీమరణదొళ్ సూర్గాడదేం పోకుమే"
(విక్రమార్జున విజయ)

"బక విధ్వంసి, జటాసురాంతకు, హిడింబా ప్రాణ పారేణు, కీ
చక నిర్మూలన కేళిలోలు, సమరోత్సాహైక శీల ప్రవ
ర్తకు, నాగాయుత సామ్యకీర్తిత బలోదగ్రున్, ప్రతి వ్యూహదా
హకు భీముంగొనివచ్చు ధర్మజుడు బాహాటోపముం జూపగన్"
(ఉద్యోగపర్వం, 2-172)

ఇక్కడ పంప దీర్ఘ సమాసాలలో భీమ పరాక్రమాన్ని వర్ణించాడు. తిక్కన కూడా సమాస రచనను స్వీకరించినా, చక్కని విరుపులు పాటించినాడు. పంప 'ముద్రాలంకార' ప్రియత్వం వల్ల ఆ పద్యవృత్తమైన మత్తేభ 'విక్రీడితాన్ని' స్మరించాడు. తిక్కన 'నాగాయుత సామ్య కీర్తిత బలోద గ్రున్' అని ప్రయోగించాడు. ఈ విశేషణం 'నాగాయుత సామ్యక్రీడిత బలోదగ్రున్' అయి ఉండవచ్చునేమో. ఎందుచేతనంటే 'కీర్తిత బలోదగ్రున్' అనటం కన్నా 'క్రీడిత బలోదగ్రున్' అనటమే భీమసేనుని బలదర్పాన్ని మరింతగా ప్రకాశింపచేస్తుంది. ఈ సందర్భాల్లో తిక్కన పద్యరచన, పంపకవి అనుసరణమే అని స్పష్టంగా చెప్పలేం. యాదృచ్ఛికం కూడా కావచ్చు. తిక్కన వ్యక్తిగానే కాక కవిగా పరమ స్వతంత్రుడు. గీతోపదేశ సన్నివేశాన్ని పంప కేవలం రెండు పద్యాల్లో ముగిస్తే (విక్రమార్జున విజయ 10వ ఆశ్వాసం 63-64) తిక్కన భీష్మ పర్వంలో (ప్రథమాశ్వాసంలోని 180వ పద్యం నుంచి 228వ పద్యం వరకు) 49 పద్యాల్లో గీతోపదేశాన్ని వర్ణించారు. 700 శ్లోకాలతో 18 అధ్యాయాలతో భారతీయ తత్త్వసారమైన భగవద్గీతా రహస్యాన్ని తిక్కన సంగ్రహంగా వర్ణించిన తీరు ఆయన దార్శనికతకు, పరిపుష్టమైన తాత్త్విక శక్తికి ప్రబల తార్కాణంగా నిలుస్తుంది. ఇటువంటి తత్త్వ వివేచనలో తిక్కన అద్వితీయుడు.

కన్నడంలో భారత కథతో వెలువడిన మరొక ప్రసిద్ధ కావ్యం 'గదాయుద్ధ' (సాహస భీమ విజయ) దీని కర్తయైన రన్న కన్నడ కవిత్రయంలో మూడవ వాడు. కవితాశక్తిలో మాత్రం ప్రథముడే. ఈయన కాలం క్రీ.శ. 993 ప్రాంతం. రన్నకవి క్రీ.శ. 949లో జన్మించి 993లో 'అజితపురాణ' రాసినట్లు తెలుస్తున్నది. రన్నకూడా జైనమత అవలంబియే. అందుకే రెండవ జైన తీర్థంకరుడైన అజితనాథుని కథను 'అజితపురాణ' అనే పేరుతో ధార్మిక కావ్యంగా రాశాడు. అజిత పురాణ 12 ఆశ్వాసాలు 791 పద్యాలతో కూడిన చంపూ కావ్యం.

రన్న రచించిన లౌకిక కావ్యం 'గదాయుద్ధ'. కన్నడ సాహిత్యంలోనే ఈ కావ్యం అత్యంత ప్రసిద్ధమైనది. గదాయుద్ధ 10 ఆశ్వాసాలు, 576 పద్యాలు కల్గిన చంపూకావ్యం. రన్నకు నన్నయవలె శబ్దానుశాసన ప్రభవవచో.. 'విభవుడు' తిక్కన వలె 'ఉభయ వ్యాకరణ' వండితుడు అన్న బిరుదులు ఉన్నాయి. రన్నకవి కావ్యాలపై వ్యాస, వాల్మీకివంటి సంస్కృత కవుల ప్రభావం తనపూర్వులైన పంప, పొన్నల ప్రభావం ఉంది.

గదాయుద్ధ (సాహస భీమ విజయం) కూడా ధ్వని కావ్యమే. రన్న కవి తనకు ఆశ్రయం ఇచ్చిన కళ్యాణ చాళుక్య ప్రభువు సత్యాశ్రయునికి, సాహస భీమునికి అభేదాన్ని ఈ కావ్యంలో వర్ణించాడు. ఈ కావ్యానికి మూలం మహాభారత కథే, భాసుని 'ఊరుభంగం', భట్ట నారాయణుని 'వేణీ సంహారం' వంటి సంస్కృత నాటకాల ప్రభావం, పంప భారత ప్రభావం ఈ కావ్యంమీద ప్రసరించాయి. ఈ కావ్యంలోని కథ కంతకూ భీముడే కేంద్ర బిందువు, నాయకుడు. కథ కురుక్షేత్ర రణ భూమిలో మొదలవుతుంది. భీముడు ద్రౌపది వల్ల కురుసభలో చేసిన ప్రతిజ్ఞను గుర్తుచేసుకొని యుద్ధానికి పూనుకుంటాడు. దుర్యోధన వధానంతరం భీముని పట్టాభిషేకంతో కావ్యం ముగుస్తుంది. ఈ కావ్య నాయకుడైన భీముడు ధీరోద్ధతుడు. ఇది దశరూపకాలలో డిమమును పోలి ఉంది అంటారు.

రన్న సన్నివేశ కల్పనలో దిట్ట. గదాయుద్ధ కావ్యం రసవంతమైన ఎన్నో సన్నివేశాలకు ఆలవాలంగా ఉంది. నాటకీయతలో తిక్కనతోనూ, రసావేశంలో నాచన సోమునితోనూ రన్నను పోల్చవచ్చు. కన్నడ భారతాలలో దుర్యోధనుడు దుష్టుడు కాదు. జైన మత సాంప్రదాయానుసారంగా అతడు విషాదనాయకుడు మాత్రమే. రన్న, దుర్యోధనుని ప్రతి నాయకునిగా చిత్రించినప్పటికి ఔచిత్యాన్ని, సంస్కారాన్ని పాటించాడు. బహుశా భాసాది సంస్కృత కవుల ప్రభావం వల్ల ఇది సాధ్యమై ఉండవచ్చు.

దుర్యోధనుని వ్యక్తిత్వాన్ని పంప పోషించిన తీరు గమనిస్తే పాత్రపోషణలో రన్న ఎంతటి శక్తిమంతుడో అర్థమౌతుంది. యుద్ధ రంగంలో అభిమన్యుని మరణాన్ని చూసి అతని పరాక్రమాన్ని దుర్యోధనుడు

"అసమబల భవద్విక్రమ
మ సంభవం పెఱగ్గె నిన్న నాని నితం ప్రా
ర్థి నువెనభిమన్యు నిజ సా
హసైక దేశాను మరణమె మగక్కెగడా"

(గదాయుద్ధ, 4-57)

సాటిలేని నీ పరాక్రమం మరొక్కరికి అసాధ్యం. నీ వలె నాకునూ సాహస మరణాన్ని ప్రసాదించమని అభిమన్యుణ్ణి ప్రార్థించడం చూస్తే దుర్యోధనుడు మహోన్నత వ్యక్తిగా దర్శనమిస్తాడు.

రన్న వర్ణనా శక్తిలో గట్టివాడు. దుర్యోధనుడు జల స్తంబన విద్యతో వైశంపాయన (ద్వైపాయన అని తిక్కన) సరోవరంలో ఉన్నపుడు అతనిని వెతుక్కుంటూ పాండవులు కృష్ణసమేతులై అక్కడకు వచ్చినపుడు రన్న చేసిన సరోవర వర్ణన అనన్య సామాన్యంగా ఉంది. ఆ సరోవరంలోని రాజహంసలు చేసే కలస్వనం 'ఓహో! వచ్చారా! రండి' అని ఆహ్వానించినట్లున్నది. అలలు గాలికి ఎగసి పడుతూ తమ నీటితో భీముని పాదాలను కడిగి తలవంచి నమస్కరిస్తున్నట్లు, విచ్చుకున్న తామరలు అర్ఘ్యమిచ్చినట్లు, ఆ సరోవరమే భీమునికి ప్రేమతో అతిథి సత్కారం చేసినట్లున్నది. నేరేడు కొమ్మలు గాలికి కదులుతూ తమ లేత చిగుళ్ళతో దుర్యోధనుడు ఇక్కడే దాక్కున్నాడు చూడు అని ఎర్రని వేళ్ళెత్తి చూపుతున్నట్లు ఉన్నదని వర్ణించాడు. (గదాయుద్ధ షష్టాశ్వాసం, 41-44) రన్న కవి గదాయుద్ధకు తిక్కన యుద్ధ షట్కానికి తులనాత్మక పరిశీలన వలన వీరిద్దరి మధ్యగల తారతమ్యాలను, నాటకీయతలోగల నైపుణ్యాన్ని గుర్తించవచ్చు. స్వపక్ష వీరులందరినీ కోల్పోయి దుర్యోధనుడు ద్వైపాయన సరోవరంలో దాగి ఉన్నపుడు అతనిని బయటకు రప్పించడం కొరకు ధర్మరాజు చాలా

సుదీర్ఘంగా సంభాషించినట్లు తిక్కన వర్ణించాడు. రన్న గదాయుద్ధంలో భీముడే దుర్యోధనుని తన దెప్పి పొడుపు మాటలతో బయటకు పిలిచినట్లు వర్ణించారు. ఈ సందర్భంలో తిక్కన

ఉ॥ శూరుఁడ వంద్రు మడుపు సొచ్చుట శౌర్యము చొప్పె? మాన మే
యూరికిఁబోయె? నాజి నృపులోడుదురే? నృపుఁడన్న మాత్రయే?
కౌరవ వంశజాతుఁడవు గవ్వవుఁ జచ్చుట తెచ్చుకొంటి, నీ
'పేరును బెంపు మారి యరి బృందము నవ్వఁగనిట్లు సేయుదే?"

(శల్య పర్వము, ద్వితీయాశ్వాసం-55)

దాదాపుగా ఇటువంటి మాటలతోనే భీముడు దుర్యోధనుని దెప్పి పొడవడం గదాయుద్ధంలో కూడా కన్పిస్తుంది. 'ఓ సుయోధనా! మానధనుడవనిపించుకున్న నీవు ఇప్పుడు నీ అభిమానాన్ని విడిచిపెడుతున్నా వెందుకు? నీటిలో ఉండవలసినది ఎండ్రకాయలు, చేపలు, కప్పలే గానీ, మనుషులు గాదు. మగటిమి గలవాడెవ్వడైనా ఇలా నీటిలో దాక్కుంటాడా? (సప్తమా శ్వాసం - 6) కృష్ణుని సంధికై నీ చెంతకు పంపినప్పుడు అతన్ని అవమానించావు గదా! అప్పటి అహంకారమే మయింది? ద్రౌపది వస్త్రాన్ని, ముడిని నిండు సభలో ఈడ్పించినప్పటి అహంకారం ఏమైంది? కుంతీ పుత్రుల్ని నిలిచిన చోట నిల్వనీయకుండా అడవుల్లో గిర్రున తిప్పిన అహంకారం ఏమయింది? (సప్తమాశ్వాసం- 14) అని, రన్న.

తిక్కనలోని వ్యంగ్య చమత్కృతి, నాటకీయ శైలి రన్నలో కూడా స్పష్టంగా కన్పిస్తాయి. రన్న కూడా తిక్కనవలె ప్రతి సన్నివేశాన్ని చాలా జాగ్రత్తగా పాత్రల అంగిక, వాచిక అభినయాలతో, మాటలతో, మనస్తత్వాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించడంలో సిద్ధహస్తుడు. రన్న భాషాపటిమ కూడా అనన్యసామాన్యమైనది. ఈ గుణాలే రన్న కావ్యద్వయాన్ని రెండు రత్నాలుగా ప్రకాశింపచేశాయి.

విజయనగర రాజైన ప్రౌఢ దేవరాయ ఆస్థానంలోని కుమార వ్యాసుడు రచించిన భారతం కన్నడ సాహిత్యంలో మరొక్క ప్రసిద్ధ భారతం. ఈయన కృష్ణదేవరాయల కాలంవాడని వివాదం కూడా ఉంది. కుమార వ్యాసుడు యుగకర్త. ఈ యుగంలో విష్ణుభక్తిని ప్రతిపాదించే సాహిత్యం కన్నడంలో వెల్లివిరిసింది. హరిదాస సాహిత్యం అంకురించింది కూడా ఈ కాలంలోనే. హళగన్నడ భాష మార్పు చెందింది. వచనాలు వృద్ధి చెందిన నడుగన్నడ తర్వాత కుమార వ్యాస యుగంలో హొసగన్నడగా వికాసం చెందింది. కన్నడ సాహిత్యంలో విశేష జనాదరణ పొందిన కావ్యంగా కుమార వ్యాసభారతాన్ని చెప్పుకోవచ్చు. ఇది షట్పది ఛందంలో ఉంది. ఈ ఛందస్సు గానయోగ్య మైంది. కుమార వ్యాసుని భక్తి భావావేశానికి అనుకూలంగా అమరిన షట్పది ఛందస్సు కన్నడ ప్రజల నాల్కలపై నాట్యం చేస్తున్నది. ఈ భారతం కన్నడ భాషా సర్వస్వం. అనాటి కన్నడ సామెతలు, పలుకుబడులు కొల్లలుగా ఇందులో దర్శనమిస్తాయి.

కుమారవ్యాసుడు మహాభారతంలోని 10 పర్వాలను మాత్రమే అనువదించాడు. మిగిలిన ఎనిమిది పర్వాల కథను కృష్ణరాయల కాలం నాటి తిమ్మణ్ణ పూరించినట్లు తెలుస్తున్నది. ఈ భారతానికి మూలం వ్యాసభారతమే అయినప్పటికి కుమార వ్యాసుడు స్వేచ్ఛానువాదంతో కొన్ని చోట్ల మూలకథకు కూడా మెరుగులద్దాడు. విస్తరించి, సంక్షేపించి కొన్నిచోట్ల పరిహరించి కవి కథను కొనసాగిం చాడు. కుమార వ్యాసుని అసలు పేరు 'నారణప్ప'. ఈయన భక్తకవి. తెలుగులో పోతనతో పోల్చదగినవాడు. గదుగిన వీరనారాయణుని కృపతో తాను ఈ కావ్యాన్ని రచించి నట్లు, తాను కేవలం లిపికారుణ్ణి మాత్రమేనని కృతికారుడు వీరనారాయణుడే అని ఈ కవి వినయంగా చెప్పుకున్నాడు. అందువల్లనే ఈ భారతానికి 'గదుగిన భారతం' అనే పేరు కూడా కల్గింది.

పోతన భాగవత కృష్ణకథను రాస్తే, 'తెలియహేళువె కృష్ణకథెయను' (తెలిసి కృష్ణకథను వినండి) అంటూ భారతాన్ని కుమార వ్యాసుడు కృష్ణకథగానే రచించాడు. పోతన, కుమార వ్యాసులిద్దరు భక్తి తత్పరతతో కావ్య రచన చేసినవారే. భావనాసౌందర్యంలోనూ, భాషా మాధుర్యంలోనూ ఇరువురూ విశేష జనాదరణ పొందిన కవులు. కుమారవ్యాసుడు పాడితే కలియుగమే ద్వాపరమవుతుందని కె.వి. పుట్టప్పగారు చెప్పడం ఈ కవి భక్తిభావ సంభరితమైన గీతరచనా శక్తిని తెలియచేస్తుంది. శిశుపాలవధ సందర్భంలో భీష్ముడు చేసిన కృష్ణస్తుతి. మానసంరక్షణ సందర్భంలో ద్రౌపది చేసిన కృష్ణస్తుతి. ఈ విధంగా వీలు చిక్కిన ప్రతి చోట కవి మనసారా కృష్ణుని వర్ణించి ఆనందించాడు. 'ఘన రజోగుణంలో బ్రహ్మయై, తమోగుణంలో శంకరుడై, సత్వగుణానుగతిలో విష్ణువై, జగన్మయరూపుడై, సర్వాత్ముడై, ఈశ్వరేశ్వరుడైన ఈతని మహిమను ఎరుగగల వారెవ్వరు? (కుమారవ్యాస భారతం, సభాపర్వం, షట్పది-3) ఇటువంటి వర్ణనలు భాగవత రచనను తలపిస్తున్నాయి.

కుమారవ్యాసభారతంలో పదిపర్వాలు, 152 సంధుల (విభాగాలు)లో, 8500 భామినీ షట్పదులున్నాయి. కుమార వ్యాసునిపై తిక్కన ప్రభావం స్పష్టంగానే కన్పిస్తుంది. విరాటపర్వంలో పాండవులు విరాటరాజు కొలువులో ప్రవేశించడానికి వ్యాసుడు పాటించిన క్రమం ధర్మజ, భీమ, ద్రౌపది, సహదేవ, అర్జున, నకులులు. కానీ తిక్కన ఈ క్రమాన్ని పాటించలేదు. ధర్మజ, భీమ, అర్జున, నకుల, సహదేవుల తర్వాత ద్రౌపది ప్రవేశించి నట్లు తిక్కన పేర్కొన్నారు. కుమారవ్యాసుడు కూడా ఇదే క్రమాన్ని పాటించాడు. అదే విధంగా శమీవృక్షంపై దాచిన ఆయుధాలు భీముడికి లోబడకూడదని అయుధ దైవతాలను ధర్మజుడు ప్రార్థించడం వ్యాసభారతంలో లేదు. దాన్ని తిక్కన మొదటగా కల్పించినాడు.

ఉ॥ "భీముడు ధార్తరాష్ట్రకుల భీషణ రోషఁడు, చిత్త మెప్పుడె
ట్టైమదమెత్తునో, యతని యాగ్రహవృత్తికి లోనుగాక మీ
రే మెయినైన వంచన వహించి తొలంగుట మత్ప్రమీహితం
బేమఱకుండగా వలయు నిర్విషమాబ్దములోన నాతనిన్"

(విరాట, ప్రథమాశ్వాసం-177)

ఇదే అంశాన్ని కుమార వ్యాసుడు కూడా ప్రస్తావించాడు.

"ఈ వుదా బెడిదరె పార్థం
గీ వుదీ యజ్ఞాత వాసదా
ళీ విగడ భీమంగె కొడదిరి"

(కుమార వ్యాసభారతం, విరాట, సంధి 1, షట్పది 14)

"ఈ అజ్ఞాతవాస వత్సర కాలంలో అర్జునుడు కోరినట్లైతే ఈయండి. దుడుకుతనంగల భీముడు కోరినట్లైతే ఈయకండి' అని కుమారవ్యాసుడు. ఈ విధంగా అనేక సందర్భాల్లో తిక్కన ప్రభావం కుమార వ్యాసునిపై కన్పిస్తుంది.

కన్నడ సాహిత్యంలో లక్ష్మీశుడు అనే కవి రచించిన 'జైమిని భారతం' అనే మరొక కావ్యం కూడా వార్ధక షట్పదిలో ఉంది. ఇది కూడా అత్యంత జనాదరణ పొందిన నాదమాధుర్యం గల స్వతంత్ర కావ్యం. వీర రస ప్రధానమైన ఈ కావ్యంలో అనేక యుద్ధాలు చోటు చేసుకున్నాయి. లక్ష్మీశకవి ఉపమాలంకార ప్రియుడు. కన్నడదేశ యక్షగానాలపై లక్ష్మీశుని ప్రభావం అధికంగా కన్పిస్తుంది. పిల్లలమఱ్ఱి పినవీరభద్రుని తెలుగు జైమినీ భారతాన్ని ఈ కవి చూసి ఉండవచ్చు. ఈ రెండు కావ్యాల తులనాత్మక పరిశీలన ద్వారా తెలుగు కన్నడ సాహిత్య బాంధవ్యాన్ని మరింత బలీయం చేయవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. తమిళ వాఙ్మయ చరిత్రము, ము. వరదరాజన్, అనువాదం- తిమ్మావజుల కోదండరామయ్య, సాహిత్య అకాడమి, ఢిల్లీ.
2. కన్నడ సాహిత్య చరిత్ర, ఆర్వీయస్. సుందరం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు.
3. దక్షిణ భారత సాహిత్యములు, చల్లా రాధాకృష్ణశర్మ. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు.
4. తెలుగు కన్నడ భారతముల తులనాత్మక పరిశీలనము (తిక్కన, కుమార వ్యాసుల విరాటోద్యోగ పర్వములు) డా॥ బి.వి.ఎస్. మూర్తి, (తి.తి.దే. వారి ఆర్థికసహాయం)
5. తమిళాంధ్ర భారతముల తులనాత్మక పరిశీలనము, శ్రీ వి.ఎస్. రాఘవన్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి. హైదరాబాదు.
6. మలయాళ వాఙ్మయ చరిత్రము, పి.కే. పరమేశ్వరన్ నాయర్, (డా॥ దివాకర్ల వేంకటావధాని). సాహిత్య అకాడమీ, ఢిల్లీ.
7. పంపకవి-తిక్కన, శ్రీ గడియారం రామకృష్ణశర్మ.
8. తిక్కన భారతం - మలయాళ భారతం, డా॥ ఎన్. భక్తవత్సలరెడ్డి, తిక్కన తిరునాళ్ళ 716వ వర్ధంతి సప్తాహ సంచిక, నెల్లూరు.
9. శ్రీమదాంధ్ర మహాభారతం, తి.తి.దే., తిరుపతి.
10. విక్రమార్జున విజయ, పంప, కన్నడ సాహిత్య పరిషత్తు, బెంగళూరు
11. గదాయుద్ధ, రన్న, కన్నడ సాహిత్య పరిషత్తు, బెంగళూరు.
12. గదుగిన భారత - ఒందు సాహిత్య అధ్యయన, జవరేగౌడ, కర్ణాటక విశ్వవిద్యాలయం, ధారవాడ.
13. మహాభారత కిళిప్పాట్టు, ఎళుత్తచ్చన్.
14. మహాభారతము - సాహిత్య అకాడమి, ఢిల్లీ.
15. ఆంధ్రసాహిత్య చరిత్ర, పింగళి లక్ష్మీకాంతం, హైదరాబాదు
16. తిక్కన, కుమార వ్యాస భారతముల తులనాత్మక పరిశీలన, జగన్నాథాచార్, అనంతపురం.
17. భారత కథా మంజరి - కుమారవ్యాస.

★★★

# నిషిద్ధాక్షరి - సామాజిక చైతన్యం

- ఉషారాణి పిల్లి, తెలుగు శాఖాధ్యక్షులు, యస్.వి.డి., జి.డి.సి. (ఉమెన్), నిడదవోలు, పశ్చిమ గోదావరి జిల్లా.

1986లో తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన నాటక పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన నాటకం "నిషిద్ధాక్షరి". రచయిత పాటిబండ్ల ఆనందరావు. ఈ నాటకంలో పాత్రోచిత భాష ఉపయోగించటం వల్ల ఈ నాటకం ప్రతిఒక్కరి మనసును తాకి, మానవత్వాన్ని తట్టిలేపుతుంది. స్థూలంగా నాటక ఇతివృత్తాన్ని పరిశీలిస్తే...

నాలుగు భాగాలతో, నాలుగు కుటుంబాలు కాపురం ఉండటానికి అనువుగా ఉన్న గృహమది. దీని యజమాని మిత్ర. ఈ ఇల్లు మిత్ర సొంతం కాకపోయినా, ప్రస్తుతం ఆ ఇంటి హక్కు దారుడు మిత్రనే. సభ్యత, సంస్కారం కలిగి, అభ్యుదయభావాలుగలవాడు ఇతను. మిత్ర ఇంట్లో ఒకభాగంలో భగీరథశాస్త్రి అద్దెకుంటాడు. కట్టు, బొట్టు, మడి మొదలైన ఆచార సంప్రదాయాలన్నీ పాటిస్తున్న పరమ నిష్ఠాగరిష్ఠుడు భగీరథశాస్త్రి. ఇతడు బ్రాహ్మణుడు, వర్ణవ్యవస్థ మీద ప్రగాఢమైన విశ్వాసం కలవాడు. ఆకలితో అలమట్టించడానికైనా సిద్ధమే కాని, వర్ణ ధర్మాలకు భంగం కలిగితే మాత్రం ఇతడు సహించడు. దళితులు ఆలయ ప్రవేశం చేశారని ఆలయ ధర్మకర్త పదవిని, దేవుని మాన్యాలను వదులుకున్న వాడితను. ఇతనికి ఒక కొడుకు, పేరు భైరాగి. నిజంగానే ఇతడు సార్థకనామధేయుడైన భైరాగే... భగీరథశాస్త్రి కూతురు అరుంధతి.

ఆ ఇంట్లో మిగిలిన భాగాల్లో ఒక పక్క ఆకాశరావు, మరో పక్క వర్ధనం ఉంటారు. ఆకాశరావు అవకాశ వాది. ఎటు పక్క గాలి వీస్తే అటు కొట్టుకుపోయేరకం. వర్ధనం ప్రభుత్వ ఉద్యోగి, ఆఫీసర్ స్థాయి కలవాడు. ఇతడు దళితుడు. వర్ధనం అరుంధతిని పెళ్ళి చేసుకోవాలనుకుంటాడు. తన మనసులోని మాటను ఆమెతో చెప్తాడు... ఆమె సమాధానం ఇవ్వదు... కానీ నవ్వుగా నవ్వుతుంది. వర్ధనంతో తన పెళ్ళి విషయం గురించి మిత్రతో చెబుతుంది. దళిత పురుషుడికి, బ్రాహ్మణ స్త్రీకి కులాంతర వివాహం జరగడం ఇతనికి ఇష్టమే... మంచిదని చెబుతాడు. కాని, తన తండ్రిని ఒప్పించే బాధ్యత మిత్రమీదే పెడుతుంది అరుంధతి. అందుకు మిత్ర అంగీకరిస్తాడు.

ఒకరోజు అద్దె ఇంటికోసం మిత్ర ఇంటికి వచ్చిన ఎర్రన్న భగీరథశాస్త్రిని చూస్తాడు. శాస్త్రి ముఖంలో రంగులు కనిపిస్తాయి. ఇది గమనించిన ఎర్రన్న తనకిక ఇల్లు దొరకదని వెళ్ళిపోతుంటాడు. కారణం అతడు హరిజనుడు. విషయం తెలుసుకున్న మిత్ర ఇల్లు అద్దెకిస్తాడు. తర్వాత వర్ధనం ఎర్రన్న కొడుకని తెలుసుకుంటాడు మిత్ర. తండ్రీకొడుకులిద్దరూ ఒకేచోట ఉంటారు. కాని, భగీరథ శాస్త్రి మాత్రం అక్కడ ఉండటానికి ఇష్టపడడు. కారణం - ఎర్రన్న అతనికి సుపరిచితుడు. వీళ్ళకు పొత్తు కుదరదు. అందుకు కారణం ఎర్రన్న కులమే. కాని, తన ఆర్థిక ఇబ్బందులచేత, మిత్రతో తనకున్న పరిచయం చేత అక్కడే ఉండి పోతాడు భగీరథశాస్త్రి.

కొంతకాలం గడిచింది - వీలు చూసుకొని వర్ధనం, అరుంధతిల పెళ్లి విషయం మిత్ర భగీరథశాస్త్రితో ప్రస్తావిస్తాడు. ఇంకేముంది? దిగ్గున లేచి భగ్గున మండుతాడు శాస్త్రి ఎట్టకేలకు అతన్ని ఒప్పిస్తాడు మిత్ర. తర్వాత ఎర్రన్నతో చెబుతాడు. ఎర్రన్న అంగీకరించడు. కారణం అడుగుతాడు మిత్ర. ఎర్రన్న గతాన్ని తవ్వడం ప్రారంభిస్తాడు...

ధనానికి కుబేరుడు, హింసకు రాక్షసుడు... దళితుల పాలిట యముడు అయిన చెంగల్రాయుని ఏలుబడిలో ఉన్న గ్రామమది... చెంగల్రాయుని మోసాలను, అమానుష చర్యలను కప్పిపుచ్చి తీర్పు చెప్పడానికి నియ

మించబడిన న్యాయమూర్తి భగీరథశాస్త్రి. ఆ ఊరివెలుపల నివసిస్తున్న వాడు భరతమాత పంచమపుత్రుడు. అతని పేరు మాల బగాది. అతనికి ఇద్దరు కుమారులు. పెద్దవాడు చిన్నోడు. రెండోవాడు అబ్బిగాడు.

మిట్ట మధ్యాహ్నం చిన్నోడికి దాహమై నాలుక పిడచ గట్టి ప్రాణం పోయే స్థితి. సవర్ణులు వచ్చి నీళ్ళు పోస్తారని గంటలకొద్దీ ఎదురు చూశాడు. కాని, వాళ్ళు రాలేదు. దాహం దహిస్తుంది. కోనేట్లోకి దిగి నీళ్ళు ముంచు కుంటాడు. చెంగల్రాయుని కడుపు మండింది... కళ్ళలో నిప్పులు కురిశాయి... ఇంటికి వచ్చి భగీరథ శాస్త్రితో చెప్పి, చిన్నోడికి గ్రామబహిష్కరణ తీర్పు ఇప్పిస్తాడు. చిన్నోడు చెప్పే మాటలు బగాది కూడా వినిపించు కోడు. కారణం - పెద్దవాళ్ళు చేసే మోసాలు తనకు తెలియకకాదు... ఎదురు తిరిగి బతకలేక, చెంగల్రాయుడు చిన్నోణ్ణి శిక్షించడానికి కారణం కోనేట్లో నీళ్ళు ముంచుకున్నాడని కాదు. తన కూతురుతో మాట్లాడినందుకు. తన కూతురు చిన్నోణ్ణి ప్రేమించినందుకు, తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగినందుకు...

అర్ధరాత్రి... కారుచీకటి... ఎర్రన్న కొడుకు కన్నయ్య చిన్నోడికి కట్టిన కట్లు విప్పుతాడు. చిన్నోడు పారిపోవడానికి ఊరి పొలిమేరలు తాకుతాడు... అంతే! చెంగల్రాయుని మనుషులు చిన్నోణ్ణి చంపుతారు...

తెల్లవారింది... బగాది కొడుకు శవాన్ని మోసుకొని వస్తాడు. చెంగల్రాయుడు, భగీరథశాస్త్రి ఇది చూస్తారు... చెంగల్రాయుడు తనకేమీ తెలియనట్లు నటించి సాను భూతి చెబుతాడు. బగాది అతని మాటలు నమ్మడు. 'నా కొడుకును చంపింది నువ్వే'నని చెంగల్రాయునితో గొడవ పడతాడు. దీంతో కన్నయ్య ఉక్రోషంతో బల్లెం తీసుకొని చెంగల్రాయుని చంపడానికి ప్రయత్నిస్తాడు. బగాది అడ్డుపడతాడు... ఈ అవకాశాన్ని వినియోగించు కున్న చెంగల్రాయుడు లఘువుగా బల్లెం లాక్కొని కన్నయ్యను చంపుతాడు. ఇదంతా చూసి కూడా భగీరథ శాస్త్రి ఒక్క మాటైనా కోర్టులో చెప్పడు... ఇక తన చిన్న కొడుకు అబ్బిగాడు అక్కడే ఉంటే బతకనివ్వరని, తన అన్న ఎర్రన్న దగ్గరకు చదువుకోసం పంపుతాడు బగాది. ఆ బాలుణ్ణి ఎర్రన్న చదివించి, పెద్దవణ్ణి చేసి, ప్రయోజ కుణ్ణి చేస్తాడు. ఆనాటి బగాది కొడుకు అబ్బిగాడే ఈనాటి ఎర్రన్న పెంపుడు కొడుకు వర్ధనం..." అని చెప్పి అశ్రు పూరితమైన కళ్ళొత్తుకుంటూ ఈ లోకంలోకి ఎర్రన్న వస్తాడు... చివరికి బగాదికి, మీ కందరికి ఇష్టమైతే కానీయండని చెబుతాడు...

అందరి అంగీకారంతో పెళ్ళి నిశ్చయమౌతుంది... ఇక్కడ నుండి కథ మరో మలుపు తిరుగుతుంది. ఒకరోజు బగాది కొడుకు దగ్గరకు వస్తాడు. బగాది రావడం వర్ధ నానికి ఇష్టముండదు. కారణం - తాను చేసుకోబోయే అమ్మాయి బ్రాహ్మణ కులానికి చెందింది కావడమే. న్యూనతాభావం అతనిలో చోటు చేసుకుంటుంది. వెంటనే బగాదికి పది రూపాయలిచ్చి హొటల్లో భోజనం చేసి అట్నుంచి అటే ఇంటికి వెళ్ళిపొమ్మంటాడు వర్ధనం. బగాదికి నోట మాట రాలేదు... దు:ఖం పెల్లుబుకు తుంది... కళ్ళు వర్షిస్తాయి... కాళ్ళు తడబడతాయి... నిరాశ, నిస్పృహతో, అవమానంతో బయటికి వస్తూ భగీరథశాస్త్రికి ఎదురవుతాడు. బగాదిని చూసిన భగీరథశాస్త్రి మంచి మనస్సుతో, మానవత్వంతో, గతాన్ని మరచిపోయి, తన బ్రాహ్మణాధిక్యాన్ని అవతల పెట్టి అతని భుజం మీద చేయి వేసి ఇంటికి తీసుకువస్తాడు.

కొడుకుచే అవమానింపబడి, అసహ్యించుకోబడిన బగాదికి, ఆ అవమానం నుండి ఇంకా బయట పడక ముందే భగీరథశాస్త్రి ఆదరణ చూసి సంతోషపడతాడు. ఇక్కడ కూడా బగాది మాట్లాడడు. ఇక్కడ ఆనందంతో మాట రాలేదు... అక్కడ దు:ఖంతో మాట్లాడలేదు... ఇంతలో అరుంధతి బగాదికి ఫలహారం తెస్తుంది. కుర్చీలో కూర్చొని తినమంటాడు శాస్త్రి... అందుకు తల అడ్డంగా తిప్పి కింద కూర్చుంటాడు బగాది. బయటికి పోయివచ్చిన ఎర్రన్న, తమ్ముడు కింద కూర్చోవటం చూసి శాస్త్రిపై మండిపడతాడు. తర్వాత బగాది ద్వారా విషయం తెలుసు

కొని ఎర్రన్న పశ్చాత్తాపపడతాడు... శాస్త్రిని క్షమించ మంటాడు... తర్వాత వర్ధనాన్ని పిలిచి చెంప ఛెళ్ళుమని పిస్తాడు.

బగాది, భగీరథశాస్త్రి వియ్యంకులుగా తాంబూలాలు మార్చుకునే సమయం. ఇక్కడే కథ అనుకోని మలుపు తిరుగుతుంది. అరుంధతి ఈ పెళ్ళి నాకిష్టం లేదం టుంది... కారణం అడుగుతారు పెద్దలు... 'కుల మతాలు మరిచి, సర్వమానవ సమానత్వానికి కంకణబద్ధులై ఉన్న ఈ తరుణంలో, వర్ధనం ఇంకా తను దళితుడని, తక్కువ కులంవాడిననే న్యూనతాభావం నుంచి బయటపడ లేదు..., కేవలం తన కులాన్ని దాచి పెట్టుకోవడానికి నన్ను వివాహం చేసుకోవాలనుకున్నాడేగాని, సమానత్వంతో కాదు... భావదాన్యంతో మగ్గుతున్న వర్ధనంతో నేను జీవితాన్ని పంచుకోలే'నంటుంది అరుంధతి. ఆమె అభిప్రాయానికి ఎవరూ అడ్డురారు.

ఈ నాటకంలో 'ఎర్రన్న, వర్ధనం, బగాది, చిన్నోడు, కన్నయ్య, పోలయ్య' వీళ్ళందరూ దళితులు... వీళ్ళం దరిలో చైతన్యవంతమైన పాత్ర ఎర్రన్న ఒక్కడే... ఇతను పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగి. కులం కారణంగా అగ్రవర్ణుల అన్యాయాలను ఎదిరించి ప్రాణం పోగొట్టుకున్న కన్నయ్య తండ్రి ఎర్రన్న.

వర్ధనం కులం పేరుతో అగ్రవర్ణుల చేత అవమానింప బడి కష్టాలు అనుభవించినట్లు కనపడదు... కానీ తాను తక్కువ కులం వాడిననే న్యూనతాభావంతో ఉంటాడు. దీని కారణం గానే అరుంధతి పెళ్ళి చేసుకోవడానికి తిరస్క రిస్తుంది... అంతేకాకుండా - కన్నతండ్రి అనే ప్రేమ లేకుండా నైతిక బాధ్యత స్వీకరించకుండా తన గౌరవాన్ని కాపాడుకొనేందుకు, తన స్టేటస్‌ను నిలబెట్టుకొనేందుకు తనను చూడ్డనికి వచ్చిన తండ్రినే ఇంటి నుండి వెళ్ళిపొమ్మని అవమానించిన ఘనుడు వర్ధనం.

దళితుడైన వర్ధనానికి, బ్రాహ్మణ స్త్రీ అయిన అరుంధతి పరస్పరం ప్రేమకు లోనవుతారు... ఇరు పక్షాల పెద్దలు ఎట్టకేలకు వీళ్ళను భార్యాభర్తల్ని చేయడానికి ఒప్పు కుంటారు... అయితే అరుంధతి వధువుగా మారే తరుణంలో పెళ్ళిని తిరస్కరిస్తుంది... కారణం, వర్ధనం తనంతకు తాను దళితుడననే న్యూనతాభావంతో ఏ ఆదర్శ సిద్ధాంతాలకూ కట్టుబడక కేవలం తన కులాన్ని కప్పిపుచ్చుకొనేందుకు, నైతికమైన విలువలను అతి క్రమించి కన్నతండ్రిని అవమానపరచి, అసహ్యించు కొన్నందుకు పీటలదాకా వచ్చిన పెళ్ళి ఆగిపోతుంది.

ఎవరికంటే ఎవరు తక్కువ కాదు... ఎక్కువకాదు... వ్యక్తి అర్హతల్ని నిర్ణయించేది కులాలు కాదు... స్వరూప స్వభావాలు... తమ పట్ల, తమ సిద్ధాంతాల పట్ల, ఆశలు, ఆశయాల పట్ల స్థిరమైన, దృఢమైన నమ్మకం, విశ్వాసం ఉన్నప్పుడే వర్ణాంతర వివాహాలు ఫలిస్తాయి. కులాలు కూలిపోతాయని ఈ నాటకం చెబుతుంది.

'నిషిద్ధం' అంటే తొలగించడం, వదిలివేయడం, విడిచి పెట్టడం, లేకపోవడం మొదలైన అర్థాలు చెప్పుకోవచ్చు. 'అక్షరి' అంటే అక్షరాలు కలది అని అర్థం. ఇక్కడ ఏది నిషిధం అనేది ప్రశ్న. మాలమాదిగ అక్షరాలు నిషేధిం చడం. ఈ సంఘం 'మాలమాదిగ' అక్షరాలు నిషేధిం చింది... అందుకే ఈ సంఘం నిషిద్ధాక్షరి.

నిషిద్ధాక్షరి నాటకంలో మానవ ప్రగతిని నిలువునా కాల్చివేస్తున్న పదం 'కులం.' ఇదే మానవునిలోని ప్రేమ, అనురాగం, ఆత్మీయత, సమానత్వం, సౌభ్రాతృత్వాలను అధఃపాతాళానికి తొక్కి పశువుగా, రాక్షసునిగా మార్చేది. మనిషి ఇలా నీతి బాహ్యునిగా, ధర్మరహితునిగా, అసమానవాదిగా మారడానికి మూలం 'కులం.' దీన్ని విడిచిపెట్టండి... కులరహిత సమాజానికి పునాదులు వేయండి... ఆ పునాదుల మీద ఒక భవనాన్ని నిర్మించి, దానికి సమత అని నామకరణం చేయండని పాటిబండ్ల ఆనందరావు ఈ నాటకం ద్వారా సందేశమిచ్చారు.

★★★

# శ్రీ లోగిశ లక్ష్మీనాయుడు 'మహానది' కథలోని పర్యావరణ, సామాజిక, ఆర్థిక, మానవీయ సంబంధాల పరిశీలన

- శివయ్య రాజులపాటి, పరిశోధక విద్యార్థి, ఆంధ్ర విశ్వకళా పరిషత్.

లోగిశ లక్ష్మీనాయుడు- సింహాచలం, విశాఖపట్నం జిల్లా నివాసి. అనేక దిన-వార-పక్ష-మాస పత్రికలలో కథలు, కవితలు రాస్తున్నారుబీ అనేక బహుమతులు, ప్రశంసలు పొందుతున్నారు. బాలసాహిత్యంలో విశేషంగా కృషి చేసారు. సినిమా పాటనూ స్పృశించారు. ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రం ద్వారా వీరి కథలు, నాటికలు, కవితలు ప్రసారమయ్యాయి. వృత్తి రీత్యా తాను పని చేస్తున్న విశాఖపట్నంలోని నావల్ డాక్ యార్డ్‌లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో క్రమం తప్పక బహుమతులు సాధిస్తున్నారు. ఒక యథార్థ సంఘటనను సామాజిక మాధ్యమాల్లో ప్రస్తావించినప్పుడు ఎంతోమంది మానవతా వాదులు స్పందించి కూర్చిన ఆర్థిక సహకారాన్ని, సదరు సంఘటన మూలంగా ప్రభావితులైనవారికి అందించినప్పుడు తన అక్షరాలకు సాహితీ ప్రయోజనం చేకూరిందని చెప్తూ సంతృప్తిని వ్యక్తం చేసారు.

## కథా సంగ్రహం :

సామాజికంగా మనిషి బాధ్యతని, నియమాలు సూత్రాలు కట్టుబాట్ల విధానాలకు అతీతంగా మానవీయ కోణంతో ముడి పెట్టమని, అందుకు పదుగురూ కలిసి వచ్చేదాకా వేచి చూడకుండా ముందుగా ఒక అడుగు వేయమని, గుర్తుచేస్తున్న కథ ఇది.

చినుకు చినుకు కలిస్తే వాన, బిందువు బిందువు కలిస్తే సింధువు - ఎంతో సరళంగా నీటి పొదుపు-దాని అవశ్యకత గురించి చెప్తూ, పర్యావరణ పరిరక్షణ-మనిషి ప్రాణ రక్షణ అని చెప్పిన కథ ఇది. ఈ రక్షణలన్నీ మన సామాజిక బాధ్యతలనీ, అవి తరం నుండి తరానికి కొనసాగుతూ ఉండాలని చెప్తూ, అందుకు తగ్గ స్ఫూర్తిని కలిగించిన కథ 'మహానది'.

రామం ప్రౌఢ వయసు వాడు, గంగాధరం అనుభ వజ్ఞుడైన వయోధికుడు. ఇద్దరికీ సింహాచలం కొండ మీద పరిచయం, ఉదయం నడకలో. నమస్కారం, ప్రతి నమస్కారాలతో మొదలైన వీరి పరిచయం, ఇద్దరినీ ఆత్మీయులుని చేస్తుంది, ఆపై గురుశిష్య బంధమై కొనసాగుతుంది.

గంగాధరం గారు ప్రకృతి ప్రేమికుడు, పర్యావరణ పరిరక్షకుడు. నగర కాలుష్యానికి గురై భార్య గతించాక, సింహాచలం వచ్చి పచ్చని చెట్ల మధ్య ఏర్పాటు చేసుకున్న ఇంట్లో ఒంటరిగా జీవిస్తూ, చుట్టూ ఉన్న వారిలో పర్యావరణం పట్ల స్పృహ కలిగిస్తూ ఉంటారు.

నీరు ఎక్కడ వృథాగా పారుతున్నా దానికి తగ్గ ఏదో ఉపాయం చేసి వృథాని తగ్గిస్తూ ఉంటారు. చుట్టుపక్కల పిల్లలకి నాలుగు అక్షరం ముక్కలు నేర్పుతూనే నీటి పొదుపు గురించి చెప్తూ ఉంటారు.

ఇవన్నీ నచ్చేసిన రామం ఆయనకి కొడుకులా, శిష్యుడిలా కుడిభుజంగా ఉంటాడు. ఎన్నో విషయాలు ఇద్దరూ కలబోసుకుంటూ ఉంటారు. ఏనాటికైనా, వీలైతే వెంటనే, సింహగిరి దిగువన కొండచుట్టూ కందకం తవ్వించి, గిరిశిఖరం మీంచి ప్రవహించే నీటి ప్రవాహాల్ని, వర్షాకాలంలో పొంగే వాటి ఉధృతిని ఆ కందకంలోకి మళ్లించి, నగరంలో నీటి ఎద్దడి లేకుండా చెయ్యాలనే ఆలోచన గంగాధరం గారిది. రామం కూడా ఆ దూరా లోచనని బలపరుస్తాడు.

సృష్టికి మూలాధారమైన నీటిని పొదుపుగా వాడు కుంటూనే, భూగర్భ జలాల్ని తిరిగి నింపుతూ ఉండాలని, నేడో రేపో నీటి కోసం యుద్ధాలు జరిగి ప్రపంచ జనం-దేశాలు తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉందని అందరికీ తెలియచెప్తూ ఉంటారు ఈ గురుశిష్యులు ఇద్దరూ.

ఎవరో ఒకరు ముందడుగు వేసి నీటి వృథాని అరికడుతూ సాటి వారికి ఉదాహరణగా నిలవాలి, వారిలో కదలిక తేవాలనే ప్రయత్నంలో, వీధి కుళాయిలు తిప్పి వదిలేసి పోయే వారిని చూసి భాధపడుతూ వాటిని కట్టి మరీ తనదారిన తాను వెళ్ళే అలవాటు గంగాధరం గారికి ఉంటుంది.

భగీరథుడు ఆనాడు ఆకాశగంగను భూమికి తెచ్చి ఇక్కడే ఉండేలా చేశాడు కనుక, మనం అందరం సంతోషించాలి.

ఇపుడు చూస్తే తాగునీరే కలుషితం, ఉన్నదాన్నీ నేలపాలు చేసుకుంటున్నాం. వీధుల్లో, ఆసుపత్రుల్లో, కార్యాలయాల్లో, పనిచేసే చోట, హెూటళ్లలో, మన ఇళ్ళల్లో వృథాగా పోయే నీటిని చూస్తే ప్రాణమే పోయి నంత పనౌతుంది గురుశిష్యులకి. ఏదో ఒకనాడు భూమి వేడెక్కిపోయి అది చల్లబడ్డానికి చాలినంత నీళ్ళు కరవై, గ్లోబల్ వార్మింగ్ తో భూగోళం బద్దలైనా ఆశ్చర్యంలేదని చెవినిల్లుకట్టుకొని చెప్తూంటారు.

వినేవాళ్ల హృదయాల్లోకి అది చేరాలి కదా!

ఈ నీటి చాదస్తం భరించలేక కోడలు, మనవలు విసుక్కుంటారనే ఉద్దేశంతో, కుటుంబంలో కలతలు వద్దనే దూరాలోచనతో, కొడుకు తమవద్దకొచ్చి ఉండ మన్నా గంగాధరం గారు వద్దనేస్తారు. ఒకరోజు, ఒంటరిగా తన కుటీరంలోనే కన్నుమూస్తారు. రామం బాధ చెప్పలేకుండా అయిపోతుంది.

నిర్మలమైన నదిలా, పవిత్ర గంగలా, పరమార్థం కలిగించే తులసీజలంలా, గంభీర సముద్రంలా నిండుగా ఉన్న గంగాధరం గారి విగ్రహం చూసి ఏదో తెలియని భావం అలుముకొంటుంది రామాన్ని. గంగాధరం గారు రాసి పెట్టిన ఒక ఉత్తరం తెచ్చి ఇస్తాడు ఆయన కొడుకు, రామం చేతికి.

తన అంతిమ సమయంలో ప్రాణం లేని శరీరానికి కడవల కొద్దీ నీటితో స్నానం చేయించవద్దనీ, తులసి నీళ్ళు చల్లితే చాలునని ఉంటుంది అందులో.

ఏదోనాడు ఇలా జరగొచ్చని ముందే తనకు కొడుకు కంటే ఎక్కువైన రామం పేర ఉత్తరం రాసి ఉంచారు ఆ పెద్దమనిషి.

ఇంకా, తన బ్యాంకు ఖాతాలో ఉన్న సొమ్ముతో, దేవస్థానం వారిని ఒప్పించి ఆ కందకం పని పూర్తి చేయించే కర్తవ్యం రామానికి అప్పగిస్తారు, ఆ ఉత్తరంలో అవన్నీ రాసి పెట్టారాయన ముందుగానే.

ఆయన కొడుక్కి ఇదంతా అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత కూడా రామానికే అప్పగించారు. చివరి క్షణం గురించి ఊహించి, తన ప్రయత్నాలు తన పరోక్షంలో కూడా సవ్యంగా జరగాలని కోరుకున్న ఆయన ముందు చూపు, నీటి పరిరక్షణ పట్ల ఆయనకున్న తపన తెలిసిన వాడు కాబట్టి, ఆ మహాత్ముడి చివరి కోరికని ఆయన కొడుక్కి చెప్పేందుకు సిద్ధమవుతాడు రామం. గంగాధరం గారిని ఓ గొప్ప 'మహానది'లా భావించుకొని నమస్కరించు కుంటాడు.

## ప్రస్తుత సామాజిక స్థితి - మానవ నిర్లక్ష్యం :

ఒక పెద్ద నిర్లక్ష్యం గొప్ప ప్రమాదాన్ని తెచ్చిపెడు తుందనే తెలివిడి కొరవడిన సమాజంలో పస్తుతం మనం ఉన్నాం. వినడానికి కటువుగా అనిపించినా సరే, భూమ్మీద అత్యంత బాధ్యతారహిత జీవి మనిషి ఒక్కడే, ఇందులో మరి రెండోమాట లేదు.

వేళకి కుళాయిలో మంచినీళ్లు రావడం లేదని అరిచి గగ్గోలు పెట్టేదీ మనిషే, సరఫరా చేస్తున్న నీటిని కావాల్సి నంత పట్టి పెట్టుకున్నాక మిగతా నీటిని నేలపాలు చేసి

వృథా చేసేదీ ఆ మనిషే. కొంచెం కూడా ఇంగితం లేకుండా ప్రవర్తిస్తూ ఉంటారు, చాలామంది.

గుక్కెడు నీళ్ళు సమయానికి దొరక్క అల్లాడిపోయిన మనిషి, ఆసక దొరికిన నీటిని ఊర్కే పారబోస్తూ ఉంటే చూసేవాళ్ళకి, అంటే నీటి విలువ తెలిసిన వాళ్ళకి, కడుపు మండిపోతుంది.

ఏ ఎడారి ప్రాంతం వారినో, మెట్ట ప్రాంతం వారినో అడిగి చూడండి, నీళ్ళ కోసం ఆ ప్రాంతాల మహిళలు ఎన్నెన్ని యోజనాలు నిత్యం నడిచి వెళ్లొస్తుంటారో తెలుస్తుంది. అంతదాకా ఎందుకు, బహుళ అంతస్తుల అపార్టుమెంటు వాసులకి తెలియవూ నీటి వెతలు! అయినా సమాజం నీటి వాడకం విషయంలో చాలా నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోంది, ఇది ఒప్పుకుతీరాల్సిన సత్యం.

నీళ్ళ ఎద్దడికి ఏడవడం, పనయ్యాక నీటి కుళాయిలు కట్టకపోవడం, దారినపోతున్నప్పుడు కంటికి నీళ్ళు కారిపోతూ కనిపించినా సరే ఓ అడుగు అటువేసి దాన్ని ఆపే బాధ్యత వహించకపోవడం, ఇన్ని అవలక్షణాలని సరిచేసుకుంటూనే, దూరదృష్టితో ఆలోచించి నీటిని నిల్వ చేసేందుకు కొండ చుట్టూ కందకం తవ్వే ఆలోచన చేసిన పొరుడి కోరిక తీరుతుందా అంటే చెప్పలేని పరిస్థితి, కాకపోతే ఆశావహ ప్రయత్నం మానకుండా ఉండటం, ఒక్కరైనా పూనుకోవడం - ఇది ఈ కథలో వినిపించిన సామాజిక స్థితి.

**పూనిక :**

ఆశావహ దృక్పథం, అందుకు తగిన కృషి, ఆ కృషిలో చుట్టూ ఉన్నవారిని మమేకం చేసే ప్రయత్నం, దాని ఫలితంగా భూమ్మీద ముఖ్యమైన జలవనరుని కాపాడుకోవడంలో మనిషికి ఉన్న అవసరం.. ఆ స్వార్థంతో అన్నా నీటి వృథాని ఆపాలనే తపన అడుగడుగునా మనకీ కథలో కనిపిస్తుంది.

సమాజాన్ని ఒక్కసారిగా ఎటూ మార్చుకోలేము, కానీ ఒక్కరొక్కరిని మంచి అడుగులు వేయిస్తూ వెళుతుంటే, ఆ ఒక్కడు మరొకరిని, తిరిగి వీరందరూ ఒక్కొక్కరిని తమ వైపు మళ్లించుకుంటూ వెళితే ఒకనాటికి ఆ మంచి మజిలీని చేరుకుంటాం. ఆ మజిలీలో దొరికిన మంచి నీటిని తాగి దాహార్తిని తీర్చుకుంటాం, మరికొందరి గొంతు తడపగలుగుతాం.

ఈ నేపథ్యంలో ఆర్థిక, మానవీయ సంబంధాల్ని పాత్రల మనోగతం లోంచి పరిశీలించడం జరిగింది.

**పాత్రల మనోచిత్రణ :**

గంగాధరం గారి మాటల్లో, చేతల్లో ఈ పూనిక కనిపిస్తూనే ఉంది, "నీరు లేక నీవు లేవు, నీవు లేక జనం లేరు, జనం లేక జగం లేదు, జగం లేక యుగం లేదు" అన్న మాటల్లో సత్యం విప్పారినట్టు కనిపిస్తోంది. వింటున్న వారి కళ్లే ఇంకా విచ్చుకోవట్లేదు. కుళాయిలోంచి కారిపోతున్న నీళ్ళు కనిపించడం లేదు. మనసుకి తెలియట్లేదు. ఆ కుళాయి కట్టడానికి గంగాధరం పేరున్న వాళ్ళు వీధికి ఎందరుండాలి, ఊరికి ఎందరు రావాలి?

"వాన నీటిని ఒడిసి పట్టాలి, మంచి మనిషిని వెతికి పట్టాలి" అని తపించిపోయేవారు. ఇంత చక్కగా చెప్తేనే వినని మనుషులు, బెత్తం పుచ్చుకుంటే వింటారా అంటే చెప్పలేం. పట్టించుకోకుండా వెళ్లిపోతే కష్టం కదా. అందుకే లోకం విడిచిపోయినా సరే, రామం లాంటి వాళ్ళు గంగాధరాలై ఆ కొండకింది కందకం పని పూర్తి చేసి, నీటిని ఒడిసి పట్టే పనిని పూర్తి చెయ్యమని పురమాయించారు.

అలాంటి ఉత్తమమైన గంగాధరం గారి మనస్తత్వాన్ని వారి మాటల్లో చాలా స్ఫుటంగా ధ్వనింపజేసారు రచయిత. సాటి మానవుల పట్ల అయాచితంగా గంగాధరం గారు కురిపిస్తున్న మానవీయత ఇదే.

రామం కూడా ఎంతటి సౌహార్దం కలవాడో, గంగాధరం గారిని తానే స్వయంగా పలకరించడంలోనే తెలుస్తోంది. సింహగిరి చుట్టూ నడక తన ఆరోగ్యానికి సంజీవినీ మొలకగా నమ్మిన అతని మనోనిర్మలత్వం బాగా నచ్చి తీరుతుంది.

ఈ సచ్చడం వెనుక ఉన్న అసలు సంగతి ఏంటంటే, ప్రకృతిని ఉన్నదున్నట్టుగా ఉంచితేనే మనిషికి మనుగడ అనే సంగతిని ముమ్మాటికీ నమ్మే సగటు జీవిగా, ఆ ప్రయత్నంలోనే ఎంతో చేస్తున్న పెద్దాయనకు అన్ని రకాలా తోడుగా ఉండి, కన్నకొడుకులా మారిపోయాడు. ఆయన తదనంతరం, ఆయన చేసే ప్రకృతి రక్షణ బాధ్యతలు తాను తీసుకోవడానికి సిద్ధమయ్యాడు.

మొత్తం చిన్నదే అవుగాక, తను దాచిన సొమ్మునంతా ప్రజల సౌకర్యానికి వెచ్చించమనే బాధ్యత రామానికి అప్పగించడం వెనుకు ఆర్థిక లాభం ఏమీ లేదు గంగా ధరం గారికి. ఆ అర్థాన్ని అర్థవంతంగా ఖర్చు చేయటం రామం వంతు ఇప్పుడు. ఇందులో ఏ స్వప్రయోజనమూ లేదు ఇతనికి. ఉన్నదల్లా సమాజ హితమే.

**కథలోని భాష, అలంకారాలు, వర్ణన, కథన శైలి:**

ఇది పూర్తిగా పర్యావరణ హితం గురించి ప్రజలకి అర్థమయ్యేలా చెప్పడం అనే ఉద్దేశ్యంతో చెప్పిన కథ. భాష సరళంగా ఉంది. కథాస్థలం విశాఖపట్నం అయినా, స్థానిక మాండలికం కంటే సాధారణ వ్యవహారిక శైలిలోనే సంభాషణలు ఉన్నాయి.

కథనంలో మాత్రం అలంకారయుక్తంగా, అక్కడక్కడ సున్నితమైన ప్రాస ఉపయోగిస్తూ, పర్యావరణ సంబం ధితం కాబట్టి ప్రకృతి వర్ణనలు చేస్తూ వచ్చారు. అదే సమయంలో ప్రకృతి నియమాలు, ప్రకృతి వనరుల పట్ల మనిషికి ఉండవలసిన విశాల అవగాహనని గుర్తుచేస్తూ వచ్చారు. అడుగడుగునా నీటిని ప్రతీకగా చేసుకొని వర్ణన, సంభాషణ రూపుకట్టింది.

గంగాధరం గారి మరణ వార్త విని ఏడుస్తున్న రామం కళ్ళని భార్య తుడుస్తూ ఉంటుంది, కానీ ఆమె కన్నీరు భర్త నుదుటిని తడుపుతుంది. ఇక్కడ గంగాధరం-రామంల అన్యోన్యతని అర్థం చేసుకున్న రామం ఇల్లాలి హృదయ నిర్మలత్వం కనిపిస్తోంది.

రామం, గంగాధరం గారి మరణ వార్త విని నిస్త్రాణగా కూలబడ్డ తాను 'భూమిలోకి ఇంకిన కన్నీటి చుక్కలా' అయిపోయానని, ఆయన స్మృతులు 'నీటి వెల్లువలా చుట్టుముట్టా'యని చెప్తాడు. నీరు గురించిన అన్యాపదేశ ప్రస్తావన గమనించవచ్చునిక్కడ. అంతేకాదు, కన్నీటి చుక్క ఇంకిపోతే ఇక మిగిలేది ఏమిటి, ఒట్టి చారిక తప్ప.. నీరు ఎగసి పడితే, అది వెల్లువలా ప్రవహిస్తూ వస్తే అన్నీ అందులో చుట్టుకుపోతాయ్, కొట్టుకుపోతాయ్, మహా విలయంలో కలిసిపోతాయ్ - అందుకే నీటిని తగిన విధంగా అదుపు చేసుకోవాలి, పొదుపుగా వాడుకోవాలి, వాన నీటిని ఒడిసిపట్టి కాపాడుకోవాలి, ముందు ముందు చెప్పబోయే కథకి ఇదో ప్రతీక అన్నమాట.

మంచుతో ఉన్న సింహగిరి, రామానికి, మేతకు దిగివచ్చిన ఐరావతంలా కనిపిస్తుంది. సింహం రాజసం, ఏనుగు భారీతనం రెండూ కలిసిన సింహాచలం కంటికి కనిపించాలి మరి. మంచు, నీటి ఘనీభవన రూపం కదా.

పలకరించిన గంగాధరం గారి ఆలింగనం వేసవిలో నీటి చెలమంత హాయిగా ఉండడం, మన పెదాలపై నవ్వు పూయిస్తే దానిక్కారణం ఆ నీటి చెలమ లోనే ఉంది. ఆ ఆర్ద్రత మన మనసుని తాకుతుంది.

గిరి నుంచి జాలువారే నీటి ధారల్ని, క్రమపద్ధతిలో కందకంలోకి మళ్లించే ప్రయత్నంలో తోడు నిలవ మంటారు, గంగాధరం గారు. కథ చివరిలో రామం ఆ బాధ్యత మొత్తం తానే మోయవలసి వస్తుంది, గంగాధరం గారు మహానదిలా నిశ్చలంగా అయిపోయాక.

ఆయన సాంగత్యం రామంలో ఆనంద పరవళ్ళు తొక్కిస్తుంది. ఆయన మాటలు ఆణిముత్యాల్లా జారు తుంటాయి. ప్రతి వాక్యంలో నీటి తడి కనిపిస్తూనే ఉంది, అది అనేక ఉపమానలతో మెరుస్తూ ఉంది.

నీరు జీవాధారం అని చెప్తూ, నీటి నుండి జీవం పుట్టుక ఏక కణ జీవి మొదలు మనిషి పుట్టుక వరకూ వివరిస్తారు గంగాధరం గారు. అలాంటిది నీటి చుక్కతో నాలుక తడుపు కోవలసి వస్తే ఆ కష్టం ఎంత భయంకరమో తెలియ చేస్తారు. ఇవన్నీ వివరించిన తీరులో విషయం సవివరంగా చెప్పే ప్రయత్నమూ, అది శ్రోతల మనసుకి చేరవేసే

నేర్పరితనమూ గ్రహించవచ్చు, ఇది శ్రవ్య కథగా రేడియోలో ప్రసారమైంది మరి.

"వాన నీటిని ఒడిసి పట్టాలి, మంచి మనిషిని వెతికి పట్టాలి" అని కాస్త ప్రాసగా చెప్పటంలో, మనకో నినాదం వినిపిస్తుంది. సులభమైన పదాల పొందిక కనిపిస్తుంది. కథ మొత్తం ధ్వని చిత్రణ చాలా అర్థవంతంగా సాగింది.

వాటర్ థెరపీ గురించి, భూమ్మీది జలవనరుల రక్షణ గురించి చెప్పే ఆయన వాక్ప్రవాహం అనకట్ట లేకుండా సాగుతూనే ఉంటుందని, రామం చెప్తాడు. అంటే రచయిత, నీటి పొదుపు గురించి ఒక కథని రేడియో ద్వారా వినిపించి శ్రోతల మెదళ్ళలో ఒక ఆలోచన ఉవ్వెత్తున ఎగసేలా చేసి, ఆ కదలికని ధారగా కొనసాగింప చేసిన ప్రయత్నం మనక్కూడా హోరున వినిపిస్తోంది- అని అంటే, అతిశయం కాదు.

"నీరు లేక నీవు లేవు, నీవు లేక జనం లేరు, జనం లేక జగం లేదు, జగం లేక యుగం లేదు" అన్న మాటల్లో ఒక ఉరవడి జలసత్యంగా మాత్రమే కాదు, ఇది ముక్తపదగ్రస్త అలంకారమని కూడా వినేవాళ్ళ చెవుల్లో పడేసారు రచయిత మంచి చాకచక్యంగా. ఇంత విన్నా జనం పాటించకోకపోతే గుండె చెరువు కావడంలో కొత్తేమీలేదు.

గంగాధరం గారి ఇంటి వర్ణన - మొక్కలు, కుందేళ్ళు, పక్షులు, కర్రలతో దడికట్టు, నీటి గుంటల్లో బాతులు - అచ్చు ఆశ్రమంలా ఉందని చెప్పేందుకే. వినేవాళ్లు ఇంకా బాగా అనుకోవాలని ఇది పంచవటి ఆశ్రమంలో ఉందని కూడా రచయితే చెప్పేస్తారు, రామం మనసుతో. కుండలోని మంచి నీటితో ప్రాణానికి హాయి సందిస్తారు.

"ఒంటికాయ శొంఠి కొమ్ము గాడిని" అనడంలో బాధ కనిపించదు గంగాధరం గారిలో, పైగా, 'ఇతరులని ఇబ్బంది పెట్టకుండా ఉభయుల్నీ ప్రశాంతంగా ఉంచే ఆలోచనతో కొడుక్కి దూరంగా ఉన్నాను, నా వ్యాపకాలతో తీరిక లేకుండానూ, ప్రశాంతంగానూ ఉన్నా'నని చెప్పడం - ఓ విధంగా పెద్ద వయసు వచ్చాక ఇలా కూడా ఆలో చించాలి సుమా అని సూచిస్తున్నట్టు తోస్తుంది. ఇది ఒక జీవన సత్యం. ఆ 'మహానది' గంగాధరం తనకప్ప గించిన పని వైపు రామం మళ్లుతాడు.

## సందర్భోచితమైన విషయం :

కథంతా రామం చేత ప్రథమపురుషలో వినిపించిన రచయిత, ఎంచుకున్న వస్తువుకు తగ్గట్టు ముఖ్యపాత్రకి 'గంగాధరం' అని పేరు పెట్టారు.

ఆ గంగాధరుడి దయతోనే, భూమ్మీదికి నీరు- పాదం మోపింది. పారిన నీటితో బూడిద రాసుల్లోని సగర పుత్రులు ఉత్తమ గతులు పొందారు. ఆపై భూమి మీద జీవజాలానికి నీరు ఆలంబన అయింది. ఇదిగో, ఇపుడీ గంగాధరం వారసుడిగా రామం బుద్ధిమంతుడైన శిష్యుడిగా, పుత్రుడుగా నీటి పరిరక్షణకు నడుం కట్ట బోతున్నాడు.

ఎంచుకున్న విషయానికి తగ్గ ఔచిత్యంతో పాత్రల పేర్లు, వస్తువు నడక, అది వింటున్నవాళ్లకి కంటికి తోచేలా సన్నివేశాలు, పురాణాలనుండి సందర్భానికి తగ్గ సంఘటనల ప్రస్తావన, అలాగని ఔచిత్య భంగం లేకుండానే సన్నివేశాలకు తగినట్టు ప్రదేశాల వర్ణన, వీటిద్వారా ప్రకృతి వనరుల్ని కాపాడితే అవి తిరిగి మనకు ఎంత అందమైన పర్యావరణాన్ని అందిస్తాయో కూడా చెప్పారు, రచయిత.

## పర్యావరణం-ప్రసార మాధ్యమాల బాధ్యత :

పర్యావరణం అనేది విస్తృతమైన విషయ వస్తువు. అలాగని కొరుకుడు పడని సీసపు గుండు కాదు. ఏ ప్రసార మాధ్యమంలోనూ దీని గురించి చర్చలు లేకుండా లేవు. నిత్యం హెచ్చరికలు, ప్రభుత్వ చర్యలు, ప్రజల బాధ్యతలు...... అన్నీ- పత్రికల్లోనూ, దృశ్యశ్రవణ మాధ్యమాల్లోనూ హోరెత్తుతూనే ఉన్నాయి. పూనిక ఎంతవరకూ ఉంది, ఫలితం ఎలా ఉంది అన్నది గమ నించుకోవాలి. ఇది భూమ్మీది ప్రతి మనిషి కర్తవ్యం.

**మనమేం చెయ్యాలంటే...:**

పర్యావరణ పరిరక్షణ ఎంత అవసరమో, ఇప్పుడు అది ఎంత తక్షణం చేపట్టితే అంత మంచిది అని చెప్ప డానికి ప్రసంగాలు చెప్తే, వ్యాసాలు రాస్తే వినే, చదివే ఓపిక అందరికీ లేదు. ఎన్ని ఐక్యరాజ్యసమితి సమావేశాలు జరిగినా, ఎన్ని సదస్సుల్లో తీర్మానాలు చేసినా సభ్యదేశాల్లోనే నిబద్ధత కరవు. సంతకం పెట్టిన ప్రతి దేశం అందుకు తగ్గట్టు కట్టుబడి ఉండటం లేదు. ఎగనామం పెడుతూనే ఉన్నాయి. మరోసారి కొత్తదార్లు, మళ్ళీ కొత్త తీర్మానాలు - ఇదో ప్రహసనం అయిపోయిన సంగతులు, సందర్భాలూ చూస్తూనే ఉన్నాం.

**కాప్ - 26 ప్రతిపాదనలు :**

ఐక్యరాజ్యసమితి, 2021 నవంబర్‌లో, వాతావరణ మార్పులపై నిర్వహించిన Conference of the Parties, 26వ ప్రపంచ దేశాల భాగస్వామ్య సదస్సు యునైటెడ్ కింగ్ డమ్ లో గాస్లో నగరంలో జరిగింది. పర్యావరణహిత జీవన విధానం అలవర్చుకోవాలి, శిలాజ ఇంధనాల విని యోగానికి క్రమంగా స్వస్తి చెప్పాలి, సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తి-వాడకం జరగాలి, కర్బన ఉద్గారాలు తగ్గించాలి, పునరుత్పాదక ఇంధన వనరుల నిర్వహణ చేపట్టాలి - అంటూ గ్లోబల్ వార్మింగ్ విసురుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రతిపాదనలు జరిగాయి. 2070 వరకూ క్రమంగా ఈ లక్ష్యాల్ని సాధించాలని అజెండా రాసుకున్నారు.

"మా భవిష్యత్తుని మేమే నిర్మించుకోవడానికి మద్దతు నివ్వండి" - అని 14ఏళ్ల భారతదేశ బాలిక, వినీసా ఉమాశంకర్, కాప్-26 సదస్సులో చేసిన ప్రసంగం ప్రపంచ దేశాల్ని ఆకట్టుకుంది.

**'మహానది' కథ చెప్పిన సంగతి :**

కథగా వినిపించిన 'మహానది'లో ఎన్నో సంగతులు తేట తెల్లమై తేలుతూ శ్రోతల మనసుల్ని తాకే ప్రయత్నం జరిగింది. ఆ నదిని కాపాడుకోవడంలో మన కర్తవ్యం అలలుగా సాగాలి, వాగులై పొంగాలి.

మనిషి, సామాజికంగా, ఆర్థికంగా తన చుట్టూ ఉన్న సమాజాన్ని చదువుతూ, అర్థం చేసుకుంటూ, పరా మర్శిస్తూ, తన్ను తాను ఆ సమాజంలోని మనిషిగానే భావించి ప్రవర్తిస్తూ, హితం కోరి నిర్వహణ చేస్తూ ఉం టేనే ఏ దేశం అయినా బాగుంటుంది. మానవీయ విలువలు పాటిస్తూ, సత్సంబంధాల్ని పాటిస్తూ పరస్పర గౌరవాభిమానాలతో వ్యవహరించాలి.

అవి, మనిషిలోని మానవత్వాన్ని సజీవంగా ఉంచు తుంటాయి. సమాజ హితం కోసం, ఒక్కరుగా ముందుకు నడిస్తే, వెంట వచ్చే పాదాలు ఎన్నో ఉంటాయి. అలాంటి సామూహిక ప్రయత్నాన్ని ఆరంభించమని గుర్తు చేస్తూ ఉన్న ప్రయత్నమే ఈ కథ. ఇదొక చైతన్య స్వరం.

**ఆధార గ్రంథాలు :**

1. ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రం - గ్రంథాలయం నుండి సేకరణ (27-05-2019 న రేడియోలో ప్రసారం)
2. శ్రీ లోగిశ లక్ష్మీనాయుడు గారితో జరిపిన సంభాషణ నుండి గ్రహించిన విషయాలు

★★★

# గ్రామీణ ప్రజల మానసిక ఉల్లాస క్రీడలు - విశ్లేషణ

- రెమావత్ రజిత, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

చుట్టూ ఎటు చూసినా పచ్చని పొలాలు, కల్లాకపటం ఎరుగని స్వచ్ఛమైన మనుషులు, ప్రేమ ఆప్యాయతలు, అరుగుమీద ముచ్చట్లు ఇవి గ్రామంలో మనకు తారసపడే దృశ్యాలు. గ్రామంలో ఎంత మంది ఉన్నా ఎవరి గురించి ఎవరిని అడిగినా టక్కున వచ్చే సమాధానాలు. ఎవరైనా ఏదైనా కష్టంలో కూరుకుపోతే నేనున్నా అంటూ ధైర్యం ఇచ్చే అప్పులు. ఇక ఏ పనికి వెళ్ళిన దాదాపుగా ఒకరినొకరు సహకరించుకుంటూ గ్రూపులు గ్రూపులుగా కలిసిమెలిసి పని చేసుకోవడం, ఆ పని నుంచి విశ్రాంతి పొందడానికి వారికి వారే నచ్చినట్లుగా, వారికి వచ్చిన ఆటలను అప్పటికప్పుడే తయారుచేసుకుని ఆడటం. ఇది గ్రామీణ జీవనం. వారు శ్రమ నుంచి విశ్రాంతి పొందడానికి ఏర్పరుచుకున్న ఆటలే గ్రామీణ మానసిక ఉల్లాస క్రీడలు. ఈ గ్రామీణ ప్రాంతాలలో గ్రామీణులు లేదా జానపదులు వారికి వారే స్వతాహాగా ఏర్పరుచుకున్న మానసిక ఉల్లాస క్రీడలను కొన్నింటిని తీసుకొని విశ్లేషించడంమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

గ్రామం లేదా పల్లె అనేది కొన్ని నివాసాల సముదాయం. ఇది నగరం లేదా పట్టణం కంటే చిన్నది. గూడెం కంటే పెద్దది. మనిషి సంఘజీవి కనుక ఇతరులతో అవసరాలను అనుసరించి దగ్గరగా జీవించుటకు కొందరు ఒకే చోట లేదా ఒకే ప్రాంతమును కేంద్రముగా చేసుకొని వారి వారి నివాసాలను ఏర్పాటు చేసుకోగా ఏర్పడినది ఒక గ్రామం. గ్రామాల మధ్య వ్యాపార సంబంధ కార్యకలాపాలు నెరపేందుకు వాటి కూడలిగా కొన్ని పట్టణాలు ఏర్పడతాయి. అయా పట్టాణాలను కేంద్రీకృతం చేసుకొని దగ్గర దగ్గరలో గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. ఎక్కువ గ్రామాలు శాశ్వతంగా ప్రజలు నివాసం ఉండేవి. కాని కొన్ని గ్రామాలు తాత్కాలికం కావచ్చును. అలాగే ఎక్కువ గ్రామాలలో ఇండ్లు దగ్గర దగ్గరగా ఉంటాయి. కాని కొన్ని గ్రామాలలో ఇండ్లు దూరం దూరంగాను ఉండవచ్చును.

వ్యవసాయమే గ్రామాలకు ములజీవన ఆధారం. కాని కొన్ని గ్రామాలు ఇతర వృత్తులపై కూడా ఆధారపడ్డాయి. రాజకీయ, పరిపాలనా ప్రయోజనాల కారణంగానూ, పారిశ్రామిక విప్లవం అనంతరం పరిశ్రమలు విస్తరించడం వలన అనేక గ్రామాలు పట్టణాలుగానూ, నగరాలుగానూ వృద్ధి చెందాయి.

ఈ గ్రామాలు, గ్రామాలలో ఉండే ప్రజలను జానపదులు అంటారు. జానపదుల జీవనంలో ఆటలు ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ప్రత్యేక సమయంలో గాని, విరామ సమయంలోగాని మానసిక, శారీరిక ఉల్లాసం కోసం వివిధ రకాల ఆటలు ఆడుకొంటారు. మనిషి పుట్టినప్పటి నుండి చనిపోయేంత వరకు జరిపే కార్యక్రమాలు, ఆహారపు అలవాట్లు, వేషాధారణ, కళలు, సాహిత్యం వివిధ అంశాలు అన్ని జానపద విజ్ఞానం కిందికి వస్తాయి.

## గ్రామీణుల ఆటలు :

గ్రామీణులు తమ తీరిక సమయంలో శారీరక శ్రమను మర్చిపోవడాయి ఉల్లాసంగా జీవించడానికి ఎంచుకొని కూర్చుకున్న నియమావళితో ఆడే క్రమాన్ని "ఆట" అని అంటారు. ఒకప్పుడు శారీరక శ్రమను మర్చిపోవడానికి, కేవలం కాలయాపన కోసం ఆడేది ఆట కాని నేడు తీరిక సమయంలో మానసిక ఉల్లాసం కోసం ఆటలు ఆడుతారు. వీటిలో చిన్న పిల్లలు ఆడేవి, పెద్దవారు ఆడేవి, స్త్రీలు, పురుషులు ఆడేవి, సముహంగ ఆడేవి ఉంటాయి. గ్రామీణ స్థాయిలో ఉండే జానపదుల క్రీడలు కొన్ని రూపాంతరం చెంది ప్రస్తుతం క్రికెట్, కబడ్డీ లాంటి

క్రీడలు జాతీయ స్థాయి వరకు వెల్లడం మనం చూడవచ్చు.

**గ్రామీణ ఆటలు :**

జానపద ఆటలు అనేక రకాలు. ఈ ఆటలలో ప్రాంతాన్ని బట్టి, ఏరియాను బట్టి కూడా ఆటలలో కొన్ని రకాల వ్యత్యాసాలు ఉంటాయి. అడే ఆట ఒకటే అయిన ఆటల పేర్లతో కూడా ఒక్కో ప్రాంతంలో ఒక్క విధంగా పిలుస్తూ ఉంటారు. ఈ ఆటలలో ముఖ్యంగా ఓమన గుంతలు (ఓనగంటలు), అష్టాచమ్మ, గిట్టలు (కచ్చ గాయాలు), టుంగు కోట్టుడు (ముక్కుగిల్లుడు, టిక్కి కొట్టుడు), చింత గింజెలాట, సీతఫల గింజలాట (ముడు గుంతలు), చెమ్మచెక్క, జొన్నసేను, ఒత్తున పొడునా.. ఓరామ సిలుక, వీరి వీరి గుమ్మడి పండు, చెట్టు పందిరి (కొతికొమ్మచి), బొంగరాలు (తాడు బొంగరం), తొక్కుడు బిల్ల, పిల్లి దుంకుడు (ఓంగుడు దుంకుడు), టైరు ఆట, లింగోచ్ (బంతితో రాళ్లను కొట్టడం), మ్యారంపీట్ (రబ్బరు బంతితో ఒకరిని ఒకరు కోట్టుకోవడం), డొప్పాట (దాగుడు మూతలు), గిల్లిపాణ (చిర్రగోనే కర్రబిల్ల), ముడ్డి సంచి (ఉప్పుబెత్తలు), చీటీల ఆట, పులికట్టు (మేకపులి / పులిమేక), కరెంటుషాకు, కాంట పెట్టుడు, మూడు రాళ్ల కలపడం, కండ్లకు గంతలు, పాలు పొంగించడం, తాడాట, గోటీలు (గోలీలు), కుర్చిలాట, చెంచాట, గోనె సంచి ఆట, పల్లరి కాయాలట, గెగ్యాట, దొంగ పోలీస్, గొలుసు ఆట, రైలాట, కానిస్టేబుల్, బొమ్మ (స్టాప్), పావులాట, పడవాట, తాడు చక్రం, పంకలు, కైలాసం (పాము నిచ్చన), చిత్తు బొత్తు, సీకాట, అగ్గిపెట్టెలాట, మల్లె పందిరి మొదలగు ఈ జానపద ఆటలు తల్లి నుండి పిల్లలు, అక్క నుండి చెల్లి, అన్న నుండి తమ్ముడు/ స్నేహితులు. వీరి నుండి ఒకరికోకరు నేర్చుకొని అడుతుంటారు. వీరికి ప్రత్యేకమైన శిక్షణగాని గురువుగాని ఉండడు. ఒక తరం నుండి మరోక తరంకు ఆటలు సంక్రమిస్తాయి.

**ఆట కొరకు తయారు చేసుకునే వస్తువులు :**

గ్రామంలోని వివిధ పరిసరాలలో దొరికే వస్తువులనే ఆట వస్తువులుగా సిద్ధం చేసుకొంటారు. సాధారణంగా రాయి, కర్ర, పెంకు, గుడ్డ పెలకలు, చింతగింజలు, పిన్నిసులు, గాజుముక్కలు, తాళ్ళు, పేపెర్లు మొదలైనవి ఉపయోగిస్తారు.

**తాడు ఆట :**

ప్రపంచవ్యాప్తంగా పిల్లలు, పెద్దలు అడే ఆట ఇది. ఒక రకమైన వ్యాయామంగా చెప్పుకోవచ్చు అడపిల్లలు దాదాపు పొడవుగల తాడును చేతులతో తమకాళ్ల క్రిందనుంచి తలపైకిత్రిప్పుతూ, కాళ్లకు తగలకుండా గెంతుతుంటారు. అలా ఏకబిగిని ఎవరు ఎక్కువసార్లు త్రిప్పితే వారు గెలిచినట్లు. దీనితోనే మరొక ఆట కూడా అడతారు. పిల్లలందరూ ఒకే చోట ఒకేసారి ఇలా గెంతుతూ బయలుదేరి నిర్దేశించుకున్న స్థలానికి ఎవరు ముందు చేరితే వాళ్ళు గెలిచినట్టు. ఇది కాళ్ళకూ, చేతులకూ, ఏకాగ్రతకూ సంబంధించిన శారీరక శ్రమకు చెందిన ఆట. చక్కని పోటీ మనస్తత్వం, పురోగతిపై ఆకాంక్ష కలిగిస్తుంది ఈ ఆట.

**దాగుడు మూతలు :**

దీనిని దొంగ - పోలీస్ ఆట ఇని కూడా అంటారు. ఇది పిల్లలు అడుకునే ఆట. ఇందులో ఆటగాళ్ళు చుట్టుపక్కల దాగుంటే, ఒకరు లేదా ఇద్దరు వారిని పట్టుకుంటారు. పట్టుబడిన వాడు/వారు తర్వాత దొంగగా మారి ఇతరులు దాగున్నవార్ని పట్టుకొంటూ ఆట కొనసాగుతుంది. దొంగ సాధారణంగా కళ్ళు మూసుకుని కొన్ని అంకెలు లెక్క పెట్టేలోగా మిగతా వాళ్ళు రహస్య స్థలాల్లో దాక్కోవాలి. దీని వలన పిల్లలలో మంచి బలం చేకూరుతుంది.

**దాడి ఆట :**

ఈ ఆట ఆడే పద్ధతి. అడేవాళ్ళు ఇద్దరుంటారు. 9 నప్పులుంటాయి. ఒకరి తర్వాత ఒకరు, ఒక్కొక్కటి చొప్పున నప్పాలి. ఎవరివైనా మూడు నప్పులు, అడ్డంగా

గాని, నిలువుగా గాని ఒకే వరుసలో వస్తే ఒక దాడి జరిగినట్లు. దాడి జరిపిన వాళ్ళు ఎదుటివారి సప్పులలోంచి ఒక సప్పును (దాడి జరగనది మాత్రమే) తీసుకుంటారు. ఒకసారి దాడి జరిపిన సప్పుని, ప్రక్కకు జరిపి, దానితో మరల దాడి చెయ్యవచ్చును. ఇలా ఆడే ఇద్దరిలో ఎవరివో ఒకరి సప్పులు పూర్తయ్యేవరకు ఆడుకోవచ్చును. మూలలో బాణం గుర్తులున్న కోణాలలో వరసగా సప్పులు పెట్టడం దాడిగా ఒప్పుకోబడదు.

**వెన్నెటి గుడ్లు :**

ఇది గ్రామీణ ప్రాంతాలలో పిల్లలు ఆడుకునే ఆట. వెన్నెల్లో ఎక్కువగా ఆడతారు, కాబట్టి దీనికాపేరు వచ్చింది. ఆటగాళ్ళందరూ ముందుగా రెండు జట్లుగా విడిపోతారు. ఆట ఆడడానికి ఒక ప్రాంతాన్ని దాని సరిహద్దులనూ నిర్ణయించుకుంటారు. ఆ ప్రాంతాన్ని రెండు జట్ల కోసం రెండు సమాన భాగాలుగా విభజించు కుంటారు. ఒక్కో జట్టూ దానికి కేటాయించిన స్థలంలో రహస్యంగా మట్టితో చిన్న చిన్న కుప్పలు (గుడ్లు) పోస్తారు. కొద్ది సేపు పోసిన తరువాత ఒక జట్టు సభ్యులందరూ అవతలి జట్టు వారు రహస్యంగా పోసిన గుడ్లను కని పెట్టాలి. ఇలా వారు కనిపెట్టిన తరువాత ఎన్ని గుడ్లైతే మిగిలాయో అవే వారి స్కోరు. ఏ జట్టు ఎక్కువగా స్కోరు చేస్తుందో ఆ జట్టు గెలిచినట్లు లెక్క.

**సీతాఫలం గింజలాట :**

ఈ ఆటను ఇద్దరు వ్యక్తులు కలిసి ఆడుతారు. ముందుగ ఒక వ్యక్తి గింజలు దూరంగ వెళ్ళి మట్టిలో మూడు గుంతలు తీసి ఎదో ఒక గుంతలో గింజలు వేసి పూడుస్తారు. మరో వ్యక్తి వచ్చి ఆ గింజలు ఎ గుంతలో ఉన్నయో తీయాలి గింజలు గుర్తిస్తే తీసుకుని వెళ్లాలి లేదంటే ఆ గుంతలో ఎన్ని గింజలున్నాయో అన్నీ ఇచ్చి వెళ్లాలి. ఈ విధంగా ఆట కొనసాగుతుంది. సీతాఫలం గింజలాట ఎక్కువగా ఆడవాళ్లు ఆడుతారు.

**టుంగు కొట్టుడు :**

ఈ ఆటలో 8, 10 అంతకంటే ఎక్కువ సభ్యులు కూడా ఉండవచ్చు. ఆటలో నైపుణ్యం ఉన్నవారు ఇద్దరు ముందుకు వచ్చి మిగత వారిని ఎన్నుకుంటారు. (కోరు కోవడం) రెండు గ్రూపులుగా ఏర్పడి అటోక గ్రూపు, ఇటోక గ్రూపు మధ్యలో 10 అడుగుల దూరం ఉండేల కూర్చుం టారు. ముందుగ ఒక గ్రూపు నుండి ఒకరు వచ్చి ఇంకో గ్రూపులో ఉన్న వారికి ఒకరికి వెనుక నుండి కండ్లు మూసి తన ఎదురుగా ఉన్న గ్రూపులో నుండి ఒకరిని వారి పేరుతో కాకుండా ఇతరుల పేర్లతో గాని, పండ్లు పేర్లతో గాని పిలుస్తారు. ఉదా: 'జామపండు రావాలి టుంగు కోట్టి పోవాలి' అనగానే ఒకరు వచ్చి కండ్లు మూసిఉన్న వారి తలపై టుంగు కొట్టి నెమ్మదిగా వెళ్ళి రోటా కండ్లు తెరిచిన తర్వాత తన తలపై ఎవరు కొట్టారో వారిని గుర్తించి తీసుకురావాలి లేదంటే ఆ గ్రూపులోనే కూర్చో వాలి. ఇలా ఒక గ్రూప్ తర్వాత ఒక గ్రూపులకు కండ్లు మూస్తు ఎదైన ఒక గ్రూపులో సభ్యులందరూ అయిపోయే వరకు ఆట ఆడుతారు.

**చెట్టు పందిరి (కొతికొమ్మచి) :**

ఈ ఆటను పురుషులు మాత్రమే ఆడుతారు. ఊరి చివర్లో చెట్టు ఉన్న దగ్గరకు వెళ్లి ఈ ఆటలు ఆడుతారు. ఆటలో 5 నుండి 10 మంది అపై కూడా సభ్యులు ఉం డవచ్చు. దొంగను చెల్లప్పలు వేసి గుర్తిస్తారు. భూమికి దగ్గరగ ఉండే ఒక కొమ్మకింద గుండ్రటి డబ్బగీసి ఒక వ్యక్తి కింద ఉండి మిగత వారంత చెట్టు పైకి ఎక్కుతారు కిందున్న వ్యక్తి మూరెడు కర్ర తీసుకొని డబ్బలో నిలబడి తన కుడికాలు కిందనే ఉంచి ఎడమకాలు కొంత పైకిలేపి కాలు కింద నుండి కర్రను దూరంగా విసిరి తాను చెట్టు పైకి ఎక్కుతాడు. లేదంటే కిందనే ఉంటాడు దొంగైన వ్యక్తి దూరంగ విసిరిన కర్రను తీసుకువచ్చి డబ్బ మధ్యలో వేసి ఆ కర్రని ఎవరు ముట్టుకోక ముందు ఎవరినైన ముట్టుకుంటే వాళ్ల దొంగ ఇంతవరకు దొంగగా ఉన్న వ్యక్తి కర్రను విసిరి చెట్టు పైకి ఎక్కుతాడు. ఈ విధంగా ఆట కొనసాగుతుంది.

**క్రీడల వలన కలిగే ప్రయోజనాలు :**

ప్రదానంగా క్రీడ గ్రామీణ ప్రాంతాలలో వారు నిత్యం పడే శ్రమ నుంచి విశ్రాంతి పొందడానికి ఇది ఒక అద్భుత మైన సాదనం. గ్రామీణుల జీవితంలో ఆటలు అధిక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ ఆటలు ఆడటం వల్ల ముఖ్యంగా మూనసిక ఉల్లాసం కలుగుతుంది. సంచాట, పిల్లిదుంకుడు, చిర్ర గొనె ఆట, దాగుడు మూతలు లాంటి ఆటలు వల్ల శారీరక వ్యాయమం అవుతుంది. కొన్ని ఆటలు మేధస్సుకు పదును పెట్టెవిగా, ఇంకొన్ని రోగనిరోధక శక్తిని పెంచేవిగా, కొన్ని సామాజిక సమైక్యతను పెంచేవిగా, కొన్ని అర్థిక విధానాలు, గణితం మరియు పొదుపును గూర్చి తెల్పేవిగా, కొన్ని ఆటలు రక్షణను గూర్చి తెలిపేవిగా ఉంటాయి. ఇవే కాకుండా ఆటల వల్ల మరెన్నో ప్రయో జానాలు కలుగుతాయి.

**ముగింపు :**

గ్రామీణ ప్రాంతాలలో ఒకానొక సమయంలో జానపద ఆటలకు అధిక ప్రాధాన్యత ఉండేవి. నాడు గ్రామీణ ప్రాంతంలోని పిల్లలు ఎటు చూసిన కేరింతలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా, గంతులు వేస్తు జానపద ఆటలను ఆడుతూ ఎంతో ఆరోగ్యంగా కనపడేవారు. కాని నేడు సెల్ఫోన్, టివిలో వచ్చే ఆటలకు పరిమితమై అనేక అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. అసలు నేటి తరం పిల్లలకు జానపద ఆటలు అంటే ఏమిటో కూడా తెలియని పరిస్థితి. ఇలాంటి దుస్థితి నుండి బయటపడాలంటే ప్రభుత్వం పాఠశాలలో జానపద ఆటలను ఒక భాగం చేసి పిల్లలను జానపద ఆటల వైపు మల్లిస్తూ వారికి మానసికంగా ఉల్లాసంతో పాటు జ్ఞానాన్ని పెంచే ఆటలను నేర్పిస్తూ గ్రామీణ ఆటలకు పూర్వ వైభవాన్ని తీసుకురావాలి. నేటి ఇంటర్నెట్, అరచేతిలో ప్రపంచం అయిన చరవాణి దూరంచేసి అంతమైపోతున్న జానవద ఆటలను పరిశోధకులు డాక్యుమెంటేషన్ చేసి భద్రపరచవలసిన నమయం అత్యావస్యకమైనది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. తెలుగు బోధన అభ్యాసన శాస్త్రం, బి.ఎడ్,తెలుగు అకాడమి, హైదరాబాదు.
2. మన గ్రామీణ క్రీడలు డా. బి. దామోదర్ రావు.
3. జానపదుల జీవనంలో - ఆటలు (సాహిత్య చరిత్రక పరిశోధన పత్రిక, ఏప్రిల్, జూన్ - 2011)

★★★

# 'శ్రీధర్ శతకం'లో చైతన్య స్పృహ

- తిరునగరి శరత్‌చంద్ర, పరిశోధక విద్యార్థి తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

ఆధునిక తెలుగు సాహిత్యంలో రసవత్తరమైన పద్య ప్రక్రియకు పెద్ద పీట వేసి, శతక ప్రక్రియకు ఎనలేని వన్నెతెచ్చి, లాలిత్యమైన పదాల పొందికతో శ్రవణ పేయమైన గేయంరాసి, గులాబీపూల గుబాళింపులు విరజిమ్మే గజల్లురాసి, అలతి అలతి పదాలలోనే అంద మైన భావుకతను ప్రకటిస్తూ నానీలు రాసి, తన ప్రతిభా వైశిష్ట్యాన్ని కవితా శక్తిని ప్రదర్శిస్తున్న ప్రముఖ కవి డా॥. పాలపర్తి శ్రీధర్.

పాలపర్తి శ్రీధర్ పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని బద్ధావాని పేటలో పాలపర్తి నరసింహమూర్తి, వేంకటలక్ష్మి అనే పుణ్యదంపతులకు 1966 సం॥ జూన్ 16న జన్మిం చాడు. శ్రీధర్‌కు పాలిన్ ఐజాక్ గారితో వివాహం జరిగింది. వారికి ముగ్గురు సంతానం. నిత్యం సాహితీ సేవలోనే జీవితాన్ని గడుపుతూ తెలుగు సాహిత్యంలో తనదైన ప్రత్యేక స్థానాన్ని నిలుపుకున్నవాడు శ్రీధర్.

శ్రీధర్ చిన్నవయసునుండే సాహిత్యాధ్యయనం చేస్తూ ఆధునిక తెలుగు కవుల్లో గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆయనలోని నిరంతర కవితా ప్రతిభకు తార్కాణం. ఆయన రాసిన 60కి పైగా గ్రంథాలు. ఆయన రచించిన ఒక్కో గ్రంథం దేనికదే విశిష్టమైనది. ఆయనలోని ప్రతిభా శేముషికి మచ్చుతునక "శ్రీధర్ శతకము", ఇందులోని ఒక్కో పద్యం ఒక్కొక్క తూటా వంటిది. ఇందులోని పద్యాలన్నీ ఆటవెలది ఛందస్సులో రాసినవే. ఆటవెలదిని ఈటెగా విసిరి ప్రజాకవి వేమనకు వారసుడని పించుకున్నాడు శ్రీధర్.

శ్రీధర్‌లో పదునైన కవి ఉన్నాడు. ఒక గొప్ప విమర్శ కుడున్నాడు. బాగోగులను నిర్ణయించే శక్తి, చైతన్యం విమర్శకుడికి ఉంటుంది. విమర్శకుడు కవి కాకపోయినా ఫర్వాలేదు కాని, కవి విమర్శకుడై ఉండాలి. ఒక కవిగా, విమర్శకుడిగా శ్రీధర్ అప్పటికే తెలుగునాట గణనీయుల వరుసల్లో పీఠం వేసుకుకూర్చున్నాడు.

ఈ శతకంలోని ప్రతి పద్యం సమాజాన్ని సునిశితంగా పరిశీలించి రచించినదే. సమాజాన్ని సున్నితంగా ప్రశ్నించే తత్త్వం శ్రీధర్‌కు అలవడింది.

"రేయిపగలు నీవు హాయిగా చదివిన
పట్టభద్రుడౌదు? దిట్టయౌదు
శిల్పిచేత రాయి శిల్పమై పొదలదె
పాలపర్తి మాట పసిడి మూట"

సాధారణంగా 'శతకం' అంటే వంద లేదా వందకు పై చిలుకు పద్యాలు కలిగినది. ప్రతి పద్యానికి ఒక మకుటం ఉంటుంది. ఇది అందరికి తెలిసిన విషయమే. 'పాలపర్తి మాట పసిడి మూట'. ఇది శ్రీధర్ శతకంలోని మకుటం. తన వంశనామం ఇందులో గోచరిస్తుంది. రాత్రి పగలు తేడా లేకుండా నిరంతర అధ్యయనం ద్వారా పట్ట భద్రత సాధించవచ్చని, ఉన్నత స్థాయిలో నిలబడ డానికి అది ఆస్కారమవుతుందని చెబుతూ 3వ పంక్తిలో ఒక ఉదాహరణను తెలియజేస్తున్నాడు. శిల్పి ఒక రాయిని నిరంతరం చెక్కడం వల్ల అందమైన శిల్పం ఎలా తయారవుతుందో మన భవిష్యత్తు కూడా బాగా చదవడం వల్ల బంగారుమయమవుతుందని చెబుతున్నాడు శ్రీధర్. మారదవెంకయ్య(భాస్కరశతకం), వేమన(వేమన శతకం)లలో ఇలాంటి ఉదాహరణయోగ్యమైన పంక్తులెన్నో కనిసిస్తాయి. శ్రీధర్ ప్రాచీన, ఆధునిక శతక సాహిత్యాన్ని ఔపోసన పట్టినవాడని చెప్పేందుకు ఈ శతకం ఒక నిదర్శనం.

శ్రీధర్ అన్నట్టుగా ఇది పసిడిమాటయే మాటలోని 'బంగారం' ఎంత నిగనిగలాడుతుందో......మచ్చుకు మరో పద్యం

"కాని పదములేరి కావ్యంబు వ్రాసిన
అతకగలదె పద్యమలరగలదె
సొంత ఊహ కన్న సొంపైనదేముంది
పాలపర్తి మాట పసిడి మూట"

పై పద్యం చదువుతున్నప్పుడు మహాకవి, మహా రచయిత తాపీధర్మారావు గారన్నమాట గుర్తుకువస్తుంది. "వాడుక మాటల వల్లనే భావాల్ చెప్పగల్గితే రాత, ఇదియని అదియని రాని దానిని ఈడ్చుకు వస్తే రోత". ఆ పదమంటూ ఈ పదమంటూ అతుకులుపెట్టి రాసితే అది పద్యమవ్వదు. అది కవిత్వమనిపించుకోదు. నిసర్గ మనోహరమైన తన ఊహను మించినదింకొకటి లేదని చెప్తూ ఈ పద్యం ద్వారా మంచి సందేశాన్ని అందించాడు శ్రీధర్.కవిత్వమంటే ఒక సమ్మోహనశక్తి. అది సమాజాన్ని శాసిస్తుంది సమాజహితాన్ని ఆశిస్తుంది.

ఒక సూటిదనం, స్పష్టత, గంభీరతలనేవి కవిత్వానికి ఉండవల్సిన లక్షణాలు. కవిత్వం పాఠకునికి చదవడానికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేలా ఉండాలి. మనల్ని ప్రశ్నింపజేయాలి తనను తాను సంస్కరించు కునేలా హెచ్చరిక బద్ధంగాను కవిత్వం ఉండాలి. అలాంటి చురుకుదనం, వాడిదనం గల కవిత్వం రాస్తున్న తెలుగు కవుల్లో శ్రీధర్ స్థానం పదిలం. అందుల సాక్ష్యం ఇదో పుట్టెడుమణులే దొర్లిపడే మంజూషలాంటి శతకం.

"ఎన్నియు సిరులున్న యెన్ని మేడలునున్న
బంధువర్గ మైత్రి బలగమున్న
శాంతిలేని మనువు చట్టు బండయెగదా
పాలపర్తి మాట పసిడి మూట"

ఎన్ని సంపదలున్నా, ఎంత ఐశ్వర్యమున్నా, బంధు వర్గం, మిత్రసంతతి ఎంత ఉన్నా, శాంతి లేని జీవితం వ్యర్థమని హితబోధ చేస్తున్నాడు శ్రీధర్. కొన్ని పద్యాలు చదువుతున్నప్పుడు శ్రీధర్ తన అనుభవాలకు అక్షరరూప మిచ్చాడా అనిపిస్తుంటుంది. శ్రీధర్ కవిత్వంలో ప్రధాన మైన విషయమేమిటంటే చూసింది చూసినట్టుగా, నిక్కచ్చిగా వెలిబుచ్చే తత్త్వం కలిగి ఉండడం. కవికి ఉండవల్సిన ప్రధానమైన లక్షణమిదే. సమాజంలో ఎక్కడైనా మంచి కనిపించిందా? కలమెత్తి తలయెత్తి నమస్కరిస్తాడు. చెడు కనిపించిందా? తన కలాన్నే విల్లులా ఎక్కుపెట్టి ఖండిస్తాడు. ఇదే ఆయనలోని ప్రత్యేక మైన లక్షణం.

"విద్దెరాని వాని గద్దెనెక్కించిన
పాలనంబు చీడపట్టగలదు
పేను పెత్తనంబు పీడయే తలకౌను
పాలపర్తి మాట పసిడి మూట"

చదువు సంధ్యలు లేని వాడికి, అర్హత లేని వాడికి పట్టం గట్టితే పాలన సర్వనాశనమవుతుంది. పేనుకు పెత్తనమిస్తే తల గొరిగిందన్న చందాన అని అంటున్నాడు శ్రీధర్. ఇలాంటి నిత్యసత్యాలెన్నో రాశులుగా పోశాడీ శతకంలో. మరో పద్యంలో...

"చదువననివాని మృదువుగా చదివించ
మొద్దువాడు మంచి ముత్యమౌను
రాయిశిల్ప చేత రంగడు గాలేదె
పాలపర్తి మాట పసిడి మూట"

చదవడానికి నిరాకరించిన వానిని బుజ్జగించి బుద్ధిగా చదివించినట్లయితే వాడు శుంఠ అయినప్పటికీ మంచి ముత్యమై అలరారుతాడని మామాలు రాయి శిల్పి యొక్క కళానైపుణ్యం వల్ల, నిరంతర కృషి వల్ల రంగడై, పర మాత్ముడై నిలిచింది కదా! అని ఉదాహరణ యోగ్యంగా చక్కని జీవిత సత్యాన్ని తెలియజేశాడు. ఈ శతకంలో ఏ పద్యాన్ని తడిమినా ఒక్కో జీవిత సత్యం, నీతి దొర్లి పడతాయి. ఒక్కో పద్యం ఒక్కో ఆణిముత్యమై రసజ్ఞుల పాఠకుల ఎదల్లో సుస్థిరస్థానాన్ని నిల్పుకుంటాయి.

"పద్య కవిత కృతులు వచన కైత కృతుల
ఎన్ని కథలు వ్రాయయేమిఫలము
ఉత్తమమగు రచన యొకటున్న చాలదె
పాలపర్తి మాట పసిడి మూట"

ఈ పద్యం చాలు ఏదో కవిత రాసి ఉత్తమ కవిత్వ మని విర్ర వీగే ప్రబుద్ధులకు చురకలంటించడానికి. పద్య

కవిత్వమని, వచన కవిత్వమని, కథలని ఏవేవో రాసి ఏమి లాభం, ఉత్తమమైన కవిత ఒకటుంటే చాలని, అదే మేలని శితువు చెబుతున్నాడు. తామే కవులమని అహం భావంతో ఊగే మూర్ఖ జనానికి బుద్ధి చెప్పేరీతి శ్రీధర్ కలంపాళీకి పుష్కలంగా ఉంది.

"అడవులందు తిరిగి యేడుకొండలనెక్కి
పుణ్యక్షేత్రము తిరుపురము తిరగ
ఫలితమేమి యెదను పరమాత్మలేకున్న
పాలపర్తి మాట పసిడి మూట".

ఎంత చక్కగా చెప్పాడో కదా! "చిత్తశుద్ధిలేని శివపూజ లేలరా!" అన్నాడు వేమన్న. హృదయంలో భక్తి లేక ఏడుకొండలెక్కి దేవున్ని కొలిచి ఏమి ప్రయోజన మంటున్నాడు శ్రీధర్.

"కూడు లేని నాడు కూర్చొని యున్నను
పొట్ట కింత కూడు పొసగలేము
కదపకున్న కలము కావ్యాలు వ్రాయునె
పాలపర్తి మాట పసిడి మూట"

తినడానికి తిండిలేని రోజుల్లో ఏమి కష్టపడకుండా కూర్చొని ఉంటే కడుపు నిండుతుందా? అని ప్రశ్నిస్తాడు. దానికి దృష్టాంతంగా కలము కదిలించ కుండానే కావ్యాలు రాయగలమా? అంటున్నాడు. అలా ప్రశ్నించిన శ్రీధరే కలం కదిలిస్తే మాత్రం కావ్యరాశులు పొంగారినట్లే. తేటైన తీయనైన లోకోక్తులు పొరలినట్లే.

"శ్రీధర్ శతకం" చదువుతున్నంత సేపు పాఠకుడు వేరే లోకంలో విహరిస్తాడు. ప్రతి పద్యం చదువుకుని తనను తాను ప్రశ్నించుకుంటాడు. సరిదిద్దుకుంటాడు. ఏ పద్యం చదివినా శ్రీధర్ ఇది నా గురించే చెప్పాడా? ఇది నా కోసమే రాశాడా? అన్నట్లుగా ప్రతి పాఠకుడు చదివి అందులో లీనమవ్వక తప్పదు. అతని కవిత్వంలోని మానవతాదృష్టికి, కారుణ్యస్పర్శకు, చైతన్య స్పృహకు పులకించిపోకతప్పదు. శబ్దాడంబరం గాని, కవిత్వంలో దాపరికాలు గాని శ్రీధర్‌కు నచ్చవు. చెప్పాలనుకున్న విషయాన్ని స్పష్టంగా చెప్పగల కలం కలిగిన వాడతడు. అందుకు తగ్గ కవితా బలం పుష్కలంగా పెంపొందించు కున్న వాడు కూడా. సరళమైన, సహజమైన పదబంధాలే అతని కవిత్వంలో కనిపిస్తాయి. ఒక్క ఈ శ్రీధర్ శతకమే కాదు "భారతీయ సంస్కృతి "విద్యాసుగంధం", "సుధా వల్లరి", "అక్షరప్రభాతాలు", "వనకుసుమములు", "నా బాల్యం, "మదిలో మొలకెత్తిన ఊహలు", "శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం", లోకరక్షక, 'చెంగలువ' ఇలా ఎన్నో శతకాల్ని రాసి తెలుగు సాహిత్యంలో తనదైన ప్రత్యేక ముద్రను పదిలపరుచుకున్నాడు. అంతే కాకుండా ఇప్పటికే తెలుగు సాహిత్యంలోనే గజల్ ప్రక్రియలో శతకాన్ని రాసిన ఏకైక తెలుగు కవి పాలపర్తి శ్రీధర్ ఒక్కడే."తెలుగు బుక్ అఫ్ రికార్డ్స్" సంస్థ వారు దీన్ని ధృవీకరించారు.

వివిధ సాహిత్య సంస్థల నుంచి ఆయన అందుకున్న బిరుదులకు కొదవేలేదు. భీమవరం కళాస్రవంతి సంస్థ వార్షికోత్సవంలో మున్సిపల్ ఛైర్మన్ శ్రీ బొమ్మిడి నారా యణరావు గారు 'యువకవికిషోరా' అనే బిరుదును ప్రదానం చేశారు. "గణపవరం గోదావరి సాహితీ ప్రభ అనే సాహిత్య సంస్థవారు 'పద్య కవితాసుధానిధి' అనే బిరుదును, మహాకవి గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ దుగ్గిరాల వార్షికోత్సవ సభలో "సాహితీ సేవారత్న" బిరుదును, వివ్వర పద్మావతి పబ్లిక్ స్కూల్ వారి వార్షికోత్సవంలో "ఆధునిక వేమన" బిరుదును ప్రదానం చేశారు. ఇంకా 'జాతీయ విశిష్టపురస్కారం', ఉగాది పర్వదినం రోజున 'జీవితసాఫల్యపురస్కారం' అందు కున్నారు. విజయవాడ జీసస్‌క్రైస్ట్ ప్రేయర్ ఫెలోషిప్ వారు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఎన్ని బిరుదులు, ఎన్ని పురస్కారాలందుకున్నా ఆయన చేసిన సాహిత్యకృషికి అది తక్కువే. చంద్రునికి నూలుపోగులాగే అనిపిస్తుంది. ఆయనలోని ప్రతిభాపాటవాలకు, ఆయనకున్న పాండితీ ప్రకర్షకు శిరస్సు వంచి నమస్కరించకతప్పదు. మహాకవి డా॥సి.నారాయణరెడ్డి, డా॥జె. బాపురెడ్డి, ఆచార్య ఎన్.గోపి లాంటి మహాకవుల మెప్పుపొంది, వారి అడుగు జాడల్లో నడుస్తూ, నిరంతర సాహితీ మూర్తిగా కొనసాగుతూ, నేటి యువరచయితలెందరికో మార్గదర్శనం చేస్తూనే ఉన్నాడు.

# ప్రాచీన సాహిత్యం - మానవతా విలువలు

- ఉల్లెంగ కుత్స్యం, తెలుగు ఉపన్యాసకులు, రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం, బాసర.

భారతదేశం అనేక విశేషాలు కలిగిన భూమి. ఇక్కడ వేదాలు వెల్లువిరిశాయి. గురువులు తమ శిష్యులకు బోధించే పరంపర ఉంది. అందుకే వేదాలను "అపౌరు షేయాలు' అన్నారు. ఈ వేదాలు సంస్కృతంలో కఠినంగా ఉన్నందున సామాన్య జనాలకు అర్థకాక పోయేవి. అందుకనే వాటిని అర్థం చేసుకొన్నవారు వేదాలకు భాష్యం రాయడం ప్రారంభం చేశారు. అలా అనేక మంది వేదాలకు భాష్యాలు రాయడం జరిగింది. ఆ తరువాత పురాణాలు రాయడం జరిగింది. వాటి తర్వాత ఉపనిషత్తులు రాయడం జరిగింది. ఈ విధంగా సామాన్య ప్రజలకు అర్థం అయ్యే భాషలో రామాయణం, మహాభారతం, భాగవతంల రచనలు చేయడం జరిగింది.

మానవుడు తన జీవన గమనంలో వ్యవహరించ వలసిన తీరును వివరించడానికి ఈ రామాయణం, మహాభారత, భాగవతాలు తోడ్పడతాయి. మార్గదర్శనం చూపుతాయి. మానవతా విలువలను ఆయా గ్రంథాలలో పాత్రల ద్వారా ప్రబోధించడం జరిగింది. వీటిని ప్రాచీన సాహిత్యం అంటారు. ఇవి ప్రాచీన సాహిత్యమే అయి నప్పటికీ అధునిక కాలంలోని మానవులకు అనేక మార్గదర్శక సూత్రాలను బోధిస్తున్నాయి. ప్రాచీన కాలం నాటి గ్రంథాలు ఈ కాలంలో ఏం ఉపయోగపడతాయి అనే అనుమానం వస్తుంది. కాని ఈ ఆధునిక యుగంలో కూడా మనిషి వ్యవహరించవలసిన విధానాలను, పాటించ వలసిన విలువలను గురించి ఈ గ్రంథాలు ప్రబోధిస్తాయి. రామయణం రాముని జీవిత చిత్రణ, భాగవతం కృష్ణుని జీవన చిత్రణ, మహాభారతం పాండవ కౌరవులు జీవనమాల గురించి ఉన్నప్పటికి ఈ గ్రంథాలలోని వారి వారి జీవితాలను, మనం అధ్యయనం చేస్తే మనిషి జీవితం ఎలా ఉండాలి. జీవితంలో అనేక సందర్భాలలో మనం వ్యవహరించవలసిన విధానాలు అర్థమవుతాయి. ఆచరణకు యోగ్యమవుతాయి. అందుకే నేటికి అవి మార్గ దర్శకంగా నిలుస్తున్నాయి. కేవలం భారతదేశమే కాదు ప్రపంచ ప్రజలందరూ ఈ గ్రంథాలను ఆదర్శంగా తీసు కుంటున్నారంటే వాటి ప్రాధాన్యత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలో ఇతర దేశాల ప్రజలు ఇతర మతాలను అవలంబిస్తున్నవారు అయినప్పటికి వారి మతాలతో కొన్ని గ్రంథాలు ఉన్నప్పటికీ, భారతదేశంలో రాయబడిన ఈ గ్రంథాలను వారు చదివి, అర్థం చేసుకొని దానిని అవలంబిస్తున్నారంటే, నేటి ఆధునిక యుగంలో ఆ గ్రంథాలు ప్రాధాన్యత ఎలా ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. ఇలా రామాయణ, భారత, భాగవతాలు మానవతా విలువను ప్రబోధించడానికి రచించబడినవి.

రామాయణం అనగా రాముని ప్రగతియని అర్థం, రాముని జీవితం ఎలా ముందుకెళ్ళిందో వివరించేదే రామాయణం. రాముని అవతారం త్రేతాయుగంలో జరిగింది. సాక్షాత్ శ్రీమహావిష్ణువే రాముని అవతారంగా భూమిపైకి వచ్చాడని జనుల విశ్వాసం. సాక్షాత్ భగ వంతుని అవతారం అయినప్పటికి, రాజవంశంలో జన్మించి నప్పటికీ సాధారణ మానవునిగా జీవించాడు శ్రీరాముడు. దశరథ మహారాజు పెద్దకుమారుడైన శ్రీరాముడు తన జీవితంలో అనేక మానవతా విలువలను ప్రబోధించాడు.

చిన్ననాటి నుండే గొప్ప సంస్కారం కలిగిన రాముడు 12 సం॥రాల వయస్సులోనే విశ్వామిత్రుని యాగరక్షణకు బయలుదేరుతాడు. అప్పుడే విశ్వామిత్రుని ద్వారా అనేక ధర్మ సూక్ష్మాలను నేర్చుకుంటాడు. మొట్ట మొదట తాటకి అనే రాక్షసిని సంహరించి తన ధర్మరక్షణా కార్యానికి శ్రీకారం చుడతాడు శ్రీరాముడు. యాగముకు ఇబ్బంది

పెడుతున్న మారీచుడిని, సుబాహుడిని తన బాణపు దెబ్బలతో పారద్రోలినవాడు శ్రీరాముడు. ధర్మ రక్షణ కోసం అవసరమైతే రాక్షస సంహారం తప్పదని శ్రీరాముడు నిరూపించాడు.

పట్టాభిషేకం కోసం ఏర్పాటు చేయగానే, రాజు కావలసిన అవకాశం ఉన్నప్పటికీ అలా కాకుండా 14 సం॥రాలు వనవాసం చేయడానికి వెళ్ళాడు రాముడు. తండ్రి ఆజ్ఞను జవదాటకూడదు అనే విషయాన్ని రాముడి జీవితం చూసి నేర్చుకోవచ్చు. యాగరక్షణకు వెళ్ళమని చెప్పి, పట్టాభిషేకం చేస్తానని చెప్పినా, లేదు వనవాసానికి వెళ్లమని చెప్పి, అన్నింటినీ సమానంగానే స్వీకరించాడు రాముడు. దేనికి ఎదురుచెప్పలే. తండ్రిమాట పట్ల కుమారుడు ఎలా వ్యవహరించాలో చేసి చూపాడు రాముడు. నేటి యువత తల్లిదండ్రులను విస్మరిస్తున్న తరుణంలో రాముడు వ్యవహరించిన తీరును మనం అవగతం చేసుకోవచ్చు. తల్లి పట్ల ప్రేమ ఎలా ఉండాలో కౌలస్య రాములను చూస్తే అర్థమవుతుంది. కేవలం తన తల్లినేకాదు పినతల్లుల పట్ల కూడా నమాన ఆదర, ప్రేమాభిమానాలు గౌరవాలను చూపాడు రాముడు. రాజ్య పట్టాభిషేకాన్ని త్యజించి వెళ్ళిన రాముడు తన ధర్మరక్షణా కార్యంలో ముందుకెళతాడు. భరతుడు వచ్చి మళ్లి రాజ్యనికి వచ్చి పట్టాభిషేకం చేసుకొమ్మని చేప్పిన సందర్భంలో అన్నదమ్ముల మధ్య ప్రేమ ఎలా ఉండాలో తెలుస్తుంది. నేడు అన్నదమ్ముల గొడవలు ఏ రీతిలో ఉన్నాయో చూస్తే, అనాటి రాముడు తన తమ్ములతో చూపిన ప్రేమను అర్థం చేసుకొని నేటి అన్నదమ్ములకు ఆ రామాయణంలోని ఘట్టాలు ఎంత ఆదర్శమో మనం అర్థం చేసుకోవచ్చు. రాముని వనవాసంలో ప్రజలతో రాముడు ప్రదర్శించిన ఆదరణ అమోఘమైనది. సాదారణ గిరిజన స్త్రీ అయన శబరిని అనుగ్రహించి దర్శన మివ్వడము, అహల్య యొక్క శాప విమోచనం చేయడం, గుహున్ని కౌగిలించుకోవడం, ఇలాంటి ఘట్టాలను పరిశీలించినపుడు ఆనాడు రకరకాల వృత్తుల కులాలు ఉన్నప్పటికీ అందరూ సమాన గౌరవాన్ని పొందేవారని అర్థమవుతుంది. రాజవంశంలో జన్మించిన రాముడు అందరిని సమానంగా చూసిన తీరు అమోఘమైనది నేడు కులాల పేరుతో, వర్గాల పేరుతో, వైషమ్యాల పేరుతో మారుతున్న ప్రజలు రాముడు అందరిపట్ల సమాన ఆదర అభిమానాల ఎలా చూపాడో మనం అర్థం చేసుకోవచ్చు. నేడు సమాజంతో లోపిస్తున్న సమానత్వం మనం సాధించ వలసిన తిరును అర్థం చేసుకోవచ్చు. ఋషులను, మునులను కాపాడడం కోసం రాముడు జీవించాడు.

సీతారాములు జీవనం, వారి అన్యోన్యత ఈనాటి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నది. పాశ్చాత్య దోరణిలో కొట్టుమిట్టాడుతున్న ఈనాటి భార్య భర్తల సంబంధాలు మారిపోతున్నా తరుణంలో ఆనాడు సీతారాముల జీవనాన్ని చూసి మనం ఎలాల ఉండాలో నేర్చుకోవచ్చు. ఇలాంటి మానవతా విలువలను రామాయణంలో మనం చూడవచ్చు. భర్తతో వనవాసానికి కూడా బయలుదేరడం, అనేక కష్టాలను భరించడానికి తయారుగా ఉండడం నేటి సమాజంలో స్త్రీలు ఆదర్శంగా స్వీకరించాలి. భార్య భర్తల బంధంకి ఉదాహరణ సీతారాములు కేవలం రాముడే వనవాసానికి వెళ్ళడం గురించి కోరిప్పటికీ, సీత కూడా వెళ్ళడం, నార చీరలు ధరించడం. ఇలా భర్తకు ప్రతి పనిలో వెన్నంటి ఉండడం సీతను చూసి నేటి సమాజం నేర్చుకోవలి. లక్ష్మణుడు రాముని పట్ల సోదర భక్తి నేర్పిస్తాడు. అన్నదమ్ముల ఎలా ఉండాలో మనకు నేర్పిస్తారు. నేడు ఆస్తిపాస్తుల కోసం, భూముల కోసం తగాదాలు పడుతున్న సంఘటనలు చూస్తున్నపుడు రామలక్ష్మణుల బంధం నేటి నమాజానికి ఎంత అవనరమో అర్థమవుతుంది. జఠాయువు అనే పక్షికి అంత్యక్రియలు నిర్వహించడం వలన పశుపక్షాదుల పట్ల ఎలా వ్యవహరించాలో నేర్పిస్తాడు రాముడు. రావణుడు సీతను అపహరించినపుడు రాముడి వేదన వర్ణనాతీతం. తనను మోహించిన శూర్పణఖ పట్ల ఏవిధమైన మోహం చూపలేదు శ్రీరాముడు. ఇతర స్త్రీల పట్ల ఎలా ఉండాలో

నేర్చుకోవాలి. సీతను వెతుకుతూ రాముడు ఏడ్చిన తీరు బాధాకరం సుగ్రీవునితో మైత్రి, హనుమంతునితో స్నేహము ఇవన్ని గమనిస్తే అనేక మానవీయ విలువలను నేర్చుకోవచ్చు.

సంవత్సరం పాటు రావణుని చెరలో ఉన్నప్పటికీ ఏమాత్రం ఇతర ఆలోచనకు తావునివ్వని సీత మహా పతివ్రత. రావణుని ఒక గడ్డిపోచతో పోలుస్తుంది సీత. రాముడు తన భార్యకోసం రామసేతువును నిర్మాణం చేసి యుద్ధం చేసి సీతను విడిపించడం, రాజ్యపట్టాభిషేకం ఒక చాకలి నిందను విని సీతను అడవులకు పంపడం అలా పంపినా సీత రామున్ని నిందించక పోవడం, రాజుగా తన పాలన గొప్పగా చేయడం రామాయణ సారాంశం.

ఈ విధంగా ఒక మంచి బాలుడుగా, పుత్రుడుగా, యువకుడుగా, సోదరుడుగా, స్నేహితుడుగా, భర్తగా, రాజుగా, చక్రవర్తిగా ఇలాంటి అన్ని పాత్రలలో కూడా సాదారణ మానవుడిలాగా జీవిస్తూ ఆదర్శాన్ని చూపెట్టడం జరిగింది. మానవ సంబంధాలు మంటగలుస్తున్న నేటి ఆధునిక పాశ్చాత్య జీవన విధానంలో అనేక మానవీయ విలువలను సమాజానికి అందించిన తీరు మానవాళికి మార్గ దర్శనము అవుతుంది అనడంతో సందేహం ఎంతమాత్రం లేదు.

### ఇక మహాభారతం గురించి పరిశీస్తే..

మానవ జీవితమే ఒక మహా భారతమని పెద్దలు అంటారు. మహాభారతంలోని ఘట్టాలు నేటి మానవ సమాజం అనేక విషయాలు నేర్చుకోలి. మానవీయ విలువలు నేర్చుకోవచ్చు. ఇది ద్వాపర యుగంలో జరిగిన సంఘటనలు అయినప్పటికీ కలియుగంలో మానవ సమాజం నేర్చుకుంటున్న విషయాలు మనం గమనించాలి.

దృతరాష్ట్రుడు, పాండురాజుల కుమారులైన కౌరవ పాండవులు రాజ్యాలకోసం పడిన గొడవల సారాంశమే మహాభారతం. ఈనాడు అన్నదమ్ముల మధ్య, తమ సంతానం కోసం పెంపర్లాడే పెద్దల ఉదాహరణలు చూస్తే ఆనాడు కూడా ఇలాంటి పరిస్థితులు ఉండేవన్న విషయం స్పష్టంగా అర్థమవుతుంది. వ్యాదిగ్రస్థుడైన పాండురాజు, అంధుడైన దృతరాష్ట్రుడు వారి కుమారుల కోసం, అధికారాన్ని కట్టబెట్టడం కోసం చేసే ప్రయత్నాలు ఉంటాయి. పాండురాజు చనిపోయిన తర్వాత దృతరాష్ట్రుడు తన కుమారుల పట్ల పక్షపాతాన్ని చూపడం వలన పాండురాజు పుత్రులు తమకు రావలసిన రాజ్యం గురించి జరిపిన సంఘర్షణనే మహాభారతం. పాండవులు తమ వద్ద శక్తియుక్తులు ఉన్నప్పటికీ, తమ పెదతండ్రి అయిన దృతరాష్ట్రుడి పట్ల గౌరవ ప్రవృత్తుల ప్రదర్శించడం, ఆయన నిర్ణయం కోసం వేచి చూడడం కుంతిదేవి మాతృవేదన కనిపిస్తుంది. మహాభారతంలో ఏకచక్రపురం గ్రామాన్ని కాపాడడం కోసం తన కుమారుడైన భీమసేనున్ని బకాసురుని దగ్గరకు పంపడం, తనకు వివాహం కాకముందు జన్మించిన కర్ణుడిని నదిలోవేయడము, పాండవుల కోసం ఆమె భర్త చనిపోన తర్వాత వారిని కంటికిరెప్పలా కాపడటము శ్రీకృష్ణుని అండ పాండవులకు ఎల్లవేళలా ఉన్నప్పటికీ కుంతికి తప్పలేదు.

పాండవులు వారి రాజ్యం కోసం వారు ప్రయత్నాలు చేసినప్పటికీ సమాజంలో మానవీయ విలువలను గురించి సమస్త మానవాళికి వివరించి నేర్పించడం జరిగింది. కర్ణుని దానగుణం కూడా నేర్చుకోవాల్సిన విషయమే. సమాజంలో అనేక రకాల వ్యక్తులుంటారని మహాభారతమును చూసి తెలుసుకోవచ్చు. ఒకే వంశంలో జన్మించినప్పటికీ వారి మధ్య వైశమ్యాలు ఎలా ఉంటాయో మహాభారతంలో కల్లకు కట్టినట్లు వివరించాడు.

మాయాజూదంలో ఓడిండం, ద్రౌపదీ వస్త్రాపరణము ఇవి గమనిస్తే మానవునిలోని రాక్షసప్రవృత్తి తెలుస్తుంది. స్త్రీల రక్షణ కొరకు మనం పూనుకోవాలని నేర్చుకోవాలి. 12 సం॥రాల వనవానంలో పాండవులు గడిపిన విషయాలు మానవత్వాన్ని ప్రతిబింబిస్తాయి. ధర్మరక్షణ కోసమే వారి జీవనం గడిచినట్లు అర్థమవుతుంది. వన

వాసంలో తమకంటే చిన్నస్థాయి సామాన్య ప్రజలతో వారు కలిసిజీవించిన విధానం, మార్గ దర్శకమవుతుంది.

పాండవులు వనవాసం పూర్తి అయిన్పటికీ వారికి రాజ్యం ఇవ్వకపోవడం, కృష్ణుడు రాయభారం చేయడం విశ్వరూపాన్ని ప్రదర్శించడం, కురుక్షేత్ర సంగ్రామం జరగడం, ఇలా అన్ని ఘట్టాలలో మానవీయ విలువలు దర్శనమిస్తాయి.

కురుక్షేత్ర సంగ్రామంలో యుద్ధ భూమిలో అర్జునునికి భగవద్గీతను బోధించడం ఒక అపూర్వ ఘట్టం. ధర్మ సూక్ష్మాలను, మానవ జీవన లక్ష్యాలను అనేక మానవతా విలువలను ప్రబోధించడం జరిగింది. భగవద్గీత యావత్ ప్రపంచ మానవాళికి మార్గదర్శకమైంది. ఆనాడు ఈనాడు.

ఈ విధంగా మానవ జీవితమే ఒక మహాభారతం. మహాభారతంలో పాత్రల ద్వారా మానవతా విలువలను వివరించి ప్రబోధించడం జరిగింది.

భాగవతంలో శ్రీకృష్ణుని జీవనం ఎలా పరిణతి చెందిందో తెలిస్తుంది. శ్రీకృష్ణుని బాల్యక్రీడల లీలలుగా దర్శనమిస్తాయి. పోతన రాసిన భాగవతంలోని పద్యాలు సామాన్య జనరంజకంగా ఉంటాయి. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, ధర్మ సంరక్షణ కోసం శ్రీకృష్ణుడు సాగించిన సంగ్రామము. సామాజిక సమరత, సాటి మనుషులను, తనతో సమానంగా చూడటం, జీవనంలో ఉన్నత స్థితికి, వ్యక్తిత్వ వికాసానికి, జీవన పరిణితికి ఈ ప్రాచీన సాహిత్యం ఎంతగానో ఉపకరిస్తుంది.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2(1), February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# "వ్యాపార మృగం" కథల సంపుటి - ప్రపంచీకరణ - సామాజికావిష్కరణ

- డా॥. వి. శాంతిలక్ష్మి, అతిథి ఉపన్యాసకురాలు, తెలుగు విభాగం, బెంగుళూరు విశ్వవిద్యాలయం, బెంగుళూరు, కర్నాటక.

ప్రపంచీకరణలో పెట్టుబడులతో పేదరిక నిర్మూలనం, అభివృద్ధి జరుగుతుందని ఆశించిన వాళ్ళకు నిరాశ ఎదురవుతున్న సందర్భాన్ని, అంతేగాక వ్యాపారం సాగటం, లాభాలు గడించటం ప్రధానంగా మారి వ్యాపర దృష్టితో లాభాలు గడించే కోణంలో మానవ సంబంధాల్లో వచ్చిన మార్పులను, స్త్రీల, మైనారిటీల వేదనలను, సామాజిక సమస్య, విధ్వంసాలను "వ్యాపార మృగం" కథల సంపుటిలో ప్రతీకాత్మకంగా చిత్రించిన వారు రచయిత్రి "ముదిగంటి సుజాతారెడ్డి" గారు.

కథ చెప్పటం చాలా నేర్పుతో కూడుకొన్నది. అందునా ప్రపంచాన్నీ, తరతరాలుగా సంతరించుకొన్న మానవ సంబంధాలనూ పటాపంచలు చేస్తున్న రాజకీయార్థి కాంశాల నేపథ్యంలో కళాత్మకంగా, ప్రతీకాత్మకంగా కథగా రూపొందించటం చాలా గొప్ప విషయం. వ్యక్తికీ, సమాజానికీ ఉన్న సంబంధం అలా ఉంచితే, వ్యక్తికీ - వ్యక్తికీ మధ్య ఉండే కనీస మానవ సంబంధాలపై కూడా తన ప్రభావం చూపిస్తున్న "గ్లోబలైజేషన్" అంశాన్ని కథల్లో ఇమడ్చి పాఠకుల మెదళ్లకు కదలిక కలిగించడం ఎంతో శాస్త్రీయంగా రాజకీయ - సామాజిక అవగాహన ఉన్న రచయితలకే సాధ్యమవుతుంది.

బహుళ జాతి సంస్థల వ్యూహాల వెనుక ఉన్న రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల గురంచి, ఆ వ్యూహాల ఫలితంగా పేద దేశాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక జీవనంలో వచ్చిన, రానున్న ప్రభావాల గురించి ఈ కథలు విశ్లేషిస్తున్నాయి.

ఫ్రీమార్కెట్ విధానంతో మార్కెట్ల నిండా కుప్పలు తెప్పలుగా కొత్త కొత్త బ్రాండ్స్ కనువిందు చేస్తున్నాయి. సూపర్ బజార్ల స్థానంలో వేల చదరపు అడుగుల బహుళ అంతస్థుల "మాల్స్" వస్తున్నాయి. అయితే అక్కడి వస్తువులేవీ సామాన్యుడికి అందుబాటులో ఉండడం లేదు. ఇలాంటి మార్కెట్ విధానం వలన సామాన్య ప్రజల జీవితాలలో అల్లకల్లోలం సృష్టించబడుతోంది. వాటిని చూస్తూ ఊరికే ఉండలేక, అందుకోగలిగే స్థోమత లేక మనసు చంపుకుని బ్రతకలేక సులభ వాయిదా పద్ధతులకు ఆకర్షితులై అప్పుల ఊబిలో చిక్కుకుని చివరకు దాని నుండి బయటపడే మార్గం కనిపించక తమ బతుకుల్లో చిచ్చు పెట్టుకుంటున్న వైనాన్ని తెలిపే కథలు పాఠకుల మనసులను కదలించడమే కాక ఆలోచింప చేసేవిగా ఉన్నాయి. ఇలాంటి మార్కెట్ విధానం మాకెందుకని పాఠకులు తమకు తాము ప్రశ్నించుకునే అవకాశాన్ని రచయిత్రి కథల రూపంలో కలిగించారు. ఆర్థిక సంస్కరణల అమలు వల్ల అనేక దుష్ఫలితాలు సంభవిస్తున్నాయి. ప్రైవేటీకరణ విధానంతో ప్రభుత్వం క్రమంగా పలురంగాల నుండి తప్పుకుంటున్నది. ప్రజలకు అత్యంత అవసరమైన విద్య, వైద్య రంగాల్ని దాదాపుగా ప్రైవేటీకరించారు. కాలక్రమంలో అమెరికా ఆధిపత్యం బాగా పెరిగిపోయింది. ప్రతిదాన్ని అమ్మటం, కొనటం, కిరాయికి ఇవ్వటం, సహజవనరులన్నిటినీ లాభాలుగా మలచుకోవటంలో పేటెంట్ హక్కులన్నీ మావేనంటోన్న అమెరికా గుట్టలు, నదులు, బొగ్గు, అదీ ఇదీ అని ఏమిటి ప్రకృతినంతటినీ ప్రపంచ బ్యాంకు వ్యూహం ముందు తాకట్టు పెట్టిన వైనాన్ని కథల్లో చిత్రించారు.

ప్రమాదకర పరిస్థితి నుండి భారత దేశం బయటపడి, ఆర్థిక సంస్కరణలమీద పట్టు, మార్కెట్ శక్తుల మీద అదుపు సాధించకపోతే భారత ప్రజలు దీర్ఘకాల నష్టాలను చవిచూడాల్సి వస్తుందున్న ఆందోళనను రచయిత్రి తమ కథల్లో జొప్పించి దేశంపట్ల తమ బాధ్యతనూ, భక్తినీ ప్రదర్శించారు. పాఠకులలో చైతన్యం కలిగించే ప్రయత్నం

చేశారు. అమానవీయ విలువల విజృంభణల వివిధ పార్శ్వాలు ఈ కథల్లో దర్శింపచేసి భారత ప్రజానీకాన్ని మేలుకొల్పే ప్రయత్నం చేశారు.

ఈ కథల సంపుటి నుండి పది కథలను ఈ పత్ర రచనకు తీసుకుని విశ్లేషించాను. ఈ కథల్లో కొన్ని కథలు వార, మరియు వివిధ పత్రికలలో, వివిధ సందర్భాలలో ప్రచురించడం కూడా జరిగిందన్న విషయం గమనార్హం.

## వ్యాపార మృగం :

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18 జనవరి 2003)

**ఇతివృత్తం** : కల్లు, సారా, విస్కీ, రమ్ము, గుడుంబా, గుట్కా, పాను మొదలైన మాదకద్రవ్యాలను అమ్ముకొనే వ్యాపారస్తులు తమ వ్యాపారానికి అడ్డు వస్తోందని పులి మాధవి అనే యువతిని హత్య చేయిస్తారు. పులి మాధవి సమాజాంలో మాదకద్రవ్యాల గురించి చైతన్యం తీసుకు రావడానికి గజ్జె కట్టి ఆడుతూ, పాడుతూ ఊరంతా తిరుగుతుంది. ఆ మత్తులో మునిగి తేలిన తన భర్త చనిపోయినట్లు ఇంకెవరూ చనిపోకూడదనుకుంటుంది. చివరికి ఆమె వ్యాపార మృగాలకు బలి అవుతుంది. హంతకులు ఆమెను హత్య చేసి ఆమె శరీరాన్ని ఖండ ఖండాలుగా చేసి అనేక ప్రదేశాల్లో పారవేస్తారు.

**విశ్లేషణ** : వ్యాపార దృష్టిలో లాభాలను గడించే దిశలో మానవ సంబంధాల్లో వచ్చిన మార్పులు, నశిస్తున్న మానవ విలువలు ఈ కథలో ఒళ్ళు జలదరించే రీతిలో చిత్రించ బడింది. అక్కడక్కడా మిగిలి ఉన్న కాస్త మంచితనం కూడా ప్రపంచీకరణ మత్తులో ఇలా బూదిడ చేయబడు తోంది. మనిషి తద్వారా సమాజం తద్వారా ఊరు తద్వారా దేశం బాగుపడాలంటే ప్రతివ్యక్తిలోనూ మార్పు రావాలి. ప్రతివ్యక్తి ముందు మనిషిగా ఆలోచించాలి కానీ మృగంలా కాదు అన్న సందేశాన్ని చాటుతున్న కథ వ్యాపార మృగం. స్వార్ధరహిత మనస్థితి నుండి విడివడి మనిషి మనిషిగా ఆలోచించిన నాడు సమాజానికి నిజంగా మేలు జరుగు తుంది. ఆరోగ్యకరమైన సమాజం నెలకొన్న నాడు మనిషి చాలా ఉన్నతస్థాయిని అధిరోహించగలుగుతాడు. ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో ఇది చాలా అవసరం.

## న్యూ ఆంనద్ హోటల్ :

**ఇతివృత్తం** : నగరంలో రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ల పేర్లతో రోడ్డుకు ఇరుపక్కల ఉన్న వ్యాపార షాపులను కూలగొట్టి, అందుకు ప్రభుత్వం కొంత నష్టపరిహారం చెల్లించి షాపులు మళ్లీ కట్టుకోవడానికి లోన్లు ఇచ్చి సహ కరిస్తుంది. అధునాతన షాపులు కట్టి కొత్త కొత్త యంత్రా లను ప్రవేశపెట్టి లాభాలు గడించాలన్న కోరిక తీరు తుందని వ్యాపారులు సంతోషిస్తారు. కానీ షాపులలో, హోటళ్లలో పనిచేసేవారికి పనులు పోవడంతో ఆ పేద కుటుంబాలు మొత్తం ఆదాయం లేక రోడ్డున పడతారు.

**విశ్లేషణ** : పేదలు మరింత పేదలుగా ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతున్న ఈ ప్రపంచీకరణ యుగానికి ఈ కథ ఒక ఉదాహరణ. ప్రభుత్వ కార్య కలాపాలన్నీ ధనవంతులకే లాభసాటిగా మారుతున్నాయి. పేదలకు ఎటువంటి సంస్కరణలు జరగటం లేదు. ప్రగతిపథంలో ఎంతో ముందుకు సాగుతున్న భారత దేశంలో పేదరికం కూడా అంతే ఎక్కువగా పెరుగుతూనే ఉందన్న ఆవేదన ఈ కథ వ్యక్తపరిచింది.

## ఎక్కలేని మెట్లు :

**ఇతివృత్తం** : కాలేజీలో చదువుకుంటున్న జగదీష్ తన పేదరికానికి విరక్తి చెంది, ఒక డబ్బున్న అమ్మాయిపై మనసుపడి ఆమె తనకు దక్కకపోయేసరికి ఆత్మహత్య చేసుకుంటాడు. ధనవంతులను చూసి అతడు ఎన్నో కలలను కంటాడు. ఎక్కలేని మెట్లను ఎక్కుతున్నట్లుగా ఊహిస్తూ మరణిస్తాడు.

**విశ్లేషణ** : ఈ కథలో పేదరికంతో బ్రతుకు ఈడ్చే పేదల మానసిక స్థితి తెలియచేయడమైనది. తారతమ్యాలు మనిషి జీవితంలో ఏ విధంగా ఆడుకుంటాయో వివరించ బడింది. ప్రపంచీకరణ ముసుగులో చెలరేగుతున్న ఈ విధ్వంసకాండలో ఎందరో అమాయకులు బలి అవు తున్నారు. జగదీష్ ధనవంతుల విలాసవంతమైన

జీవితాలకు ఆకర్షించబడి దాన్ని అందుకోలేక, తీరని ఆశలతో జీవితంతో రాజీపడలేక చివరకు తన జీవితాన్ని తానే అంతం చేసుకోవడం వెనక ఎందరో పేదల ఆర్తనాదాలు, ఆక్రందనలు వినిపించేలా చిత్రించబడిన ఈ కథ పాఠకుల హృదయాలను నిద్రలేపి ఆలోచింప చేసేదిలా ఉంది. అభివృద్ధి నలువైపులా సాగుతోందం టున్న ఈ అందమైన భారతదేశంలో పేదవాడికి జీవించే హక్కే లేదా? అన్న ప్రశ్న ప్రతి ఒక్క పాఠకుని మెదళ్లకు పదును పెడుతుంది.

## ముంజలు :

(రచన, మార్చి 200)

**ఇతివృత్తం** : బాల్యంలోని జ్ఞాపకాలు, జన్మభూమి మీద మమకారం మెండుగా ఉన్న రవీందర్ కాలిఫోర్నియాలో స్థిరపడిన భారతీయుడు. వేసవికాలంలో సేదతీర్చే ముంజలు అంటే అతడికి చాలా ఇష్టం. కంప్యూటర్ ముందు కూచుని ముంజల్.కామ్ అనే పేరు చూడగానే చిన్నతనంలో తిన్న ముంజల మధుర రుచిని, ఆనాటి మధుర స్మృతులను, తీయటి అనుభూతులను నెమరు వేసుకుంటాడు. మాతృభూమిపై అతనికి ఎంతో ప్రేమాభి మానాలున్నప్పటికీ నేటి జీవనశైలి అతన్ని కాలిఫోర్నియాలో స్థిరపడేలా చేస్తుంది.

**విశ్లేషణ** : ముంజలు కథలో దాగిన మధుర స్మృతుల లోతుల్లో తొంగి చూస్తే ఎన్నో నిగూఢ రహస్యాలు బయట పడతాయి. దేశంలో ప్రవేశించిన ప్రపంచీకరణ వల్ల రేపటి భావితరాలకు మనం ఏ విధమయిన స్మృతులను మిగుల్చుతామన్న ప్రశ్న ప్రతి భారతీయుడు తప్పనిసరిగా వేసుకోవలసిన అవసరం నెలకొన్న పరిస్థితులలో నేడు భారతదేశం ఉంది. నిన్నటి తరం కష్టనష్టాలకు ఓర్చి నేటి తరానికి బహూకరించిన స్వాతంత్ర్యం నేటి తరం ఆలోచనారహితంగా సర్వనాశనం చేసుకుని, దేశం మొత్తాన్ని ప్రపంచీకరణ ముసుగు తొడిగి తమ వశం చేసుకునే ప్రయత్నంలో ఉన్న విదేశీయుల మయం చేస్తోంది. ఇటువంటి సందర్భంలో రేపటి తరానికి నేటితరం మన సంస్కృతి, సంస్కారాలు, తీయటి అను భూతులు మిగల్చగలదా? అన్నది ప్రశ్నార్థకంగా మిగల కూడదంటే ప్రతి భారతీయుడు ఆలోచించి ముందడుగు వేయవలసిన అవసరాన్ని ఈ కథ చిత్రించింది.

## సంస్కారబంధం :

(తెలుగుపలుకు - తానా రజతోత్సవ సంచిక, జులై 3-5, 2003లో ప్రచురితం)

**ఇతివృత్తం** : యూ.యస్.లో స్థిరపడిన సురేందర్ జానకి లకు ఒక కూతురు, కొడుకు, యూ.యస్.లోనే పుట్టి పెరిగిన వారి పిల్లలు అక్కడి సంస్కృతినే పునికి పుచ్చు కుంటారు. సురేందర్ జానకిల పెళ్లి సిల్వర్‌జూబ్లీ ఫంక్షన్ వారి పిల్లలకు ఓ కొత్త కోణాన్ని పరిచయం చేస్తుంది. ఇష్టపడిన జంట కొద్దికాలంపాటు కలిసి జీవించడం ఇష్టంలేనిరోజు విడిపోవడమే తెలిసిన వాళ్ళకి ఇంతకాలం కలిసే ఉన్న సురేందర్ జానకీలను చూసి ఎలా ఇది సాధ్యం అనిపిస్తుంది. భారత సంస్కృతిని కాపాడుతున్న వివాహ బంధాన్ని గుర్తించిన వారి కూతురు దానికి ఆకర్షితురాలై తనకూ అటువంటి జీవితమే కావాలని కోరుకుంటుంది.

**విశ్లేషణ** : యూ.యస్.లో పుట్టి పెరిగిన అమ్మాయి, భారత వివాహ సంస్కృతిని గుర్తించడమే కాక తానూ అటువంటి బంధాన్ని పొందాలని నిర్ణయం చేయడం ముదావాహం. సురేందర్-జానకిల ఆదర్శ దాంపత్యానికి రుజువు. భారత సంస్కృతికి భార్యాభర్తల అనుబంధం ఆయువుపట్టు వంటిది. దాన్ని విదేశీయులు గుర్తిస్తున్న సందర్భంలో భారతీయులు మాత్రం చేజార్చుకుంటు న్నారు. విదేశీ సంస్కృతికి ఆకర్షితులవుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను వీడుతున్నారు. యువతలో ఈ విషయమై అవగాహన కలిగించే ప్రయత్నం ఈ కథలో కనిపిస్తుంది.

## కొసరి కొసరి బేరాలు :

(విపుల, సెప్టెంబర్ 2005)

**ఇతివృత్తం** : కోటి రూపాయల కట్నం ఇచ్చి వివాహం

చేసే దొరల పనిమనుషులతో మాత్రం పనుల దగ్గర బేరాలాడతారు. పది, పన్నెండు రూపాలయలకే పని వాళ్ళతో ఒకరితో పిండిని కొట్టించుకుని, అన్ని పనులు చేయించుకుని వాళ్ళ శ్రమను దోచుకుని పేదవాళ్ల పొట్ట కొడతారు.

**విశ్లేషణ** : సమాజంలో ఆర్థిక అసమానతలు, దోపిడీలు పెరిగిపోతున్న వైనం ఈ కథ చిత్రించింది. ప్రపంచీకరణ ముసుగులో సాగుతున్న అభివృద్ధి పేదలపై ఏనాటికైనా కనికరం చూపుతుందా అన్నది ప్రశ్నార్థకంగానే మిగులుతున్నది.

### నిశ్శబ్ద విప్లవం :

(ఆటా వారి 'అమెరికా భారతి' పత్రిక, జనవరి - ఫిబ్రవరి 2003; 'మన తెలంగాణ' ఏప్రిల్ - జూన్ బులెటిన్ - 2, 2005)

**ఇతివృత్తం** : ఊర్లో ఒకప్పుడు అధికారం చెలాయించిన దొరలు తక్కువ కులస్థులను చులకనగా చూస్తూ, వాళ్ళతో వెట్టిచాకిరీ చేయించుకునేవారు. పరిస్థితులు తారుమారు కావడంతో అధికార పెత్తనం చలాయించిన దొరలు కూటికి గతిలేక పనులు దొరక్క బతకడానికి కూలి పనులు చేయవలసి వస్తుంది. సమాజంలో కుల వ్యవస్థ, ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు తీవ్రస్థాయిలో చోటుచేసుకుంటాయి.

**విశ్లేషణ** : ప్రపంచీకరణ ఆగమనం సమాజంలో కుల వ్యవస్థ, ఆర్థిక పరిస్థితులపై చూపుతున్న తీవ్ర ప్రభావం ఈ కథలో చిత్రించబడింది. శిఖరాలను అందుకోబోతున్నా మనుకుంటూనే పాతాళంలోకి కూరిపోతున్నామన్న సత్యాన్ని ఈ కథ ఆవిష్కరించింది.

### మారిన బంధాలు :

(తెలంగాణ సోయి, జనవరి - మార్చి 2003))

**ఇతివృత్తం** : సమాజంలో కులవృత్తుల్లో మార్పులు సంభవిస్తాయి. పరిస్థితుల ప్రభావం వల్ల గొప్ప వర్గం వారు కూడా జీవనాధారం కోసం కులం పక్కన పెట్టి అన్ని రకాల పనులు చేయవలసి వస్తుంది. మరిపకాయలు కొట్టడం, వడ్లపని, మంగలి పని చేయనారంభిస్తారు. బతుకుదెరువు కోసం తమ తమ కుల వృత్తులను వదిలి దొరికిన పని చేసుకుంటూ కాలం వెలిబుచ్చడం కొంతమందిని మానసికంగా కృంగదీస్తుంది.

**విశ్లేషణ** : ప్రపంచీకరణ యుగం ప్రారంభంతో కుల వృత్తులు ఎలా కనుమరుగవుతూ వస్తున్నాయో చర్చించిన కథ 'మారిన బంధాలు'. ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులు సమాజంపై ఎంతటి తీవ్రప్రభావాన్ని చూపుతుందో విశ్లేషించింది. సమాజం తన స్వరూప స్వభావాల్ని మార్చుకుని కేవలం బ్రతకటం కోసమే ఎదురవుతున్న తప్పని పరిస్థితులకు అనుగుణంగా రాజీ పడుతూ జీవితాన్ని ఏదోవిధంగా వెలిబుచ్చుతోంది. ఇది ఇలానే సాగితే ఏదో ఒక రోజు భారత ప్రజలు పూర్తిగా బానిసలుగా మారే ప్రమాదకర దృశ్యాన్ని ఈ కథ పాఠకుని ముందించింది.

### వ్యాపార వియ్యం :

(ఆదివారం ఆంధ్రప్రభ, 16 జనవరి 2005)

**ఇతివృత్తం** : సుదర్శన్ - బ్రహ్మాజీలు ఇద్దరూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు. ఒకరంటే ఒకరికి గిట్టని విరోధులు. వ్యాపారంలో కోట్లు గడించిన వారిరువురికీ పెద్ద కష్టం వచ్చిపడుతుంది. వేర్పాడు అనే కొత్త పార్టీ, కొత్త రాష్ట్రం కావాలనే ఉద్యమాలను ప్రారంభిస్తుంది. దీని కారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోతుంది. అలాంటి సమయంలో శత్రువులైన సుదర్శన్ - బ్రహ్మాజీలు అన్నీ మరచి ఇంకా ఏర్పడని కొత్త రాష్ట్రానికి రాజధాని సృష్టించి రైతుల నుండి అధిక భూములను అతి తక్కువ ధరకు సేకరించి అధిక లాభాలను గడించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కొత్త అర్థం చెప్పి మళ్లీ తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటారు.

**విశ్లేషణ** : భూముల్ని కబ్జా చేసి అమ్మిన వాటినే మళ్లీ మళ్లీ అమ్ముతూ కొన్నవారి కడుపుకొట్టి సొమ్ము చేసు

కుంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారస్థుల అరాచకాలను వ్యాపార వియ్యం కథ తెలియచేసే ప్రయత్నం చేసింది.

**ఇంకా పొద్దు పొడవలేదు :**

**ఇతివృత్తం** : శీల తన భర్తతో పడిన కష్టాలను, అతని సూటిపోటి మాటలను భరించింది. అతని తీరు రోజు రోజుకు ఎక్కువైన కొద్దీ విడాకులు ఇవ్వడానికి సిద్ధ పడింది. తన జీవితానికి ఒక మంచి మార్గం వెతుక్కుంది. ఇంకో పెళ్లి చేసుకోవాలని నిశ్చయించింది. దీన్ని ఆమె తండ్రి హర్షించడు. ప్రపంచం ఎంత ముందున్నా తనకు జరుగుతున్న అన్యాయానికి తనకు తానుగా తీసుకున్న పరిష్కారాన్ని కూడా హర్షించలేని తన తండ్రి ప్రవర్తన శీలకు బాధ కలిగిస్తుంది.

**విశ్లేషణ** : ప్రపంచీకరణలో దినదినాభివృద్ధి చెందు తున్న దేశంలో స్త్రీ మాత్రం ఇంకా అభివృద్ధి నోచుకోలేదన్న అర్థంలో చిత్రించిన కథ 'ఇంకా పొద్దు పొడవలేదు'. మగవాళ్ళు స్త్రీ రెండో పెళ్లిని హర్షించలేని సంప్రదాయ తత్వం, ప్రపంచం ఏ తీరున మారినా కనిపించని స్త్రీ అభివృద్ధిని ఈ కథలో చిత్రించారు. బాల్యంలో తండ్రి నీడలో, వయసులో భర్త నీడలో, ముసలితనంలో కొడుకు నీడలో స్త్రీ జీవించాలన్న మనువు శాసనం అనాదిగా చెలామణి అవుతూ, స్త్రీలు సైతం ఎంతో అభివృద్ధిని సాధిస్తున్నప్పటికీ ఇంకా మనువు మాటలకే జేజేలు కొడుతున్న నేటి స్వార్థపూరిత మగ ప్రపంచాన్ని జయిం చడం ఎలా అన్న ప్రశ్న ఈ కథ చదువుతున్న ప్రతి ఒక్కరి మనసులో ప్రతిఫలిస్తుంది.

**ముగింపు :**

మానవ సంబంధాలన్నీ మార్కెట్ సంబంధాలుగా రూపాంతరం చెందుతున్నాయి. దేశమంటే మట్టి అని ఆరాధించిన మొన్నటి తెలుగు సమాజాన్ని, దేశమంటే మట్టి కాదు మనిషి అనీ, దేశాన్ని ప్రేమించి ప్రగతిని పెంచమనీ ప్రబోధించిన నిన్నటి సాహిత్యాన్ని ప్రక్కకు నెట్టుతూ దేశమంటే మట్టి కాదు, మనిషీ కాదు దేశమంటే మార్కెట్ అంటూ సకల మానవ సంబంధాలను, సమస్త మానవ విలువలనూ శాసిస్తూ, మన జీవిత విధానాలను ప్రభావితం చేస్తూ, సంపన్న దేశాలు తమ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రయోజనాలకు దిశను నిర్దేశిస్తూ, విష సంస్కృతి పేద దేశాలపై విరుచుకు పడడానికి మార్గాన్ని సుగమం చేసిన ప్రపంచీకరణపై స్పందించిన ఈ కథలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపచేస్తాయి అనడంలో సందేహం లేదు.

★★★

# తెలుగు భాషను విస్మరిస్తోన్న రాష్ట్ర ప్రభుత్వాలు

- వై. శివకుమార్, సీనియర్ రీసార్చ్ స్కాలర్, యూనివర్సిటీ ఆఫ్ హైద్రాబాదు.

పర రాష్ట్ర పాలకుల పాలన తెలుగు ప్రాంతం పూర్తిగా అభివృద్ధికి నోచుకోకుండా ఉందని అమరజీవి పొట్టి శ్రీరాములుగారి ప్రాణ త్యాగంపై ప్రత్యేక తెలుగు దేశం ఏర్పడింది. కాని తెలుగు దేశంలో కూడా తెలంగాణ ప్రాంతాన్ని, భాషను, సాహిత్యాన్ని, అస్థిత్వాన్ని ఆంధ్ర పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. తెలంగాణ పట్ల ఆంధ్రులు చూపిన నిరాదరణ, నిర్లక్ష్యం, అసమానతల వల్ల ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వచ్చింది. కాళోజిగారు కూడా అనేక సందర్భాలలో మన పాలన మనకుంటే, మన అస్థిత్వాన్ని, భాషను బ్రతికించుకోవచ్చంటూ, ప్రత్యేక రాష్ట్రం సాధనలో కీలక పాత్ర పోషించాడు. కాని నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో ప్రభుత్వ పాఠశాలలో కూడా ఆంగ్ల విద్యను ప్రవేశపెడతామని తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుగారు ప్రకటన చేశారు. తెలుగు భాష అభివృద్ధికి ఎలాంటి రక్షణ చేపట్టకుండా ఇలాంటి ప్రకటనలు ఇవ్వడం సిగ్గుచేటు.

ఎన్నో పోరాటాలు, ఉద్యమాల, ఆత్మ బలిదానాలపై తెలంగాణ రాష్ట్ర నిర్మాణం జరిగింది. మన సొంత రాష్ట్రం ఏర్పాడిన తర్వాతనైనా మన తెలంగాణ భాషా అస్థిత్వాలకు, సాహిత్యానికి, కళలకు పెద్ద పీట వేస్తారని తెలంగాణ సమాజంలోని ప్రతి ఒక్కరు అనుకున్నారు. కాని నేడు సొంతం రాష్ట్రం ఏర్పడిన తర్వాత, తెలంగాణలో తెలుగు భాష, సాహిత్యాల పరిస్థితి ఉమ్మడి పాలనలో కంటే మరింత అధ్వాసంగా తయారైంది. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుగారు ఉద్యమ సమయంలో ఎన్నో సభలలో మాట్లాడుతూ, తెలంగాణ భాషను సినిమా రంగంలో కేవలం రౌడీలకు, కామిడిలకు, వెక్కిలిచేష్టలు చేయాడానికే ఉపయోగిస్తున్నారు. రేపు సొంత రాష్ట్రం ఏర్పాడిన తర్వాత మన భాషకు, సాహిత్యాలకు, కళలకు పెద్ద పీఠ వేస్తామని చెప్పాడు. 2017సం. నిర్వహించిన తెలుగు ప్రపంచ మహా సభలలో కూడా మాట్లాడుతూ, తెలంగాణలో తెలుగు భాషను ఖచ్చితంగా ఒకటవ తరగతి నుండి ఇంటర్ వరకు అమలు చేస్తామని, తెలుగు భాషలో చదువుకునే వాళ్ళకు ప్రత్యేకమైన సదుపాయాలను కల్పిస్తామని చెప్పాడు. కాని నేడు ముఖ్యమంత్రి గారు తెలంగాణలోని ఇంటర్, డిగ్రీ ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడేడ్, మైనార్టీ కళాశాలలో తెలుగు భాషకు పోటీగా సంస్కృత భాషను ప్రవేశ పెట్టడానికి జీవోలను విడుదల చేయడం జరిగింది. అంతే కాకుండా 2018 సం. శాసన సభలో "తెలుగు కంపల్సరీ ఆక్ట్" తీసుకువచ్చారు. ఈ ఆక్ట్ ప్రకారం ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు తెలుగును ద్వితీయ భాషగా అమలు చేయని స్కూళ్ళపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాని నేటికి కూడా ఆ చట్టం అమలుకు నోచుకోలేదు. తెలంగాణలో 2014కు ముందు తెలుగు పండిత్ కళాశాలలుండేవి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వాటిని మునివేసింది. మళ్ళీ2018సం నోటిఫికేషన్ ఇచ్చి, పరిక్షలు నిర్వహించి, కౌన్సిలింగ్ కూడా నిర్వహించకుండా అలాగే వదిలేశారు. మరో వైపు ఆంధ్రప్రదేశ్‌లో కూడా డిగ్రీ స్థాయిలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నం చేస్తోంది.

రాష్ట్రంలో ఉన్న ఆదివాసిలు, ముస్లింలు, ఇతర భాషలకు చెందిన భాషలు కూడా, ఈ రోజు తెలుగు భాషలో భాగస్వామయ్యి తెలుగు భాషతో కలిసిపోయాయి. తెలంగాణలోని తెలుగు భాషకు పూర్వకాలం నుండి ఎంతో చరిత్ర ఉన్నట్లు హిందూ మత గ్రంథాల ఆధారంగా తెలుస్తుంది. ఈ ప్రాంతాలను ఎందరో పాలించిన తెలుగు

భాష తన అస్థిత్వాన్ని కోల్పోలేదు. తెలుగు భాషకు ప్రాచీన హోదా రావడంలోను తెలంగాణ కరీంనగర్లో లభించిన శాసనాలే కీలకం అయ్యాయి.

భారతదేశంలో 1961లెక్కల ప్రకారం మొత్తం 1652 భాషలుంటే, 2011 నాటికి వీటి సంఖ్య 1369 కి వచ్చింది. దాదాపు 283 భాషలు గడిచిన 50ఏళ్ళలోనే అంతరించి పోయ్యాయి. 50ఏళ్ళ కింద సంఖ్య పరంగా దేశంలో తెలుగు మాట్లాడేవాళ్ళ సంఖ్య మూడవ స్థానంలో ఉంటే (హిందీ, బెంగాలి, తెలుగు) 2011లెక్కల ప్రకారం నాల్గవ స్థానంలోకి చేరింది. మూడవ స్థానంలోకి మరాఠీ భాష చేరడం విశేషం. ఒకప్పుడు ఆంగ్లేయ అధికారి సర్ జార్జ్ గియర్సన్ దేశంలోని భాషలన్నింటిపై సర్వే చేసి లింగ్విస్టిక్ సర్వే ఇన్ ఇండియా అనే పుస్తకంలో పొంద పరిచాడు. ఆ తర్వాత కాలంలో ఈ భాషలన్నింటిపై సర్వేను కేంద్రం చేపట్టాలి. కాని నేటికి కూడా ఆ ప్రయత్నాలు జరుగలేదు. దేశంలో 1652 భాషలుంటే, అందులో కేవలం 22భాషలను మాత్రమే భారత రాజ్యంగం ద్వారా గుర్తింపును ఇవ్వడం, మిగిలిన భాష లను విస్మరించడం వంటి అంశాల వల్ల కుడా దేశంలో భాషలు కనుమరుగవ్వడానికి ప్రధాన కారణం. ఏ సమాజంలో అయితే ప్రజలు ప్రజాస్వామ్యంలో భాగ స్వాములు అవుతారో, ఆయా దేశాలే అభివృద్ధిలో ముందు ఉంటాయి. భారత రాజ్యంగంలో ఆర్టికల్ 19 ప్రకారం తమ భావాలను వ్యక్తం చేసే హక్కు ప్రతి భారతీయుడికి ఉండి కాని, నేడు భాషాంతరాల వల్ల, స్థానిక భాషలను పరిపాలనలో భాగస్వామ్యం చెయకపోవడం వల్ల కూడా భారతదేశం వంటి దేశాలు ఇంకా అభివృద్ధి చెందక పోవడం, ప్రజాస్వామ్యంలో భాగం కాలేకపోతున్నారు. 1961 జనాభా గణన ప్రకారం దేశంలో హిందీ తర్వాత అత్యధిక మంది మాట్లాడే భాషలో తెలుగు రెండవ స్థానంలో ఉండేది. 1971 లెక్కల ప్రకారం మూడవ స్థానంలోకి, 2011 లెక్కల ప్రకారం నాల్గవ స్థానంలో పడి పోయింది. అందుకే చాలా ప్రాంతాలలో ప్రజలు పరి పాలనలో ఇంకా భాగస్వామ్యులు కావడం లేదు. కాని అమెరికాలో మాత్రం సెంటర్ ఫర్ ఇమిగ్రేషన్ స్టడీస్ సర్వే ప్రకారం 2010 నుండి2017 మధ్యకాలంలో తెలుగు మాట్లాడే వారి సంఖ్య దాదాపు 5లక్షలకు చేరింది. వికీపీడియా వ్యాసాలలో అవసరమైన చిత్రాలు ఉప యోగించుకునేందుకు ప్రపంచ వ్యాప్తంగా "వికీపీడియా పేజెస్ వాంటింగ్ ఫోటోస్" పేరిట నిర్వహించిన పోటిలో తెలుగు భాషకు మూడవ స్థానం దక్కింది. మొదటి స్థానంలో వీవో భాష, రెండవ స్థానంలో ఆంగ్ల భాషకు దక్కింది.

ఆంగ్ల సామ్రాజ్య వలస విధానం వల్ల ప్రపంచంలోని చాలా ప్రాంతీయ భాషలు అంతరించిపోయే ప్రమాదం ఉందని, అందులో తెలుగు కూడా ఉందని 1999సం యునెస్కో హెచ్చరించింది. భారతీయ సమాజంలో ఉన్న అనేక ఆర్థిక, సామాజిక అసమానతలతో, కుల వ్యవస్థలతో అనేక అంతరాలతో అనేక అవస్థలు పడు తుంది. ఫలితంగా నేటికి కూడా చాలా సమాజాలు విద్యకు దూరంగా ఉన్నాయి. ఇలాంటి సమయంలో ప్రపంచీకరణ పేరుతో ఒకవైపు ఆంగ్ల భాష, దేశ భాష అని చెప్పుకుంటూ హిందీ ఒకవైపు దాడి చేస్తున్నాయి. ఇవి మాత్రమే సరిపోదు అన్నట్లుగా నేడు సంస్కృత భాషను ప్రాంతీయ భాషలకు పోటిగా ఆయా సమాజాలపై రుద్దుతున్నారు. కేవలం ఆంగ్లంలో మాత్రమే చదువుకుంటేనే ఉద్యోగాలు వస్తాయనే అపవాదాన్ని అందరు నమ్ముతున్నారు. కాని నేడు ఇజ్రాయిల్ దేశ జనాభా కేవలం 93 లక్షలే. అయినప్పటికి నేడు ప్రపంచ దేశాల ముందు శక్తివంత మైన దేశంగా ఎదిగింది. కారణం వారి మాతృభాష అయిన హీబ్రూ భాషలో విద్యా బోధన అందించడమే. అంతే కాకుండా ప్రపంచంలో అతిపెద్ద జనాభా కలిగిన చైనా దేశం కూడా ఆర్థిక అభివృద్ధిలో భారత్ కంటే ముందుంది. విస్తీర్ణంలో అతి పెద్ద దేశం రష్యా, జపాన్, జర్మనీ వంటి చాలా దేశాలు అభివృద్ధి చెందడమే కాకుండా శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రపంచ దేశాలకు మార్గదర్శకం

అయ్యాయంటే ప్రధాన కారణం ఆయా దేశాలు మాతృభాషలో విద్య బోదనను చేయడమే.

దేశంలోనే మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రం మన తెలుగు దేశమే. కాని నేడు అభివృద్ధికి వందల కిలోమీటర్ల దూరంలో ఉన్నాం. భారతదేశంలో కవులకు, కళాకారులకు, భాషావేత్తలకు విలువ ఉండదు కాని, యూరప్ దేశాలలో కవులను, వారు ఉపయోగించిన వస్తువులను, వాళ్ళు నివసించిన ఇళ్ళను జాతి సంపదగా గుర్తిస్తారు. కాని మన దేశంలో మాత్రం వీటికి భిన్నంగా ఉంటుంది. తెలుగు భాషకు, సాహిత్యానికి రూపం తీసుకొచ్చిన ఆదికవి నన్నయగారికి రాజమహేంద్రవరంలో ఎలాంటి గౌరవం ఇవ్వలేదు. ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని కాపాడటం కోసం ప్రత్యేక తెలుగు దేశం కోసం 58రోజులు అమర నిరహార దీక్ష చేసి ప్రాణాలను విడిచిన పొట్టి శ్రీరాములు గారిని, ఆంధ్రుల ఆరాధ్య పవిత్ర గ్రంథమైన భారతాన్ని అందించిన తిక్కన్నకు నెల్లూరులో, ఒంగోల్లో ఎర్రనకు, భాగవతం వంటి గొప్ప కావ్యాన్ని ఆంధ్రులకు పరిచయం చేసిన పోతనకు వరంగల్‌లో మనం ఏం గౌరవం ఇచ్చుకున్నామో అందరం ఆలోచించుకోవాలి. డల్లాస్ లోని సమ్మర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ లింగ్విస్టిక్స్ సర్వే ప్రకారం ప్రపంచంలో చాలా భాషలకు చెందిన వాళ్ళు అతి తక్కువ సంఖ్యలో జీవిస్తున్నారు. కెమరూన్ లో యిన్సు భాషను మాట్లాడేవాళ్ళు కేవలం ఎనిమిది మంది మాత్రమే ఉన్నారు. మెక్సికోలో చిపాక్ కో తెలిసిన వాళ్ళు 150 మంది, అమెరికాలో అవాచే మాట్లాడేవాళ్ళు కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఆస్ట్రేలియాలో వాడజిగు భాష తెలిసిన వాళ్ళు కేవలం ఒక్కరు మాత్రమే ఉన్నారు. మన భాష పట్ల నిర్లక్ష్యం వహిస్తే కొంతకాలానికి మన తెలుగు భాష కూడా ఈ భాషల పక్కన చేరే అవకాశం ఉంది.

2004 సం. కేంద్ర ప్రభుత్వం తమిళ భాషకు, 2005 సంస్కృత భాషకు, 2008సం. తెలుగు, కన్నడ భాషలకు ప్రాచీన హోదా ఇవ్వడం జరిగింది. ఇలా ప్రాచీన హోదా వచ్చిన భాషాలకు కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం వందకోట్ల నిధులను ఇస్తుంది. ఈ నిధులతో రాష్ట్ర ప్రభుత్వాలు తెలుగు క్లాసికల్ లాంగ్వేజ్ సెంట్రల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, తెలుగు డెవలప్ మెంట్ కౌన్సిలుంగ్ వంటివి ఏర్పాటు చేసి భాషల అభివృద్ధికి తోడ్పడవచ్చు. ఈ నిధుల ద్వారా మాతృభాషలో విద్యాభ్యాసం చేసిన ప్రతి ఒక్కరిని జీవనోపాధి లభించడమే కాకుండా తెలుగు భాషను సజీవంగా ముందు తరాలకు అందించడం జరుగుతుంది.

మాతృభాష ఉపయోగం, పరిరక్షణను గురించి పత్రికా, సమాచార సాధనాలు కీలక పాత్ర పోషించాలి. ఉన్నత న్యాయ స్థానాలలో కూడా తీర్పులు తెలుగు భాషలలోనే వచ్చేటట్లు, కోర్టులలో తెలుగు భాష వినియోగం పెరిగేటట్లు న్యాయ స్థానాలు కూడా చొరవ చూపాలి. THE TELANGANA SHOPS & ESTABLISHMENTS RULES, 1990 చట్టం ప్రకారం రాష్ట్ర పరిధిలో ఉన్న దుకాణాలకు పేర్లను తెలుగు భాషలో పెట్టేటట్లు చట్టాలను అమలు చేయాలి. తమిళనాడు తరహాలో మాతృభాష పరిరక్షణ అనే అంశాన్ని అన్ని పార్టీలు తమ ఎన్నికల మానిఫేస్ట్‌లో పెట్టేటట్లు ప్రజలందరు పెద్ద ఎత్తున భాషా ఉద్యమాన్ని చేపట్టాలి. అంతేకాకుండా 1966సం. వచ్చిన అధికార భాష చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి. రాష్ట్రంలో ఉన్న భాష పరమైన సంస్థలకు ప్రభుత్వాలు ఖచ్చితంగా నిధులను కేటాయించి తెలుగు భాష పరిరక్షణకు పెద్ద పీట వేయాలి.

తెలుగు భాషను కాపాడుకోవడం ప్రతి తెలుగు వాడి బాద్యత. భాష అంటే కేవలం భావ వ్యక్తికరణకు మాత్రమే ఉపయోగపడే సాధనం కాదు. మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, మన కట్టుబాట్లు, మన పూర్వీకుల జ్ఞాపకాలు, మన పూర్తి అస్థిత్వమే ఇందులో నిమిడి ఉంటుంది. భాషలను ఏ సమాజనైనా సరే ఇతర సమాజాలకు, ఇతర సంస్కృతులకు బానిసలను చేయాలంటే ముందుగా ఆయా సమాజాలకు సంబంధించిన భాషలను నాశనం చేస్తే సరిపోతుంది. కాబట్టి తెలుగు భాష పరిరక్షణ మనందరి బాద్యత. ★

# ఎరుకల పుట్టుక - జీవన విధానం

- ఎన్. రాజేష్ కుమార్ రెడ్డి, పరిశోధక విద్యార్థి, జానపద గిరిజన అధ్యయన శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

భారతీయ సంస్కృతి ప్రపంచదేశాల్లో తలమానికమై తనదైన విశిష్టనేపథ్యం కలిగివున్న సంస్కృతి. ప్రాచీన నాగరికతా కాలంనుండి వేలాది సంవత్సరాలుగా ఎన్నో ఒడిదుడుకులను అనుభవించినప్పటికి తన అస్తిత్వాన్ని అది ఏనాడూ కోల్పోలేదు. ఋగ్వేద ఆర్యుల కాలంనాటి నుండి బ్రిటిష్ వలసపాలకుల పరిపాలన దాకా కాలాను గుణంగా, చారిత్రాత్మకంగా ఎన్నో మార్పులు సంభవిం చినా భిన్నత్వంలో ఏకత్వం సిద్ధించుకొన్న సంస్కృతిగా భారతీయ సమాజం నిలచిపోయింది. సనాతనధర్మం, వేదవిజ్ఞానం, పురాణ సాహిత్యం వంటి అర్వాచీన ధోరణులు మొదలు ఆధునిక విజ్ఞాన రీతులదాకా భారతీ యులు వర్తమానకాలంలో జాతీయంగానూ, అంత ర్జాతీయం గానూ తమదైన గౌరవాదరాలను ఎన్నింటినో పొందగలిగారు. ఈ నేపథ్యంలో భారతీయ సంస్కృతీ, సాహిత్యాల్లో ప్రత్యేకస్థానాన్ని సంతరించుకొన్నట్టి పలు అంశాలలో ప్రముఖంగా తనదైన విలక్షణతను, ప్రత్యే కతను కలిగివున్న అంశం గిరిజన సంస్కృతి.

భారతదేశంలో వేలాది సంవత్సరాలుగా పర్వత ప్రాంతాలు, అరణ్యాలకు మాత్రమే పరిమితమైపోయి నాగరిక ప్రపంచంతో సంబంధం ఏమాత్రమూ లేని మానవ సమూహాలు గిరిజనులు. అనాదికాలం నుండి ఎంతో ప్రాచీనతను సంతరించుకొన్న వీరిని 'ఆదివాసీలు' అని వాడుకలో వ్యవహరిస్తారు. సభ్యసమాజానికి దూరంగా పూర్తిగా తమదైన ప్రత్యేకతగల జీవనవిధానంతో ప్రకృతితో మమేకమై జీవించే జీవనరీతులు గిరిజనులు కలిగివుంటారు. గిరిజనులు సాధారణంగా అరణ్యాలు, పర్వతాలు, నదీతీరాలు వంటి ప్రాంతాల్లో నివాసం వుండే తెగలుగా వుండటంవల్ల వారు "వనచరులు, పర్వ తేయులు, ఆటవికులు" అనే పేర్లతో పిలువబడు తున్నారు. నిత్యజీవితంలో ఆహార సంపాదన మార్గాలలో వారికి వేట ప్రధానమైన అంశంగా వుండటంచేత గిరిజను లను "మృగయులు, వేటకారులు" అని కూడా పిలుస్తారు. అధికజనాభా ఒత్తిడి లేకపోవడంవల్ల, నాగరిక ప్రపంచానికి వెలుపల జీవించడం వల్ల ఎంతో స్వచ్ఛమైన సంస్కృతి, అస్తిత్వంగల గిరిజనుల సమూహాలపై నాగరిక సమాజం తమ విలువలను వీరిచే బలవంతంగా అవలంబింపం చేయాల్సిన అవసరం ఏ మాత్రం లేదని ప్రసిద్ధ సామాజిక శాస్త్రవేత్త హైమెన్‌డార్ఫ్ భావిస్తాడు.

1. ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారు తన పరి శోధనలో ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్రుల పుట్టుకను గురించి ఒక కథ ప్రసిద్ధంగా చెప్పబడింది. క్రీ.పూ. 600 సం. ఐతరేయ బ్రాహ్మణంలో తొలి సారిగా ఆంధ్ర ప్రస్తావన జరిగింది. (ఆంధ్ర ప్రసక్తి - అధ్యప్రకృతి చూ.చరిత్ర చర్చ 1989, పుటలు 7-8)
2. ఎరుకల భాషమీద మనకు తెలిసినంతవరకు తెలుగు శాఖల్లో జరిగిన పరిశోధన ఆచార్య ఎం. సంపత్ కుమార్‌గారిదే. వీరు మదురై విశ్వవిద్యా లయంలో ఎరుకల బంధువాచకాల మీద (1986) ఎం.ఫిల్ పట్టాకోసం, ఎరుకల భాషమీద పిహెచ్.డి. (1989) పట్టాకోసం కృషి చేశారు. వీరికి ముందు జరిగిన కృషిని వారే సమీక్షించారు. వీరిచ్చిన వివరా లను బట్టి కొంతమంది విద్వాంసులు ఈ భాషను తమిళ మాండలికంగా గుర్తిస్తున్నారని, మరి కొందరు ఇది ప్రత్యేక భాష అంటున్నారని కొంతమంది రచయితల పేర్లు చెప్పారు. అవి గ్రియర్‌సన్, గైట్, శ్రీనివాస వర్మ మొదలైనవారు ఈ భాషను తమిళ మాండలికం అన్నారు. సి.వి. గురురెడ్డి, డి.ఎన్.ఎస్. భట్, ఎం. అండోనోన్, జి.వి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి

ఎరుకల భాష ప్రత్యేకం అంటున్నారు. (Census of India), Vol.I, Part-XI (1) 1961, జూ.372, Yerukala Dialect, P.XIII) (చూడు. ఎం. సంపత్ కుమార్, ఎం.ఫిల్. (1986) పు.17-18)

3. E.H. థర్స్టన్ గ్రంథంలో (Caste and Tribes of South India) ఒక వంద సంవత్సరాల క్రితం ఉండిన కొరివ, కొరిచ, ఎరుకల తెగలసు గురించి ఆయన రాసిన విషయాలే కొన్ని స్థానిక వైవిద్యాలలో ఇప్పటికి అక్కడక్కడ కనిపిస్తూ ఉండటంవల్ల ఈయన ప్రచురణలో మొదటిది అబ్బేడు బోయి (1770-1848) ఈయన రచన 'Hindu Manners, Customs and Cermonics' ఈయన సంస్కృతి మీద భారతీయ సంస్కృతి పట్ల, ఆచార వ్యవహారాల పట్ల, కర్మకాండల పట్ల విశేషకృషిని 1792-1823 ప్రాంతంలో చేశారు. వీరి గ్రంథంలో కురువర్, కురవ అనే పేర్లలో దక్షిణ భారతంలో కనిపించే ఒక జనజాతిని వివరించాడు.

4. 1901 సం॥లో Madras Census Report ప్రకారం దక్షిణ భారతదేశంలో కొవలు తమిళ దేశం, కర్నూలు, సేలం, కొయంబత్తూరు, దక్షిణ అర్కాటు జిల్లాలలో వీరు ఎక్కువగా కనిపిస్తారు అని ఈ Report తెలియజేస్తుంది. కొరవ, ఎరుకల వీరు సంచార జీవులేసని వీరికి బుట్టలు అల్లడం, సోదె చెప్పటం వీరి వృత్తులని మరియు వీరు తమిళభాష మాట్లాడుతారని అయితే వీళ్ళ మూలజాతి ఒకటేనని ఈ రిపోర్టులో చెప్పబడింది.

5. పిరాట్ల సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తన పరిశోధనలో ఒకటైన కొండరెడ్లసు గూర్చి పరిశోధన చేసి "ది కొండ రెడ్డీస్ అఫ్ బైసిన్ హిల్స్" అనే గ్రంథంలో పాశ్చాత్య శాస్త్రవేత్త "హెమెండార్ఫ్" ఉభయ గోదావరి, ఖమ్మం జిల్లాలోని కొండరెడ్లు, నల్లమల లోని చెంచులు, తెలుగు మాతృభాషగా, కుల ఆదిమ తెగలని వర్ణించారు. (గిరిజన గేయాలు సామాజిక పరిశీలన, 1992, పు.14)

6. శ్రీరాములు, జి. మరియు బ్రహ్మానంద, హెచ్.ఎస్. వీరి అభిప్రాయం ప్రకారం "ద్రోణాచార్యులు గురువుల గురించి ఈ సందర్భంగా తెలియజేస్తూ ద్రోణాచార్యులు విలువిద్యాగురువు వారి తండ్రి భరద్వాజుడా? లేదా తాత ఉతద్యుడా? లేదా మరి ప్రత్యేకమైన ఎవరైనా ఆచార్యులా? అనే అంశం మీద అనేక ప్రశ్నలు ఉద్భవిస్తాయి కాని సమాధాసం ఉండదు. అయితే ఈ అంశం గురించి ఎరుకల వారితో చర్చించినప్పుడు ద్రోణాచార్యుల గురువు గురించి చర్చించినప్పుడు అనేక ప్రశ్నలు వస్తాయి గాని సమాధాసం ఉండదు. అని ఎరుకలలో కొందరి అభిప్రాయం. (ఎరుకల భాషా సంస్కృతి, సాహిత్యం, పరిశోధన, శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం, 2010, పు.36)

7. ఆచార్య సంపత్ కుమార్ మరియు క్రీ.శే. చల్లా రాధాకృష్ణ శర్మగారు ఎరుకలవారి భాషపై పరిశోధన జరిపారు. వీరి పరిశోధనలో భాగంగా తమిళనాడు మరియు కర్ణాటకలో జరిగిన పరిశోధన వివరాలు తెలుసుకుంటే వీరిద్దరి పరిశోధన ద్వారా నేను ఇక్కడ అనంపురం జిల్లాలోని బందలాయిల కుటుంబాలకు చెందిన ఎరుకల వారి భాషా పద జాలాన్ని సేకరించి పూర్వ పరిశోధనల సేకరణతో పోల్చి చూసి ఈ సిద్ధాంత వ్యాసాన్ని రచించాను. ఈ పరిశోధన ఫలితంగా ఎరుగల భాష విశిష్టమైన భాష అని, ఇందుకు వారి సంస్కృతే వారికి తార్కాణం అని తెలిసింది.

8. Oppert and Wilson అభిప్రాయం ప్రకారం ఎరుకల శబ్దార్థ విషయంగా వారు ఎర్రగా ఉంటారని చెప్పాడు. ఎరుక అంటే జ్ఞానం అందుకే వీరికి భవిష్యత్తు చెప్పే వీరికి ఆ పేరు వచ్చిందని అభి ప్రాయం వ్యక్తం చేశారు. Oppert అభిప్రాయం

ప్రకారం 'కుర్రు' లేక 'కుర్ర', 'కొండ జాతి' అని సూచించడం జరిగింది. కుర్రు జాతి వారికి కూడా భవిష్యత్తును చెప్పే శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. అందుకే వీరిని కూడా ఎరుకల వారు అని పిలవటం జరిగింది. ఎరుకల వారికి అతిప్రాచీన కాలం నుండి తెలుగు తెలునునని చెప్పవచ్చు. ఎందుకంటే ఎరుకల స్త్రీలు సోదె చెప్పేటప్పుడు 'ఎరుకోయమ్మ ఎరుక' అనే అంటుందని ఆ కాలంలోనే గుర్తించారు.

## ఎరుకల వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులు :

ఈ అధ్యాయంలో ఎరుకలవారి ఆర్థిక సామాజిక పరిస్థితులు గురించి ప్రస్తావించినప్పుడు ప్రపంచంలో వచ్చిన మార్పులు ప్రపంచీకరణ నేపథ్యంలో ఒక గ్రామం ప్రపంచంగా చెలామణి అవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎరుకల అభివృద్ధి అనేది మన సమాజంలో అన్ని వర్గాల జాతులను స్పృశిస్తుంది. ప్రస్తుత పరిస్థితులు గమనిస్తే ఎరుకల జాతిలో విద్యావంతుల సంఖ్య దశలవారిగా పెరుగుతూనే వుంది. కాని వీరి యొక్క జాతి సంపూర్ణ అభివృద్ధి సాధించడానికి ఇంకా చాలా కాలం పడుతుందని చెప్పవచ్చు. ఎందుకంటే... వీరు సంచార జీవులు మరియు మారుమూల ప్రాంతంలో జాతి ఇంకా అభివృద్ధి చెందక పోవడం, రేపటి తరంలో సైతం అట్టగున జీవన పరిస్థితులు ఉండటమే కారణం.

ఎరుకల వారికి స్థిర నివాసం అంటూ ఏమీ లేదు. వీరు ఎక్కువగా ఎక్కడైతే తమకు అనుకూలమైన పరిస్థితి ఉంటుందో అక్కడ వాళ్ళ జీవనం సాగించేవారు. ఇలా ఎరుకల వాళ్ళు సంచార జీవితం సాగిస్తుంటారు. ప్రస్తుత పరిస్థితులలో వారి జీవన విధానంలో మార్పులు రావడం వల్ల వారి ఆర్థిక సామాజిక పరిస్థితులు అభివృద్ధి చెందు తున్నాయి. వీరు ఎక్కువగా గ్రామ ప్రాంతాలలో నివసిస్తు న్నారు. వీరిలో మరికొన్ని అనగా ముగ్గ ఎరుకల, కుంటు ఎరుకల తెగలవారు నేటికి సంచాల జీవనాన్నే గడుపు తున్నారు. మరికొన్ని తెగలవారు అనగా దబ్బ ఎరుకల, ఈత ఎరుకల వాళ్ళు స్థిరనివాసాలను ఏర్పరచుకొని, కొన్ని ప్రాంతాలలో బలమైన వర్గాలుగా ఏర్పడుతూ నాగరి కతను క్రమంగా అభివృద్ధి చేసుకుంటున్నారు. వీళ్ళలో కొందరు మంచి విద్యావంతులుగా మరియు ఉద్యోగస్తు లుగా ఎదగడం జరిగింది. ఈ విధంగా నేటికి జీవన విధానం మరియు ఆర్థిక, సామాజిక విధానాలలో అనేక మార్పులు చోటుచేసు కుంటున్నాయని చెప్పవచ్చు.

ఎరుకలవారు సంచార జీవితం సాగించేటప్పుడు ప్రధానమైనవి వస్తువులు మాత్రమే వెంటవుండేవి. వీరు తప్పనిసరిగా 'గుడారాలు' ఏర్పర్చుకుంటారు. వాటితో పాటు మట్టిపాత్రలు, తెడ్లు, తిరగలి, కత్తులు, తాళ్ళు, బోసులు, వలలు, ఉచ్చులు, గొడ్డళ్ళు, కొడవళ్లు, సూదులు, దబ్బళాలు మొదలైనవి వారి జీవనాధార వస్తువులుగా పేర్కొనవచ్చు. వీటితోపాటు కొన్ని జంతువులు కూడా ఉండేవి. అవి గాడిదలు, కుక్కలు, పిల్లులు, ఆవులు వీరి వెంట ఉండటం గమనించాల్సిన విషయం. వీటితోపాటుగా 'కుండలగంప' అనే ఒక పెద్ద అరిక సాధనాన్ని వీళ్ళ వెంట ఎల్లప్పుడు తీసుకొని వెళ్తుంటారు. ఎరుకల వారు రవాణాకు ప్రధానంగా గాడిదను ఉపయోగించేవారు. వీరు నివాస స్థలం మార్చే టప్పుడు వారి ప్రధాన వస్తువులను కుండ గంపలో జాగ్రత్తగా అమర్చి దాన్ని గాడిదవీపుమీద అటు ఇటు పడిపోకుండా జాగ్రత్తగా ఒక క్రమ పద్ధతిలో వ్రేలాడ గట్టేవారు. వారి వస్తువులతోపాటు చిన్న పిల్లలను మరియు ముసలివాళ్ళను ఈ గంపలో కూర్చోబెట్టుకుని ప్రయాణం చేసేవారు. ఇలాంటిదే గోనె మూటల 'పెదిల్' సాధనాన్ని కూడా వీళ్ళు ఉపయోగించేవారు. (శ్రీరామ మాల కొండయ్య 'కుర్ర చరిత్ర', పు.26)

ప్రస్తుత పరిస్థితులను ఆధారంగా చేసుకొని పరిశీలిస్తే వారి జీవన విధానంలో గుడారాలు, వస్తువులు సాధా రణంగా కనిపిస్తున్నప్పటికీ కుండ గంపలు, పెదికులు దాదాపుగా కనుమరుగై పోయాయి. జంతువుల విషయంలో మనం గమనిస్తే నేటికి గాడిదను వాళ్ళు పెంచుకుంటున్నారు. గాడిద పాలు చిన్న పిల్లలకు

మంచిది అనే భావన సమాజంలో ఉన్నది కనుక వారు ఆ పాలతో కొందరు వ్యాపారం చేస్తున్నారు.

### ఎరుకల తెగలు, వృత్తులు :

ఎరుకల వారి తెగలు, వృత్తులను ఆధారంగా చేసుకొని విభజించటం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఎరుకల జాతి చాలా తెగలుగా విభజించడమైనది. ఆ వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.

**దబ్బ ఎరుకల :**

దబ్బ ఎరుకల వారు అడవిలో దొరికే బొంగులను తీసుకొనివస్తారు. ఈ బొంగులను నాలుగువైపుల జాగ్రత్తగా పగులకొడతారు. తరువాత పగులకొట్టిన దబ్బల్ని తయారు చేస్తారు. ఈ దబ్బల్ని అనేక రకమైన వస్తువులుగా తయారు చేస్తారు. అంటే బుట్టలు, తట్టలు, జల్లలు, తడికెలు, బొంగుమంచాలు మొదలైనవి. వీటిలో ముఖ్యమైనవి 'జల్లగంపలు', 'తడికలు'.

జల్లగంపలను వ్యవసాయదారుల కొరకు తయారు చేస్తారు. ఇది ప్రాచీన కాలంలో ప్రధానమైన ఉపకరణం. తడిక వ్యవసాయదారులకు అతి ముఖ్యమైనది. ప్రస్తుత కాలంలో వ్యవసాయంలో ట్రాక్టరును ఉపయోగిండంవల్ల తడిక వాడకం క్రమంగా తగ్గింది. దీనిని అవసరాన్ని బట్టి వినియోగించడం జరుగుతుంది. సవారి తడక దీనిని ఎద్దుల బండిపై గుడారంలా అమర్చేవాళ్ళు. పూర్వకాలంలో కార్లు, జీపులు లేవు కనుక వీటిని జమీందారులు, దొరలు, భూస్వామి కుటుంబాలు ఎక్కువగా ఉపయోగించేవారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిలో మనిషి దైనందిన జీవితంలో నిచ్చెన ఎంతో అవసరం. ఇనుప నిచ్చెనలు మార్కెట్‌లో వచ్చినప్పటికి బొంగు నిచ్చెనే వాడేవారు.

వీటి అన్నింటిని దబ్బలవారు 'సంత'లో విక్రయిస్తుం టారు. వీరి ఆర్థిక జీవన విధానంలో దబ్బ ఎరుకలవారికి వడ్రంగం పనులలో కూడా నైపుణ్యత ఉన్నది.

ప్రస్తుత పరిస్థితులలో వీరియొక్క ఆర్తిక పరిస్థితులను గమనిస్తే ఎరుకల వాళ్ళు చాలావరకు పేదవాళ్ళే అయి నప్పటికి వారియొక్క ఆర్తిక పరిస్థితిని మెరుగు పరుచుకోవడానికి ప్రయత్నిస్తు వుంటారు. ఆ క్రమంలో వీరిలో కొందరు కొన్ని మైదాన ప్రాంతాలలోను, మరి కొందరు గ్రామాలలో నివసిస్తూ వారియొక్క వృత్తి పను లను మెరగుపరచుకుంటూ జీవన విధానాన్ని సాగిస్తారు. ఈ క్రమంలోనే వాళ్ళు సమాజంలో మమేకమై జీవిస్తు న్నారు.

రాయలసీమ ప్రాంతాల్లో ఎరుకల వాళ్ళు నివసించే ప్రదేశాలను ఎరుకల వీధి, ఏకల్య, శుంకలమ్మ...గా పిలుస్తుంటారు. వీరి వాడలు సమాజంలో చాలా చిన్నవిగా ఒకటి నుండి ఐదారు కుటుంబాల వరకు ఉంటారు. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే వీరు గ్రామాలలో వీరి కుటుంబ సంఖ్య పెరుగుతూ వస్తుంది. అయినప్పటికి వలసల కారణంగా వీరి కుటుంబాల సంఖ్య గణ నీయంగా తగ్గుతూ వస్తుంది.

ఎరుకల వారు వలస వెళ్ళడానికి ప్రధానమైన కారణం ఒక్కటి ఉంది. అది వృత్తి పనులు. వీరు ఒకే ప్రదేశంలో ఉండటంవల్ల వాళ్ళ వ్యాపారాలు, కొనుగోలు మధ్య పోటీ ఏర్పడుతుంది. కాబట్టి వారి ఆర్థిక పరిస్థితి దిగజారుతుంది. అనే భావనతో వీరు వలస వెళ్ళడం అనేది ప్రాధాన్యత సంతరించుకుంది.

**ఈతకట్టి ఎరుకల :**

వీరి యొక్క ప్రధానమైన వృత్తిలో ముఖ్యమైనది "ఈత చెట్టు" అందుకే వీరిని 'ఈత ఎరుకల' అని పిలవడం జరుగుతుంది. ఎరుకల వారికి సమీపంలో ఉన్న అడవులు మరియు గ్రామ చివరలో ఉన్న ఈతకట్టెను సేకరిస్తారు. ఈ సముదాయాన్ని వీరు 'ఈతబరి' అని పిలుస్తారు. ఈత కట్టెలతో కొన్ని వస్తువులను తయారు చేస్తారు. ముఖ్యంగా వీరు ఇంటిపై భాగాన అనగా ఇంటి కప్పుకు వాడతారు. అలాగే ఈతచాపలు, చీపుర్లు, (పొరకలు), పేడ తట్టలు, చుట్టకుదుర్లు, సిబ్బిలు, గద్దెకు మొదలైన వాటిని వీరు ప్రత్యేకంగా తయారుచేసి వాటిని సంతలో విక్రయిస్తుంటారు. ప్రస్తుత పరిస్థితులను

గమనిస్తే వారి యొక్క ఆర్థిక విధానంలో మార్పులు వచ్చినట్లు చూడవచ్చు. వీరు తయారు చేసే స్థానంలో కొత్త ఆధునిక పద్ధతులు వస్తున్నాయి. కాబట్టి వాటికి సమానంగా వీరు ఆధునిక పద్ధతులను ఉపయోగించు కుంటూ వారి యొక్క వస్తువులను తయారు చేస్తున్నారు.

**కూటు ఎరుకల :**

ఈ ఎరుకల వారి యొక్క ప్రధానవృత్తి గరిసిల్ని తయారు చేయడం ప్రత్యేకం గరిసె. అంటే గడ్డిని ఉప యోగించి ధాన్యం నిలువచేయుటకు గరిసిల్ని తయారు చేస్తారు. ఇవి వ్యవసాయ దారులకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటాయి. ఆధునిక పద్ధతులు సమాజంలో ఉ పయోగించడం వల్ల గరిసె అనేది కనుమరుగవుతుంది. ఈ నేపథ్యంలో వీరు వేరు వృత్తులకు వెళ్ళి జీవన మరియు ఆర్థిక స్థితిని మెరుగుపరచుకుంటున్నారు.

**ఉప్పు ఎరుకల :**

వీరి యొక్క ప్రధానమైన వృత్తి ఉప్పు తయారు చేసి సంతలో అమ్మడం. అందుకే వీరికి ఉప్పు ఎరుకల అనే పేరు వచ్చింది. ఎరుకల వారి జీవన విధానంలో ఉప్పు వ్యవసాయం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. వీరి యొక్క ఆర్థిక సామాజిక పరిస్థితి గమనిస్తే కొన్ని ప్రధానమైన ప్రాంతాలలోనే నివసిస్తుంటారు.

**ఎద్దుల ఎరుకల :**

ఎద్దుల ఎరుకల వారిని మనం ఎక్కువగా గ్రామ ప్రాంతాలలో చూస్తుంటాము. వీరు ఎక్కువగా ఎద్దులను ఆడిస్తూవుంటుంటారు. అందుకే వీరిని ఎద్దు ఎరుకల అంటారు. ఎద్దు ఎరుకలవారు ఎద్దులను జాతరలలో, సంతలలో, జన సముదాయం ఎక్కువగా ఉన్నచోట్ల వాటిని ఆడించడం జరుగుతుంది. ఇలా ఆడించినప్పుడు వచ్చిన సొమ్మును వారి ఆర్థిక అవసరాలకు ఉప యోగించుకుంటారు.

**ఢడంత్రి ఎరుకల :**

వీరు సన్నాయిని తయారుచేసి దాని సహాయంతో పాటల్ని రాగయుక్తఇగా పాడుతూ ఇల్లిల్లూ తిరిగి అడుక్కొని జీవనం సాగిస్తూ ఉంటారు. ఒకప్పుడు వీరు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో కనబడేవారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులలో గ్రామంలో కూడా వీరు కనిపిస్తూ వుంటారు. వీరిలో కొందరు నల్లకోటు ధరించి, తమ వేషధారణలో వైవిధ్యం కనబరుస్తుంటారు.

**తాళ్ళ ఎరుకల / నార ఎరుకల :**

తాళ్ళ ఎరుకల వారు ఎక్కువగా కర్ణాటక ప్రాంతంలో జీవిస్తుంటారు. వీరు రాయలసీమ ప్రాంతంలో . . . . . . గ్రామంలో ఈ తాళ్ళ ఎరుకల వారు ఉన్నారు. వీరి యొక్క ఆర్థిక పరిస్థితుల ఆధారంగా ఇరు ప్రాంతాలవారు ఇచ్చిపుచ్చుకోవడం వల్లన వారు ఇక్కడ స్థిరపడి నివాసా లను ఏర్పరచుకొని తాళ్ళను అనేక రకాలుగా తయారు చేస్తూ వాటిని సంతలలో విక్రయిస్తూ తద్వారా వచ్చిన సొమ్ముతో జీవనం సాగిస్తున్నారు. తాళ్ళను తయారుచేసే విధానాలు పరిశీలిస్తే పాత చీరెను తీసుకొని వాటిని అంచుదగ్గర నుండి ఒక క్రమ పద్ధతి ప్రకారం పది నుండి పదిహేను ముక్కలు జాగ్రత్తగా చీలుస్తారు. ఈ ముక్క లన్నింటిని ఒక క్రమపద్ధతిలో వ్రేలాడదీస్తారు. ఈ విధంగా వ్రేలాడదీసిన తరువాత వారు తమ నైపుణ్యాన్ని ప్రదర్శి స్తారు. చీరె ముక్కలు బిగుసుకొని పోయి పెనవేసుకొని తాడు మాదిరాగా తయారు అవుతుంది. పాత చీరలలో కాకుండా ప్లాస్టిక్ బ్యాగులతో కూడా ఈ పద్ధతి ప్రకారంగానే తాళ్ళను తయారుచేస్తారు.

**ముగ్గుల ఎరుకల :**

వీరు సమీపంలో ఉన్న అడవుల నుండి ముగ్గును సేకరించి వారి సమీప ప్రాంతాలలో విక్రయిస్తుంటారు. కాబట్టి వీరిని ముగ్గుల ఎరుకల అని పిలుస్తుంటారు.

**కావల ఎరుకల :**

కావల జాతి వారి ఎరుకలలో ఒక తెగకు సంబం ధించినవారు. వీరు ప్రధానంగా కోతులను ఆడిస్తుంటారు. వీరు అడవుల్లోంచి కోతులను పట్టుకొని, వాటికి శిక్షణ

ఇస్తారు. తరువాత ఆ కోతులకు దుస్తులు ధరింపజేసి గ్రామాలు, ఊర్లు తిరుగుతూ వాటిని ఆడిస్తూ వారి ఆర్థిక జీవనాన్ని సాగిస్తారు. వీరు మనదేశంలో కన్నా శ్రీలంకలో ఎక్కువగా ఉన్నారు.

**కొత్త ఎరుకల :**

వీరు ఎక్కువగా ఉత్తరాంధ్ర ప్రాంతమైన విశాఖలో కనబడుతుంటారు. వీరు తమ అవసరాలకు అను గుణంగా కొత్త కొత్త వృత్తులను అవలంభిస్తారు. కాబట్టి వీరిని 'కొత్త ఎరుకల' అని పిలుస్తుంటారు.

**కావలి ఎరుకల :**

ఈ ఎరుకలవారు పూర్వం జమీందారులు, రాజులు, భూస్వాములు మరియు దేశిముఖ్ దగ్గర సేవకులుగా పనిచేస్తూ నమ్మకంగా ఉండేవారు. వీరి మీది నమ్మకంతో వీరిని 'నిఘా' గా గ్రామానికి లేదా రాజ్యానికి వుంచేవారు. ఈ విధంగా వీరి వృత్తి ధర్మాన్ని పరిపూర్ణంగా నెరవేర్చేవారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితి వీరు గ్రామ పటేల్, పట్వారీల దగ్గర కావలిగా పనిచేస్తున్నారు.

ఈ ఎరుకల వారు గ్రామంలోగాని ఇంకా వీరు నివ సిస్తున్న ప్రదేశాలలోగాని భూతగాదాలు, ఆస్తిపాస్తులు కొట్లాటలు మరియు అన్నదమ్ముల కొట్లాటలు వచ్చి నప్పుడు ముందుగా బాధితులు కావలి వాళ్ళకు చెప్పుకొనే వారు. కావలి వాళ్ళు ఆ విషయాన్ని గ్రామపెద్దవరకు తీసుకొని వెళ్ళేవారు. ఇలా మధ్యవర్తిత్వం వహించడంలో మంచి పరిణతిని సాధించారు. ప్రస్తుత కాలంలో కావలి తనం అనేది ఉద్యోగంగా మారిపోయింది. ఈ ఎరుకల వారి ఆర్థిక పరిస్థితి మెరుగు పరచుకోవడానికి ఎక్కువ అవకాశం లభించినట్టయింది. నాగరికతలో జీవించడానికి కూడా వీరికి ఎకుకన్వగా అవకాశం లభించనట్టయింది.

**కరివేపాకు ఎరుకల :**

ఈ ఎరుకల వారి ప్రధాన వృత్తి అడవుల్లోంచి కరివేపాకును సేకరించి గ్రామాలలో విక్రయిస్తుంటారు. కాబట్టి వీరిని కరివేపాకు ఎరుకల అంటారు. వీరు ఆర్థికంగా స్థిరపడటానికి వారు సేకరించిన కరివేపాకును సంతలలో అమ్ముతూ వుంటారు.

**కుంచపురి ఎరుకల :**

వీరు ఉచితంగా లభ్యమయ్యే తాటినార, కలబంద నార, చీశనారలను సేకరించి వాటితో వెదర్లు, ఉట్లు, తాళ్ళు, సులకలు, సిబ్బిలు మొదలైన వాటిని తయారు చేసి సంతలలో విక్రయిస్తుంటారు.

**వూర ఎరుకల :**

వూర ఎరుకల అంటే సంచార జీవితం గడిపేవారు. వీరు అడవుల్లో ఒకప్పుడు నివసించేవారు. వీరు కాల క్రమేణ ఊళ్ళల్లోకి వలసవచ్చి నివాసం ఏర్పర్చుకున్నారు. వీరి యొక్క ప్రధానవృత్తి 'భిక్షాటనం' గ్రామాలలో వీరిని బిచ్చగాళ్ళుగా వ్యవహరిస్తుంటారు. ఇతరులు పెట్టిన అన్నాన్ని, దుస్తుల్ని ప్రేమగా అందించుకుంటారు. వీరిలో కొందరు రోళ్ళు చెక్కుతుండగా మరికొందరు సవరాలు అల్లుతుంటుంటారు.

**మంత్రసాని ఎరుకల :**

వీరికి సమాజంలో ఒక్క మంచి గుర్తింపు ఉంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను మనం గమనిస్తే వీరియొక్క వృత్తి చాలా వరకు పరిమితమైనది. పూర్వకాలంలో స్త్రీకి పురుడుపోయాలి అంటే మంత్రాసని ఉండవలసిందే. కానుపు చేసినందుకుగాను మంత్రసానికి బియ్యం, పప్పు, ఉప్పు సరుకులతోపాటు కొంత డబ్బు కూడా కానుకగా ఇచ్చేవారు. మంత్రసాని కుటుంబానికి ఇవి ఎంతగానో సహాయపడేవి.

ప్రస్తుత పరిస్థితులను మనం గమనించినట్లయితే మంత్రసాని యొక్క ఆదరణ క్రమంగా తగ్గుతూ వస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో ఏరియా మరియు ప్రైవేటు ఆసు పత్రులు రావడం వలన డెలివరీల కోసం వీటిని ఆశ్రిస్తు న్నారు. ప్రస్తుత పరిస్థితులలో వీరు ఆర్థికంగా గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. అయినప్పటికి కొన్ని మారుమూల మరియు కొండ ప్రాంతాలలో వీరినే

సమ్మకొని వున్నారు. సమాజంలో కొందరు మంత్రసాని చేసిన సేవలు మరిచిపోలేక వారికి పండుగలు, పర్వ దినాలు వచ్చినప్పుడు వారిని పిలిచి కొత్త బట్టలు మరియు పిండివంటలు కొంత డబ్బు వంటి కానుకల్ని సమర్పించ కోవడం జరుగుతుంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులలో మంత్రసానులు జీవనోపాదికి వేరు వేరు వృత్తుల్ని ఆశ్రయిస్తున్నారు.

**బేరగాళ్ళు :**

వీరు ఎద్దులను, గాడిదలను కొనడం మరియు అమ్మడం జరుగుతుంది. కాబట్టి వీళ్ళని బేరగాళ్ళు అంటారు. వీరు తక్కువగా కొని కొంత లాభానికి అమ్ముకుంటూ తమ ఆర్థిక పరిస్థితిని తమకు అవకాశం ఉన్నంతలో ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచుకుంటున్నారు.

**పాముల ఎరుకల :**

ఈ ఎరుకల వారు పాములు పట్టడం వాటికి కోరలు పీకి ఆడించడం నేర్పుగా చేస్తుంటారు. పాముల సయ్యాటని చూసిన ప్రజలు తృణమో ఫణమో ఇచ్చు కుంటూ వుంటే దానితో వీరు తమ జీవితాన్ని కొనసాగిస్తుం టారు.

**కొరవంజి :**

ఎరుకలకు కొరవంజులనియు, కొరవత, కొరలు అను పేర్లున్నట్లు చెంగల్వరాయ విరచతమగు "ఎరుకల కథ" ఆధారంగా తెలుస్తుంది. కొరవంజి పదాన్ని మొదట కావ్యంలో వాటిని తెలుగుకవి అయ్యలరాజు రామ భద్రుడు (1500-1580). కొరవంజి ఎరుకల యక్షగానాలు చేస్తూ భిక్షాటనచేసి జీవిస్తుంటారు. ఈ పదాన్ని గమనిస్తే కొరవ అంజె అనే పదంలో 'అంజె' కు అడుగు అనే నృత్యవిశేషం వుందని, వారు ప్రదర్శించే దృశ్యరచనలకు కొరవంజునే పేరు వచ్చిందని శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు అభిప్రాయపడ్డారు. నాటకాల్లో ఎరుకల వేషంతో ప్రవేశించే సింగి, సింగని పాత్రలు పై అభిప్రాయాన్ని బలపరుస్తు న్నారు. ఈ తెగవాళ్ళు అడవిలో దొరికే దినుసుల్ని నగరా లకు తీసుకెళ్ళి, నృత్యం చేస్తూ ప్రజల్ని ఆకర్షితుల్ని చేసి విక్రయిస్తూ వుంటారని ప్రత్యక్ష సాక్షుల కథనం. కొరవంజి స్త్రీలు, సోది చెప్పి బియ్యం, డబ్బు సంపాదిస్తారు. (ఎరుకా ఎఱుక యటంచుం గొరవంజి,ఎశీశ్రీ.××, పు.287-88)

**సెటిల్‌మెంట్ ఎరుకల :**

ఈ ఎరుకల జాతి వారిని రెండు రకాలుగా విభజించ వచ్చు. 1) వైట్ కాలర్ నేరము, 2) భ్లూ కాలర్ నేరము. వీరియొక్క జీవన విధఆనంలో దొంగతనము, దోపిడీలను వృత్తిగా చేసుకొని జీవించేవారు. ఈ తెగ వారిని సెటిల్‌మెంట్ ఎరుకలగా పేర్కొంటారు.

1. వైట్ కాలర్ నేరము - వీరు చిన్న చిన్న దొంగతనాలు కుండా, ముఠాలు కట్టి పెద్ద పెద్ద దోపిడీలు చేస్తారు.
2. భ్లూకాలర్ నేరము - వీరు జేబులు కొట్టడం, పశు వుల్ని దొంగలించడం వంటివి చేస్తారు. ఈ తరహా దొంగతనం చేసేవాళ్ళని కత్తిరోళ్ళని కూడా పిలుస్తారు.

ఎరుకలవారి వృత్తి రీత్యా ఎంత హింసించినా నిజం చెప్పరు. అంతేకాకుండా వంశపారంపర్యం పేరుతో తమ పిల్లలకు దొంగతనం చేసే పద్ధతులన్నీ నేర్పుతారు. ఈ నిర్దిష్ట జాతుల మీద పరిశోధన చేసిన ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ వై.సి. సింహాద్రి ఇలా అంటారు. "ఇక్కడ స్త్రీలు కూడా నేరాలు చేయడం, లేదా నేరం చేయువారికి సహాయం చేయటం జరుగుతుంది. వీరు చిన్న చిన్న దొంగతనాలు మొదలు, పెద్దనేరాలు అంటే బస్సులు, రైళ్ళు ఆపి దోచుకోవటం, దేవాలయాలు, ఇండ్లలోని నగలు దోచుకోవడం వరకు దాదాపు అని& రకాలైన నేరాలు చేస్తారు.

ఎరుకల గురించి ఒక గ్రంథంలో సామాన్యంగా మనిషిని గాయపరచడం అను గ్రంథంలో రాస్తే డా॥ గిడుగు వెంకట సీతాపతిగారు 'ఎరుకల దొంగతనం చేసిన వస్తువుల్ని చిన్నవి నోటిలోను, గొంతుకలోను, కడుపులోను, మరియు మర్మస్థలాలలోను దాచేశక్తి స్త్రీ

పురుషులకు ఇద్దరికి కలదు". తన 'ఆదిమ నివాసులు' అనే వ్యాసంలో తెలియజేశారు. వీరు దొంగతనాలతో పాటు హత్యలు కూడా చేస్తారు. (ఆంధ్రసర్వస్వము, అధ్యాయం-10, పు.101-112)

**పిట్టల ఎరుకల :**

ఎరుకల వారి ప్రధానవృత్తి పిట్టలు పట్టడం. వీరు సమీపంగా ఉన్న అడవుల్లోకి వెళ్ళి పిట్టల్ని పడుతుంటారు. వీరు బురక పిట్టలు, ఉడుములు, కుందేళ్ళు, కౌజు పిట్టలు, వీరి వేటలో ప్రధానంగా వుంటాయి. వీరి ఆర్థిక పరిస్థితి మెరుగు పరచడానికి వాటిని అమ్మగా వచ్చిన సొమ్ముతో కుటుంబ అవసరాల్ని తీర్చుకుంటారు.

ఈ ఎరుకల వారు తాబేళ్ళు, కొంగలు, దుప్పులు, అడవి పందులు, చేపలు... మొదలగువాటిని కూడా వేటాడుతారు. వీరు ఒక్కొక్క జీవుల్ని వేటాడటంలో ఒక్కో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. (మిర్యాలజ్యోతి, 'సోది ఒక పరిశీలన' ఎం.ఫిల్. అముద్రిత సిద్ధాంత గ్రంథం) పద్నాలుగు ఎరుకల తెగల్ని మాత్రమే పేర్కొన్నారు. నేను ఎరుకల నాగన్న లింగాల గ్రామస్థుడిని ఇంటర్వ్యూ చేయగా, అలాగే కొన్ని సిద్ధాంత గ్రంథాలను పరిశీలించడం ద్వారా అసదంగా మరో నాలుగు జాతుల్ని కూడా పేర్కొన్నాను.

**ఎరుకల వృత్తి :**

ఎరుకల జాతిలో వివిధ రకాల తెగలు మరియు వృత్తులు, ఎంతో వైవిధ్యాన్ని కనబర్చే అంశం ఆసక్తి దాయకం! వీరి యొక్క వృత్తి విధావన్ని గురించి కొంచె లోతుగా పరిశీలిద్దాం.

**వ్యవసాయం :**

దేశంలో వ్యవసాయం అనేది ఒక గౌరవప్రదమైన సాంప్రదాయ విధానం. ఈ విధానం ప్రధానంగా రాయల సీమ కడప జిల్లా.... మండలంలో ఎరుకల వారి జీవన విధానాన్ని పరిశీలిస్తే వ్యవసాయదారులు చాలామంది కనిపిస్తారు. వీరు పోడు వ్యవసాయం చేస్తారు. వర్షాలపై ఆధారపడి పంటలను కొనసాగించే వీరి వ్యవసాయంలో ప్రధానంగా మొక్కజొన్నలు, రాగులు, జొన్నలు, సజ్జలు, ఆముదాలు మొదలైన పంటలు పండిస్తారు. పొరేగులు, కాలువు, వీళ్ళ కల్పతరువులు. ఆ నీటిని తమ వ్యవసాయంలో ఉపయోగించుకుంటూ వీటికి వర్షం తప్పనిసరి. వర్షాలు పడకపోతే వీరి వ్యవసాయం నెమ్మ దిస్తుంది. వీరు స్వయంగా వ్యవసాయానికి కావలసిన తాళ్ళను పేసుకుంటుంటారు.

**ఎరుకల జీవితాల్లో అడవులు :**

ఎరుకలలో కొన్ని జాతుల వారు వ్యవసాయంలో పాటు 'దొంగతనం' కూడా చేస్తువుంటారు. వారు ఎక్కువగా దొంగతనములు అడవిల్లో చేస్తారు. వీరు అడవిలో దొరికే కర్ర అనగా టేకు, నారెపి, తుమ్మ, వేప, నల్లతుమ్మ, సిరియాసు, పెద్దగి, చెన్నగి వంటి కర్రలను దొంగలించి వారికి నమ్మకస్తులైన వారికి అమ్ముకుంటారు. కాబట్టి వారి దొంగలించే కర్రకు ఎప్పుడూ డిమాండ్ తగ్గడం.

**ఎరుకల వారి కులవృత్తి :**

ఎరుకల వారి కులవృత్తి గురించి చెప్పుకుంటే వీరు ఎక్కువగా పందులను, బాతులను పెంచుకుంటుంటారు. ఎరుకల వారి గురించి చెప్పుకుంటే ప్రస్తుతం వీరు ఎన్నో రకాల వ్యాపారాలు చేసినా, ఉద్యోగాలు చేస్తున్న వారు మాత్రం ఎక్కువ శాతం పందుల పెంపకం పై ఆధార పడతారు. వీరు రెండు రకాల పందులను పెంచుతారు. అవి సీమపందులు, మరియు ఊరపందులు, తెల్ల పందుల వలన వీరికి ఎక్కువ సంపద చేకూరుతుంది. ఇవి కొల్లాపూర్, నాగరకర్నూల్, అచ్చంపేట తాలుకాలకు సంబంధించిన ప్రాంతాలలో సీమపందులు ఎక్కువగా పెంచుతుంటారు. వీరు బయట దేశాలను కూడా ఎగుమతి చేస్తారు.

ఎరుకల వారు తమ పందులకు 'కుర్తి'ని ఆహారంగా అందిస్తూ ఈ ఆహారాన్ని పందుల ప్రేమగా స్వీకరిస్తాయి.

కుర్తి తయారు చేయడంకోసం ఒక పెద్ద డబ్బాగాని, కుళాయిగాని, కుండగాని ఉపయోగిస్తారు. వీటిల్లో నిర్దేశించిన ఎదో ఒక్క ప్రాంతంలో వాటిని ఏర్పాటు చేస్తారు. అలా ఏర్పాటు చేసిన దగ్గర బియ్యం కడిగిన నీళ్ళు గంజి, కుర్తిని అన్ని రకాల కూరగాయలు, పందులు మరియు నన్నిని నూకను కలిపి రాత్రంతా దానిలో నానబెడతారు. ఈ ద్రవ పదార్థంగా బాగా పులుస్తుంది. ఉదయాన్నే పందులను ఆదరంగా అందిస్తారు.

ఎరుకల వారు బాతులను పెంచుటకోసం వారి యొక్క నివాసాన్ని నీటి వసతిఉన్న ప్రదేశంలో నిర్మించు కుంటారు. వీరు వ్యవసాయం జరుగుతున్న ప్రాంతాలలో నీటికోత సమయాన్ని ముందుగా తెలుసుకొని వీరు అక్కడికి వెళ్ళి వాటిని పెంచుతారు. వీరు ఈ వ్యాపారం కోసం వట్టి వ్యాపారస్తుల దగ్గర అప్పుతీసుకొని కొద్దిపాటి ఆస్తిని తాకట్టు పెట్టో బాతుల పిల్లల్ని కొంటారు. చెయ్యి పెట్టి తీయాలి. అలా చేసిన వ్యక్తికి నూనెలోకి మునిగి సంతవరకు గుడ్డచుట్టాలి. కొంతసేపు అయిన తరువాత అందరి సమక్షంలో చుట్టిన గుడ్డ తొలగించి వడ్లు సలపాలి. చేతులు కాలి బొబ్బలెక్కినా వడ్ల నీరు పడి చర్మం ఊడినా తప్పు చేసినట్లుగా నిర్ణయిస్తారు. కాకపోతే అతనికి నిర్దోషిగా తీర్మానించి వాడిని శిక్షించి ఖర్చంతా అతని నుండి రాబడతారు.

గడ్డపారను విధానాన్ని పరిశీలిస్తే అవుపేడతో చేసిన పిట్టకలతో వీటి గడ్డపారను ఎర్రగా కాల్చుతారు. పై చెప్పిన కుండపరీక్ష విధానంగానే అన్ని కట్టుబాటు చేస్తారు. ఎర్రగా కాకిన గడ్డపారను కూడా పై పద్ధతిలోను చేతులతో పైకెత్తి దుయ్యాలి. ఈ పద్ధతిలో ఒక్కొక్క సారి ప్రాణా పాయం సంభవిస్తుందని తెలిసినప్పటికీ లెక్కచేయక మూఢత్వం ఇంకా వీళ్ళని వెంటాడుతూనే వుంది. ఈ విషయాన్ని ధృవీకరిస్తూ విజ్ఞాన సర్వస్వం (పుట 50) సందు నిర్దోషిని ఋజువు చేసుకోవలసిన నేరస్తుడు సలసల మరుగుతున్న నూనెలో కాని కణకణలాడీ నిప్పులో కాని చేతులు, కాళ్ళు చొప్పించవలెను. లేదా ఎర్రగా కాలిన గడ్డపారను చేతిలో తియ్యాలి. ఇందువలన హాని కలిగితే నేరస్తుడిలా కాకపోతే నిర్దోషి' అని వ్రాసి వుంది. ఎరుకల వారి ఆర్థిక సామాజిక జీవనంలో మారుతున్న పరిస్థితు లలో మారక ఇంకా ప్రాచీన మన పద్ధతిలో అనుసరిస్తూ జీవిస్తున్నారని యం. బాపూజీ తన 'బలహీన వర్గాల సంక్షేమం' అనే వ్యాసంలో పేర్కొన్నారు. ప్రతివాదనలు ఎన్ని రోజులైన పట్టవచ్చు. అంతవరకు గ్రామ పెద్దలకు అయ్యే ఖర్చు అంతా వాది, ప్రతివాది ఇద్దరూ సమానంగా భరించాలి. ఈ విచారణలో సాక్ష్యముల కన్నా, ప్రమాదాలకు ఎక్కువగా విలువనిస్తారు. ఈ కాడ్డికొట్టే ఆచారం, నాగరికుల కోర్టులో పిటిషన్ దాఖలు చేసే విధంగా వుంటుంది.

**ఎరుకలవారి వ్యసనాలు :**

ఎరుకల వారి జాతిరీత్యా ఆటవికులు కావడం వలన కష్టం మరచిపోవడానికి మత్తు పదార్థాలు సేవిస్తారు. కాని తెగల్లో స్త్రీ పురుషలతో సమానంగా కల్లుతాగుతారు. అ కల్లు లేకపోతే వట్టినాట మాట్లాడ కూడదు." అనే సామెత వీరు ఎరుకల కట్టుబాట్లలోని త్రాగుడు సంప్రదాయం తెలియజేస్తుంది. వీరు పొగాకు నముల్తారు. చుట్ట పీలుస్తారు. అకువక్క అలవాటు వుంది. వేటాడటం, సొమ్ము విచ్చలవిడిగా ఖర్చుచేయటం వంటి వ్యసనాలు కూడా ఎరుకలలో చూడవచ్చు.

**కులకట్టుబాట్లు – న్యాయం :**

న్యాయవ్యవస్థ ఒక ఉన్నతమైన వ్యవస్థ. ఇక్కడ న్యాయస్థానం, న్యాయవాదులు, న్యాయమూర్తులు ఉండరు. ఎరుకల సామాజిక పరిస్థితులను గమనిస్తే వీరి జీవన విధానాలు వ్యక్తీకరించే కులం కట్టుబాట్లు ఉం టాయి. దీనినే వీరు న్యాయం అని అంటారు. దాదాపు అన్నీ గిరిజన తెగలలో ఇలాంటి సాంప్రదాయం ఉం టుంది. అయితే ఎరుకల జాతిలో ఒక నిర్దుష్టమైన కులపాలన ఉంటుంది. ఏదైన ఒక సమస్య వచ్చినప్పుడు మాత్రం తాత్కాలిక సంఘాలు ఏర్పడి న్యాయం చేస్తారు.

ఎరుకల కట్టుబాట్లు మనం గమనిస్తే దొంగతనం, వ్యభిచారం, సంఘతీర్మానాలు తిరస్కరించడం, స్థిరాస్తి గొడవలు, కొట్లాటలు వంటివి నేరంగా పేర్కొంటారు.

ఎరుకలవారి యొక్క ఆర్థిక పరిస్థితుల ఆధారంగా వారి మెడలలో ఆభరణాలు, పూసల దండలు ధరిస్తారు. సోది చెప్పే స్త్రీలు పచ్చపూసల దండ ధరిస్తారు. ఈ పూసల మధ్యలో వెండి ధరించటం జరుగుతుంది.

**ఎరుకలవారి ఆహార్యం :**

పూర్వకాలంలో ఎరుకల ఆహార్యాన్ని పరిశీలిస్తే వారియొక్క కట్టుబాట్ల గురించి చెప్పాలంటే వస్త్రాలంకరణ లోను, ఆభరణాలు ధరించటంలోను, కేశాల్ని అలంక రించుకోవటంలోనూ వీరికి అంటూ ఒక ప్రత్యేకత ఉన్నది! ప్రస్తుత ఆర్థిక సామాజిక పరిస్థితులను పరిశీలిస్తే ఆధునిక ప్రంచానికి అనుగుణంగా నాగరికతతో పోటీ పడుతున్నట్లు గమనించవచ్చు. అయినప్పటికి గ్రామీణ ప్రాంతాలలో పరిశీలిస్తే వీరి సాంప్రదాయికమైన కట్టు బాట్లలో ఇంకా ఎందరో కనబడుతూనే ఉంటారు. వీరి జీవనశైలిలో మార్పులు రావడం వలన వీరి యొక్క అక్షరాస్యత సంఖ్య పెరుగుతున్నప్పటికీ నిరక్షరాస్యుల సంఖ్య తగ్గలేదు. ఈ నిరక్షరాస్యులు చాలా వరకు తమ సంప్రదాయ అలంకరణాన్ని నశాస్త్రీయంగా పాటిస్తుం డటం విశేషం.

**ముసలివారి శ్రమ :**

ఎరుకల వారి కుటుంబంలో ముసలివారి శ్రమ అధిక ప్రాధాన్యం ఉంటుంది. ఒకరకంగా చెప్పాలి అంటే “తిని తిరిగే పనిలేని బాపతులు” అనేది వాస్తవం. వీరు తమ కుటుంబంలో ఉన్న చిన్న పిల్లల్ని జాగ్రత్తగా చూసు కుంటారు. వీరికి అన్ని వేళల అన్నపానీయాలు అందిస్తారు. మరియు ఆడిన్నూ పాడిన్నుంటారు. వీరు అమ్మను మైమరిపించే విధానంగా ఉంటారు. వీరితోపాటు పందులను కూడా వీరు చూసుకోవలసివస్తుంది. ఇలాం టప్పుడు ముసలివారు అటు పిల్లల్ని, ఇటు పందుల్ని చూసుకుంటూ వీరు ఉన్న సమీపాన్ని కాపాడుకుంటూ ఎక్కువగా శ్రమ పడాల్సివస్తుంది. (పాలికొండ రంగమ్మ, వయసు-75, మొలచింతపల్లి గ్రామం, మహబూబ్‌నగర్ జిల్లా)

**ఎరుకలవారి ఆహారం :**

ఎరుకలవారి ఆహార అలవాట్లు విభిన్నతని కనబరు స్తారు. వీరి యొక్క అలవాటు ఈ విభిన్నతకి అద్దం పడుతుంది. ఆహారం అనేది సమాజంలో ప్రతి జీవికి తప్పనిసరి! సమాజంలోని మాంసాహారులు, శాకాహారులు అనే రెండు రకాలవారు ఉంటుంటారు. మాంసారాల్ని పరిగణనలోకి తీసుకుంటే వీరు తీసుకొనే విధానమునకు ప్రత్యేకమైన వైవిధ్యాన్ని కనబరుస్తారు. వీరు ఎక్కువగా వేటమాంసాన్ని ఇష్టపడతారు. వీరు ఈ క్రింది మాంసము అలవాట్లను గుర్తించవచ్చు.

**వేటమాంసము :**

పూర్వకాలంనుండి ఎరుకలవారు ఎక్కువగా మాంస ప్రియులు. ఎందుకంటే వీరికి వేట అనేది ఈ జాతి వారికి పుట్టుకతోనే వచ్చిన ఒక పరిపూర్ణమైన విద్య. వీరు ఎక్కువగా వేటాడే మాంసమును ఇష్టంగా తీసుకుంటారు. వీరు మూడు రకాలైన మాంసాహారాలను తీసుకుంటుం టారు. అవి -

1) అడవిలో సంచరించే జంతువుల మాంసము
2) పక్షి జాతులైన ఆహారము
3) జలచరాలైన జీవులు

అడవిలో సంచరించే జంతులను అంటే అడవి పందులు, ముంగీసులు, ఉడతలు, ఉడుములు, అడవి పిల్లులు, కుందేళ్ళు, కొండముచ్చులు, నక్కలు మొదలైన వాటిని విరివిగా వేటాడి వచ్చి ఆహారంగా స్వీకరిస్తారు. వీటితోపాటు వీరు ఆవుజాతి, గేదెజాతి, జంతువుల్ని కూడా తింటారు. గొర్రెలు, మేకలు వంటి జంతువుల్ని చచ్చిన వాటిని సైతం తినడానికి ఇష్టపడతారు. అలాగే వీరు స్వయంగా పెంచుకొనే ఊరపందుల్ని పండుగల

సమయాల్లోను బంధువులు వచ్చిన సమయాల్లోను వండుకుని తింటారు. వీరు అడవి జంతువులు వేటాడే టప్పుడు ఉడుములను కుక్కల సహాయంతో వేటాడు తారు.

పక్షిజాతులైన ఆహారము అంటే కోయిలలు, అడవి కోళ్ళు, నాటుకోళ్ళు, కొంగలు, బాతులు, కౌజులు, బురక పిట్టలు మొదలైనవి వీరికి ప్రియమైన ఆహారంగా చెప్ప వచ్చు. వీరు వేటాడేటప్పుడు కముజుల్ని అవు సహాయంతో వేటాడుతారు. పక్షులను టబ్బుల సహాయంతో, కొన్ని చిన్న జంతువులను బోనుల సహాయంతో ఇలా ఒక్కొక్క పద్ధతిలో వీరు వేట సాగిస్తారు

జలచరాలైన జీవులు అంటే చేపలు, పీతలు వీరి ఆహారం క్రమంలో ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించుకొని వున్నాయి. వీరు వేటాడేటప్పుడు చేపల్ని, పీతల్ని వల లేదా గాలం సహాయంతో మరియు కొన్ని చేపల్ని వేటాడేటప్పుడు కర్రకు వానపాముల్ని గుచ్చి వాటి సహాయంతో చేపల్ని వేటాడుతారు.

**శ్రమ జీవనం :**

ఎరుకల వారు శ్రమ జీవులు. వీరి కుటుంబాలలో చిన్న, పెద్దలు అందరూ ఎక్కువ శ్రమ పడతారు. అందుకే వీరిని ఒకరకమైన మంచి బుద్ధిజీవులు? నిజమే. వీరు తమ కులవృత్తిని కొనసాగించడంలో మరియు వీరియొక్క నైవుణ్యాన్ని సాధించడంలో అంత బుద్ధికుశలతను ప్రదర్శిస్తారు. కాబట్టి వీరి వృత్తి ధర్మాల్లో మంచి ఫలితాలు సాధిస్తారు. ప్రపంకీకరన నేపథ్యంలో మార్పులు రావడం వలన వీరు కులవృత్తులపై ప్రభావం చూపిస్తున్నాయి. వీరు తయారు చేసే వస్తువులలో చాలావరకు ప్లాస్టిక్ వస్తువులు రావడం వలన వీరు తయారు చేసే వస్తువులు మార్కెట్ లేదా సంతలో పోటి పడలేకపోతున్నాయి. అయినా ఎరుకల వారు శ్రమపడుతూనే వున్నారు.

**ఆధార గ్రంథాలు :**

1) ఆంధ్రసర్వస్వము, అధ్యాయం-10
2) అబ్బేడు బోయి 1770-1848 'Hindu Manners, Customs and Cermonics'
3) థర్స్టన్. E.H. Caste and Tribes of South India
4) శ్రీరాములు, జి. మరియు బ్రహ్మానంద, హెచ్.ఎస్. 2010. ఎరుకల భాషా సంస్కృతి, సాహిత్యం, పరిశోధన, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం.
5) శ్రీరామ మాలకొండయ్య. కుర్ర చరిత్ర'
6) సంపత్ కుమార్, ఎం. 1986 ఎం.ఫిల్. డిసర్టేషన్
7) సుబ్రహ్మణ్య శాస్త్రి, పిరాట్ల. 1992. గిరిజన గేయాలు సామాజిక పరిశీలన.
8) Census of India, Vol.I, Part-XI (1) 1961, p.372, Yerukala Dialect.

★★★

# సమ్మక్కా - సారక్కా జాతర - విశిష్టత

- డా॥. పెండ్యాల లావణ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఆంధ్రా విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

- డా॥. బూసి వెంకటస్వామి
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఆంధ్రా విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

గిరిజనులు అడవినే నమ్ముకున్న అడవి తల్లి బిడ్డలు. వీరు తమ పరిధి మేర ఏర్పర్చుకున్న సంప్రదాయాలకి కట్టుబాట్లకి, పండుగలకు విలువనిస్తారు. పొలం పనులు ప్రారంభించే ముందు, విత్తనాలు జల్లేటప్పుడు, పండిన పంట చేతికి వచ్చినప్పుడు ఆనందంగా పండుగలు జరుపుకుంటారు. పండుగలు, జాతర్లు గిరిజనుల సంస్కృతికి, ఆచారాలకి పునాదిరాళ్ళు, అటువంటి పండుగల్లో కొన్ని తెగలు వారి వరకు జరుపుకునే ప్రత్యేకమైన పండుగలుంటాయి. అయితే జాతర్లు అందరు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. జాతర్లు గిరిజనులందరూ హిందూ మతాచార ప్రకారం అన్ని దైవాలను కొలుస్తారు. గిరిజనులు జాతర్లు జరుపుకోవడానికి అనేక కారణాలున్నాయి.

1. గిరిజనులలో ఎవరికైన మొండి జబ్బులొచ్చినప్పుడు భూత ప్రేత పిశాచాలే కారణమని మంత్రగాళ్ళను ఆశ్రయిస్తారు. మంత్రగాడు మంత్రాలు జపిస్తూ ఫలానా దేవత కోపంతో వ్యాధిని కలిగించిందని దేవతకు జంతుబలితో శాంతింప జేయాలని జాతర్లు చేస్తుంటారు.
2. వ్యవసాయాన్ని ప్రారంభించే ముందు పంటలు బాగా పండాలని సకాలంలో వానలు బాగా కురవాలని, కరువు కాటకాలు సంభవించకుండా ప్రకృతి వైపరిత్యాలను దృష్టిలో పెట్టుకుని వన దేవతలకు వరుణ దేవతలకు జాతర్లు చేస్తుంటారు.
3. గిరిజనుల అదృష్టం కొద్ది పంటలు బాగా పండితే వచ్చిన ఆదాయంలో కొంతభాగం జాతర్లు చేయడానికి ఖర్చు చేస్తారు.
4. ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి కిందపడిన దీనికి దుష్ట శక్తులే కారణమని మంత్రగాళ్ళ చేత శాంతి చేయించడానికి జాతర్లు చేస్తారు.
5. గ్రామాల్లో విష జ్వరాలైన క్షయ, కలరా, మలేరియా వంటి రోగాలు విపరీతంగా వ్యాపించినప్పుడు దుష్ట శక్తులే కారణమని దేవతలకు లోటు జరగడం వలనే రోగాలు వ్యాపిస్తున్నాయని అవి మళ్ళీ రాకుండా జంతురక్తంతో జాతర్లు చేస్తుంటారు.
6. గిరిజనులు ఏ తెగలకు చెందినవాళ్ళు ఆ తెగలోని అందరు కలిసి ప్రతి ఏటా జాతర్లు జరుపుకుంటారు. ఇలా జాతర్లు జరుపుకోవడం వలన గ్రామాలు పవిత్రమౌతాయని వారి నమ్మకం.

ఆదివాసీల్లో ఎన్ని తెగలు ఉన్నప్పటికీ ఎవరి పరిధి మేర వాళ్ళు జాతర్లు, పండుగలు జరుపుకుంటారు. ఆదివాసీలు తమ కులదైవాలైన సమ్మక్క - సారక్క, నూకాలమ్మ, మారెమ్మ, సత్తెమ్మ, పోలేరమ్మ, మల్లమ్మ, గంగానమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ, పోలమ్మ లాంటి దైవాలను కొలుస్తారు. 99 మంది అక్కా చెల్లెళ్ళకు ఒక్కడే తమ్ముడైన 'పోతురాజు'ను ప్రతి గిరిజనుడు కులదైవంగా కొలుస్తాడు. గిరిజన గూడెంలో అమ్మవారు, ఆటలమ్మ, మశూచి వంటి రోగాలు తమ ఇష్టదైవాలకు పూజలు చేస్తారు. కంటికి కనిపించని దుష్ట శక్తులు గ్రామాల్లో తిరుగుతుంటాయని, వాటికి ఆగ్రహం కలిగించకుండా పూజించడం, కొలవడం, ఉపాహారాలు సమర్పించాలని గిరిజనులందరు బలంగా నమ్ముతారు.

గిరిజన తెగలు అతి పవిత్రంగా జరుపుకునే జాతర్లలో సమ్మక్కా - సారక్కా జాతర విశిష్టమైనది. సమక్కా -

సారక్కా జాతరనే ''మేడారం జాతర'' అని కూడా పిలుస్తారు. గిరిజన సంస్కృతికి అద్దంపట్టే సమ్మక్కా - సారక్కా జాతర్లో గిరిజనులు తమ ఆచార వ్యవహారాలను తూ.చా తప్పకుండా పాటిస్తూ ఆ తల్లులను కొలుస్తారు. సమ్మకాలకు, ఐకమత్యానికి కట్టుబాట్లకి ఈ జాతర నిదర్శనం. రెండేళ్ళకొకసారి మాఘశుద్ధ పౌర్ణమి నుండి మొదలుకొని వరుసగా నాలుగు రోజులపాటు అత్యంత వైభవంగా జరుపుకుంటారు.

900 సంవత్సరాల చరిత్ర కలిగిన సమ్మక్కా - సారక్కా జాతరను 1940 సంవత్సరం వరకు చిలుకల గుట్టపై గిరిజనులు మాత్రమే జరుపుకునేవాళ్ళు. భక్తుల్లో ఈ తల్లులపై సమ్మకం పెరిగి 1940 సంవత్సరం తర్వాత నుండి చుట్టుప్రక్కల రాష్ట్రాల ప్రజలు కూడా కలిపి ఈ జాతరను జరుపుకుంటున్నారు. భక్తుల రద్దీ ఎక్కువైన కారణంగా జాతరను కొండ కింద జరువుకోవడం ప్రారంభించారు. గిరిజన సంప్రదాయం ప్రకారం జరుపు కునే ఈ జాతరకు తెలంగాణా నుండే కాకుండా మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, ఒడిస్సా రాష్ట్రాల నుండి సుమారు 10 కోట్ల మందికిపైగా భక్తజనం అమ్మవార్ల దర్శనానికి తరలివస్తారు.

సమ్మక్కా - సారక్కా జాతర వరంగల్ జిల్లా తాడ్వాయి మండలానికి చెందిన మేడారం గ్రామంలో ప్రతి రెండేళ్ళకొకసారి జరుపుకుంటారు. ఈ జాతర ప్రపంచం లోనే అతిపెద్ద గిరిజన పండుగగా ఖ్యాతి గడించింది. భారత దేశంలో కుంభమేళ తర్వాత అత్యధికులు హాజరయ్యే పండుగ ఇదే. వరంగల్ జిల్లా నుండి 110 కిలో మీటర్ల దూరంలో తాడ్వాయి మండలంలో ఉన్న మారుమూల అటవీ ప్రాంతమైన మేడారం దట్టమైన అడవులు, కొండా కోనల మధ్య సమ్మక్కా - సారక్కా జాతర జరుగుతుంది. సమ్మక్కా - సారక్కాలు గిరిజనుల సమారాధ్య దేవతలు, కష్టాలు కడతీర్చే కలియుగ దైవాలుగా, ఆపదలో ఉన్న వారిని అదుకునే ఆపద్బాంధవులుగా యావదాంధ్ర దేశములోనే వనదేవతలుగా పూజలందుకుంటున్నారు. 1996 సంవత్సరంలో ఈ జాతరను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించింది.

## సమ్మక్కా - సారక్కా ల పుట్టు పూర్వోత్తరాలు :

12వ శతాబ్దంలో నేటి కరీంనగర్ జిల్లా జగిత్యాల ప్రాంతంలోని 'పొలవాన(ను పాలించే గిరిజన దొర మేడరాజు ఒకరోజు అడవిలో వేటాడటానికి తన మంది మార్బలంతో వెళ్ళాడు. వేట జంతువుకోసం తిరిగే సమయంలో ఒకచోట పెద్ద పుట్టమీద పసిపాప ఆడు కుంటూ కనిపించింది. ఆ పసిపాపకు కాపలాగా పులులు, సింహాలు, కాల సర్పాలు రక్షణగా ఉన్నాయి. మేడరాజును చూసిన సింహాలు, పులులు, పాములు అక్కడినుండి అదృశ్యమయ్యాయి. మేడరాజు ఆ పసిపాపను తీసుకుని ఇంటికి వచ్చి ఎంతో అపురూపంగా పెంచుతాడు. మేడరాజు దంపతులు ఆ పాపకు 'సమ్మక్క' అని నామ కరణం చేశారు. సమ్మక్క పేరుకు తగ్గట్టుగానే గూడెంలోని ప్రజలందరికి తలలో నాలుకగా ఉండేది. సమ్మక్క గూడెంలో రోగంతో బాధపడేవారికి తన హస్తలతో ఔషధాలు ఇస్తుండేది. తన హస్తవాసి మంచిదికావడంతో అందరు ఆమెను ఆశ్రయించేవారు.

మేడరాజు సమ్మక్క వివాహం మేడారం పాలకుడు పగిడిద్దరాజుకిచ్చి వివాహం చేశాడు. పగిడిద్దరాజు మేడరాజుకు స్వయానా మేనల్లుడే. పగిడిద్దరాజు సమ్మక్కను అపురూపంగా చూసుకునేవాడు. వీరికి సారలమ్మ, నాగులమ్మ, జంపన్న ముగ్గురు సంతానం కలిగారు. రాజ్యవిస్తరణ కాంక్షతో కాకతీయ ప్రభువు మొదటి ప్రతాపరుద్రుడు 'పొలవాస'పై దండెత్తాడు. ఆయన దాడికి తట్టుకోలేక మేడరాజు మేడారం పారి పోయి అజ్ఞాతవాసం గడుపుతున్నాడు. మేడారాన్ని పాలించే కోయరాజు పగిడిద్దరాజు కాకతీయుల సామంతునిగా ఉంటూ పాలించేవాడు. అయితే ఆ ఏడు కరువు కాటకాలు సంభవించాయి. ఇటువంటి దుర్భర పరిస్థితుల కారణంగా మేడరాజు కాకతీయులకు కప్పం కట్టలేకపోయాడు. పగిడిద్దరాజు కప్పం కట్టక పోవడం,

మేడరాజుకు ఆశ్రయం కల్పించడం, కోయ గిరిజనులతో సార్వభౌమునికి వ్యతిరేకంగా విప్లవ భావాలు నూరిపోసి రాజ్యాధికారాన్ని ధిక్కరిస్తున్నాడనే కారణంతో పగిడిద్ద రాజుపై ఆగ్రహం చెందిన ప్రతాపరుద్రుడు అతడిని అణచివేయడానికి తన ప్రధానమంత్రి యుగంధరుడితో సహా మాఘ పౌర్ణమి రోజున మేడారంపై దండెత్తాడు.

సంప్రదాయ ఆయుధాలు ధరించి పగిడిద్దరాజు, సమ్మక్క, సారక్క, సారక్క భర్త గోవిందరాజులు, నాగులమ్మ, జంపన్నలు వేర్వేరు ప్రాంతాలనుండి గెరిల్లా యుద్ధాన్ని ప్రారంభించి వీరోచితంగా పోరాటం చేశారు. కాని సుశిక్షితులైన అపార కాకతీయ సేనల ధాటికి తట్టుకోలేక మేడరాజు, పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజులు యుద్ధంలో మరణించారు. జంపన్న కొన ప్రాణంతో వచ్చి సంపెంగ వాగులో పడి చనిపోయాడు. అప్పటి నుండి సంపెంగవాగు జంపన్న వాగుగా ప్రసిద్ధి చెందింది.

సమ్మక్క యుద్ధభూమిలో కాకలు తీరిన కాకతీయ సైన్యాన్ని ముప్పతిప్పలు పెట్టింది. సమ్మక్క వీరోచిత పోరాటానికి ప్రతాపరుద్రుడు ఆశ్చర్యచకితుడయ్యాడు. శత్రువులతో చివరి వరకుపోరాడి దెబ్బతిన్న సమ్మక్క రక్తపు ధారలతోనే యుద్ధభూమి నుండి నిష్క్రమించి చిలుకల గుట్ట వైపు వెళుతూ మార్గమధ్యంలో ఒక గట్టుపై కూర్చుంది. కాకతీయ సైన్యం ఆమెను వెతుక్కుంటూ వెళ్ళి గట్టుపై కూర్చున్న సమ్మక్కను చంపబోయారు. ఆమె వెంటనే తళతళ మెరునన్నా కుంకుమ భరణిగా మారిపోయింది. అందరు ఆశ్చర్యపోయి ప్రతాపరుద్రుడికి విషయాన్ని చెప్పారు. ప్రతాపరుద్రుడు ప్రతి రెండేళ్ళకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున సమ్మక్క జాతరను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ప్రారంభించారు.

**జాతర జరుపుకునే విధానం :**

జాతర ప్రారంభానికి వారం రోజుల ముందు నుండే తొలి అంకం మొదలవుతుంది. కన్నెపల్లెలో సారలమ్మ దేవాలయానికి ఉదయాన్నే పూజారు వెళ్తారు. గుడిని పాలు నీళ్ళతో శుద్ధి చేస్తారు. అమ్మవారిని పసుపు, కుంకుమలతో అలంకరించి పూజ చేస్తారు. ముస్తాబైన సారలమ్మ తల్లి తన పుట్టినిల్లయిన మేడారానికి ఊరేగింపుగా బయలు దేరుతుంది. పుట్టింటికి వచ్చిన సారమ్మను సాదరంగా మేడారం గ్రామ పెద్దలు ఆహ్వానిస్తారు. ఇదే సమయంలో మేడారంలలోని సమ్మక్కకు పూజలు నిర్వహిస్తారు. ఈ తొలి ఘట్టంలో 100 మంది మేడారం గ్రామ పెద్దలు మాత్రమే పాల్గొంటారు. 'కొక్కెర' వంశానికి చెందిన వాళ్ళు మాత్రమే సమ్మక్క, సారక్క పూజ చేసే హక్కు దారులు. జాతరకు సంబంధించిన ప్రధాన పూజలు కూడా వీళ్ళే చేయాలి. పూజా మందిరాన్ని అలంకరిచండంలో కొక్కెర వంశస్థులకు సిద్ధబోయిన, మల్లెల వంశస్థులు సహాయ పడతారు. ఆరు రోజులు పూజ జరిగే విధానాన్ని 'మండెమెలిగె' అంటారు. ఈ మండెమెలిగెలో ప్రతీ ఘట్టాన్నీ నియమ నిష్టలతో చేస్తారు. ఈ ఆరు రోజులు పండుగ కేవలం మేడారం, కన్నెపల్లె వాసులకే సొంతం.

**మండెమెలిగె అనంతరం జాతర :**

ఆరు రోజుల పూజనే తొలి పూజలని పిలుస్తారు. ఆరు రోజుల అనంతరం జాతర మొదలౌతుంది. గ్రామ పొలి మేరల్లో, నల్లకోడి, జీడిగింజలు, నిమ్మకాయలు, ఉల్లి గడ్డలు, సొరకాయలతో తోరణం కడతారు. ఇలా తోరణాలతో వ్రేలాడదీస్తే దుష్టశక్తులేవీ మేడారంలోకి రావని గిరిజనుల నమ్మకం. పొలిమేరకు రెండు వైపులా బూరుగ వృక్షాలతో ధ్వజ స్తంభాలను నాటి ఆహ్వానం పలుకుతారు. ముందుగా భక్తులు జంపన్న వాగులో స్నానం చేసి గాని గిరిజనులు జాతరలో అడుగుపెట్టరు. జంపన్న వాగులో స్నానం చేయకుండా జాతరలో పాల్గొంటే అది పరిపూర్ణం కాదనీ వీరి ప్రగాఢ నమ్మకం. సమ్మక్క - సారక్క గద్దెలతోపాటు సారలమ్మ తండ్రి పగిడిద్దరాజును కొత్తగూడెం మండలం కొండ్రాయి గ్రామం నుండి ఊరేగింపుగా తీసుకొచ్చి తల్లుల గద్దెవద్ద ప్రతిష్టించి పూజలు చేస్తారు.

వనదేవతలుగా కొలువబడుతున్న సమ్మక్క,

సారలమ్మ, పగిడిద్దరాజు, నాగులమ్మ, జంపన్న, గోవిందరాజు ఒకే తెగకు చెందినవారైన ఆయా గోత్రికుల ఆధారంగా వేర్వేరు గోత్రాలవాళ్ళు వీరికి పూజలు నిర్విహిస్తారు. రాచకోయల్లో 3, 5 గోత్రీకులకు సమ్మక్క ఇలవేల్పు, అయితే నాలుగో గోత్రీకులకు సారలమ్మ, పగిదిద్దరాజులు ఇలవేల్పులు, ఆరవ గోత్రీకులకు గోవిందరాజు ఇలవేల్పు. తమ జాతి కోసం ప్రాణత్యాగం చేసిన దైవాలుగా పూజింపబడుతున్న సమ్మక్క, సారలమ్మ పడిగిద్దరాజు ఇలా వేర్వేరు గోత్రాలవాళ్ళు పంచుకోవడానికి కారణాలు లేకపోలేదు. సమ్మక్క, సారలమ్మ జాతరను కోయులు, చెంచులు, వడ్డెరలు వేరే ముగ్గురు సంయుక్తంగా జరుపుకుంటారు. ఏటూరు నాగారం ఏజెన్సీలో సుమారు 12 రకాల కోయ తెగలున్నాయి. రాచకోయ, గుత్తికోయ, పూనకోయ, చెంచుకోయ, వెదురు, కోయ, అమ్ముల కోయలు ముఖ్యులు. వీరిలో రాచ కోయలు సమ్మక్క సారలమ్మ జాతరను నిర్వహిస్తారు.

## మొక్కుబడులు - వివరణ :

సమ్మక్క, సారక్క జాతరలో భక్తులు మొక్కుబడులు గిరిజన ఆచారాలను ప్రతిబింబిస్తాయి. జాతరలో సుమారు పది రకాల మొక్కుబడులుంటాయి. వరంపట్టడం, తల నీలాలు, వడిబియ్య, తొట్టెలు, బంగారం, పిట్ట, బాషింగం, కోడెను కట్టడం, ఎదురుకోళ్లు, తులాభారం మొదలగునవి మొక్కుబడులుగా చెల్లిస్తారు. ఈ మొక్కుబడులు నాగరికులకు వింతగా అనిపించినా విశేషంగా ఆకట్టు కుంటారు.

కోడెను కట్టే సంప్రదాయం జాతరలో ప్రత్యేకమైంది. సమ్మక్క గద్దెకు పడమర వైపు కోడెను కడతారు. ఆ తరువాత కోడెతో మూడుసార్లు సమ్మక్క గద్దె దగ్గర ప్రదక్షిణం చేస్తారు. కోడి పిల్లను అమ్మవార్ల గద్దెల ఎదుటపైకి ఎగురవేస్తారు. దీన్నే ఎదురుకోళ్ళు మొక్కు అంటారు. అలా అమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తారు. ఇక వడి బియ్యం మొక్కు, కిలోంపావు బియ్యంలో ఖర్జూర పండ్లు, తమలపాకులు, నూతన వస్త్రాన్ని ఉంచి దాన్ని నడుముకు కట్టుకుంటారు. నడుముకు కట్టుకున్న బియ్యంతోనే అమ్మవారి గద్దెలకు వచ్చి మొక్కు తీర్చుకుంటారు.

గిరిజనుల ఇంట పుట్టిన తొలిబిడ్డను మేడారం తీసుకు వస్తారు. జంపన్నవాగులో స్నానం చేయించి తలనీలాలు సమర్పించి అమ్మవార్ల దర్శనం చేసుకోవాల్సిందే. తమ పిల్లల తల వెంట్రుకలు తీస్తే తమ బిడ్డలు ఆయు రారోగ్యాలతో ఉంటారని గిరిజనులు బలంగా నమ్ము తారు. అందుకే ప్రతి గిరిజనుడు జాతరలో పాల్గొని తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించు కుంటారు. సంతానం లేనివాళ్ళు తొట్టె కడతామని మొక్కుకుంటారు. జంపన్న వాగును ఆనుకొని ఉన్న 'ఒద్దిమాను' చెట్టుకు తొట్టె కట్టి మొక్కును చెల్లించు కుంటారు. ఈ జాతరలో వేల సంఖ్యలో తొట్టెలు దర్శన మిస్తాయి.

సమ్మక్క - సారక్క జాతరలో ప్రత్యేకత బంగారం మొక్కు బంగారం అంటే 'బెల్లం' అని అర్థం. గిరిజనులు బెల్లాన్ని బంగారంగా భావిస్తారు. అమ్మవార్లకు మొక్కులు ఉన్నా లేకపోయినా బెల్లం సమర్పించుకోవడం ఆన వాయితీ. మేడారం జాతరలో తులాభారంగా బెల్లాన్ని సమర్పిస్తారు. తమ బరువంత బెల్లాన్ని తూచి అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పిస్తారు. మిగిలిన బెల్లాన్ని మహా ప్రసాదంగా భావించి తమ ఇళ్ళకు తీసుకెళ్తారు. అమ్మ వారికి సమర్పించిన బెల్లాన్ని ప్రసాదంగా స్వీకరిస్తే దీర్ఘ కాలిక రోగాలు నయమౌతాయని నమ్ముతారు. సమ్మక్క సారలమ్మ జాతరలో కనిపించే ప్రతీ దృవ్యం, ప్రతీ మొక్కుబడి గిరజనుల జీవనశైలితో ముడిపడి ఉం టుంది. ఇక్కడ మొక్కులు చెల్లించడమంటే అమ్మవార్లతో సంతోషాన్ని పంచుకోవటంగా భావిస్తారు. తమ కష్టసుఖాల్లో వనదేవతలు తమకు ఎల్లప్పుడు తోడుగా ఉంటారని గిరిజనులు నమ్ముతారు. అందుకే జాతరకు వెళ్ళే ప్రతి భక్తుడు మొక్కు ఉన్నా లేకున్నా అమ్మవార్లకు బెల్లాన్ని సమర్పించి తమ భక్తి భావాన్ని చాటుకుంటారు.

**ముగింపు :**

తెలంగాణాలో జరిగే అతి పెద్ద విశిష్టమైన ఆదివాసీ జాతర మేడారం జాతర దీన్నే తెలంగాణా కుంభమేళగా పేర్కొంటారు. ప్రతి రెండు సంవత్సరాలకి ఒకసారి జరిగే ఈ జాతర కుంభమేళాన్ని తలపిస్తుంది. గిరిజనులు ఈ జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.

**ఆధార గ్రంథాలు :**

1. చిన వెంకటేశ్వర్లు భూక్యా, గిరజన స్రవంతి, పూజా పబ్లికేషన్స్, గుంటూరు, 1993.
2. డా॥. పెండ్యాల లావణ్య, ఆంధ్రప్రదేశ్‌లోని ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలు, స్వీయ ప్రచురణ, దుగ్గిరాల, 2022.
3. అంతర్జాలం ఆధారంగా విషయ సేకరణ.

★★★

# ఆచార్య యస్వీ జోగారావు సాహితీ జీవితం

- ఆచార్య వెలకుల సిమ్మన్న, విశ్రాంత ఆచార్యులు, దూరవిద్యా కేంద్రం, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

"నాది రసరాజమార్గము, నాదు గమ్య
మది కళా సురభిళ రసి కాంతరంగ
మనగ ప్రతిభా సముద్ర సాంయాత్రికుడను
ప్రాతయనించు సరిక్రొత్త పథము నాది"

- ఆచార్య యస్వీ జోగారావు.

కవిగా, కథకుడిగా, నవలా కారుడుగా, నాటికల రచయితగా, వ్యాసకర్తగా, పరిశోధకుడుగా, పర్య వేక్షకుడుగా, విమర్శకుడుగా, సమీక్షకుడుగా, పీఠికా రచయితగా, గ్రంథ పరిష్కర్తగా, సంపాకుడుగా, అనువాదకుడుగా, మహావక్తగా, నటుడుగా, ఉత్తమ అధ్యపకుడుగా, విద్యావేత్తగా, చమత్కార చతురుడుగా, స్నేహశీలిగా, సాహితీవేత్తగా, పరమ భావుకపట్టభద్రుడుగా, రసికశేఖరుడుగా, బహుముఖ ప్రతిభాశాలిగా, సహృదయ సార్వభౌముడుగా, ఎనలేని కీర్తిని సంపాదించిన సాహితీ సంపన్నులు, మధురమశస్వి, మహా మనీషి, యశస్వి, ఆచార్య యస్వీ జోగారావు గారు. వీరి పూర్తి పూరు శిష్టా వెంకట జోగారావు 'యస్వీ'గా ప్రసిద్ధి. వీరు గొప్ప సాహితీ స్రష్ట, ద్రష్ట కూడా.

వీరు 2 అక్టోబర్ 1928 తేదీన విజయనగరం జిల్లా పార్వతీపురంలో జన్మించారు. తల్లిదండ్రులు సరస్వతీ సాంబశివరావులు. రావు గారి భార్య పేరు పుష్పరాగం. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. కొడుకు పేరు వెంకట షేక్స్పియర్, కూతురు పేరు శ్రీమతి వెంకట రసజ్ఞ, కోడలు పేరు శ్రీమతి సాయిబాల, అల్లుడు పేరు సతీష్ కుమార్.

జోగారావు గారు పార్వతీపురం హైస్కూలులో విద్యనభ్యసించారు. కాకినాడ పిఠాపురం రాజా వారి కళాశాలలో ఇంటర్మీడియట్ (1944 - 46) చదువు కున్నారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్ (1949 - 1952)లో తెలుగు బి.ఏ ఆనర్స్ పూర్తిచేశారు. ఎం.ఏ తెలుగు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఇదే విశ్వవిద్యాలయంలో పి.హెచ్‌డి. (1952 - 56) చేశారు. 1957లో డాక్టర్ పట్టాను పొందారు.

రావు గారు సంస్కృతాంధ్ర, ఆంగ్లభాషల్లో నిష్ణాతులు. జోగారావు గారి గురువులు శిష్టా కవియుగం, వడ్లమాని సుబ్బావధాని, కర్రి కామేశం, రాంభట్ల లక్ష్మీనారాయణ శాస్త్రి, తణికెళ్ళ ప్రకాశశాస్త్రి, అంగర సోమశేఖరరావు, ఈ యుణ్ణి వెంకటవీర్ రాఘవాచార్యులు, చెళ్ళపిళ్ళ సీతారమమూర్తి, గంటిజోగి సోమయాజి, దువ్వూరి వెంకటరమణశాస్త్రి, అప్పల సోమశేఖరశర్మ, ఆదిభట్ల నారాయణదాసు మొదలైనవారు.

1954 జనవరిలో ఆంధ్ర విశ్వకళా పరిషత్, తెలుగు శాఖలో లెక్చరర్‌గా చేరారు. 1967లో గుంటూరులో ఏర్పాటు చేసిన పి.జి. సెంటర్, తెలుగు శాఖలో కొంత కాలం పనిచేశారు. తర్వాత మరల ఆంధ్ర విశ్వకళా పరిషత్‌కు వచ్చారు. 1965-67లో రష్యాలో 'లెనిన్‌గ్రాడ్' విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1976 నుంచి 1979 వరకు ఆంధ్ర విశ్వకళా పరిషత్, తెలుగుశాఖలో అధ్యక్షులుగా పనిచేశారు. 1980లో ఉత్తమ అధ్యాపక అవార్డు ఇచ్చి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గౌరవించింది. 1980-83 వరకు ఆర్ట్స్, కామర్స్ లా కాలేజికి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో అనేక కీలక పదవులుచేపట్టి విద్యార్థుల ఆదరాభిమానాల్ని చూరకున్నారు. వీరి ప్రతిభకు గుర్తింపుగా 1984లో యు.జి.సి వారు వీరికి జాతీయ ఆచార్యునిగా పరిగణించారు. జాతీయస్థాయికి ఎదిగిన అధ్యాపక ప్రముఖుల్లో రావు గారు అగ్రగణ్యులు. రావు గారి దగ్గర ముప్పైకి పైగా పి.హెచ్‌డి.లు, నలుగురికి

ఎం.ఫిల్‌లు వచ్చాయి. 1984లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ వీరికి గౌరవ డి.లిట్ ఇచ్చి ఘనంగా గౌరవించింది. వీరు జీవితంలో ఎన్నో సభల్లో పాల్గొని గొప్పగా ఉపన్యసించడం మరుపురాని అంశం. వీరి ఉపన్యాస కళ మహా మహా పండితుల ప్రశంసల్ని అందుకుంది.

1970లో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ వారు వీరిని ఘనంగా సన్మానించారు. 1981 ఏప్రిల్‌లో మలేషియాలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలకు ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ప్రతినిధిగా వెళ్ళారు. 1987లో మదరాసు తెలుగు అకాడమి వారిచే 'గురజాడ అప్పారావు మెమోరియల్ అవార్డు' అందుకున్నారు. 1989లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు.

వీరు రష్యా, ఫ్రాన్సు, ఇంగ్లాండు, ఇటలీ, చెకోస్లోవి కియా, డెన్మార్కు, అమెరికా, కెనడా, మలేషియా, సింగపూర్ ఇలా ఎన్నో దేశాలు పర్యటించారు. 'వరల్డ్ యూనివర్శిటీ' అమెరికా వారు సాంస్కృతిక, సారస్వత రంగాల్లో జోగారావు గారు చేసిన గొప్ప కృషిని మెచ్చుకొని వీరికి అత్యున్నత అవార్డు డి.లిట్ గౌరవ పట్టాతో గనంగా సత్కరించారు.

జోగారావు గారు తనకు గల ప్రతిభా పాటవాలతో అనేక వినూత్న సాహితీ సభలకు రూపకల్పన చేసి ప్రముఖుల ప్రశంసల్ని అందుకున్నారు. ఇందిరా మందిరం, ఇంద్రసభ, చాంద్రసభ, యమసభ, బ్రహ్మ సభ, సరస్వతీ సామ్రాజ్యం, మన్మథ సామ్రాజ్యం, శృంగార ధర్మాసనం, త్రైలోక్య విజయం, కనకాభిషేకం, అష్ట కష్టావధానం, నవరస తరంగిణి మొదలైన సభల్ని ఏర్పాటు చేసి సహృదయ ప్రేక్షకుల్ని రసమయ జగత్తులో వోలలాడించిన రసిక రాజశేఖరుడురావు గారు. అంతేకాదు శ్రీకృష్ణదేవరాయలు, రఘునాథరాయలు, ఇంద్రుడు, మున్నగు పాత్రలు పోషిస్తూ సభను రంజింపచేశారు జోగారావు గారు.

వీరికి ఎన్నో బిరుదులు, బహుమానాలు, పురస్కారాలు లభించాయి. వీరి కవిత్వానికి మెచ్చుకొని విశ్వనాథ సత్యనారాయణ గారు 'మధుర సరస్వతి' అనే బిరుదును ఇచ్చారు. 1974లో తణుకు పండిత పరిషత్తు వారు 'మహా కవి' అనే బిరుదును ఇచ్చారు. భీమవరం, జాషువా సాహితీ సమితి వారు 'సాహితీ రత్నాకర' బిరుదును ఇచ్చారు. అభినవ కృష్ణరాయ, పరిశోధన పరమేశ్వర, తెలుగు తానీషా లాంటి బిరుదులున్నాయి.

22-5-1982 గుంటూరులో జరిగిన జోగారావు గారి 'శృంగార సర్వజ్ఞ' కృతి సమర్పణ సభలో రావు గారికి 'శృంగార సర్వజ్ఞ' బిరుదునిచ్చారు. ఆ బిరుదు పత్రంలో ఇలా వుంది. 'ప్రాచార్య శ్రీయస్వీ జోగారావు మహోదయు లకు 'శృంగార సర్వజ్ఞ' కావ్య సమర్పణ సభలో గుంటూరు మండల రచయితల సహకార సంఘము, శ్రీనాథ పీఠము, కవి పండిత పరిషత్తు, ప్రజా ప్రతినిధుల సమక్షమున వారి నాస్యతోదర్శనీయము, అపూర్వము, అసాధారణము అయిన కవితా ప్రతిభకు ఆశ్చర్యచకితులు, ఆనంద తుందిల హృదయములు అయిన సహృదయులు వారికి 'శృంగార సర్వజ్ఞ' బిరుదును సప్రశయముగా సమర్పించు చున్నారు'.

ఆంధ్ర విశ్వకళా పరిషత్‌లో సిండికేట్, సేనెట్ ఎకడ మిక్ కౌన్సిల్‌లో సభ్యుడుగా పనిచేశారు. ప్రాచ్య విద్యా పరిషత్ అధ్యక్షుడుగా, తెలుగు బోర్డు ఆఫ్ స్టడీస్ అధ్యక్షులుగా పదవులు నిర్వహించారు. ఉస్మానియా, శ్రీవెంకటేశ్వర, బెనారను, బెంగుళూరు మొదలైన విశ్వవిద్యాలయాల్లో 'తెలుగు బోర్డు ఆఫ్ స్టడీస్'లో సభ్యుడుగా బాధ్యతలు నిర్వహించారు. కాకతీయ, అన్నామలై, మద్రాసు, మైసూరు, దార్వారు, గుల్బర్గా మొదలైన విశ్వవిద్యాలయాల్లో ఎం.ఫిల్., పి.హెచ్‌డి పట్టా పరీక్షల సభ్యత్వం మరియు అధ్యక్షత వహించారు. ఢిల్లీ, వారణాసి కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగ నిర్ణయ విద్యా సమితుల్లో సభ్యత్వం వహించారు.

భారత ప్రభుత్వ విద్యాశాఖ, యు.జి.సి. సాహిత్య అకాడమీ, అలహాబాదు జ్ఞానపీఠం మొదలైన వాటికి సలహాదారుడుగా పనిచేశారు. యు.పి.యస్.సి ఉద్యోగ

నిర్ణయ వదాన సమితిలో సభ్యత్వం వహించారు. ఆలిండియా ఓరియంటల్ రైటర్స్, ఫోక్‌లోర్, ప్లేస్‌నేమ్స్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి మొదలైన సంస్థలల్లో సభ్యత్వం, వయోజన విద్యా, ఎన్.సి.సి శిక్షణ శిబిరాల్లో సభ్యత్వం వహించారు. గుంటూరు జిల్లా రచయితల సహకార సంఘానికి వీరు వ్యవస్థాపకాధ్యక్షులుగా పని చేశారు. ఒక సంవత్సర కాలం గుంటూరు రోటరీ క్లబ్బులో 'డైరెక్టర్ ఆఫ్ ఇంటర్నేషనల్ సర్వీసు'లో సేవలందించారు. స్వయంకృషితో, నిరంతర సాధనతో ఒక్కొక్క మెట్టు దాటుకుంటూ, తెలుగు సాహిత్య శిఖరాలను అధిరోహించిన ఘనత జోగారావు గారికి దక్కుతుంది. 21 సెప్టెంబర్ 1992లో విశాఖపట్టణంలో పరమపదించారు.

**రచనలు :**

**I. కవిత్వం :**

1. పంచకళ్యాణి (1958)
2. ఉపనిషత్తు (1961)
3. ప్రసన్న కుసుమాయుధం (1973)
4. అడిగొప్పల హోరుగాలి (1979)
5. శృంగార సర్వజ్ఞం (1981)
6. శృంగారచ్ఛంగారువు (1987)
7. గంధర్వనగరం (1988)

**II. ఊహా ప్రహేళికలు :**

1. అవతారం (1958)
2. యశ్వంతరం (1958)

**III. కథలు : స్వర్ణశృంఖల (కథా సంపుటి - 1961)**

1. సువర్ణ శృంఖల
2. విషాదాంతం
3. ఉత్తిష్ఠస్తుభూత పిశాచా
4. రసాభాసం
5. అసలు సంగతి
6. డాక్టర్ సుదర్శనం
7. సుబ్బారాయుడి షష్ఠి

**కథా సంకలనంలో కేళి కథలు - 3**

1. మహాకవి శివయ్య గారి జీవిత చరిత్ర
2. శభాష్ శేషయ్య కటకటా కాంతమ్మ
3. ధా

**IV. నవల :**

మేరు శిఖరం (చోమోయింగ్మా - 1988)

**V. నాటికలు :**

**అ) అప్సరస (గేయ నాటికలు - 1961)**

1. అప్సరస
2. సమభాణం
3. సాక్షాత్కారం
4. అవిముక్తం

**ఆ) మధురామాధవం (వచన నాటికలు - 1963)**

1. మధురామాధవం
2. పాచికలు
3. దూతవాక్యం
4. అఘాయిత్యం
5. కథానియకులు
6. విచిత్రచిత్ర గుప్తం
7. పాపారాయుడు
8. మదన కామేశ్వరి
9. చిత్రపత్రి

**VI. పరిశోధన : యక్షగాన వాఙ్మయ చరిత్ర (1957)**

**VII. విమర్శ :**

1. సప్త తంతువు (1959)
2. సారస్వత నీరాజనం (1965)
3. మహాకవి మార్గం (1965)
4. తెలుగు జీవుడు (1968)
5. అభిజ్ఞనశాకుంతలం - కాళిదాసు ఆంతర్యం (1987)
6. కాదంబరిస్వాదం (1988)
7. మణిప్రనాళం (1988)
8. శ్రీనాథశ్రీ (1989)

9. సాహిత్య భావలహరి (1989)
10. సాహిత్యవల్లి (1990)
11. అదిభట్ల నారాయణ దాససారస్వత స్వాదం (1992)

జోగారావు గారు ఏడు కవితా సంపుటాలు, రెండు ఊహా ప్రహేళికలు, ఒక కథా సంపుటి, ఒక నవల, పదమూడు నాటికలు, పదకొండు విమర్శ గ్రంథాలు, ఒక పరిశోధన గ్రంథం రాశారు. రోటరీ చరిత్రను రాశారు. ఒక గ్రంథాన్ని అనువాదం చేశారు. ఒక ఆంగ్ల గ్రంథాన్ని ప్రకటించారు. అనేక సాహిత్య ప్రక్రియలను చేపట్టి, అందులో విజయం సాధించిన బహుముఖ ప్రజ్ఞావంతుడు జోగారావు గారు. వీరి రచనలన్నీ ఏదోఒక ప్రత్యేకతను సంతరించుకొన్నవే. అనేక సమీక్షలు, లెక్కలేనన్ని గ్రంథాలకు ముందుమాటలు రాశారు. ఎన్నో ఉత్తమ గ్రంథాల్ని పరిష్కరించారు. మరెన్నో గ్రంథాలకు సంపాద కత్వం వహించారు.

ఇలా ఎన్నో గ్రంథాలు రాసి, తెలుగు సాహిత్యంలో మంచిపేరు ప్రఖ్యాతలు సంపాదించారు జోగారావు గారు. వీరి రచనలన్నీ ప్రామాణికమైనవే. వీరి రచనాశైలి మధు రాతి మధురమైనవి. వీరి వచనం కమనీయమైన కవిత్వంలా ఉంటుంది. సంప్రదాయ కవిత్వంలోనూ ఆధునిక కవిత్వంలోనూ రెండింటిలోనూ వీరు అందెవేసి చేయి.

వీరి ఆలోచన విలక్షణమైంది. వారి భావ ప్రకటన అంతకంటే విశిష్టమైంది. తాను చెప్పదలచుకున్నది నిర్భయంగా చెప్పడం వారి ప్రత్యేకత. రావు గారు చేసిన సాహిత్యసేవ అపూర్వం. అందుకే సాహిత్యలోకంలో జోగారావు గారు 'సాహితీ బంధు'గా సహృదయ పాఠకుల హృదయాల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారు.

'ప్రాచీనమార్గముల గౌరవించుచుక్రొత్తత్రోవలకు
మోజువడుఉ పిన్ననాటినుండి జోగారావు తత్త్వము
అనుకరణముల సభలహింపడు. ఉపజ్ఞకుబ
లాఉపడును. రచనమునూతనము. బాణీకొత్తది'
- దువ్వూరి వేంకటరమణశాస్త్రి.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2(1), February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# దిగంబర కవితోద్యమం - నేపథ్యం

- డి. ప్రవీణ్ కుమార్, పరిశోధక విద్యార్థి - నిజాం కాలేజ, ఉస్మానియా యూనివర్సిటి.

గురజాడతో ప్రారంభమైన తెలుగు కవితా ప్రస్థానం భావ, అభ్యుదయ కవిత్వాలుగా మలుపులు తిరిగి ఒక స్తబ్ధతలోకి జారుకున్న సమయంలో దిగంబర కవులు తమ సరికొత్త స్వరంతో దిక్కులు పిక్కటిల్లేలా తిరుగుబాటు చేసారు.

భారతదేశంలో మన రాష్ట్రంలో రాజకీయ, సామాజిక పరిస్థితులు నిరాశాజనకంగా ఉన్న రోజులవి. అభ్యుదయ కవితోద్యమం ఉధృతి తగ్గి, సాహిత్య వ్యాపారం ప్రభావం పెరిగి కళా, సాంస్కృతిక రంగాలు రెండు ప్రజలను జోకొట్టేవిగా పాలక వర్గాల కొమ్ముకాసేవిగా మారిన రోజులవి.

అభ్యుదయ, భావవాద ధోరణులన్నీ కలగాపులగంగా సాగుతూ అవకాశవాద నైజాన్ని సంతరించుకుంటున్న కాలమది. అప్పుడే 1965 మే 6వ తేదీన దగంబర కవులు తమ మొదటి కవితా సంపుటిని హైదరాబాద్ ఆబిడ్స్ సర్కిల్‌లో "నాంపల్లి పాండు" అనే రిక్షా కార్మికుని చేత ఆవిష్కరింప చేశారు. నిజాయితీతో, నిర్భతితో, భిన్నమైన భాషా ప్రయోగంతో ఉద్విగ్న, సగ్న పదాలతో దిగంబర కవిత్వం కవిత్వ అభివ్యక్తిలోనే ఒక కొత్త దనాన్ని ప్రదర్శించింది.

దిగంబర కవులుగా ప్రసిద్ధి పొందిన కవులు అరుగురు వారు తమ కవిత్వంలో అసలు పేర్లకు బదులు కలం పేర్లను ఉపయోగించారు. వారు 1) నిఖిలేశ్వర్ (యాదవ రెడ్డి) 2) నగ్నముని (ఎం.హెచ్.కేశవరావు) 3) చెర బండరాజు (బద్ధం భాస్కర రెడ్డి) 4) జ్వాలాముఖి (వీరరాఘవచార్యులు) 5) మహాస్వప్న (కమ్మిశెట్టి వేంకటేశ్వర రావు) 6) భైరవయ్య (మన్మోహన్ సహామ్)

అభ్యుదయ సాహిత్యం ఒక నిస్తబ్ధతలోకి జారుతున్న తరుణంలో సమకాలీన సామాజిక వ్యవస్థను సకల రంగాలలో పెరిగిపోయిన కుళ్ళును ఎండగట్టే ప్రయత్నంలో ఒక మహోధృతితో తెలుగు కవిత్వానికి సమాజానికి కూడా దిగంబర కవిత్వం ఒక షాక్ ట్రీట్ మెంట్‌ను యిచ్చింది. అభ్యుదయ కవితోద్యమం తర్వాత మొదలైన విప్లవోద్యమానికి ఒక వారధిగా పని చేసింది.

"గ్లా నిర్భవతి భారత" కవితలో మహాస్వప్న దిగంబర కవి ఆవిర్భావాన్ని అభివర్ణించాడు. భగవద్గీతలోని ఒక శ్లోకంలో ఈ కవిత ప్రారంభమవుతు ధర్మానికి ఎప్పుడు ఎక్కడ ఆపద సంభవించినా, తాను ప్రత్యక్షమై అధర్మాన్ని అంతమొందిస్తుంటానని కృష్ణుడు తన విశ్వరూపాన్ని ప్రదర్శించి, అర్జునునికి చెప్పిన సందర్భంలోనిది శ్లోకం. దీనిని కవిత మొదట్లో పేర్కొనడం వల్ల దిగంబర కవి ఆవిర్భావం ఈ ప్రపంచంలో అధర్మాన్ని అసత్యాన్ని అంత మొందించేందుకే జరుగుతోందని ప్రతిపాదించడం కనిపిస్తుంది.

"నేను వస్తున్నాను దిగంబర కవిని
రాత్రి ఉదయిస్తున్న రవిని"...

అంటూ అస్తవ్యస్తమైన సామాజిక వ్యవస్థలో మానవత మరిచి అహంభావంతో, అజ్ఞానంతో ప్రవర్తిస్తున్న కీర్తికాముకులు, నియంతలు వారి దురాక్రమణలో పుచ్చి గబ్బు కొడుతున్న దేశదేశాలు, నాగరిక మత్తు ఇంజక్షన్‌తో జీవచ్ఛవమైన సామాజిక శకలాలు... కనిపించే వికృత కురూపి వ్యవస్థ రూపాన్ని కళ్ళకు గట్టినట్లు కవి చిత్రించారు. మరణించిన భాగవంతునికి ప్రాణం పోసేం దుకు, వికృతాకారపు శిలల్ని మనవులుగా మలిచేందుకు 20వ శతాబ్దంలో ఉదయిస్తున్న దిగంబర కవి ఆవిర్భావాన్ని నిర్దుష్టంగా ప్రకటించారు.

దిగంబర కవిత్వం ఆవిర్భావానికున్న చారిత్రక, సామాజిక, ప్రాసంగితను ఈ కవిత బలంగా వెల్లిడిస్తోంది.

ఒక రాజకీయ, సామాజిక అవగాహనతో ప్రారంభమైన దిగంబర కవితోద్యమం తెలుగు సాహిత్యంలో ఏర్పడిన స్తబ్ధతను వదిలించే చారిత్రక ప్రయోజనాన్ని సమర్థ వంతంగా నిర్వహించింది. జీవిత వాస్తవికతకు దూరంగా కవిత్వం కదిలి వెళ్ళిపోతున్నప్పుడు పట్టి, లాగి కుదిపి భూమార్గం పట్టించిన ఉద్యమంగా దిగంబర కవితోద్యమాన్ని మనం గుర్తించాలి.

**విశేషాంశాలు** :

సాంఘీకమైన నిరసనలో భాగంగా తమ కోపాన్ని, కసిని, ద్వేషాన్ని వ్యక్తీకరించేందుకు దిగంబర కవులు సరికొత్త ఉపమానాలను ప్రతికలను, పదచిత్రాలను ప్రయోగించారు. సత్యం అనాచ్ఛాదితం సగ్నత ఒక అన్వేషణకు స్ఫూర్తి సామాజిక సగ్న సత్యాలను వ్యక్తీరించాలని బయలుదేరిన కవులు దిగంబర కవులు, సాధారణంగా, సామాన్యంగా చెబితే తట్టని విషయాలను చెళ్ళున చరిచి, ఉలిక్కిపడేట్టు చెప్పడానికి చేసిన ప్రయత్నంలో వారి అభివ్యక్తి జుగుప్సలోకి దారితీసిందని విమర్శకుల అభియోగం.

కలియుగం రేడియోగ్రాం, ఇరవయ్యో శతాబ్దపు రికార్డు మీద పెన్సు రాత్రి ఉదయిస్తున్న రవి, మొదలైన పద చిత్రాలు సరికొత్తవి "కాలం - వాయులీసం మీద కమాసు; చరిత్ర నిద్రా సముద్రం మీద తుపాను" మొదలైనవి కవి బలమైన భావనాశక్తిని ఊహాశక్తిని ప్రతిబింబించేవి. పురాణ గాధల్ని, ప్రతీకల్ని వాడుకునే పద్ధతి ఈ కవితలో మనం గమనించవచ్చు.

"జగన్నాటకము, మా నిషాద శోకము, ఉగ్రనగ్న నరకేసరి" మొదలైన వాక్యాల్లో ఈ విషయాల్ని మనం గుర్తించవచ్చు. కవిత ఎత్తుగడలోని భగవద్గీతలోని ఒక శ్లోకాన్ని పేర్కొనటంతో మహాభారతంలోని ఒక ఘట్టాన్ని సూచించటం ద్వారా దిగంబర కవి ఆవిర్భావాన్ని స్ఫురించేలా చేయటం కూడా ఒక విశేషమే.

దిగంబర కవితోద్యమం ఒక చారిత్రక అవసరంగా వచ్చి ఒక ఉద్యమంగా నిర్వహించవలసిన కర్తవ్యాన్ని నిర్వహించింది. తెలుగు కవిత్వ చరిత్రలో అతి కొద్ది కాలంలో (సుమారు ఐదేండ్లు) సాహిత్యం మీద అంత గాఢ ముద్ర వేసిన కవితోద్యమం మరొకటి లేదు. క్యాలెండర్ కవిత్వాలు ప్రాజెక్టు కవిత్వాలు రాసుకునే కవులను, రాజకీయోద్యమం బలంగా లేకపోవటం వలన నిద్రపోతున్న అభ్యుదయ కవులను, వాక్య చమత్కారాలతో ప్రభుత్వ కవి సమ్మేళనాలలో ఆలిండియా రేడియోలో చెవులు హోరెత్తించే కవులను, కొంత శృంగారం మరికొంత అభ్యుదయం కలిపి కాసేపు గేయాలు - కాసేపు వచన కవిత్వం రాసి - పత్రికల్లో పుంఖానుపుంఖంగా అచ్చేసే కవులను, ఏం చేసుకున్నారో తమకే తెలియని అయోమయ కవులను, కొరడా దెబ్బలతో "దిక్" లలో కొట్టి కాలాన్ని కదిలించింది దిగంబర కవిత్వం, దాదాపుగా మరుగునపడ్డ సామాజిక ప్రయోజనం అనే లక్ష్యాన్ని మళ్ళీ సాహిత్యంలో ముందుకు తీసుకువచ్చింది దిగంబర కవిత్వం. అభివ్యక్తిలో స్వేచ్ఛకు, నవ్యతకు ఈ కవిత్వం చేసిన దోహదం చాలా ఎక్కువేనని చెప్పాలి.

★★★

# పోతన భాగవత దశమస్కంధంలో దశావతారాల ప్రస్తావన

– డా॥. అల్లు గణేష్, టి.జి.టి. తెలుగు ఉపాధ్యాయుడు, బాలయోగి గురుకులం, అడవి తక్కెళ్ళపాడు, గుంటూరు.

కం॥ పలికెడిది భాగవత మట,
పలికించెడివాడు రామభద్రుం డట, నే
బలికిన భవహర మగునట
పలికెద, వేఱొండు గాథ బలుకగ నేలా?

(భాగవతం 1-18)

చెప్పేదేమో పరమ పవిత్రమైన శ్రీమద్భాగవతమా! కరుణా సముద్రుడైన శ్రీరామచంద్ర ప్రభువే చెప్పించే వాడా! చెప్పినందువల్ల భవబంధాలు పరిహారమై పోతాయా! ఇంక అనవసరంగా మిగతావి పలకటం ఎందుకు! భాగవతాన్నే చెప్తాను అని భాగవతం ప్రారంభంలోనే పోతన సభక్తికంగా చెప్పాడు. రాముడు రాయించిన భాగవతం మొత్తం శ్రీకృష్ణ మయం. రామాయణ భారత భాగవతాలను చదవడం ప్రారంభించే టప్పుడు లోకంలో ఒక సంప్రదాయం ఉంది. రామాయణాన్ని సుందరకాండ నుండి, మహాభారతం విరాటపర్వం నుండీ, మహాభాగవతాన్ని దశమస్కంధం నుండి చదవాలి అనేది ఆ సంప్రదాయం. పూర్వులు పెద్దలు ఏర్పరచిన ఈ సంప్రదాయానుసారం ఇప్పటికీ ఈ మూడు మహా గ్రంథాలను ఇలాగే చదవడం ప్రారంభిస్తున్నారు. తెలుగులో పోతన అందించిన మహాభాగవతం చక్కని చిక్కని పురాణం. ఎంతో వినయ సంపన్నతతో ఈ భాగవతాన్ని పోతన తెనిగించాడు. భాగవతాన్ని తాను రాయటం పూర్వజన్మ సుకృతం అని ఎంతో వినయంగా చెప్పాడు.

మ॥ ఒనరన్ నన్నయ తిక్కనాది కవు లీ యుర్విం
బురాణావళుల్
తెనుఁగుం జేయుచు మత్పురాకృత శు
భాధిక్యంబు దా నెట్టిదో
తెనుఁగుం జేయరు మున్ను భాగవతమున్
దీనిం దెనింగించి నా
జనసంబున్ సఫలంబు జేసెద బునర్జన్మంబు
లేకుండగన్.

(భాగవతం 1-21)

బమ్మెర పోతనామాత్యులు భాగవతాన్ని తెనిగించడానికి పూనుకున్న విధం తెలుపుతూ-ఇంతకు పూర్వం నన్నయ భట్టారకుడు, తిక్కన సోమయాజులు మొదలైన కవీంద్రులు సంస్కృతంలో ఉన్న పురాణాలు, గ్రంథాలు ఆంధ్రీకరించారు. కాని నా పూర్వజన్మ ఫలం ఎంత గొప్పదో కాని, ఆ మహానుభావులు ఎవరు కూడా భాగవతాన్ని ఆంధ్రీకరించలేదు. బహుశా నా కోసమే అట్టేపెట్టి ఉంచారేమో. ఈ మహా గ్రంథాన్ని నేను ఆంధ్రీకరించి పునర్జన్మ అన్నది లేకుండా ఈ నా జన్మను సార్థకం చేసుకుంటానని విధేయతను ప్రదర్శించాడు.

అష్టాదశ పురాణాలలో భాగవత స్థానం పదిలమైంది. సభక్తికంగా, సుమధురంగా, వినయంగా భాగవతాన్ని తెలుగులో అందించిన పోతన కవి చరితార్థుడు. బమ్మెర పోతన 1) వీరభద్ర విజయం, 2) నారాయణ శతకం, 3) భోగినీ దండకం, 4) భాగవతంలోని ఎనిమిది స్కంధాలు (1,2,3,4 మరియు 7,8,9,10) రచించాడు. పంచమ స్కంధాన్ని గంగన, షష్ఠ స్కంధాన్ని సింగన, ఏకాదశ ద్వాదశ స్కంధాలను నారయ రచించారని తెలుగు సాహితీ జగతికి తెలిసిన విషయమే. సుమారు 9 వేల పద్యగద్యాలతో విలసిల్లుతున్న ఆంధ్రమహాభాగవతం భక్తిరస ప్రధానమైంది. వ్యాస విరచిత సంస్కృత భాగవతాన్ని యథోచితానుసరణంగా పోతన తెనిగించాడు. సంస్కృత అలంకారికులు పేర్కొన్న రసం, గుణం, ధ్వని, వక్రోక్తి వంటివన్నీ పూర్వ పరిశోధకులు పోతన భాగవతం నుండి ఉదాహరణలు చూపించారు. పోతన భాగవతం దశమ స్కంధంలో కనిపిస్తున్న దశావతారాల ప్రస్తావనను ఇప్పుడు ఈ పరిశోధన పత్రంలో పరిచయం చేస్తున్నాను.

ఆంధ్రమహాభాగవతంలో దశమ స్కంధం శ్రీకృష్ణ లీలామృతం..అందులో మూడు ఘట్టాలలో శ్రీకృష్ణుని పరంగా, దశావతారాలను గుర్తుచేసే మూడు పద్యాలు ఉన్నాయి.

అల్లరి చేస్తున్న చిన్ని కృష్ణుణ్ణి యశోద అదిలిస్తున్న సంర్భంలోని పద్యమిది.

సీ॥ తోయంబు లివి యని తొలగక చొచ్చెదు;
తలచెదు గట్టైన ధరల నెత్త;
మంటితో నాటలు మానవు; కోరాడె;
దుస్సత స్తంభంబు లూప బోయె;
దస్యుల సల్పంబు లడుగంగ బాఱెదు;
రాచవేటల జాల అవ్వదెచ్చె
దలయవు నీళ్ళకు సడ్డంబు గట్టెదు;
ముసలివై హలివృత్తి మొసయ జూజె

ఆ॥ దంబరంబు మొలకు సడుగవు తిరిగెద
వింకఎ గల్కిచేత లేల పుత్ర!
నిస్ను వంప వ్రాల్ప నే నేర సనియొ నీ
విట్టు క్రిందు మీదు నెఱుగ కునికి
(పోతన భాగవతం-10 స్కం.-377ప)

ఒరే కన్నయ్యా! అల్లరి పిల్లాడా! అదురు బెదురు లేకుండా నీళ్ళలో చొరబడి పోతావు! (మత్స్యావ తారుడవుగా నీళ్ళలో తిరిగావు కదా). ఎంత పెద్ద బండైనా ఎత్తేయాలని చూస్తావు! (కూర్మావతారుడివిగా మందర పర్వతాన్ని ఎత్తావు కదా). పరాయి వాళ్ళ దగ్గర అల్పమైన వాటికోసం చెయ్యి చాస్తావు! (వామనా తారుడివిగా రాక్షస చక్రవర్తి బలివద్ద చెయ్యిచాపావు కదా). నీకు రాజసం ఎక్కువ ఎన్నో జగడాలు తెస్తావు! (పరశురామావ తారుడివిగా రాజలోకాన్ని సంహరించావు కదా).

నీళ్ళ ప్రవాహానికి అడ్డకట్టలు వేయాలని చూస్తావు! (రామావతారుడవు సముద్రానికే సేతువు కట్టావు కదా). దుడ్డుకఱ్ఱ పట్టుకొని నాగలిదున్నే వాడిలా నటిస్తావు! (బలరామావతారుడవుగా ముసలము పట్టావు కదా). మొలకు గుడ్డ లేకుండా దిగంబరంగా తిరుగుతావు! (బుద్ధావతారుడవుగా సన్యాసిగా ప్రకాశించావు కదా). ఇవి చాలవు నట్లు ఇంకా దుడుకు చేష్టలెందుకు చేస్తావో ఏమిటో? (ఇక ముందు కల్కి అవతార మెత్తి దుష్టులను శిక్షించడానికి ఏవేం చేస్తావో). నిన్ను నేను భయభక్తులలో పెట్టలేను అనుకునేగా ఇలా కింద మీద తెలియకుండ మిడిసిపడుతున్నావు! (త్రివిక్రమావతారుడవుగా బ్రహ్మాండ భాండందాటి ఎదిగిపోయావు కదా). ఇలా ఎత్తిపొడుపు మాటలతో తల్లి యశోదాదేవి కొంటె కొడుకును దెప్పు తోంది.

చమత్కారమైన అలంకారం నిందాస్తుతి. ఓ ప్రక్కన నిందిస్తున్నా, స్తుతి పలుకుతుంటే నిందాస్తుతి అంటారు. ఇలా అల్లరి బాలకృష్ణున్ని యశోద దెప్పటంలో నిందాస్తుతితో బహు చక్కగా అలరించారు మన పోతన్న గారు.

కొడుకు ఎంత అల్లరి చేసినా తల్లికి ముద్దే. అయితేనేమి యశోద ఎత్తి చూపిస్తున్న కొడుకు అల్లరిలోని ఈ ఘన కార్యాలన్నీ చేస్తున్నాడని ఎంతో రమణీయంగా, తల్లి అయిన యశోద పరంగా ఎంతో ఔచిత్యవంతంగా సహజ సుందరంగా ఉన్నది ఈ పద్యం. ఇది శ్రీకృష్ణుడి చిన్నప్పటి ఈ సందర్భంలో చెప్పిన పద్యం. పెరిగి కొంత పెద్దవాడయ్యాక, కాత్యాయనీ వ్రతంలో ఉన్నటువంటి గోపికలు, వ్రత నియమాలను పక్కనపెట్టి, ఒకరకంగా వాటిని ఆచరించకుండా, సరోవరంలో బహిరంగ ప్రదేశంలో స్నానం మాడటానికి దిగినప్పుడు, వ్రతం నియమాన్ని గుర్తు చేయటానికని, ఆ వస్త్రాలను తీసి పట్టుకున్న సందర్భాన్ని గోపికల వస్త్రాపహరణ సందర్భంలో లోకంలో ప్రసిద్ధి పొందింది. ఆ గోపికలు చేసిన శ్రీకృష్ణ స్తుతిలో దశావతారాలు ఇలా ఉన్నాయి.

సీ॥ బహుజీవనముతోడ భాసిల్లి యుండుటో?
గోత్రంబు నిలుపుటో కూర్మితోడ?
మహి నుద్ధరించుటో? మనుజసింహంబవై;
ప్రజలఎ గాచుటొ? కాక బలి దెరల్చి

పిన్నవై యుండియుఁ బెంపు వహించుటో?
రాజుల గెలుచుటో రణములోన?
గురునాజ్ఞ జేయుటో? గుణనిధి వై బల;
ప్రఖ్యాతి జూపుటో భద్రలీల?
ఆ॥ బుధులు మెచ్చ భువిఁ బ్రబుద్ధత మెఱయుటో?
కలికితనము చేయ ఘనత గలదె?
వావి లేదు వారి వారు నా వారని
యెఱుగ వలదె? వలువ లిమ్ము కృష్ణ!
(10 స్కం.పో.భా.822 ప)

ఓ కిట్టయ్యా! ఏం పనయ్యా యిది! దొడ్డ బ్రతుకుతో వన్నె కెక్కడం కాని (జలరాశిలో విలసిల్లడం - మత్స్యావతారం), కూర్మితో కులం ప్రతిష్ట నిలబెట్టటం కాని (కొండను మూపున నిల్పడం - కూర్మావతారం), భూమిని రక్షించటం కాని (భూదేవిని పైకి లేవనెత్తటం - వరహావతారం), పురుషపుంగవుడవై జనులను కాపాడటం కాని (నరకేసరియై భక్తుల రక్షించటం-నృసింహావతారం), వయసున పసివాడవయ్యు దుష్టులు, బలవంతులు అయినవారిని నిగ్రహించి ప్రఖ్యాతి వహించటం కాని (వటువు రూపంలో బలిచక్రవర్తి నణచి కీర్తిపొందటం - వామనావతారం), యుద్ధాలలో రాజులను గెలవటం కాని (ఇరవై యొక్క మార్లు క్షత్రియులను జయించటం-పరశు రామావతారం), పండితులు ప్రశంసించేలా ప్రబుద్ధుడవై లోకంలో ప్రకాశించటం కాని (పొందిన జ్ఞానంతో పండితుల ప్రశంసలకు పాత్రుడవటం-బుద్ధావతారం) తగిన పని. అంతేకాని ఇలాంటి వంచకత్వం ఏమాత్రం గొప్పదనం కాదయ్యా. (కల్కి పదంతో కల్క్యావతారం సూచన). నీకు వావివారసలు లేనట్లుంది, తనవారు పరాయివారు అనే వివేకం అక్కరలేదా (భగవంతునికి వావివరసలు, స్వపక్ష పరపక్షాలు లేవు). మా బట్టలు మా కిచ్చెయ్యవయ్యా. మొదటి పద్యంలో తల్లి యశోద మాటల్లోని లాలిత్యం, ఆ పదాల పోహళింపు, గోపికల మాటల్లోని తేడాను మనం ఈ పద్యంలో గమనించవచ్చు. యశోద చెప్పిన వృత్తాంతంలోని కృష్ణుడు బాలుడు. ఒక చిన్న పిల్లవాడు చేసే అల్లరిని వర్ణిస్తూ తల్లి మందలించే సందర్భంలోని పదాలు అలాగే ఉంటాయి. ఇక ఈ సీస పద్యంలోని మాటలు అంటున్న వాళ్ళు గోపికలు. వారిది ముగ్ధ భక్తి. కృష్ణుడి వయసు కూడా యశోద చెప్పేనాటికన్నా వయసు కన్నా రెట్టింపు. ఇందులో కొంత ఎదిగిన వాడు! అందుకే ఇందులో పదాలు వాడిన విధానం వేరు. ఈ రెండు పద్యాల మధ్య ఉన్న తేడా చదివిన పాఠకులంద రికీ ఇట్టే తెలుస్తుంది. అక్కడ, ఇక్కడ చెప్పినవి దశావతారాలే. అయితే స్తుతించిన వారు, సందర్భం, ఇలాంటి వాటినీ బట్టీ భాషలో కూడా మార్పు మనం గమనించవచ్చు.

శ్రీకృష్ణ బలరాములు కొంత పెద్దవాళ్ళయ్యాక, కంసుడి మంత్రి అయిన అక్రూరుడు వారిద్దరినీ మధురా నగరాన్ని తీసుకెళ్ళడానికి వస్తాడు. బలరామకృష్ణులను ఎలాగైనా మట్టుబెట్టాలని సంకల్పించిన కంసుడు అందుకు తగిన ఏర్పాట్లను చేశాడు. దేవకీదేవి అష్టమ గర్భంలో పుట్టిన వాడి చేతిలో తన ప్రాణాలు పోతాయి అని అశరీరవాణి చెప్పింది. ఆనాటి నుండే కంసుడు వీరిద్దరి ప్రాణాలు తీయడానికి ఎన్నో రకాలుగా ప్రయత్నించాడు. చివరిగా కృష్ణుని తన రాజధానికి పిలిపించుకుని ఏ రకంగా అయినా సరే చంపాలని నిర్ణయించుకున్నాడు. తన దగ్గర ఉన్న మల్ల యోధులైన చాణూరముష్టికులను ఇందుకు వినియోగిస్తాడు. ఆ మల్లయుద్ధ యోధులలో ఒకడు చాణూరుడు. చాణూరుడితో యుద్ధసమయంలో సంభాషణలో దశావతారాలను వర్ణించిన పద్యం..

సీ॥ చలమున నను డాసి జలరాశి జొరరాదు;
నిగిడి గోత్రముదండ నిలువరాదు;
కేడించి కుంభిని క్రిందికిఁ బోరాదు;
మనుజసింహుడ నని మలయరాదు;
చేరిన బడవైతు జెయి చాపగారాదు;
బెరసి నా ముందటఁ బెరుగరాదు;
భూనాథ హింసకుఁ బోరాదు నను మీఱి;
శోదింతు గానలఁ జొరగరాదు;

ఆ॥ ప్రబలమూర్తి ననుచు భాసిల్లగారాదు;
ధరణి బ్రబుద్ధుడ నని దఱుమరాదు;
కలికితనము చూపి గర్వింపగారాదు;
తరముగాదు; కృష్ణ! తలఁగు తలఁగు.
(10 స్కం.పో.భా 1343 ప)

ఓ కృష్ణా! పౌరుషానికి పోయి నా దగ్గరకి వచ్చేక ఇక వేషాలేసి నాటకాలాడి తప్పించుకుపోవడానికి అవకాశం ఉండదు జాగ్రత్త. తర్వాత (మత్స్యావతారంలోలా చేపలా వేషం కట్టి) సముద్రంలోకి పోడానికీ కుదరదు. (కూర్మావ తారంలో మంథర పర్వతానికి కింద నిలబడి ఆధారంగా ఉన్నానని తాబేలు వేషం కట్టి) కొండల దన్ను తీసుకోడానికీ అవ్వదు. (వరహావతారంలో భూమిని ధరించి దాని కిందున్నా కదా అని పంది వేషం కట్టి) తప్పించుకుపోయి భూమి కిందకి దూరడానికి వీలవదు. (నరసింహావతారం ఎత్తిన వాడివి కదా అని) సింహంలాంటి మగాణ్ణి అన్ని విఱ్ఱవీగడానికీ కుదరదు. (వామనావతారంలో చెయ్యి చాచడం అలవాటే అనుకోకు) దగ్గరకు వస్తే పడదోసేస్తా. ఇక చెయ్యి చాచడానికి కూడా సందు దొరకదు. (త్రివి క్రమావతారం ఎత్తి పెరిగా కదా అని) నా ఎదురుగా పెచ్చు మీరడమూ అలవికాదు. (పరశురామావాతారంలో రాజు లను చంపేసా అనుకోకు) నన్ను దాటి రాజుని హింసించడ మన్నది సాధ్యం కాదు. (రామావతారంలో అడవులకు పోయా కదా అని) అవసరమైతే అరణ్యంల్లో దాక్కుంటా అనుకోకు, గాలించి మరీ పట్టుకుంటా.(బలరామావతారం ఎత్తిన) ప్రబలమైన ఆకారం కలవాడను నేనే అని విఱ్ఱవీగడానికీ వీలుండదు. (బుద్ధావతారం ఎత్తిన వాడిని) పుడమిలో నేనే ప్రబుద్ధుణ్ణి అని బెదిరించి తరిమేద్దాం అనీ (కల్కి అవతారం ఎత్తుతా కదా అని) కపటంతో జయించేస్తా అని గర్వించటమూ వీలుకాదు సుమా. నాతో యుద్ధం చేయడం నీ తరంగాదులే, పో కృష్ణా! పారిపో.

ఇవి చాణూరుడు అంటున్న మాటలు. ఇందులో చాణూరుడు మల్ల యుద్ధ వీరుడు. అందుకు తగిన పౌరుషంతో అంటున్న మాటలే ఇవి. కానీ శ్రీకృష్ణుడి దశావతారాలను పోతన చాకచక్యంగా వివరించాడు. ఈ మూడు సందర్భాలలోనూ శ్రీకృష్ణుని దశావతారాలతో పోలుస్తూ చెప్పిన పద్యాలు ఇవి. సందర్భాలు వేరు, చెప్పిన వారి వయస్సులు వేరు, వర్ణించిన వ్యక్తులు వేరు. ఎవరెవరి స్థాయికి తగ్గట్టుగా, కృష్ణుడితో వారికున్న అనుబంధాలు బంధాలకు తగ్గట్టుగా, చక్కని పదబంధా లతో ఆ సందర్భానికి తగినట్లుగా అన్న పద్యాలు ఇవి. ఈ మూడు పద్యాల్లోనూ ముగ్గురు వ్యక్తులకు సంబం ధించినటువంటి మాటలు ఎంతో సహజంగా, ఔచిత్య వంతంగా ఆయా పాత్రలకు తగినట్లుగా ఉన్నాయి. ఆ పాత్రల వ్యక్తిత్వాలను ప్రతిబింబించే విధంగా ఆ పాత్రల ద్వారా చెప్పించాడు పోతన కవి. ఇలా యశోద, గోపికలు, చాణూరుడు దశమ స్కంధంలో దశావతారాలు స్మరిం చారు.

**ఆధారగ్రంథాలు :**

1) పోతన భాగవతం టీటీడీ ప్రచురణ.
2) పురిపండా వారి వచన భాగవతం.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2(1), February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# వేదాంగాలు - విషయ వివేచన

- డా॥. పి. ఉదయకుమారి, డిప్యూటీ డైరెక్టర్, ప్రచురణ విభాగం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

వేదాలు ముఖ్యంగా ఋగ్, యజుస్, సామ, అధర్వణ విభాగాలుగా ఉన్నాయి. అందులో ఎంతో జ్ఞానం నిగూఢమై ఉంది. మరి ఆ అర్థాన్ని ఎట్లా తెలుసుకోవడం? వేదాన్ని అర్థం చేసుకోవడానికి, వేద రాశి యొక్క అర్థ నిర్ణయం కొరకు మన ఋషులు వాటికి ఎన్నో వివరణ గ్రంథాలను ఇచ్చారు. వీటినే వేదాంగాలు అని అంటారు.

శిక్షా వ్యాకరణంఛందో నిరుక్తం జ్యోతిషం తథా
కల్పశ్చేతి షడంగాని వేదస్యాహుర్మనీషిణః

**ఇవి ఆరు వేదాంగాలు**

1. శిక్షా 2. వ్యాకరణం 3. ఛందస్సు 4. నిరుక్తం 5. జ్యోతిష్యం 6. కల్పం

వేదాలను అవి ప్రతిపాదించిన విషయాలను సమగ్రంగా గ్రహించడానికి ప్రత్యేకంగా శాస్త్ర గ్రంథాల సృష్టి జరిగింది. ఇటువంటి శాస్త్ర గ్రంథాలకే వేదాంగాలు అని పేరు. వైదిక కర్మలను ప్రతిపాదించే సంహిత, బ్రాహ్మణ, అరణ్యక గ్రంథాలను అలాగే బ్రహ్మ విద్యను బోధించే ఉపనిషత్తులను తెలుసుకోవడానికి వేదాంగాలు సహకరిస్తాయి. వేద పురుషునికి శిక్ష ముక్కు, కల్ప సూత్రాలు చేతులు, వ్యాకరణం నోరు, నిరుక్తం చెవులు, ఛందస్సు కాళ్ళు, జ్యోతిషం కళ్ళు

ఋషుల ఆశ్రమాల్లో వేదాలను అధ్యయనం చేయడానికి అధ్యావనం చేయించడానికి వీలుగా ఈ వేదాంగాల సృష్టి జరిగింది. వేదాంగాలను గూర్చిన ప్రసక్తి మనకు గోపథ బ్రాహ్మణం, బౌధాయన ధర్మ సూత్రం, గౌతమ సూత్రం, రామాయణాల్లో కనిపిస్తున్నది.

**శిక్షా :**

మంత్రాలను సరైన రీతిలో ఉచ్చరించడానికి శిక్షా గ్రంథాలు సృష్టించబడ్డాయి. ఉచ్చారణ విధిని శిక్షా గ్రంథాలు బోధిస్తాయి. వేద పఠనానికి స్వరజ్ఞానం చాలా అవసరమైంది. స్వరాలు ఉదాత్త, అనుదాత్త, స్వరితము అని మూడు విధాలు. ఉదాత్త స్వరాన్ని ఉచ్చై స్వరంతో పలుకుతారు. అందుచేతనే పాణిని 'ఉచ్చైరుదాత్తః' అని సూత్రీకరించాడు. అనుదాత్త స్వరాన్ని తక్కువ స్వర స్థాయిలో అంటే మంద్ర స్థాయిలో ఉచ్ఛరిస్తారు. పాణిని 'నీచైరనుదాత్తః' అని సూత్రీకరించాడు. స్వరిత స్వరాన్ని ఉదాత్త అనుదాత్త స్వరాలకు మధ్య స్థాయిలో పలుకుతారు. 'సమాహారః స్వరితః' అని పాణిని సూత్రీకరించాడు. స్వర నియమాన్ని ఇంత శాస్త్రీయంగా నిర్దేశించిన వారు మరొకరు లేరు.

వేద శబ్దాలకు అర్థాలను నిర్ణయించడానికి స్వర నియమం చాలా ముఖ్యమైంది. స్వరం ఉచ్చరించడంలో కొంచెం భేదం కలిగినా కూడా అర్థం మారిపోతుంది. ఈ విషయాన్ని సూచిస్తూ చెప్పబడినది వృత్రాసురుని కథ. 'ఇంద్రశత్రుర్వర్ధస్వ' అనే మంత్రాన్ని అంతోదాత్త స్వరంలో కాకుండా అది ఉదాత్తంగా ఉచ్చరించడం వల్ల ఇంద్రుని యొక్క శత్రువు వర్ధిల్లు గాక అనే షష్టి తత్పురుష సమాసం బదులుగా శత్రువైన ఇంద్రుడు వర్ధిల్లు గాక అనే బహువ్రీహి సమాసం ఏర్పడింది. ఇందువల్ల వృత్రాసురునికే వినాశనం సంభవించిందని ఈ కథ చెప్తున్నది.

శిక్షా శాస్త్రాల సంఖ్యను ఇప్పుడు నిర్ణయించి చెప్పటం కష్టం. మహాభారతం శాంతిపర్వం లోనూ, పాణిని అష్టాధ్యాయి లోనూ గాలవ మహర్షి రాసిన శిక్షా శాస్త్ర ప్రసక్తి ఉన్నది. కానీ అది ఇప్పుడు దొరకడం లేదు. మరొకటి భారద్వాజ శిక్షా శాస్త్రం ప్రస్తుతం లభిస్తున్నది. చారాయణీయ, ఆపిశలి, శౌనకీయ, పాణినీయ శిక్షా శాస్త్రాలు ప్రస్తుతం లభిస్తున్నాయి. శిక్షా శాస్త్ర గ్రంథాలలో పాణినీయ శిక్షా శాస్త్రం ప్రముఖమైంది.

నాలుగు వేదాలకు వేరువేరు శిక్ష శాస్త్ర గ్రంథాలు ఉండేవని తెలుస్తున్నది. సామవేదానికి నారదీయ శిక్ష, గౌతమీ శిక్ష, లోమశీ శిక్షా గ్రంథాలు కనిపిస్తున్నాయి. అథర్వ వేదానికి సంబంధించి మాండుకీ శిక్ష కనిపిస్తున్నది. శుక్ల యజుర్వేదానికి యాజ్ఞవల్క్య శిక్ష, మాండవ్య శిక్ష, వాసిష్ఠీ శిక్షా గ్రంథాలు ఉన్నాయి. కాత్యాయని శిక్ష, పారాశరీ శిక్ష, అమోఘ సందిని శిక్ష, మాధ్యందిన శిక్ష, కేశవీ శిక్ష, సర్వాంకుశ శిక్ష, షోడశ శ్లోకి శిక్ష, ప్రాతిశాఖ్య ప్రదీప శిక్ష, క్రమ సంధాన శిక్ష, గల దృక్ శిక్ష, మనః స్వర శిక్ష వంటి శిక్షా గ్రంథాలు ప్రచురితమైనాయి. ప్రచురణకు నోచుకోని అనేక శిక్షా గ్రంథాలు లిఖిత ప్రతుల రూపంలో గ్రంథాలయాల్లో పడి ఉన్నాయి. శిక్షా గ్రంథాల్లో ఆధునిక మైనవి కూడా ఉన్నాయి. మల్ల శర్మ శిక్ష క్రీస్తుశకం 1724 నాటిదని తేదీ కనిపిస్తున్నది.

శిక్షా శాస్త్రంలో చెప్పబడిన విషయాలు ఆరు ప్రధానంగా కనిపిస్తున్నాయి. అవి వర్ణ, స్వర, మాత్ర, బల, సామ, సంతాన అనేవి. వర్ణాలు అంటే అక్షరాలు. స్వరాలు ఉదాత్త, అనుదాత్త, స్వరితములు. మాత్రలు అంటే స్వర ఉచ్చారణకు పట్టే కాలం. బల అంటే స్వరాన్ని ఉచ్చరించే సమయంలో గాలి నోటిలో ఏ స్థానానికి తగిలి బయటకు వస్తుందో ఆ స్థానం అంటే స్వరాన్ని ఉచ్చరించ డానికి చేసే ప్రయత్నం. దీనినే మనం భాషాశాస్త్రంలో ప్రయత్నం అంటాం. మంత్రాన్ని దోష రహితంగా మధురంగా ఉచ్చ రించడం సామం. రెండు వేరు వేరు పదాలు వేగంగా సంధి రూపంలో ఉచ్చరింపబడడం సంతానం.

శిక్షా గ్రంథాల పరిశీలన వలన ఆనాటి ఋషులు భాషా శాస్త్ర సంబంధ విషయాలను కూడా ఎంత శాస్త్రీయ పద్ధతిలో ఆలోచించారనే విషయం మనకు అర్థమవు తుంది. వేల ఏళ్ళు గడిచినప్పటికీ, దేశంలోని ఏ ప్రాంతంలో నైనా వేదమంత్రాల ఉచ్చారణ మార్పు చెందకుండా ఉండడానికి కారణం శిక్షా గ్రంథాలే.

శిక్షా గ్రంథాలకు అంగ రూపంగా ప్రాతిశాఖ్య గ్రంథాలు ఏర్పడ్డాయి. ఉచ్చారణ, స్వర విధానం, సంధి విధానం, హ్రస్వ దీర్ఘ విధానాలను ప్రాతిశాఖ్య గ్రంథాలు పేర్కొం టున్నాయి.

**వ్యాకరణం :**

వేదాంగాలలో ఒకటైన వ్యాకరణం మొదట శబ్దాల వ్యుత్పత్తిని వివరించేది. తర్వాత పద స్వరూపాన్ని వివరిస్తూ అర్థ నిర్ణయాన్ని కూడా చేస్తున్నది. వేదమంత్రాల్లోని శబ్దాల యొక్క అర్థాన్ని బోధించడమే కాకుండా ఆ శబ్దాలు కాలగర్భంలో కలిసిపోకుండా వ్యాకరణం రక్షించిందని చెప్పడం సమంజసం. ఋగ్వేదంలో వ్యాకరణ శాస్త్ర ప్రశంస కనిపిస్తున్నది.

చత్వారి శృంగా త్రయో అస్య పాదా
ద్వే శీర్షే సప్తహస్తా సో అస్య
త్రిధా బద్ధో వృషభో రోరవీతి
మహా దేవో మర్త్య ఆవివేశ 4-58-6

నామ, ఆఖ్యాత, ఉపసర్గ, నిపాతము లనే నాలుగు కొమ్ములు, వర్తమాన భూత భవిష్యత్తులు అనే మూడు పాదాలు, సుబంత, తింగంతములనే రెండు శిరస్సులు, ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ, షష్టి, సప్తమము లనే విభక్తులు ఏడు చేతులుగా కలిగిన వృషభం వ్యాకరణం. ఈ వ్యాకరణం అనే వృషభము ఉరస్సు, కంఠం, శిరస్సు స్థానాల్లో బంధింపబడి ఉంది.

వరరుచి పండితుడు వ్యాకరణానికి ఐదు ప్రయోజనా లను చెప్పాడు. వ్యాకరణానికి పతంజలి రక్ష, ఊహ, ఆగమ, లఘు, అసందేహ, అపభాషణ, దుష్టశబ్ద, అర్థజ్ఞాన, ధర్మలాభ, నామకరణములనే 13 ప్రయోజనాలను వివరిం చాడు.

వైదిక శబ్దాల వ్యుత్పత్తి, అర్థ వివేచన చేసిన ప్రాతి శాఖ్య గ్రంథాలు వ్యాకరణ గ్రంథాలకు తొలి రూపాలని చెప్పవచ్చు. గోపథ బ్రాహ్మణం వ్యాకరణ సంబంధమైన ధాతు, ప్రాతిపదిక, నామ, ఆఖ్యాత, లింగ, వచన, విభక్తి వంటి అనేక పారిభాషిక పదాలను పేర్కొంటున్నది. దీన్ని బట్టి గోపథ బ్రాహ్మణం నాటికే వ్యాకరణం వికసిస్తుందని ఊహించవచ్చు.

ప్రస్తుతం లభిస్తున్న వ్యాకరణ గ్రంథాల్లో పాణిని రచించిన అష్టాధ్యాయియే ప్రాచీనమైంది. పాణిని స్వయంగా పేర్కొన్న ఐంద్ర వ్యాకరణం నేడు లభించడం లేదు. బోప దేవుడు తాను రచించిన కవి కల్పద్రుమ గ్రంథంలో సంస్కృత వ్యాకరణ సంప్రదాయంలో ఐంద్ర వ్యాకరణానికి ప్రథమ స్థానాన్ని ఇచ్చాడు. తమిళ్ వ్యాకరణం తొల్కాప్పియం కూడా ఐంద్ర వ్యాకరణాన్ని ఆదర్శంగా గ్రహించి రాసిందని డాక్టర్ బర్నల్ అభిప్రాయం.

పాణినికి పూర్వం చాలామంది వ్యాకరణ కారులు ఉన్నారు. పాణిని స్వయంగా 19 మంది వ్యాకరణ కారులను పేర్కొన్నాడు. సంస్కృత భాషను శాస్త్రీయమైన పద్ధతిలో వ్యాకరించిన ఘనత పాణినికి దక్కుతుంది. పాణిని తర్వాత వ్యాకరణ శాస్త్ర అధ్యయనం విశేష ప్రచారంలో ఉండేది. పతంజలి రచించిన మహాభాష్యం, భర్తృహరి రచించిన వాక్యపదీయం, సింహళ దేశీయుడు అయిన బౌద్ధ భిక్షువు ధర్మకీర్తి రచించిన రూపావతారమనే వ్యాకరణ గ్రంథాలు ప్రముఖమైనవి. ఇవి కాక లెక్కకు మిక్కుటంగా వ్యాకరణ గ్రంథాలు వెలువడి ఉన్నాయి.

**ఛందస్సు :**

వేదాల విశుద్ధమైన, లయబద్ధమైన ఉచ్చారణకు, పాఠానికి ఛందస్సు చాలా అవసరం. ఇది లేకుండా మంత్రాల ఫలితం లభించదని ప్రాచీనుల విశ్వాసం. ఛందః శబ్దానికి రుచికరమైంది, శ్రుతి పేయమైంది, లయ బద్ధమైంది, ఆహ్లాదమైంది అనేక అర్థాలు ఉన్నాయి. అసుర సంబంధమైన అనేక విఘ్నాల నుంచి వేదాన్ని రక్షించే కవచం వంటిది ఛందస్సు అని ప్రాచీనుల విశ్వాసం. నిరుక్త కారుడైన యాస్కుడు కూడా ఈ అర్థాన్ని గ్రహించాడు.

వేదాలు అధికభాగం ఛందోమయంగానే ఉన్నాయి. కృష్ణ యజుర్వేదం అధర్వవేదంలో కొన్ని భాగాలు గద్యనిబద్ధాలుగా కనిపిస్తున్నాయి. ఇవి కాకుండా మిగిలిన వైదిక సంహితల భాగాలన్నీ ఛందోబద్ధాలే.

వైదిక ఛందస్సులు అక్షరం మీద ఆధారపడినవి. వాటిలో అక్షరాల గురు లఘువులు ఒక క్రమం గాని, నియమం కానీ లేవు. అలాగే పాద నియమం కూడా కనిపించదు. గాయత్రి, ఉష్ణిక్ ఛందస్సులకు మూడు పాదాలు ఉన్నాయి. పంక్తి అనే ఛందస్సుకు ఐదు పాదాలు ఉన్నాయి. వైదిక ఛందస్సు లోని ప్రధానమైన వాటిలో వర్ణాల సంఖ్య కూడా అనేక విధాలుగా కనిపిస్తున్నది. వివిధ ఛందస్సులకు వర్ణ నియమం చెప్పబడి ఉన్న ప్పటికీ ఒక అక్షరం ఎక్కువగాని లేదా తక్కువ గాని ఉం డడం కనిపిస్తుంది. అక్షరం తక్కువగా ఉంటే నిచృత్ అని, ఎక్కువగా ఉంటే భురిక్ అని అంటారు.

శాస్త్రాలు అన్నింటికీ శివుడు ప్రథమ ప్రవర్తకుడు అయినట్లుగానే ఛందస్ శాస్త్రానికి కూడా ఆయనే ప్రథమ ప్రవర్తకుడు. శివుని దగ్గర నుండి బృహస్పతి, బృహస్పతి నుండి దుశ్చవనుడు, అతని నుండి ఇంద్రుడు, ఇంద్రుని నుండి మాండవ్యుడు ఈ శాస్త్రాన్ని గ్రహించారు.

ఇప్పుడు లభించే ఛందస్ శాస్త్ర విషయమైన గ్రంథాల్లో ఋక్ ప్రాతిశాఖ్యమే ప్రాచీనమైంది. అయితే వ్యాకరణాన్ని ప్రధానంగా చర్చించిన ఈ గ్రంథం చివరలో ఛందస్సును కూడా కొంత అసమగ్రంగా నైనా చర్చించింది. ఛందస్సును సమగ్రంగా చర్చించిన మొట్టమొదటి గ్రంథం పింగళుని ఛందస్ శాస్త్రం. ఇది సూత్ర రూపంలో రాసిన 8 అధ్యాయాల గ్రంథం. మొదటి నాలుగు అధ్యాయాలలో వైదిక ఛందస్సులు తర్వాత లౌకిక ఛందస్సులు వివరింప బడినాయి.

కాళిదాసు పేరుతో వృత్త రత్నావళి, శ్రుతబోధ అని గంథాలు కనిపిస్తున్నాయి. అయితే వీటి రచయిత కవి కాళిదాసు కాకపోవచ్చు. వరాహమిహిరుడు రాసిన జ్యోతిష సంబంధమైన బృహత్సంహితలో ఒక అధ్యాయంలో ఛందస్సులను గురించి చర్చించాడు. క్రీస్తు శకం ఏడవ శతాబ్దికి చెందిన జనాశ్రయుడు రాసిన ఛందోవిచితి, 11వ శతాబ్దికి చెందిన క్షేమేంద్రుడు రాసిన సువృత్త తిలకం, క్రీస్తు శకం 15వ శతాబ్దికి చెందిన కేదార భట్టు రాసిన

వృత్త రత్నాకరం, 16వ శతాబ్దికి చెందిన దుర్గా దాసు రచించిన ఛందో మంజరి, దామోదర మిశ్ర రచించిన వేణీ భూషణం, దుఃఖ భంజనుడు రాసిన వాగ్వల్లభ మొదలైన ఛందో గ్రంథాలు ఉన్నాయి. ఇంకా ప్రచురణకు నోచుకోని అనేక గ్రంథాలు కూడా హస్త లిఖిత ప్రతుల రూపంలో పడి ఉన్నాయి.

**నిరుక్తం :**

వేదార్థాన్ని తెలుసుకోవడానికి నిరుక్తం అత్యంత ఆవశ్యకమైన అంగం. నిరుక్తం అంటే వ్యుత్పత్తి అని అర్థం. శబ్ద వ్యుత్పత్తిని చెప్పడం నిరుక్త శాస్త్ర ప్రయోజనం. నిరుక్తం కేవలం వేద శబ్దాలను వివరించడానికి పుట్టింది. అయితే నిరుక్త కారునికి వ్యాకరణ శాస్త్ర పరిజ్ఞానం చాలా అవసరం. నిరుక్తం నిఘంటువుకు టీక వంటిదని చెప్పవచ్చు. మొదట నిఘంటు గ్రంథాలు పుట్టాయి. నిఘంటువులు పూర్వ కాలంలో చాలా ఉన్నప్పటికీ ప్రస్తుతం ఒక్క నిఘంటువు మాత్రమే మిగిలింది. దానిని కశ్యపుడు కూర్చాడని మహాభారతం చెబుతున్నది. ఈ నిఘంటువుకు యాస్కుడు రాసిన నిరుక్తమే మనకు ఇప్పుడు లభిస్తున్నది.

నిరుక్త గ్రంథాలు కూడా పూర్వం చాలా ఉండేవి. దుర్గా చార్యుని ప్రకారం 14 నిరుక్త గ్రంథాలు ఉన్నాయి. అయితే అవేవీ ఇప్పుడు లభించడం లేదు. యాస్కుడు 12 మంది నిరుక్త కారులను పేర్కొన్నాడు. ఈ నిరుక్త కారుల గ్రంథాలేవి మనకు దొరకలేదు. యాస్కుడు రచించిన నిరుక్తం ఒక్కటే ప్రస్తుతం నిరుక్త శాస్త్రానికి ప్రతినిధిగా లభిస్తున్నది.

యాస్కుడు రాసిన నిరుక్తంలో 12 అధ్యాయాలు ఉన్నాయి. ఇది కాకుండా చివర రెండు పరిశిష్ట రూపమైన అధ్యాయాలు ఉన్నాయి. అంటే మొత్తంగా నిరుక్తంలో 14 అధ్యాయాలు ఉన్నాయి. అయితే యాస్కుడు 12 అధ్యాయాలకు మాత్రమే కర్త అని సాయణాచార్యుల అభిప్రాయం. యాస్కుడు పాణిని కంటే ప్రాచీనుడు.

నిరుక్తం నిఘంటువుకు టీకా రూపం అయినప్పటికీ రానురాను నిరుక్తం కూడా అర్థం కావడం కష్టమైంది. ఇందువల్ల క్రీస్తు పూర్వం నుండే నిరుక్తానికి భాష్యాలు రాయడం ప్రారంభమైంది. ఇటువంటి అనేక భాష్యాలు వెలువడి ఉండొచ్చు. పతంజలి మహర్షి కూడా ఇటు వంటి ఒక భాష్యాన్ని పేర్కొన్నాడు. అయితే ప్రస్తుతం దుర్గాచార్యుడు రాసిన వృత్తి ఒక్కటే లభిస్తున్నది. నిరుక్తానికి దుర్గాచార్యుని వ్యాఖ్య లేకపోతే ఈనాడు నిరుక్తాన్ని అర్థం చేసుకోవడం చాలా కష్టంగా ఉండేది.

నిరుక్తంలో ప్రతిపాదించిన సిద్ధాంతాలను వివరించే మరొక గ్రంథం నిరుక్త సముచ్చయం. దీనిని వరరుచి రాశాడని అంటారు. నిరుక్త సముచ్చయం ఆధారంగానే మధ్యయుగాల్లో ఆచార్యులు వేదమంత్రాల కు వ్యాఖ్యానాలు చేయగలిగారు. వేదాధ్యయనానికి ఇవి చాలా మహత్వ పూర్ణమైన గ్రంథాలు.

**జ్యోతిషం :**

వేద పఠనానికి జ్యోతిషం కూడా అత్యంత ఆవశ్యక మైంది. పవిత్రమైన యజ్ఞయాగాదులను ఆరంభించి, సమాప్తి చేసే ముహూర్తాలను నిర్ణయించడం కొరకు జ్యోతిష సహాయం అవసరమైంది. వేదాంగాల్లో జ్యోతిషం అగ్ర స్థానాన్ని కలిగి ఉందని చెప్పబడింది. కాల నియమాన్ని పాటించడానికి కాలాన్ని గణించటం చాలా ముఖ్యం. నక్షత్రాలు, గ్రహాల గతులు, భూభ్రమణం మొదలైన వాటిని ప్రాచీనులు శాస్త్రీయమైన పద్ధతిలో అధ్యయనం చేశారు. జ్యోతిషాన్ని అభ్యసిస్తేనే యజ్ఞ యాగాదుల సంపూర్ణ జ్ఞానం కలుగుతుందని ప్రాచీనుల విశ్వాసం.

వేదాంగ జ్యోతిషం గ్రంథానికి రెండు విభిన్నమైన పాఠ ప్రతులు దొరుకుతున్నాయి. ఒకటి ఋగ్వేద జ్యోతిషం. ఇందులో 44 శ్లోకాలున్నాయి. రెండవది యజుర్వేద జ్యోతిషం ఇందులో 36 శ్లోకాలున్నాయి. రెండు గ్రంథాల లోనూ శ్లోకాలు చాలా మటుకు సమానంగానే ఉన్నాయి. ఈ రెండు గ్రంథాలు ఏదో ఒక బృహత్ గ్రంథం నుండి ఏర్పడిన అవశిష్ట రూపాలని పండితులు భావిస్తున్నారు.

వేదాంగ జ్యోతిష్య గ్రంథాన్ని బట్టి దాని రచయిత లగధుడు అని తెలుస్తుంది. ఈ పేరు సంస్కృతం లోనిది లాగా లేకపోవడం వల్ల ఇతడు విదేశీయుడని కొందరు భావించారు. ఈ గ్రంథం లోని మొదటి శ్లోకంలో ఉన్న శుచి అన్న శబ్దాన్ని బట్టి అదే రచయిత పేరని కొందరు నిర్ణయించారు. అయితే ఈ వాదం సరైంది కాదని ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. ఈ గ్రంథంలో చెప్పబడిన అక్షాంశాలను బట్టి చూస్తే ఈ రచయిత కాశ్మీర్ ప్రాంతం లేదా గాంధార ప్రాంతం అంటే నేటి అఫ్ఘనిస్తాన్ ప్రాంతం వాడు కానీ అయి ఉండవచ్చని పండిత విమర్శకుల అభిప్రాయం.

వేదాంగ జ్యోతిష జ్ఞానం మొట్టమొదట బ్రహ్మకు లభించిందని దాన్ని ఆయన తన కుమారుడైన వశిష్టునికి బోధించాడని చెప్పబడింది. మరొక కథను బట్టి విష్ణువు సూర్యునికి జ్యోతిష జ్ఞానాన్ని ఇచ్చాడు. సూర్యుడు శాపగ్రస్తుడై యవన జాతిలో జన్మించి రోమక సిద్ధాంతాన్ని నిర్మించాడని ఒక కథ ఉంది.

అనంతరకాలంలో బాగా అభివృద్ధి చెందిన జ్యోతిష శాస్త్రానికి మూలం మాత్రం వేదాంగ జ్యోతిష గ్రంథమే. జ్యోతిష శాస్త్రం సంహిత, గణిత, జాతక విభాగాలుగా వికసించింది. ఆర్యభట, వరాహమిహిర, బ్రహ్మ గుప్త, భాస్కరాచార్య వంటి వారు జ్యోతిష శాస్త్ర వికాసానికి చాలా కృషి చేశారు.

### కల్పం :

వేదాంగ సాహిత్యంలో కల్పసూత్ర గ్రంథాలకు ప్రముఖ స్థానం ఉంది. ఈ గ్రంథాలను అత్యంత పురాతనమైన గ్రంథాలుగా పేర్కొంటున్నారు. బ్రాహ్మణ గ్రంథాల్లో యజ్ఞయాగాదుల వివరణ చాలా విస్తృతంగానూ, ప్రౌఢంగాను ఉంది. కాలక్రమంలో వీటిని అర్థం చేసు కోవడం చాలా కఠినంగా మారింది. ఈ సమస్య పరిష్కారం కోసం వ్రాయబడినవి కల్పసూత్ర గ్రంథాలు. వేద విహితమైన కర్మలను క్రమబద్ధంగా వ్యవస్థీకృత రూపంలో కల్పన చేసే గ్రంథాలు కల్ప సూత్రాలని అర్థం.

యజ్ఞయాగాదులు, వివాహము, ఉపనయనం వంటి కర్మలకు సంబంధించిన నియమాలను అవసరమైన మంత్రాలతో బాటుగా కల్పసూత్ర గ్రంథాలు ప్రతి పాదిస్తున్నాయి. ఇది సూత్రాల రూపంలో ఉండడం వల్ల విస్తారమైన వేద విధులను కంఠస్థం చేయడం సులభ మైంది. తక్కువ శబ్దాల్లో ఎక్కువ అర్థాన్ని బోధించడమే సూత్రానికి ఉన్న ప్రయోజనం. సూత్ర పద్ధతిలో విషయాన్ని చెప్పడం ప్రపంచంలోనే ఒక విశిష్టమైన పద్ధతి. ఇటువంటి ఘనతను భారతీయులు ప్రాచీన కాలంలోనే సాధించారు.

భాషా దృష్టితో చూసి నట్లయితే కల్ప సూత్రాల్లో ఉన్న భాష వైదిక భాష కంటే విభిన్నంగా ఉంటుంది. భాష, శైలి, ఆలోచనా విధానం వీటన్నింటిని బట్టి పరిశీలిస్తే కల్ప సూత్ర గ్రంథాలు ఒక విశిష్టమైన స్థానాన్ని కలిగి ఉన్నాయి.

కల్ప సూత్ర గ్రంథాలను నాలుగు విభాగాలుగా చెప్పారు. అవి శ్రౌత సూత్రాలు, గృహ్య సూత్రాలు, ధర్మ సూత్రాలు, శుల్వ సూత్రాలు.

### శ్రౌత సూత్రాలు :

బ్రాహ్మణ గ్రంథాల్లో చెప్పిన కర్మకాండల సారాంశాన్ని శ్రౌత సూత్రాల్లో చెప్పారు. వేదాలు ప్రతిపాదించిన 14 యజ్ఞాలను ఇవి వివరిస్తున్నాయి. ఋగ్వేదానికి సంబంధించి ఆశ్వలాయన, శాంఖాయన అనే రెండు శ్రౌత సూత్ర గ్రంథాలు ఉన్నాయి. శుక్ల యజుర్వేదానికి సంబంధించి కాత్యాయన శ్రౌత సూత్రం కనిపిస్తుంది. కృష్ణ యజుర్వేదానికి సంబంధించి ఆరు శ్రౌత సూత్ర గ్రంథాలు కనిపిస్తున్నాయి. సామవేదానికి సంబంధించి మశక కల్పసూత్రం ఉన్నది. అథర్వ వేదానికి వైతాన శ్రౌత సూత్రం ఉంది.

### గృహ్య సూత్రాలు :

గృహస్థుల జీవనానికి సంబంధించిన నియమాలను గృహ్య సూత్రాలు వివరిస్తున్నాయి. గర్భాదానం మొదలు కొని అంత్యక్రియల వరకు గల గృహస్థ జీవనానికి

సంబంధించిన కర్మలు, విధి విధానాలు వీటిలో వివరించారు. ఏడు విధాలైన గృహ యజ్ఞాలను వివరించారు. అవి పితృ, పార్వణ, అష్టిక, శ్రావణి, ఆశ్వాయుజ, ఆగ్రహాయణేయ, చైత్రీ యజ్ఞాలు. ఇవే కాకుండా గృహస్థులు నిర్వర్తించవలసిన దేవ, భూత, పితృ, మహా, మనుష్య అనే పంచ మహా యజ్ఞాలు కూడా గృహ్య సూత్రాలు వివరిస్తున్నాయి. అంతేకాకుండా వీటిలో గృహ నిర్మాణం, గృహప్రవేశం, ప్రయాణ ముహూర్తాలు మొదలైన గృహస్థులు అవసరమైన విషయాలు ఎన్నో వివరించబడి ఉన్నాయి. శ్రౌత సూత్రాలను అనుసరిస్తూ గృహ్య సూత్రాలు కూడా చెప్పబడ్డాయి.

**ధర్మ సూత్రాలు :**

నాలుగు విధాలైన వర్ణాశ్రమ ధర్మాలు ఇందులో వివరింపబడిన ఉన్నాయి. రాజులు పాటించాల్సిన కర్తవ్యాలను కూడా ధర్మ సూత్రాలు వివరిస్తున్నాయి. శ్రౌత సూత్రాలను అనుసరించి గృహ్య సూత్రాలు, గృహ్య సూత్రాలను అనుసరించి ధర్మ సూత్రాలు ఉంటాయి. ధర్మ సూత్రాలు చాలా మటుకు ప్రస్తుతం లభించడం లేదు. ఆశ్వలాయన, శాంఖాయన, మానవ ధర్మ సూత్రాల పేర్లు వినపడుతున్నాయి కానీ అవి లభించడంలేదు. మానవ ధర్మ సూత్రాలు ఆధారంగానే మనుస్మృతి రాయబడింది. వేరు వేరు వేద శాఖలకు వేరు వేరు ధర్మశాస్త్ర గ్రంథాలు ఉండేవని కుమారిలభట్టు చెప్పి ఉన్నాడు. అవి నేడు లభించడం లేదు. బౌధాయన, గౌతమ, అపస్తంబ, హిరణ్యకేశి, విష్ణు, వశిష్ఠ ధర్మ సూత్ర గ్రంథాలు ప్రముఖ ధర్మసూత్ర గ్రంథాలుగా కనిపిస్తున్నాయి.

**శుల్వ సూత్రాలు :**

యజ్ఞవాటికల నిర్మాణ పద్ధతుల్ని ఈ సూత్రాలు వివరిస్తున్నాయి. ప్రాచీన భారతీయులు జ్యామితి విద్యలో సాధించిన విజయాలను శుల్వ సూత్రాలు వివరిస్తున్నాయి. ఒక్కొక్క శాఖకు ప్రత్యేకంగా శ్రౌత, గృహ్య, ధర్మ సూత్రాల మాదిరిగానే శుల్వ సూత్రాలు కూడా ఉన్నాయి. అయితే వైదిక కర్మకాండకు సంబంధించిన శుల్వ సూత్రాలు యజుర్వేద శాఖలకు సంబంధించినవి మాత్రమే ఇప్పుడు లభిస్తున్నాయి. శుక్ల యజుర్వేదానికి కాత్యాయన శుల్వ సూత్రం ఒక్కటే లభిస్తుంది. కృష్ణ యజుర్వేదానికి 6 శుల్వ సూత్రాలు లభిస్తున్నాయి. ఈ విధంగా వేదకారులు మనకు అద్భుతమైన విజ్ఞానాన్ని అందించారనడంలో ఎటువంటి సందేహం లేదు.

**ఆధార గ్రంథాలు :**

1. వేద వేదాంగ చంద్రిక, కర్త - చివుకుల అప్పయ్య శాస్త్రి, సంపాదకుడు - నీలా రాజయ్య గుప్త, చందా నారాయణ శ్రేష్ఠి, పబ్లిషర్స్, బుక్ సెల్లర్స్, జనరల్ బజార్, సికింద్రాబాద్ - 1934.
2. సంస్కృత వాఙ్మయ చరిత్ర, మొదటి సంపుటం, వైదిక వాఙ్మయం, మల్లాది సూర్యనారాయణ శాస్త్రి, ఆంధ్ర సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్డు - హైదరాబాద్, ప్రథమ ముద్రణ 1986.
3. సంస్కృత సాహిత్య చరిత్ర, ముదిగంటి గోపాలరెడ్డి, ముదిగంటి సుజాత రెడ్డి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, ప్రథమ ముద్రణ 1997.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2(1), February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# "ఈ కోతి ఈ డ్రామాకు పనికొస్తుందా?" చూద్దాం రండి

- డా. గుండ్లూరు వెంకట రమణ, తెలుగు ఉపన్యాసకులు, S.Ch.V.P.M.R. ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
గణపవరం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

'ఈ కోతి ఈ డ్రామాకు పనికొస్తుందా?' అనే ఈ అసంబద్ధ నాటికను నాయని కృష్ణమూర్తి గారు రాశారు. నాటికలోని అంశాలను చర్చించడానికంటే ముందుగా నాటకకర్త గురించి అయితే సాహిత్య లోకానికంతటికీ ఆయన సుపరిచితులు కాబట్టి ప్రత్యేకించి ఆయనను పరిచయం చేయాల్సిన పనిలేదు. అయితే ఆయనతో నాకున్న పరిచయాన్ని గురించి ఒకటి రెండు మాటలు ఖచ్చితంగా చెప్పాలి. నాకు మా గురువు ఆచార్య తుమ్మల రామకృష్ణ గారి ప్రమేయం వల్ల కృష్ణమూర్తి గారితో పరిచయం ఏర్పడింది. పరిచయమయ్యాక ఒకటి రెండు సార్లు కలవడం, వారితో అప్పుడప్పుడూ ఫోన్లో మాట్లాడు తుండటం వల్ల సాహిత్య సంబంధమైన స్నేహం ఏర్పడింది.

నాకు తెలిసినంతలో కృష్ణమూర్తి గారు మంచి స్నేహశీలి. నిగర్వి. వయోభేదం లేకుండా ఎవరితోనైనా కలిసిపోతారు. వారికున్న క్రమశిక్షణ, సమయాన్ని పాటించడం చూస్తే మనం నోరెళ్ళబెట్టాల్సిందే. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మహా మనిషి. ఆధునిక ఋషి, నేటి యువతకు ఆదర్శమూర్తి కృష్ణమూర్తి. ఓ ప్రాక్టికల్ లైఫ్‌కి, ఓ విజయానికి, ఓ ఐక్యతకు చిరునామా కృష్ణమూర్తి గారు. ఆయనో చిత్రమయిన మనిషి. ఆయన ఫోటోల్లో కొన్ని వెనక్కు నిల్చుని తీసుకున్నవి ఆయన పుస్తకాలకున్న వెనుక కవరు పేజీపై మనం చూడచ్చు. తెల్లని గడ్డం అంతే తెల్లని పల్చని బట్టలు, చేతిలో తెల్లని సిగరెట్టు, తెల్లని మనసు వెరసి కృష్ణమూర్తిగారి రూపు.

ఓసారి మా గురువుగారు, నేను హైదరాబాదు నుంచి ట్రైన్లో కలికిరికి వస్తున్నామని మా సార్ ఆయనకు ఫోన్ చేసి చెప్పిన వెంటనే ఆయన కారును పంపారు. మా గురువు గారితో ఆయనకున్న స్నేహ సంబంధం ఎంత గట్టిదో అప్పుడర్థమైంది నాకు. వాళ్ళింట్లో భోజనం చేయడం, ప్రెస్సును, దాంట్లోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో వచ్చిన కొత్త కొత్త మిషన్లను చూడడం, ఆయన వ్యక్తిగతంగా, ఏకాంతంగా గడపడానికి కట్టించుకున్న గుండ్రని ఇంట్లో రెండు రోజులుండటం, వారితో ఒకటి రెండు ఫోటోలు తీసుకోవడం, వారు రాసిన పుస్తకాలివ్వడం మొదలైనవి మరచిపోలేని జ్ఞాపకాలు.

కృష్ణమూర్తి గారు రామాయణ, మహాభాగవతాల్ని తెలుగులోకి అనువదించి సులభశైలిలో పాఠకలోకాని కందించారు. అలాగే రెండు కథా సంపుటాలు, మూడు నవలలు, రెండు నాటికలు వెలువరించారు. ఈ మధ్యనే ఏంలేదంటూనే 'ఏంలేదు' అనే కథల సంపుటిని అందించారు. 'ఈ కోతి ఈ డ్రామాకు పనికొస్తుందా?' అనే అసంబద్ధ నాటికను రాశారు. ఈ నాటికను స్థూలంగా పరిచయం చేయాలనే కాంక్షతోనే ఈ నాలుగు మాటలూ.

ఈ నాటికలో రచయిత టైటిల్ దగ్గర నుంచి చివరి పేజీలో అంకితం వరకూ కూడా ఒక కొత్త పద్ధతిని పాటించినట్లు తెలుస్తుంది. ఈ కోతి ఈ డ్రామాకు పనికొస్తుందా అనేది ఒక విచిత్రమైన టైటిల్. అసలు కోతులే కదా డ్రామాకు పనికొచ్చేది. ప్రత్యేకించి 'ఈ కోతి ఈ డ్రామాకు పనికొస్తుందా?' అని అనడం వెనుక, అదొక ప్రత్యేకమైన డ్రామా అనీ, దానికి అలాంటి కోతినే కావాలని తెలుస్తుంది. ఇదొక సంకేతాత్మకమైన, ప్రతీకాత్మకమైన నాటిక. ఆధునిక సమాజంలోని ప్రతి మనిషీ ఒక కోతిలాగా డ్రామా ఆడతాడని చెప్పకనే చెబుతోంది నాటిక.

ఈ నాటిక లోని ఇతివృత్తం ఒక మేధావి (రచయిత, కవి, దర్శకుడు) అవకాశవాది చేత అక్రమాలు చేయించి, కిరీటి చేతిలోకి అధికారాన్ని ఇప్పించి, వెర్రిబాగుల

వీరయ్య అనే ప్రజలచేత విప్లవం, ఉద్యమాలు చేయించి, చివరికి ఎవరి అవకాశాలు వారు దక్కించుకొని, ఇదే అవకాశ వాదమని చెప్పి ప్రజాస్వామ్యాన్ని మరింత బంధించడమే.

రచయిత ఈ నాటిక మొదట్లోనే నాటిక వెనుక కథను స్థూలంగా చెప్పారు. సమాజంలోని బాధ్యతాయుతమైన ఒకు టీచరు తన విధుల్ని మరిచిపోయి రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతూ, చివరికి రచయిత పరోక్ష ప్రమేయం వల్ల M.L.O. అయ్యి పబ్బం గడుపుకుంటాడు. అదే టీచరు పలికిన "ఎప్పుడైనా ఈ కోతి వాళ్ల డ్రామాకు పనికొస్తుందనే" మాటే ఈ నాటిక రాయడానికి నేపథ్యం అయ్యిందని రచయిత పేర్కొన్నారు. ఈ నాటిక రచనా కాలం 1995.

ఈ నాటికలోని పాత్రలు ఐదంటే ఐదే. బహుశా మన చేతికున్న ఐదువేళ్ళకు (హస్తం) సంకేతం కావచ్చు. ఈ నాటికలోని పాత్రల పేర్లు అవకాశవాది, మేధావి, కిరీటి, వెర్రిబాగుల వీరయ్య, స్త్రీ. ఈ నాటికలో పాత్రలుగా ఈనాటి సమాజానికి సరిగ్గా సరిపడే విచిత్రమైన, వాస్తవికమైన పేర్లను అలాగే వాడుకున్నారు రచయిత. ఈ నాటిక చదువుతుంటే నాకు జాన్ బయ్యన్ రాసిన 'యాత్రికుని ప్రయాణం' గుర్తుకొస్తుంది. అందులోని పాత్రల పేర్లు కూడా చాలా విచిత్రంగా ఉంటాయి.. మెలకువ, మూర్ఖుడు, సువార్తికుడు, విశ్వాసి లాంటి పేర్లు 'యాత్రికుని ప్రయాణం' (The piligrim's progress) అనే నాటకంలో చూడవచ్చు.

అవకాశవాది మేధావి సలహాతో కిరీటిని చంపి పదవి చేపడతాడు. కిరీటి మేధావికి ఒక పదవినిస్తే అతను పెదవి విప్పడు. కట్లుకట్టుకొన్న వెర్రిబాగుల వీరయ్య ప్రజలకు సంకేతం. అతని కట్లు విప్పితే 'విప్లవం వర్ధిల్లాలి' అంటాడు. అందరూ అవకాశవాదులే. ప్రజాస్వామ్య ముసుగులో ఎవరి అవకాశాలు వాళ్ళు పొంది ప్రజల్ని పిచ్చోళ్లని చేస్తున్నారు. కుహనా రాజకీయ నాయకులు, ఆశలకు, ప్రలోభాలకు లొంగిపోయే మేధావులు, నోర్లు లేని ప్రజలు. పంజరంలో బంధింపబడిన స్త్రీలు, స్వార్థ పూరిత మనుషులు, కుళ్ళికంపుకొడుతున్న మనుషులు, విలువలులేని టీచర్లు, పనికిరాని సిలబస్సు, సంస్కారం నేర్పని చదువులు... ఇలాంటి అనేక సామాజి కాంశాల్ని ఆయన ఈ నాటికలో చర్చించారు.

ఈ నాటిక అంకితం కూడా చిత్రమే చూడండి.

"నిజంగానే
మనమంతా
ప్రజాస్వామ్యయుతంగా
జీవస్తున్నామని
భ్రమపడుతున్న
గొఱ్ఱెల్లాంటి
భారతీయ
సోదర సోదరీ మణులకు"

♦♦♦♦♦

అంతా
అసంబద్ధమని తెలిసీ
నిర్లిప్తంగా ఉండే
జ్ఞానులకు -
నాటకాలాడుతూ
పబ్బం గడుపుకొనే
మేధావులకు -
????????

రచయిత ఈ నాటిక చివర్లో పైన రాసిన వాక్యాలు అక్షరసత్యాలు. అందుకే ముందు పేజీల్లో ఉండాల్సిన అంకితాన్ని చివర్లో ఇచ్చారు.

అవును నిజంగానే ఈ కోతి ఈ డ్రామాకు పనికొచ్చిం దేమో. మా గురువు గారెప్పుడూ విద్యార్థులమైన మాతో ఒక మాట అంటుంటారు. "మీ రెవ్వరూ నా దగ్గర నటించద్దు. నేను మీ అందరికన్న గొప్ప నటుణ్ణి" అని. ఈ నాటిక చదివిన తర్వాత ఆ మాటలు నిజమేనేమో అనిపించాయి. ఎందుకంటే మనమంతా ఏదో ఒక 'రంగ'స్థలంపై నటులమే కదా !

డామిట్ కథ ముగిసింది. ★

BHAVAVEENA
Vol. 19, Issue. 2(1), February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# మాతృదేవో భవ

- డా॥. దేవినేని జ్యోతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

విశ్వమయుడు, విశ్వధరుడు, వేదాంతవేద్యుడు, సకల ప్రాణి సంరక్షకుడైన పరమాత్ముడు జీవులకు కల్పిస్తున్న జన్మలలో మానవజన్మ ఒకటి. అన్ని జన్మలలోకెల్ల మానవ జన్మ శ్రేష్ఠమైంది. ఈ మానవజన్మ లభించడం చాలా కష్టం. 'జంతూనాం నరజన్మ దుర్లభం' అని కదా ఆర్యోక్తి. శ్రేష్ఠమైన మానవజన్మను సార్థకం చేసుకోవాలి. మానవజన్మ చరితార్థం కావాలంటే జన్మనిచ్చిన తల్లికి 'మాతృదేవో భవ' అంటూ ప్రణమిల్లి అనగా నమస్కరించి మాత్రారాధనతో జీవించాలి.

"తల్లియె వేదము శాస్త్రము
తల్లియె జపమున్ తపంబు తల్లియె గురువున్
దల్లియె సకలము తల్లియె
తల్లిని నెదిరించువా డధమగతినొందున్"

తల్లి త్యాగానికి ప్రతీక. త్యాగానికి, అనురాగానికి అమ్మకు సాటి మరొకరుండరు. ఈ సృష్టిలో మానవజీవన వికాసానికి మాతృమూర్తి ఆత్మీయతే అమృతాస్త్రంగా పనిచేస్తుంది. మానవులకే కాక ప్రతిపాణికి జన్మనివ్వడానికి ఒక తల్లి ఉండాల్సిందే. దేవతలకు కూడా జన్మనిచ్చిన తల్లులున్న సంస్కృతి మనది. తల్లిరూపమైన స్త్రీ లేనిదే జన్మలేదు. స్త్రీకి సంతానం పొందాలనే తపన సహజంగా ఉంటుంది. కాని దానిని స్త్రీ మనస్ఫూర్తిగా కోరుకోవాలి. దానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బిడ్డపై అత్యంత మమకారాన్ని చూపాలి. అప్పుడే బిడ్డ ఈ మట్టిపై క్షేమంగా అడుగుపెడుతుంది. సుఖంగా, ఆరోగ్యంగా, ఆనందంగా బిడ్డ ముందుకు సాగిపోవాలంటే తల్లి ప్రేమ చాలా అవసరం. ముక్కోటి దేవతలు ఒక్కటై వచ్చి ఎన్ని వరాలు ఇచ్చినా దీవెనలెన్ని ఇచ్చినా తల్లికి బిడ్డపై మమకారం లేకపోతే బిడ్డ నేలపై అడుగు పెట్టలేడు.

అవతారమూర్తులు, చారిత్రక పురుషులు, జాతీయ నాయకులు, కళాకారులు, శాస్త్రవేత్తలు, నాయకులు, ఆధ్యాత్మికవేత్తలు, అవధూతలు ఒకరేమిటి ఎవరైనాసరే గొప్పవారయ్యారంటే అది ఆ తల్లి చలువే. ఆ తల్లి ప్రేమయే "ఢిల్లీకి రాజైనా ఒక తల్లికి బిడ్డడే" అనే సామెత అందుకే పుట్టింది.

"మాతృత్వంలోనే ఉంది ఆడజన్మ సార్థకం
అమ్మ అనిపించుకొనుటే స్త్రీ జాతికి గౌరవం"

అన్నాడొక సినీగేయ రచయిత. స్త్రీ జన్మకు సార్థకత్వం మాతృత్వం. అందుకే పెళ్లయిన పిమ్మట సంతానం కోసం తల్లి ఆరాటపడుతుంది. నిజమేకదా! సంతానం కోసం స్త్రీ పడరానిపాట్లు పడుతుంది. చెట్టుకు పుట్టకు మొక్కు తుంది. పుణ్యక్షేత్రాలనుదర్శిస్తుంది. పుణ్యతీర్థాల్లో స్నానాలు చేస్తుంది. సంతానం కోసం ఎవరేం చెప్పినా తుచ తప్పకుండా శ్రద్ధాభక్తులతో ఆచరిస్తుంది. బిడ్డకు జన్మనివ్వడమంటే తల్లి మరోజన్మ ఎత్తినట్లే. జన్మనిచ్చిన ప్రతిసారి తల్లికి మరోజన్మలా ఉంటుందని..

"జన్మ జన్మకు నీవు-జన్మమెత్తేవమ్మ
జన్మనిచ్చుచు నీవు - జన్మించగలమ్మ
జన్మజన్మలకైన - ఎన్ని జన్మలకైన
జగతిలో వెలుగొందు - జనని నీవేనమ్మ
ఎన్ని జన్మలనెత్తినా - ఎన్ని నోములు నోచినా
ధరణిలో నీ ఋణం - తీర్చలే రెవరమ్మా!"

నిజమే కదా! ఏం చేసినా? ఏమిచ్చినా? తల్లి ఋణం తీర్చుకోలేనిది. అందుకే భారతీయధర్మంలో "మాతృదేవో భవ" అంటూ మాతృత్వానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది.

పురాణేతిహాసాది కావ్యాల్లో మాతృవాత్సల్యాన్ని, మాతృ ప్రేమను వెల్లడిచేసే సన్నివేశాలున్నాయి. అవన్నీ మాతృ

త్వపు అనుభూతిని ప్రదర్శించడమే గాక మాతృమూర్తు లకు మార్గదర్శకాలవుతాయి.

## ద్రౌపది పుత్రవాత్సల్యం :

ఉపపాండవులను చంపిన అశ్వత్థామను పట్టి బంధించి తెచ్చి అర్జునుడు ద్రౌపది ముందు పడవేశాడు. పుత్రశోకంతో ఉన్న ద్రౌపది అశ్వత్థామతో ఇలా అంటుంది. "నాయనా! మా వారలందరూ మీ తండ్రిగారి వద్ద సకలశాస్త్రాలను అభ్యసించారు. పుత్రాకారంలో ఉన్న ద్రోణుడవు నీవు. గురుతుల్యుడవైన నీవు కొంచమైనను మనస్సులో దయలేకుండా నీ శిష్యుని పుత్రుల శిరస్సులను ఖండించడం ధర్మమేనా? అంతేగాక బాలురు ఉద్రేకంతో నీ పైకి రాలేదు. ఆయుధాలు ధరించలేదు. కొంచెమైనా ద్రోహంచేయలేదు. అలాంటి చిన్నారులను, యుద్ధంలో సంపూర్ణ సామర్థ్యం లేని వాళ్లను నిద్రలో ఆదమరిచి ఉండగా వారిని చీకటిలో వీరావేశంతో చంపడానికి నీ చేతులెట్లాడినవి" అని పలికి మాతృ వేదనను వెల్లడిచేసింది.

ద్రౌపది తన పుత్రశోకాన్ని ప్రకటించడమేగాక సాటి స్త్రీ మాతృవేదనను గుర్తించిన గొప్ప సహృదయ మాతృమూర్తి. అందుకే అశ్వత్థామతో ఇలా అంటుంది..

అక్కటా పుత్రశోక జనితాకులభారవిషణ్ణ చిత్తనై
పొక్కుచు నున్నభంగి నిసుబోర గిరీటి నిబద్ధు జేసి నే
డిక్కడ కీడ్చి తెచ్చుట సహింపనిదై భవదీయమత, నే
డెక్కడ నిట్టిశోకమున నే క్రియ నేడ్చుచు బొక్కుచున్నదో?
(భాగ-1-162)

"అయ్యో! పుత్రశోకంతో బరువెక్కిన మనస్సుతో నేను దు:ఖిస్తున్నట్లే అర్జునుడు నీ కాల్లుచేతులు కట్టి బంధించి ఇక్కడికి తీసుకొనిరాగా, ఈ విషయం తెలిసిన నీ తల్లి ఎంత దు:ఖిస్తూ తల్లడిల్లి పోతున్నదో కదా!" అంటూ సాటి ఇల్లాలి పుత్రశోకానికి తపించిన మహాతల్లి ద్రౌపది.

అమ్మచూపే ప్రేమకు, వాత్సల్యానికి, ఆదరానికి దేశ, కాల ప్రాంతాల తేడా ఉండదు. తల్లీబిడ్డల అనుబంధానికి ఎలాంటి అరమరికలుండవు. ఏ ప్రాణి అయినా అమ్మ అమ్మే. దేనికైనా పోలిక ఉంటుందేమో కానీ, మాతృ ప్రేమకు పోలిక ఉండదు. చల్లని వెన్నెల కురిపించే చంద్రుడు కూడా తల్లి ప్రేమకు సాటిరాడంటే వెన్నెల చల్లదనాని కంటే తల్లిప్రేమ ఎంత చల్లనిదో, ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. మబ్బులు వస్తే చంద్రుడు కనిపించడు కాని తల్లిప్రేమకు ఎప్పుడూ లోటులేదు. పాలు, పెరుగు, తేనె, జున్ను లాంటివి అమ్మ మాధుర్యా నికి సాటిరావు. ఆస్తిపాస్తులు, అధికారాలు, పదవులు అమ్మ ప్రేమను పంచలేవు.

## కుంతీదేవి పుత్రవాత్సల్యం :

తన బిడ్డపై ఉన్న మమకారంతో బిడ్డకు ఎంత వయసు వచ్చినా పసిబిడ్డని, అమాయకుడని తల్లి భావిస్తుంది. పాండవులు అరణ్యవాసానికి బయలుదేరే ముందు కుంతీదేవి తన కోడలు ద్రౌపదిని దగ్గరకు తీసుకొని "కోడలా! నిన్ను నమ్మి మిక్కిలి కష్టమైన ఈ వనవాసాన్ని చేయడానికి, సహదేవుడిని పంపటానికి ఒప్పు కుంటున్నా"నని (విరాట 2-211) కన్నీరు పెట్టుకుంటూ మరలా ఇలా అంటుంది..

"కడు పసిబిడ్డ వీ, డొకటి గాదవునా నెఱుగండు ముందరె
య్యడ నొకపాటెఱుంగ, డెదయెంతయుగోమల, మెప్పుడైన నే
గుడువగ బిల్తుగాని తనకుంగల యాకటి ప్రొద్దెఱుం డీ
కొడు కిటుపోకకు స్మనముగుందెడు నిగ్గని యాఅడిల్లెడున్"
(విరాట 2-213)

"ఓ కోడలా! ఈ సహదేవుడు మిక్కిలి పసిబిడ్డ. 'ఔను, కాదు' అని చెప్పలేని చిరుప్రాయంవాడు. ఇంతకు ముందెప్పుడూ ఎలాంటి కష్టాలు తెలియనివాడు. కోమల మైన హృదయం కలవాడు. నేను పిలిచి అన్నం పెడితేకాని, ఆకలి అవుతుందనే విషయం తెలియని వాడు, అలాంటి బిడ్డ అడవులకు పోతుంటే మనస్సు విలవిలలాడుతుంది. అయితే నిన్ను చూచి నా మనస్సు ఊరట పొందుతున్నది. అందువల్ల నీవు అతనిమనసును కనిపెట్టి కాపాడుతూ నా దీవెనలను పొందమని చెబుతుంది. ఈ సందర్భంలో

ఒక పసిబిడ్డను ఇతరులకు అప్పగించేటప్పుడు మాతృమూర్తి పడే మానసిక వేదన వెల్లడవుతుంది. మాతృప్రేమ అలాంటిది. ఇక్కడ మరో విశేషముంది సహజంగా సహదేవుడు మాద్రి కుమారుడు. మాద్రి మరణం తర్వాత కుంతి నకులసహదేవులిద్దరిని తన సొంత బిడ్డల్లాగ పెంచింది. మాతృహృదయానికి స్వపరభేదాలు, కుల, మత, ప్రాంతభాషాభేదాలుండవు. అందుకే భారతీయ సంస్కృతిలో మాతృమూర్తికి అంత గౌరవం.

**ఆధార గ్రంథాలు :**

1. ఆంధ్రమహాభారతం - నన్నయ
2. ఆంధ్రమహాభాగవతం - పోతన
3. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణలు

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2(1), February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# రాయలసీమ రచయిత్రుల జీవన నేపథ్యం

– కోడూరు జయప్రకాష్, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

## ఈ కథా రచయిత - గంజాం భ్రమరాంబ :

చిత్తూరు జిల్లాకు చెందిన గంజాం భ్రమరాంబ 2-7-1973 నగరిలో జన్మించారు. వీరి మొదటి కథ 'పరువాల తొలిపొద్దు' 2013స ఆంధ్రనాడు కథా సర్వలనంలో అచ్చయ్యింది. చిన్నా పెద్ద కథలు కలిపి వంద దాకా అచ్చయ్యాయి. కవితలు, పద్యాలు, గజల్స్, రుబాయిత్, వ్యాసాలు, కూడా అనేకం.

**సంతానం :**

వీరు తిరుపతి వాస్తవ్యులు, శ్రీవారు మహావాది సత్యనారాయణశర్మ గారు ఏకైక మహావాది సత్య నారాయణశసకమ గారు ఏకైక సంతానం చి॥ మోహిత్‌శర్మ.

**విద్యార్హతలు :**

ఎం.ఎస్.సి, ఎం.ఫిల్, ఎం.ఈడీ

**బిరుదులు :**

సహస్ర కవి చక్రవర్తిని. తెలుగు కవితా వైభవం హైదరాబాద్ (దాదాపు 5000 లకు పైగా కవితలు వ్రాసి నందుకు) సహస్ర కవి భూషణ, స్వీయ గాన కోకిల మొదలగునవి.

**తల్లిదండ్రులు :**

వీరి తల్లిదండ్రులు గంజాం వరలక్ష్మి, గంజాం నాగరాజు రావు గారు. వీరిరువురూ వృత్తి రీత్యా ఇంజనీరింగ్ శాఖలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో పని చేయడం వలన భ్రమరాంబ గారు అనేక ప్రాంతాలలో చదువు కోవడం జరిగింది. అనేక సాంస్కృతిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని బహుమతులు గెలుచుకోవడం జరిగింది.

**వృత్తి :**

గంజా భ్రమరాంబ గారు చిత్తూరు జిల్లా వెదురుకప్పం ఉన్నత పాఠశాలలో వృత్తి రీత్యా భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయిరాలు.

**ప్రవృత్తి :**

కవయిత్రి, రచయిత్రి, గాయని, ఒక చక్కని కళాకారిణి. ఇటు తెలుగు సాహిత్యం లో మరియు అటు సైన్స్ రంగంలోనూ నవ్యసాచి వలె సమర్థవంతంగా రచనలు చేస్తున్న ఏకైక వ్యక్తి గంజాం భ్రమరాంబ అంటే అతిశయోక్తి కాదు.

## ఆమె కలానికి ఎనెన్నో అభిరుచులు :

- ఒకసారి పద్యమై అలరిస్తుంది మరొసారి కవిత్వాన్ని చిందిస్తుంది ఇంకొక సారి గజళ్ళ సౌందర్యాన్ని చూపుతుంది.
- మరొక సారి రుబాయీల చిరుపును అందిస్తుంది. కొన్ని సార్లు కథలుగా మురిపిస్తుంది. మరి కొన్ని సార్లు గేయాలతో మైమరపిస్తుంది.
- వివిధ రకాల తెలుగు సాహితీ ప్రక్రియలలో తనదైన శైలిలో నిరంతర కృషి నలుపుతున్న గంజాం భ్రమరాంబ గారి గురించి కొన్ని విశేషాలు.

**సాహితీ ప్రస్థానం :**

ఇప్పటివరకు 5000కి పైగా కవితలూ, వేల సంఖ్యలో పద్యాలు, వంద పైగా కథలు, నూరకుపైగా వ్యాసాలు, లేఖలు వ్రాసారు. వీరి రచనలు అన్ని ప్రధాన పత్రికలో ప్రచురించబడ్డాయి.

**అందుకున్న పురస్కారాలు :**

- గురజాడ గారి మనుమరాలు అరుణా గారు.... నందిని సిద్దారెడ్డి గారి చేతుల మీదుగా హైదరాబాదులో గురజాడ వారి స్థాయి విశిష్ట పురస్కారం అందుకొన్నారు.

- 2019 సంవత్సరం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు గారి జాతీయ సాహితీ సేవా పురస్కారాన్ని కొలకలూరి ఇనాక్ శ్రీమతి కాంతికృష్ణ గారి చేతుల మీదుగా స్వీకరించారు.
- 2018 సంవత్సరం బెంగళూరులో భారత రత్న శ్రీ అంబేద్కర్ గారి మనవల చేతుల మీదుగా "అంబేద్కర్‌రత్న" జాతీయ పురస్కారాన్ని అందు కున్నారు.
- రాయలసీమ రంగస్థల వారి ఆధ్వర్యంలో గుర్రం జాషువా గారి స్మారక పురస్కారం అందుకున్నారు. మంత్రి వర్యులు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి గారి నుంచి మన్మథనామ సంవత్సర ఉగాది పురస్కారం అందుకొన్నారు.
- శ్రీకాళహస్తిలో జరిగిన జాతీయ కవి సమ్మేళనంలో పద్మ భూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారి చేతుల మీదుగా చిరు సత్కారాన్ని అందుకున్నారు.
- చిత్తూరులో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్ గురించిన కవితను వ్రాసి ఎందరో అభినందనలు పొందారు.
- శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ లో జానపద విజ్ఞానం జరిగిన జాతీయ సదస్సులో పత్రాన్ని సమర్పించి, జానపదగేయులను ఆలపించి పలువురి మన్ననలు పొందారు.
- ఆకాశవాణి తిరుపతి కేంద్రం నుండి అనేక సాహిత్య కార్యక్రమాలలో పాల్గొన్నారు.
- రాష్ట్రా స్థాయిలో వివిధ సైన్స్ పోటీలలో పాల్గొన్నారు. గతంలో తిరుపతిలో జరిగిన జాతీయ సైన్స్ కాంగ్రెసు లో జరిగిన వివిధ కార్యక్రమాలలో గైడ్ టీచర్ గా పాల్గొన్నారు.
- అనేక జాతీయ, అంతర్జాతీయ సాహితీ సదస్సులలో పాల్గొని పత్రాలను సమర్పించారు. నవ్యాంధ్ర పుస్తక సంబరాలలో కూడా తమ వాణిని వినిపించారు.
- పాఠ్యాంశాలను పాడుపుకథలుగా, చిన్న చిన్న గేయా లను రచించి, స్వర కల్పన చేసి పిల్లలకు అందించి వారికి సులువుగా నేర్పిస్తున్నారు.
- ఒకవైపు సైన్స్ పట్ల విద్యార్థులలో ఆసక్తి పెంచుతూ మరో వైపు మాతృభాషాభివృద్ధికి తమవంతు కృషిని చేస్తుండటం ఎంతో అభినందనీయం.
- అభినయా ఆర్ట్స్ వారిచే మహతి ఆడిటోరియంలో "నవరత్నాలు" పురస్కారం.
- ఆది నుంచి అనంతం దాకా పుస్తక రచన లో 116 మంది కవులతో పాల్గొనందుకు. వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో భాగస్వామ్యం.

**డేగల అనితా సూరి**

జననం : 7 - జూన్ - 1974

తల్లి దండ్రులు - అండే శ్రీనివాసులు, తులసి

స్వగ్రామం - రొంపిచెర్ల చిత్తూరు.

విద్యార్హతలు - బి.ఏ

అత్తమామలు - శ్రీమతి డేగల మునెమ్మ, శ్రీ డేగల సుబ్బయ్య.

చిరంజీవులు - గ్రీష్మసాయి, దరహాస్.

**వృత్తి/వ్యాపకం :**

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో విభాగాధికారిణి. అచ్చయిన తొలి రచన - "పసి మనసులు" కథ 31-8-1995 సంవత్సరం లో ఆంధ్రభూమి వారపత్రికలో

చేసిన రచనా ప్రక్రియలు - వచన కవితలు, నానీలు, జోక్స్, పేరడీ పాటలు, బాలల కథలు, బాల - గేయాలు, కథలు, వ్యాసాలు, సమీక్షలు మరియు ఆధ్యాత్మిక వ్యాసాలు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో విభాగాధికారి.

మొత్తం రచనలు - కవితలు రెండు వందల వరకు, వందపైగా కథలు, బాలల కథలు అరవైకి పైగా ఉం టాయి.

ముద్రితాలు - 2014 లో 'సర్వధారి' వచన కవితా సంపుటి ముద్రించడమైంది. నానీల పుస్తకం ప్రచురణకు సిద్ధంగా ఉంది.

ఆధ్యాత్మిక వ్యాసాలే కాక పిల్లల కోసం కూడా అనేక కథలు రచించారు.

అముద్రితాలు - పాంతిక కథలు ఎమెస్కో వారి పరిశీలనలో ఉంది. మరో రెండు కథల పుస్తకాలు, కవితల పుస్తకాలు, బాలల కథలు వంటివి. ఆర్థిక ఇబ్బందుల వల్ల ప్రచురించటానికి సమయం పడుతుంది.

పట్టున్న రచనా ప్రక్రియలు - కవితలు మరియు కథలు.

ప్రకృతి - రచనా వ్యాసంగం, సంగీతం పట్ల మక్కువ, అధ్యాత్మిక ప్రవచనాలు వినటం, ఎఫెమ్ రేడియో వినడం మరియు రేడియో కార్యక్రమాల్లో పాల్గొనడం.

**సన్మాన సత్కారాలు :**

1) 'చేతన' సచివాలయ సారస్వత వేదిక ద్వారా నిర్వహించిన వివిధ సంవత్సరాలలోని కవి సమ్మేళనాల సందర్భంలో ఆచార్య డా॥ ఎన్. గోపి, సినీ నటుడు రచయిత శ్రీ రావి కొండలరావు, సినీ గీతరచయిత జాతీయ పురస్కార గ్రహీత శ్రీ సుద్దాల అశోక్ తేజ. సహజకవి శ్రీ ఎమ్.ఎస్.రెడ్డి, (మల్లెమాల). సినీ గీత రచయిత శ్రీ వడ్డేపల్లి కృష్ణ. ఆచార్య శ్రీమతి సుమతీ సరేంద్రలచే అందుకున్న ఉగాది పురస్కారాలు. వినాయక చవితి కవితల పోటీలో సినీ నటులు, రచయిత శ్రీ తనికెళ్ళ భరణి గారిచే అందుకున్న ప్రథమ బహుమతి మరియు విజయనామ సంవత్సర కథల పోటీలలో తృతీయ బహుమతి.
2) చిత్తూరు రచయితల సంఘం వారి 'చిత్రబాను' నామ సంవత్సర ఉగాది పురస్కారం.
3) జి.వి.ఆర్ ఆరాధనా కల్చరల్ ఫౌండేషన్ వారి వర్ధమాన కవయిత్రి సత్కారం.
4) 'సాహితీ కిరణం' మాస పత్రిక వారి నిర్వహణలో డా॥ ధర్మపురి మధుసూదన్ 'ఉత్తమ కవితా' పురస్కారం.
5 లెర్వ్ ఇంటర్నేషనల్ వారి నిర్వహణలో శ్రీమతి లక్ష్మీపార్వతి మరియు జస్టిస్ బి.చంద్రకుమార్ గార్ల చే విజయనామ సంవత్సర ఉగాది పురస్కారం.
6) 'తెలుగు రక్షణ' వేదిక వారి 2013వ సంవత్సర అంతర్జాతీయ కవితా దినోత్సవం సన్మానం.
7) శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య ద్వారా
   ఎ. 'స్నేహం' అన్న అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవితల పోటీలలో ఉత్తమ కవితా పురస్కారం.
   బి. పద్మవిభూషన్ డా॥ సి. నారాయణ రెడ్డి గారిచే దసరా పురస్కారం.
   సి. 'అమ్మ' అన్న అంశంపై నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీలలో ఉత్తమ కవితా పురస్కారం.
8) "రేడియో మిర్చి" నిర్వహించిన వివిధ కార్యక్రమాలలో గెలుపొందిన సందర్భంగా ప్రముఖ సినీ నటులు యువరత్న శ్రీ బాలకృష్ణ గారిచే మరియు దర్శకులు శ్రీ తేజ గారిచే అందుకున్న బహుమతులు.
9) 'బిగ్ ఎఫెమ్' రేడియో కార్యక్రమంలో పాల్గొని ప్రముఖ సినీనటులు శ్రీ సాయి కుమార్ గారిచే అందుకున్న బహుమతి.
10) "రెడ్ ఎఫెమ్" రేడియో కార్యక్రమంలో గెలుపొందిన సందర్భంలో సినీ హీరో శ్రీ నవదీప్ గారిచే అందుకున్న " బంగారు కాసు " బహుమతి.
11) 'తెలుగు రక్షణ వేదిక' వారి 2014 వ సంవత్సరం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ" సన్మానం.

**కొలకలూరి మధుజ్యోతి :**

ఆచార్య కొలకలూరి మధుజ్యోతి శ్రీ పద్మావతి విశ్వ

విద్యాలయంలో తెలుగు అధ్యయన శాఖలో అధ్యాపకు రాలు, శాఖాధ్యక్షులు.

తల్లిదండ్రులు : శ్రీమతి కొలకలూరి భాగీర, ఇనాక్ గార్ల తృతీయ పుత్రిక.

భర్త : డా॥ చిలుమూరి శ్రీనివాసరావు.

సంతానం : చి. సరయ, చి. ఆశీష్, చి. ప్రభాత్ లుసంతానం.

విద్య : పాఠశాల, కళాశాల విద్య జన్మస్థలమైన అనంతపురంలో ముగించుకొని శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం, తిరుపతి లో ఎం.ఏ చేసి గోల్డ్‌మెడల్ సంపా దించారు.

ఆచార్య మధుజ్యోతి " తెలుగు సాహితీ వస్తు పరిణామం" గురించి పరిశోధించి, శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం నుంచి పిహెచ్.డి పట్టా పొందారు. తమిళంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి పి.జి డిప్లొమాలు పొందారు. హిందీ, సంస్కృత భాషల్లో ప్రవేశం ఉంది.

ఆచార్య మధుజ్యోత 200కి పైగా పరిశోధన పత్రాలను జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో సభలలో సమర్పిం చారు. వివిధ పత్రికల్లో 75 పరిశోధన పత్రాలు విజ్ఞాన సర్వస్వాలలో అనేక వ్యాసాలు ప్రచురించారు. పలు రేడియో ప్రసంగాలు చేశారు. టి.వి. కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆచార్య మధుజ్యోతి పర్యవేక్షణలో పది మంది పిహెచ్.డి, నలుగురు ఎం.ఫిల్, పట్టాలు పొందారు.

బెజవాడ గోపాలరెడ్డి కవిత్వం - సౌందర్య, సాహిత్య వీక్షణ తెలుగు సాహితీ వస్తు పరిమాణం, దండోరా అంబేద్కర్ అభీష్టం, శ్రీ తాళ్ళపాక సాహిత్యాను శీలనం, ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యం పై విమర్శనం (సం), పిడికెడు ఆలోచనలు, స్త్రీవాద సాహిత్యం - సామాజిక అవసరం, ఆధునిక తెలుగు సాహిత్యం - దళిత సంస్కృతి, 'నాన్న' (ఆచార్య కొలకలూరి ఇనాక్ జీవిత చరిత్ర), గుప్పెడు తలపులు వీరి ముద్రిత రచనలు.

దళిత సాహిత్య సౌందర్య శాస్త్రం, (తెలుగు అకాడమి హైదరాబాద్ వారు, సంకల్పం - సంఘర్షణ - జయ కేతనం - గుర్రం జాషువా' సి.పి.బ్రౌన్ అకాడమి హైదరాబాద్ వారు ముద్రించారు.

'అంబేద్కర్ రాజ్యాధికారం - దళిత కవిత్వం ' అంబే ద్కర్ స్టడీ సెంటర్, ఇందిరాగాంధీ జీవితం -సంచలన సంస్కరణలు, ఇందిరాగాంధీ స్టడీ సెంటర్, శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం వారికి, రచించి ఇచ్చిన పుస్తకాలు.

వీరి సాహితీ కృషికి ఆంధ్ర విశ్వ సారస్వత సమితి, మచిలీపట్నం వారు 'శ్రీ పురాణం సూరిశాస్త్రి, మల్లాది సూరిశాస్త్రి స్మారక పురస్కారం 2004, వినుకొండ జాషువా సాంస్కృతిక సమాఖ్య, వినుకొండ వారు జాషువా సాహితి పురస్కారం 2009, వానమామలై వరదాచార్యులు ట్రస్టు, హైదరాబాదు వారు, వానమామలై వరదాచార్యులు పుర స్కారం 2010, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు బెస్టటీచర్‌పురస్కారం 2011, క్రైస్తవ-సాహిత్య అకాడమీ విజయవాడ వారు సాహిత్యరత్న పురస్కారం 2015, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు గుర్రం జాషువా పురస్కారం 2016, అభినయ ఆర్ట్స్, తిరుపతి వారు ఉగాది విశిష్ట పురస్కారం 2017, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు ఉగాది విశిష్ట పురస్కారం 2017, బహుకరించారు.

కథానికలను పుస్తక రూపంలో తొలిసారి వెలు వరుస్తున్నారు.

ఆచార్య మధుజ్యోతి 26 సంవత్సరాల బోధన, పరిశోధనా - అనుభవం కలిగి ఉన్నారు. వీరు శాఖా ధ్యక్షులుగా, పాఠ్యప్రణాళిక సంఘాధ్యక్షులుగా, యూని వర్సిటీ కమ్యూనిటి ఎంగేజ్‌మెంట్ డైరెక్టర్ గా ఉన్నారు. యు.జి.సి., ఎ.పి.పి.యస్.సి, తెలుగు ఉభయ రాష్ట్రాల విశ్వవిద్యాలయాలకు రిసోర్సుపర్సన్ గా ఉన్నారు. విక్రమ సింహపురి, వేమన విశ్వవిద్యాలయాల తెలుగు పాఠ్య ప్రణాళిక సంఘ సభ్యులుగా ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారి బెస్ట్ టీచర్ పురస్కారం 2011, గుర్రం జాషువా పురస్కారం - 2016, ఉగాది విశిష్ట పురస్కారం 2017, బెస్ట్ రీసర్చ్ అవార్డు - శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం 2018, లతో పాటు సాహిత్య సామాజిక సంస్థల నుంచి పురస్కారాలు అందుకొన్నారు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2(1), February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ప్రాచీన పద్యం - స్త్రీ పాత్ర చిత్రణ

- జక్కె పద్మ, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యాపకురాలు టిఎస్‌డబ్ల్యుఆర్‌డిసి, వరంగల్ ఈస్ట్

కాలాన్ని బట్టి అప్పుడు ఉన్నటువంటి సామాజిక పరిస్థితుల ప్రభావం కవుల కావ్యాలలోను, పాత్రల చిత్రణ లోనూ ప్రభావం చూపుతుంది. వాటిలో ముఖ్యంగా స్త్రీల పాత్రను గమనించినట్లయితే ఆయా కాలాల్లో ఆయా రకాలుగా స్త్రీలను వర్ణించారు. ప్రాచీన కాలంలోని నన్నయ నుండి 15వ.శతాబ్దం వరకు కవుల రచనలను గమనించి నట్లయితే స్త్రీల సౌందర్యాన్ని వర్ణించినా కూడా వారు వారి కుటుంబం కోసం, భర్తల కోసం, పుత్రుల కోసం పోరాడిన మహిళలుగానే ఎక్కువగా కనిపిస్తారు.

ప్రాచీన సాహిత్యంలో ప్రబంధాలకు పూర్వం వెలువడిన కావ్యాలలో స్త్రీ పాత్రలు ఎంతో ఉదాత్త మైనవిగా ప్రసన్నమవుతాయి.

**ఉదా :**

**శకుంతల పాత్ర** : శకుంతలోపాఖ్యానంలో నన్నయ శకుంతలను న్యాయం కోసం పోరాడే స్త్రీగా, కుమారుని యొక్క భవిష్యత్తు కోసం ఆరాటపడే స్త్రీగానే చిత్రించాడు. దుష్యంతుడు శకుంతలను గాంధర్వ వివాహమాడి కొన్ని రోజుల తర్వాత తన రాజ్యానికి వెళ్ళి వస్తానని చెప్పి తిరిగి రాకపోవడం, తర్వాత శకుంతల దుష్యంతుని సభలోనికి కుమారునితో సహా ప్రవేశించగా తెలిసి కూడా తెలియని వాడివలె నటించినప్పుడు శకుంతల బాధ పడినా కూడా తన కుమారుడి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బోధించే విషయాలు క్రింది పద్యాల్లో ప్రస్ఫుటమవు తాయి.

"బాలార్క తేజుడగు నీ
బాలుడు నీ కొడుకు వీని పౌరవకులర
త్నాలంకారు నుదారగు
ణాలయు యువరాజు జేయు మభిషికముతోన్"

(మ.భా - ఆదిపర్వం చతుర్థి - 75)

అని కుమారున్ని పట్టాభిషక్తున్ని చేయమని మాత్రమే కోరి తన మాతృత్వాన్ని చాటుకుంటుంది కానీ తనని పట్టపురాణిగా గుర్తించమన్నట్లు ఎక్కడా కనిపించదు.

"నీ పుణ్య తనువు వలనన
యాపుత్రకు డుద్భవిల్లి యెంతయు నొప్పున్
దీపంబు వలన నొండొక
దీపము ప్రభవించినట్లు తేజం బెసంగన్"

(మ.భా - ఆదిపర్వం చతుర్థి - 90)

"పున్నామ్నో నరకాత్త్రాయత ఇతి పుత్ర"యని వేదవచనంబు చెప్పబడినట్లు నీవెంత కీర్తి ప్రతిష్టలును పొందినావో నీ పుత్రుడు కూడా అంతే కీర్తి ప్రతిష్ఠలను తీసుకువచ్చి పున్నామ నరకం నుండి కాపాడుతాడని చెప్పి, సభలో తెలిసిన వారెవరు లేకున్నా ఒంటరిగా పోరాడే ధీరవనితగా శకుంతలను చిత్రించడం గమనించవచ్చు.

**ద్రౌపది పాత్ర** : ద్రౌపది పడినన్ని కష్టాలు లోకంలో ఎవరూ పడలేదు అని చెప్పవచ్చు. వ్యాసుడు చెప్పిన కారణంతోనే ఆమె ఐదుగురు భర్తలను వివాహ మాడుతుంది. ఐదుగురిని వివాహమాడిన స్త్రీగా ఆమెను ప్రతి ఒక్కరూ చులకనగా చూసి అవమానించాలని చూసినవారె. చివరికి ఆడపడుచు భర్త సైంధవుడు కూడా ఆ దృష్టితో చూసినవాడే. ద్రౌపది అందాన్ని చూసి కౌరవుల భార్యలే అసూయ చెందుతారు. అంతటి అద్భుత సౌందర్య రాశి ద్రౌపది.

"అఖిల లావణ్య పుంజంబు నబ్జభవుడు మెలతగా
దీనియందు నిర్మించెనొక్కొ
కానినాడిట్టి కాంతి యేకాంత లందు నేల లేదని
సామర్ష హృదయులైరి"

(మ.భా - సభా.ద్వితీయా. 160)

అసగా ద్రౌపది శరీరచ్ఛాయ అంత లావణ్యంగా ఉండి స్త్రీలకే అసూయ కలిగించేదిగా ఉందని దీని భావం. అలాంటి అసూయ కలిగించే సౌందర్యాన్ని కలిగి ఉండడం వల్లనే ద్రౌపదిని అవమానించడానికి కౌరవుల భార్యలు కూడా ఆనందం వ్యక్తం చేయడం జరిగిందని, ఆ తరువాత ద్యూత క్రీడ అనే కథ ప్రారంభమైనదని దీని అంతరార్థం. ఇక్కడ గమనించినట్లయితే ద్రౌపది సౌందర్యంతోనే మహాభారత ద్యూత క్రీడ ప్రారంభమయ్యి మహాభారత కథ ప్రవాహం సాగినదని తెలుస్తుంది.

ద్రౌపదిని నిండు సభలో అవమానించిన దుర్యోధన దుశ్శాసనులపై పగతీర్చుకోవాలనే క్రౌర్యము, ప్రతీకారాలు తీర్చుకోవాలనే స్త్రీగా చిత్రించిన విధము తిక్కన ఉద్యోగ పర్వంలో కనిపిస్తుంది. ఎన్ని అవమానాలు కలిగినా వాటిని ఎదురించే ప్రయత్నమే చేసింది కానీ ఎక్కడా ధైర్యాన్ని కోల్పోలేదు ద్రౌపది.

"వరమున బుట్టితిన్, భరత వంశము జొచ్చితి, నందు బాండుభూ
వరునకు గోడలైతి, జనవంద్యుల బొందితి, నీతి విక్రమ
స్థిరులగు పుత్రులం బడసితిన్, సహజన్ముల ప్రాపు గాంచితిన్
సరసిజనాభ! యిన్నిట బ్రశస్తికి నెక్కినదాన నెంతయున్."

(మ.భా - ఉద్యోగ. తృతీయ. - 108)

కష్టం వస్తే కృంగి పోయేదానిని కాదు అని తన చరిత్రకారుల ప్రశస్తిని చాటి చెప్పిన విధము పై పద్యంలో కనబడుతుంది.

"ఇవి దుస్ససేను వ్రేళ్ళం! దవిలి సగము ద్రెవ్విపోయి దక్కినయవి కౌ
రవుల కడ దీరు మాటల యవసరమున దలప వలయు సచ్యుత! వీనిన్"

(మ.భా -ఉద్యోగ. తృతీయ.-116)

అని సగం తెగిపోగా మిగిలన శిరోజాలను చూపిస్తూ ప్రతీకారం తీర్చుకోవాలనే భావనతో సంధి నెరిపే సమయంలో గుర్తుంచుకొమ్మని శ్రీకృష్ణునికి వివరించే తీరు ఆమె ధీరత్వాన్ని తెలుపుతుంది. అందుకే ప్రతీకారం తీర్చుకోవాలని ఈ క్రింది పద్యంలో తిక్కన ద్రౌపదిని శత్రు సంహారం చేయడమే ప్రధాన లక్ష్యమనే స్వభావాన్ని చిత్రించారు.

"నెట్టన యిట్టియల్క మది నిల్పితి రక్కస తాల్మిజచ్చెడిం
గట్టిన యట్లు పెద్దయును గాలము దీనికి నాకు బెన్నడుం
బుట్టదు దుష్ట నిగ్రహము పూని జగంబులు గాచునట్టి తో
బుట్టువు తీవ్ర తేజమున బొల్చిన భర్తలు గల్గ నచ్యుతా!"

(మ.భా - ఉద్యోగ. తృతీయ. - 118)

లోకాలను రక్షించే జనార్ధుడవైన నీవంటి సోదరుడిని, ఎదురులేని పరాక్రమం కలిగిన భర్తలు కలిగి కూడా నేను ఇంతటి పరాభవాన్ని ఎదుర్కొని క్రోధాగ్నిని, నిప్పును ఒడిలో నుంచుకొన్న విధంగా సహనంతో భరిస్తున్నాను. కావున ఈ పరాభవానికి ప్రతీకారం తీర్చుకోవలసిందే అని 'నిప్పును ఒడిలో నుంచుకున్న దానిని' అనే వాక్యంలో, నిప్పును ఒడిలో పెట్టుకుంటే శరీరము మొత్తమును దహించి వేస్తుంది అనే ధ్వని ఇచ్చుట ఎంతటి ప్రతీకారజ్వాలను కలిగివుందో తెలుపుతుంది.

అలాగే భారత, భాగవత కథల్లో పేర్కొన్నటువంటి అంశం ద్రోణాచార్యుని కుమారుడు అశ్వత్థామ, ద్రౌపది పాండవుల కుమారులు పసిపిల్లలైనట్టి ఉప పాండవులను అదమరచి నిద్రపోతున్న సమయంలో చంపి ద్రౌపదిని పుత్రశోకం అనుభవించేలాగ చేశాడు. మాతృవేదనతో వున్న ద్రౌపదిని చూసి తట్టుకోలేక అర్జునుడు వెళ్లి బంధించి తెచ్చిన అశ్వత్థామను చూసి, ద్రౌపది నీ తల్లి నీ కోసం దుర్భరమైన దుఃఖంతో ఎంతగా తల్లడిల్లి పోతున్నదో కదా అని తన మాతృహృదయాన్ని చాటుకుంది ఈపద్యంలో.

"అక్కట ! పుత్రశోక జనితాకుల భార విషణ్ణచిత్తవై
పొక్కుచు నున్నభంగి నిన్ను ఘోర గిరీటి నిబద్ధు జేసి నే
డిక్కడ కీడ్చి తెచ్చుట సహింపనిదై భవదీయ మాతనే
డెక్కడ నిట్టి శోకమున నే క్రియ నేడ్చుచుల బొక్కు చున్నదో!"

(భాగవతం)

అని ఎదుటి వారిని క్షమించే గుణం కూడా కలిగివున్న పాత్రగా కూడా ద్రౌపదిని చిత్రించారు.

**కుంతి పాత్ర** : ఇదే సందర్భంలో కుంటి పాత్ర కూడా గమనించదగినది. కుంతి ఎలాంటి కష్టాలు పడినదో ఉద్యోగపర్వంలో ధర్మరాజు నోట మనం వినవచ్చు. రాయ భారానికి వెళ్తున్న కృష్ణుడితో ధర్మరాజు అంటున్న మాటలు ఈ పద్యం గమనించవచ్చు.

"వచ్చె జనార్దనుం డనిన వార్తకు బ్రాణము మేని కంతకున్
వచ్చిన సేద దేరు గురువంశ పవిత్ర చరిత్ర గొంతి నీ
వచ్చుటి కేగి పాండవుల యందర మారని చెప్పి మ్రొక్కుచున్
గ్రుచ్చియ కౌగిలించుకొని కుందిన చిత్తము నొప్పి దీర్పుమీ !"

(మ.భా - ఉద్యోగ. తృతీయ. - 134)

అని ధర్మరాజు, పాలలో పడిన బల్లి వలె దు:ఖంతో కృంగిపోయిన తన తల్లి కుంతీదేవిని దర్శించి, ఆమె శ్రమను తొలిగించి రమ్మని చెప్పే ఈ పద్యం ఎంతటి వారికైనా కళ్ళు చెమర్పింపజేస్తుంది.

అలాగే కుంతీదేవి క్షత్రియ ధర్మం గురించి తెలుపుతూ క్షత్రియ వృత్తి వీరవృత్తి అని , రాజులు పరాక్రమంతో, గౌరవంతో, పౌరుషంతో బ్రతకాలి అని క్రింది పద్యంలో హితబోధ చేసినట్లుంటుంది .

"మరచిరె కొలువున ద్రౌపది బరచిన బన్నంబు? ధర్మపథము దొఅంగన్
వెరుచుట కప్పటి కది దగు జెరచినచో వెదకవలదే చిరతర కీర్తన్"

(మ.భా - ఉద్యోగ.చతుర్థి. - 18)

అని తెలివిమాలిన నీతిని ప్రదర్శించరాదని తన మాటలను పాండవులకు చెప్పవలసిందిగా శ్రీకృష్ణుడితో చెప్పుతూ, జరిగిన అవమానాన్ని మరిచిపోకూడదని చెప్తున్న హెచ్చరికపు పలుకులు ఈ పద్యంలో కనబడుతున్నాయి.

పోతన కావ్యాల్లో గమనించినట్లయితే భక్తి ఆధ్యాత్మిక చింతనలో లీనమయ్యే విధంగా దేవతామూర్తులు, వారి ఆలోచనా విధానం, లోక కళ్యాణం కోసం వారి త్యాగం, నడుచుకునే విధానం కనబడుతుంది.

దేవతలు, రాక్షసులు పాల సముద్రమును చిలికి నప్పుడు ముందుగా హాలాహలం వెలికి రాగ దానిని కేవలం శివుడు సేవిస్తేనే అమృతం వస్తుందని దేవత లందరు పార్వతీ దేవిని వేడుకోగా పార్వతీ దేవి శివున్ని హాలాహలం సేవించమని చెప్పే పద్యం.

"మ్రింగెడిది గరళమని
మ్రింగెడివాడు తన విభుండని
మ్రింగమనెను సర్వమంగళా, ప్రజల మేలుకున్
మంగళ సూత్రమునెంత మది నమ్మినదో."

(పోతన భాగవతం)

అనే ఈ పద్యంలో పార్వతి దేవికి తన మంగళ సూత్రము మీద, శక్తి సామార్థ్యాల మీద ఎంత నమ్మకముందో తెలుస్తుంది.

ఇక శ్రీనాథుని కావ్యాల్లో, ప్రబంధయుగం, దక్షిణాంధ్ర యుగంలో గమనించినట్లయితే అప్పటి సాంఘిక పరి స్థితులు కొంత మెరుగు పడటం వలన ప్రజలు విలాస వంతమైన జీవితానికి అలవాటు పడినట్లు తెలుస్తుంది. క్రమంగా నైతిక విలువలు పతనమయ్యాయి అని చెప్పుకోవచ్చు. "శృంగార నైషధం"లోని దమయంతి వర్ణన గమనించినట్లయితే శృంగార నాయికగా ఉంటుంది.

"రాజబింబము నందు సారము హరించి
చేయబోవు విధాత యాచెలియ మోము
నడిమి రంధ్రంబు నందు కానంగవచ్చు
ఖనిక నీలిమ యది నిదర్శనము గాదె."

(శృంగార నైషధం )

అని దమయంతి ముఖ సౌందర్యాన్ని వర్ణించాడు శ్రీనాథుడు. అంతటి సౌందర్యరాశి దమయంతిని వివాహమాడడానికి ఇంద్రాది దేవతలే వచ్చినా కూడా కేవలం తను మననుసందు లగ్నం చేసుకున్న నలున్నిమాత్రమే వివాహమాడిన వనిత దమయంతి.

ప్రబంధ కావ్యాల్లో అష్టాదశ వర్ణనలు చేస్తూ అందులో భాగంగా అంగాంగ వర్ణనకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చినట్లు

తెలుస్తుంది. "మనుచరిత్ర" వంటి కావ్యాలలో వరూధినిని శృంగార నాయికగా రూపవర్ణన చేసినా కూడా చివరగా ఈ కావ్యం కుటుంబానికి ప్రాధాన్యతనిచ్చే కావ్యంగా రూపొందించారు.

"అతడా వాతపరంపరా పరిమళ వ్యాపారలీలన్ జనా
న్వీత మిచ్చోటని చేరబోయి కనియెన్ విద్యుల్లతా విగ్రహన్
శత పత్రేక్షణ జంచరీక చికురన్ జందాస్య జక్రస్తనిన్
నతనాభిన్ నవలా నొకానొక మరున్నారీ శిరోరత్నమున్."

(మనుచరిత్ర)

అని అల్లసాని పెద్దన రాసిన ఈ మనుచరిత్ర కావ్యములో ప్రవరాఖ్యుడు హిమవత్పర్వతముపైన చూసిన వరూధిని సౌందర్య మును ఈ పద్యంలో అంగాంగ వర్ణన చేయడం కనిపిస్తుంది.

**గోదాదేవి పాత్ర చిత్రణ** : శ్రీకృష్ణదేవరాయలు రాసినటు వంటి ఆముక్త మాల్యద గ్రంథంలో గోదాదేవికి నూతన యవ్వనారంభమవుతున్న సమయంలో గోదాదేవి యొక్క బాల్యం తన మనసులోని బాధను వెల్లడిస్తున్నట్టుంటుంది పద్యం.

"వట్టి గాంభీర్య మొక్కడు వెట్టుకొనియె
నాభి నానాటికి గతి నాటి ప్రియము
చవుకయైనట్టి యిచ్చట జనదు నిలువ
ననుచు జారిన కరగి బాల్యంబు జారె"

(ఆముక్తమాల్యద)

గోదాదేవికి నూతన యవ్వనారంభం వలన బాల్యం, తనకు ఇక చోటు లేదని, నేను ఇక్కడ ఉండటం ఇక విలువ లేనిది అవుతుందని తిన్నగా జారుకుంది అని గోదాదేవి సౌందర్యాన్ని వర్ణించి లోకకళ్యాణారం వెలసిన శ్రీరంగనాథస్వామి , గోదాదేవిల వివాహవుట్టాన్ని అత్యద్భుతంగా వర్ణించి పాఠకులను ఆనందింపజేశారు.

**సత్యభామ పాత్ర** : నంది తిమ్మన రాసిన పారిజాతా పహరణంలో సత్యభామ పాత్ర పోషణ అద్భుతమైన దిగా చెప్పవచ్చు. కావ్యంలో తన భర్త ప్రేమ తనకు మాత్రమే సొంతం కానీ పరస్త్రీలకు దక్కకూడదనే వ్యక్తిత్వం కుటుంబ విలువలను తెలుపుతుంది.

"చక్కనిదానననుచు నెలజవ్వనినంచు జగంబులోన
బేరెక్కిన దాననంచు
బతియెంతయు నాకనురక్తు డంచు దానిక్కుచు
విఱ్ఱవీ గుచు"

(పారిజాతాపహరణం)

ఈ విధంగా కవి సత్యభామ కోపావేశాన్ని చిత్రించారు. సత్యభామ తన పతి శ్రీ కృష్ణుడిని ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే అనురాగమూర్తి.

"ననుభవదీయ దాసుని మనంబున నెయ్యపు
కిన్కబూనితా
చిన యది నాకు మన్ననయ, చెల్వగు నీ పద
పల్లవంబు మ
త్తను పులకాగ్ర కంటక వితానము తాకిన నొచ్చునంచు నే
ననియెద నల్క మానవుగదా యికనైన సరాళకుంతలా"

(పారిజాతాపహరణం)

అని కృష్ణుడే ప్రాదేయపడే పాత్ర సత్య భామది. తనకు తాను తక్కువ చేసుకునే మనస్తత్వం లేని స్త్రీగా చిత్రించారు.

అదేవిధంగా ఆనాటి కాలంలో రాజులు బహు భార్యాత్వమును కలిగివున్నారు. అయినప్పటికీ కూడా వారి రసికతకు భంగం కలిగే సందర్భంలో ప్రియురాలిని ప్రసన్నం చేసుకోవడానికి కాళ్ళు పట్టుకోవడానికి కూడా వెనుకాడే వారు కాదని ఇలాంటి పద్యాల ద్వారా తెలు స్తుంది.

"జలజాతానన వాసవాది సుర పూజాభాజనంబై తన
ర్చులతాంతాయుధు గన్నతండ్రి శిరమచ్చో వామ పాదంబునన్
దొలగన్ ద్రోచె లతాంగి యట్లయగు, కాంతల్
నేరముల్ సేయపే
రలుకన్ బూనినయట్టి కాంత లుచిత వ్యాపారముల్ నేర్తురే!"

(పారిజాతాపహరణం)

అని ప్రియురాలు తన్నినా మన్ననే అన్నట్లుగా శృంగార రసం, ప్రణయ కోపాన్ని చిత్రించారు నంది తిమ్మన.

నిగమశర్మ అక్క : తెనాలి రామకృష్ణుడు వ్రాసిన పాండురంగ మహాత్మ్యంలో నిగమశర్మ అక్క పాత్ర తన తమ్ముడు నిగమశర్మ ప్రవర్తనను చక్కదిద్దేందుకు, సంసారమును బాగు చేయడానికి ఆమె ఎంతో శ్రమపడి హితబోధ చేసే విధానం ఈ పద్యంలో కనబడుతుంది.

"నాదు సహెూదరుండు సుజన స్తవనీయ నయప్రశస్తి బ
హ్మాదుల మెచ్చ, డేనతని యజ్ఞమునం గడు బూజ్యురాలనై
వేది యలంకరింతునని వేవురి లోపల నాడుకొందు నీ
వేదియు లేక సర్వగుణహీనుడ వౌట యెఱుంగ ! దమ్ముడా!"

(పాండురంగ మహాత్మ్యం)

అనగా మా పుట్టింట్లో నీగురించి ఎంతో గొప్పగా చెప్పుకునేదాన్ని. మా తమ్ముడు న్యాయం, ధర్మం విషయంలో బ్రహ్మదేవుని కూడా మెచ్చుడు అని, నీవు భవిష్యత్తులో యజ్ఞం చేస్తే నేను ముఖ్య పదవిని పొందుతాను అనుకుంటే నీవు ఇవన్ని వదిలేసి తిరుగుతున్నావని బాధ పడుకుంటు అతన్ని మార్చడానికి ప్రయత్నించే స్త్రీగా అక్క పాత్రకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి వర్ణించినట్లు కనిపిస్తుంది. అంటే ప్రబంధ కావ్యాలయిన మనుచరిత్ర, వసుచరిత్ర వంటి కావ్యాలలో నాయికకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి, పాండురంగ మహాత్మ్యం వంటి కావ్యాలలో మిగిలిన వారికి ఉదా: సుజాత, నిగమ శర్మ అక్క వంటి పాత్రలకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి మహిళ పాత్ర చిత్రణను ఉదాత్తమైన పాత్రగా చిత్రించడం గమనార్హం.

సుభద్రవర్ణన : చేమకూర వేంకట కవి కాలములో శృంగార రసమునకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చినట్లు తెలుస్తుంది.

"కడు హెచ్చు కొప్పు దానిం
గడువా జనుదోయి హెచ్చు: కటియన్నటికిన్
గడు హెచ్చు: హెచ్చులన్నియు
నడుమే పసలేదు గాని నారీమణికిన్"

(విజయవిలాసం)

ఈ పద్యంలో సుభద్ర యొక్క బాహ్య సౌందర్యాన్ని అంగాంగ శృంగార వర్ణన చేయడం వలన తాపీధర్మారావు గారు ఈ గ్రంథాన్ని శృంగార ప్రబంధంగా కూడా ప్రశంసించారు.

ఇప్పటి వరకు చర్చించిన విషయాల్లో ప్రధానంగా రెండు అంశాలు కనబడుతాయి. ప్రబంధాలకు ముందు నాయికలే కాకుండా మిగిలిన వారి పాత్రలు కూడా కనబడుతాయి. కాలాన్ని బట్టి కవుల ఆలోచనల్లో, పాత్ర చిత్రణలల్లో తేడా ఉంటుంది. కావ్యాలన్నీ ఆనందంతో ఉపదేశాన్ని అందించే ఉద్దేశంతో రాయబడినవి. కావ్యాలలో కొన్ని సార్లు అంగాంగ వర్ణన చేసినా కూడా ఇవి శ్రవ్య కావ్యాలే కావున ఇష్టాఇష్టాలను బట్టి ఎవరికి నచ్చినవి వారు చదివి ఆనందం పొంది ఉపదేశాన్ని గ్రహిస్తారు. కావున ఏ కావ్యాలను చదివినా ఆ కావ్యాలలో ఆనాటి సాంఘిక పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకొని చదవాలన్న ఆలంకరికులు, ప్రసిద్ధ విమర్శకుల విషయాలను మనసులో పెట్టుకున్నట్లయితే ఆ పాత్రలోని ఔచిత్యం మాత్రమే ఆస్వాదించే అవకాశం కలుగుతుంది.

## ఉపయుక్త గ్రంథాలు :

1. టిటిడి వారి మహాభారత ప్రచురణ గ్రంథాలు
2. జి. నాగయ్య పుస్తకాలు
3. పాండురంగ మహాత్మ్యం
4. పోతన భాగవతము

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2(1), February 2022
ISSN No. 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావ వీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# పోతన భాగవతము - నవవిధ భక్తి మార్గాలు

- డా. జి. శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పటాన్‌చెరు, సంగారెడ్డి జిల్లా.

**ఉపోద్ఘాతము :**

సమస్త ప్రాణికోటిలో మానవ జన్మ ఉత్తమమైనది. సమస్త ప్రాణులకు చివరి లక్ష్యం భగవత్ సాక్షాత్కారమే. అది ఇతర ప్రాణులకన్న మానవులకు అవకాశమెక్కువ. భగవంతుని సాక్షాత్కరించుకొనుటకు మార్గములెన్నియో కలవు. వాటిలో భక్తిమార్గము సులభము, మధురము సునాయాసకరము. భక్తి మార్గము ననుసరించువారు కఠిన నియమములు అవలంబించవలసిన పనిలేదు. భక్తి తొమ్మిది రకములని భాగవతములో చెప్పబడినది. ఆ నవవిధ భక్తి మార్గములు ఎలా భాగవతమున ప్రతిఫలించినవో తెలుపుట ఈ వ్యాసము ముఖ్యోద్దేశము.

**విషయ వివరణ :**

వేదములను నాలుగు భాగాలుగా విభజించి, బ్రహ్మ సూత్రములు రచించి, పంచమవేదమైన జయేతిహాసము (మహాభారతం) ప్రవచించి, కొన్ని పురాణాలు చెప్పినప్పటికీ శ్రీవేదవ్యాసమునీంద్రునకు ఏదో తెలియని 'వెలితి' అనిపించినది. అప్పుడు తన కడకు విచ్చేసిన నారదుని ఇదే విషయము వ్యాసభగవానుడు అడుగగా, నారదుడు ఎన్ని నీతులు, న్యాయములు, ధర్మసూక్ష్మములు చెప్పినా, శ్రీమన్నారాయణుని లీలలను విష్ణుభక్తిని ప్రవచింపకున్న ప్రయోజనమేమి? కావున భక్తి భావ బంధురమైన శ్రీవిష్ణు కథలను తెలుపుమనిన అప్పుడు వ్యాస మునీంద్రుడు శ్రీ మహాభాగవత పురాణము వివరించెను.

భాగవతమున నవవిధ భక్తి మార్గములు ఇలా చెప్పబడినవి.

శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్ ।
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్॥
(సంస్కృత భాగవతం: సప్తమస్కంధం, 5వ అధ్యాయం, 23వ శ్లోకము)

దీనినే బమ్మెర పోతన కవీశ్వరుడు ఇలా చెప్పాడు.

తనుహృద్భాషల సఖ్యమున్, శ్రవణమున్, దాసత్వ
మున్, వందనా
ర్చనముల్, సేవయు, నాత్మలో నెఱుకయున్, సంకీర్త
నల్, చింతనం
బను నీ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్
నమ్మి న
జ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబు
దైత్యోత్తమా
(శ్రీమహాభాగవతము సప్తమస్కంధము:167 పద్యం)

1.శ్రవణం 2.కీర్తనం 3.స్మరణం 4.పాదసేవనం 5.అర్చనం 6.వందనం 7.దాస్యం 8.సఖ్యం 9.ఆత్మ నివేదనం. ఇవి నవ విధ భక్తి మార్గాలు భక్తుడు తనకు ఇష్టమైన మార్గముననుసరించి భగవంతుని చేరవచ్చును.

**శ్రవణం :**

జ్ఞానమును పొందుటకు అత్యంత సులభమార్గము శ్రవణం. జ్ఞానులు తమ నిరంతర అధ్యయనము ద్వారా, అభ్యాసము ద్వారా, తపస్సు ద్వారా సంపాదించిన జ్ఞానమును, జ్ఞానార్జనా పిపాసతో తమ కడకు వచ్చిన వారికి ఆ జ్ఞానమును ఉపదేశింతురు. కావున జ్ఞానము పొందుటకు సులభమార్గము శ్రవణము. పూర్వకాలంలో గురువులు చెప్తుంటే శ్రవణము వలననే జ్ఞానమును పొందేవారు. వ్యాసభగవానుడు తనశిష్యులకు ఉపదేశించిన జ్ఞానమును తరువాత వారు ఇతరులకు వినిపించిరి.

వ్యాసుల వారి శిష్యుల నుండి సూతుడు, సూతుని ద్వారా శౌనకాది ఋషులు శ్రవణం ద్వారానే జ్ఞానమును పొందారు. వ్యాసుని ద్వారా శుకమహర్షి భాగవతాన్ని విని, ఆ భాగవతాన్ని శుకమహర్షి ఏడు రోజుల పాటు పరీక్షిత్తుడనే రాజుకు వినిపిస్తాడు. పరీక్షిత్తుడు విష్ణు లీలలను

వినడం ద్వారానే మోక్షాన్ని పొందుతాడు. అందుకే పోతన గారు ఇలా అన్నారు. "విష్ణు నాకర్ణించు వీనులు వీనులు" (శ్రీమహాభాగవతము:సప్తమస్కంధం, 169వ పద్యం)

**కీర్తనం :**

భగవంతునిపై భక్తి కలిగిన వారు భగవంతుని నామ గుణ కీర్తన చేయకుండా ఉండలేరు. పోతనగారు భాగవత ప్రారంభములో ఇలా అంటారు.

"నోరునొవ్వంగ హరికీర్తినుడువడేని

.........................................

కలుగనేటికి తల్లుల కడుపు చేటు"

(శ్రీమహాభాగవతము, ప్రథమస్కంధము, 12వ పద్యము)

నిరంతర భగవల్లీలాకీర్తనం మోక్షదాయకం. అందుకే పోతనగారు ఇలా అన్నారు.

"శ్రీనాథు వర్ణించు జిహ్వాజిహ్వా"

(శ్రీమహాభాగవతము, సప్తమస్కంధము, 169వ పద్యము)

ఎక్కడా గోవును పాలు పితికినంత తడవు కూడా ఒక చోట నిలువని శుకమహర్షి ఏడు రోజుల పాటు ఒక చోట ఉండి పరీక్షితునికి భాగవతాన్ని వినిపించాడు, కారణం హరి లీలా కథా సంకీర్తనానందమాధుర్యాస్వాదనార్థమే.

**స్మరణం :**

మనస్సులో నిరంతరం హరిని గూర్చి స్మరించుకోవడము కూడా ఒక భక్తి మార్గము. పోతనగారు "మధువైరి దవిలిన మనము మనము" (శ్రీమహాభాగవతము: సప్తమస్కంధము, 169వ పద్యము)

ప్రహ్లాదుని వంటి పరమ భాగవతాగ్రేసరులు నిరంతరం హరిని స్మరించుకుంటూనే ఉంటారు. హిరణ్యకశ్యపుడు ఎన్ని విధాల దండించుచున్నా సరే ప్రహ్లాదుడు హరిని స్మరించడం మానలేదు.

"పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్ భాషించు
చున్ హాసలీ
లానిద్రాదులు సేయుచున్ దిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీనారాయణ పాదపద్మ యుగళీ చింతామృతాస్వాద సం
ధానుండై మఱచెన్ సురారి సుతుడేతద్విశ్వమున్ భూవరా!"

(శ్రీమహాభాగవతము: సప్తమస్కంధము - 123వ పద్యము)

అలుకనైన జెలిమినైనగామంబున
నైన బాంధవమున నైన భీతి
నైన దగిలి తలప నఖిలాత్ముడగుహరి
జేరవచ్చువేఱుసేయడతడు

(శ్రీమహాభాగవతము, సప్తమస్కంధము. 14వ పద్యము)

**పాదసేవనం :**

శ్రీమహావిష్ణువు పాదములను సేవించుట కూడా భక్తి మార్గములలో ఒకటి. సుదాముడు (మాలాకారుడు) శ్రీకృష్ణుని కోరిన కోరిక చూడవచ్చు.

నీపాదకమలసేవయు
నీపాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపార భూత దయయును
దాపస మందార! నాకు దయసేయగదే

(శ్రీమహాభాగవతము, దశమస్కంధము, పూర్వభాగము 1268వ పద్యం)

**అర్చనము :**

భగవంతుని పూజించడం కూడా నవవిధ భక్తి మార్గాలలో ఒకటి. షోడశోపచారాలు అర్చన క్రిందకే వస్తాయి.

పత్రము, పుష్పము, ఫలము, తోయము ఏదైనా భక్తితో సమర్పిస్తే దానిని తాను స్వీకరిస్తానని భగవంతుడు భగవద్గీతలో చెప్పడం జరిగింది. అందుకే దైవం అర్చావతారాలుగా దేవాలయాలలో అర్చింపబడుతున్నాడు.

"కమలాక్షు నర్చించు కరములు కరములు"

(శ్రీమహాభాగవతము, సప్తమస్కంధము, 169వ పద్యము)

అని చెప్పారు పోతనగారు. ఇంకా భాగవత ప్రారంభములో

"చేతులారంగ శివుని పూజింపడేని"

(శ్రీమహాభాగవతము, ప్రథమస్కంధము, 12వ పద్యము) అన్నారు.

**వందనము :**

వందనమంటే నమస్కరించడం. అభివాదం, కృతజ్ఞత చూపడం అని కూడ అంటాము. సాష్టాంగ నమస్కారము అనగా ఎనిమిది అంగాలను నేలకు అన్చి వందనం చేయడం ఒక వ్యక్తి చూపించే వినయమునకు పరాకాష్ఠ. భాగవతము దశమ స్కంధములో కంసుని పంపున అక్రూరుడు శ్రీకృష్ణుని కొరకు వస్తూ దారిలో శ్రీకృష్ణుని పాదముద్రలు చూసి నమస్కరించి, రథము నెక్కకుండా నడిచి రావడం వందన భక్తి కోవకే వస్తుంది.

**దాస్యం :**

భగవంతుని ప్రభువుగా, భక్తుడు తనను తాను దాసుడుగా భావించుకొని సేవలు చేయడమే దాస్యభక్తి. రామాయణములో ఆంజనేయుడు దాస్యభక్తికి పరమోత్కృష్టోదాహరణము.

**సఖ్యము :**

భగవంతుని తనకు మిత్రునిగా భావించి చనువుగా ఉండడమే సఖ్య భక్తి. అర్జునుడు, గోపబాలురు, కుచేలుడు సఖ్యభక్తికి ఉదాహరణలుగా చెప్పవచ్చు.

"ఎన్నడునైన యోగివిభులెవ్వని పాదపరాగ మింత యున్
గన్నులగానరట్టి హరిగౌగిట జేర్చుచు జెట్ట బట్టుచున్
దన్నుచు గ్రుద్దుచున్నగుచు దద్దయు బైపడి కూడి యాడుచున్
మన్నన సేయు వల్లవకుమారుల భాగ్యము లింత యొప్పునే"

(శ్రీమహాభాగవతము, దశమస్కంధము, పూర్వభాగం, 459వ పద్యము)

గోపబాలురు శ్రీకృష్ణపరమాత్మను మిత్రునిగా భావించి, కౌగిలించుకుంటూ, తన్నుచు, గ్రుద్దుచూ, చేయి పట్టుకుంటూ, పైనబడుతూ ఉంటారు. ఇది సఖ్యభక్తికి ఉత్తమ ఉదాహరణగా చెప్పవచ్చు.

**ఆత్మనివేదనము :**

భక్తుడు తమ సర్వాస్వాన్ని భగవంతునికి సమర్పించుకొని శరణాగతుడవడమే ఆత్మనివేదనం. బలిచక్రవర్తి, గజేంద్రుడు తమ సర్వస్వాన్ని భగవంతునికి సమర్పించుకొని శరణాగతి పొందినారు. వచ్చినవాడు విష్ణువని తెలిసినా సరే తన మాట తప్పకుండా సర్వస్వమూ వామనునికి ధారపోసినవాడు బలిచక్రవర్తి. అనన్యభక్తితో గజేంద్రుడు ఇలా ప్రార్థించాడు.

"లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను మూర్ఛవచ్చె దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప నితఃపరంబెఱుగ మన్నింపందగున్ దీనునిన్
రావే యీశ్వర! కావవే వరద సంరక్షించు భద్రాత్మకా"

(శ్రీమహాభాగవతము, అష్టమస్కంధము, 90వ పద్యము)

**ముగింపు :**

మానవుడై పుట్టి, భగవత్ సాక్షాత్కారము పొందని జన్మ వృథా. కావున నవవిధ భక్తి మార్గములలో ఏదో ఒక పద్ధతి నవలంబించి విష్ణుసాయుజ్యము నందుట సర్వప్రాణులకు అవశ్యము.

**ఆధార గ్రంథాలు :**

1. భాగవత వైజయంతిక (వ్యాససంకలనం). 1983. కరుణశ్రీ సంపాదకుడు.
2. వేదవ్యాస భాగవతం - జన్నాభట్ల వాసుదేవశాస్త్రి.
3. శ్రీమహాభాగవతము - బమ్మెర పోతన (పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 11వ ముద్రణ)

★★★

BHAVAVEENA
VOL. 19, ISSUE. 2(1), FEBRUARY - 2022.
ISSN NO. : 2456-4702 - RNI NO. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group -1 Journal
under Arts and Humanities Category

# శైవసాహిత్యంలో అష్టావరణముల విశిష్టత

**డాక్టర్ మఠపతి మాంతయ్య,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (తెలుగు)
తారా ప్రభుత్వ కళాశాల (స్వ), సంగారెడ్డి.

**ఉపోద్ఘాతము:** భారతదేశములో అనేక ధర్మములు కలవు. వాటిలో శైవధర్మము అత్యంత ప్రాచీన ధర్మము. శైవధర్మములో వీరశైవధర్మము విశిష్ట ధర్మము. వీరశైవధర్మములో పంచాచారములు, షట్ స్థలములు, అష్టావరణములు ప్రధానమైనవి. ఈ పత్రములో విశేషముగా అష్టావరణములను గూర్చి చర్చించనైనది.

అష్ట విధ ఆధ్యాత్మిక ఆచరణములకు యోగ్యమైన వాటికి అష్టావరణముని పేరు. పంటపొలాలను రక్షించటానికి చుట్టూ కంచె ఎలా అవసరమవుతుందో, రాజప్రసాదానికి కోట గోడ ఎంత అవసరవెూ, యుద్ధవీరునికి కవచమెంత అవసరమో అదేవిధంగా ప్రతి వీరశైవునకు అష్టావరణములు అత్యంతావశక్యములు.

అష్టవిధ అవరణతో ఈ దేహమునకు మల, మాయ, కార్మికాది రూ శత్రువులు దూరంగా ఉంటాయి. ఈర్ష్య, అసూయ, ద్వేషాది దుర్గుణములు దరిజేరడానికి సహసించవు.

1.గురు 2.లింగ 3.జంగమ 4.విభూతి 5. రుద్రాక్ష 6.మంత్ర 7.పాదోదక 8.ప్రసాదములనేవి అష్టావరణములు. వీటిని వీరశైవులు విధిగా పాటించాలి. ఈ అష్టావరణ అనుష్టానమే లింగైక్యము (మోక్షము) నకు సాధనం. అష్టావరణ అనుష్టానం వలన లింగాంగ సామరస్యం సిద్ధింపబడుతుంది.

కావున వీరశైవులు అష్టావరణములను గూర్చి తెలుసుకొని, ఆచరించవలెను.

## 1.గురువు

గురువు సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపుడు జ్ఞానమూర్తి లింగాంగ సామరస్యం కలవాడు. నిత్యుడు, అమలుడు, సచ్చిదానంద స్వరూపుడు, భవరోగములను హరింపజేసేవాడు.

## 2.లింగము

ఈ సమస్త చరాచర సృష్టి దేనియందు లయమై, మళ్ళీ దేనియందు ఉద్భవిస్తుందో అదే లింగము.

శ్లో॥ లీయతే యత్ర భూతాని నిర్గచ్ఛంతి యత: పున:।
తేనలింగం పరంవ్యోమ నిష్కల: పరమ: శివ:॥

సృష్టి, స్థితి, లయలకు కారణ భూతమైన లింగమే పరబ్రహ్మమనీ, శివుడే లింగ స్వరుపుడని భావం.

నాదమే లింగం, బిందువే పీఠం. ఈం రెండింటి కలయిక లింగాకారం. లింగంలోనే ప్రపంచమంతా లయమవుతుంది. జగద్వ్యాపకుడైన శివుడు లింగస్వరూపుడు. ఆకాశమే లింగం. పృథివీ తలం పీఠం అని భావిస్తే, ఆకాశం, భూమితో కూడిన జగత్తు అంతా లింగారూపమే అని గోచరమవుతుంది. కాబట్టి ''సర్వమిదం లింగామయం".

శ్లో॥ లింగమధ్యే జగత్సర్వం త్రైలోక్యం సచరాచరం।
లింగ బహ్యాత్ పరం నాస్తి తస్మాల్లింగం ప్రపూజయేత్॥

ఈ జగత్తు అంతా లింగంలోనే ఇమిడి ఉన్నది. లింగం వెలుపల ఏమీ లేదు. కావున విశ్వ వ్యాపకమైన లింగ పూజయే శ్రేష్ఠమైనది. హరి బ్రహ్మాది దేవతలందరూ

## 3. జంగమము :

వీరశైవులకు ''జంగమయ్య'' సర్వదా పూజనీయుడు. జంగయ్యలను పూజిస్తే పరమ శివుని పూజించినట్లే

శ్లో॥ ఏకమూర్తిస్త్రయోభాగా: గురోర్లింగంతు జంగమం।
జంగమంచ గురుర్లింగం త్రివిధం లింగాముచ్యతే॥

పరమశివుడొక్కడే గురు, లింగ, జంగమ రూపాలతో ప్రకాశిస్తున్నాడని భావం. ఒక్కమాటలో చెప్పాలంటే "జంగముడే శివుడు, శివుడే జంగముడు"

అహంకార, మమకారములను వర్జించి, స్వస్వరూప జ్ఞానమును పొంది, సమాజమునకు మార్గ నిర్దేశ్యం చేసేవాడు కనుక "జంగమయ్య"ను చరలింగమని కూడా పిలుస్తారు. "జంగమం" అంటే చరించునది, "జంగముడు" అంటే "చరించేవాడు"

## 4. భస్మము :

విభూతిర్భూతిరైశ్వర్యమణిమాదికమష్టదా।
అణిమా మహిమాచైవ గరిమా లఘిమ తథా॥

అణిమ, మహిమా, గరిమా, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశత్వం, వశిత్వం అనే అష్టైశ్వర్యములను కలిగి ఉన్నది విభూతి. కావున నొసట విభూతి ధరిస్తే చాలు అష్టైశ్వర్యములు ప్రాప్తిస్తాయి.

విభూతి ధారణ చాలా శ్రేష్టమైనది. పవిత్రమైనది. గోమయం చేత మంత్ర ప్రపూరితంగా తయారు చేయబడిన భస్మమే నిజమైన భస్మము.

లింగాధారులు విధిగా భస్మమును ధరించాలి. పంచ బ్రహ్మ మంత్రములతో న్యాసం చేస్తూ భస్మ ధారణ చేయాలి. ఏ వీరశైవుడైతే త్రికాలములలో భస్మ ధారణ చేస్తాడో ఆ వీర శివుడు సాక్షాత్తు శివ స్వరూపుడే.

భస్మము, విభూతి. భసిత, భస్మ, క్షార, రక్ష అనే పేర్లతో పిలువబడుతుంది. దీనిలో భసిత మపగా శివతత్వ ప్రకాశమైనది. భయోత్పాతాలను దూరంగా ఉంచునట్టిది. క్షారమనగా తాప త్రయాత్మకమైన దు:ఖమును నాశనము చేయునట్టిది. రక్ష అనగా భూత ప్రేత గ్రహది బాధల నుండి రక్షించునది అనే అర్థాలున్నాయి.

స్త్రీలు, పురుషులు అనే భేదం లేకుండా ఎవరైనా భస్మమును ధరించవచ్చు. శివ పూజా సమయములలో మరియు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాలలో భస్మమును ధరించాలి. భస్మమును నీటితో కలిపి ధరించాలి. పొడి భస్మముకన్నా తడి భస్మము శ్రేష్టమైనది. భస్మమును మూడు రేఖలు (త్రిపుణ్డ్రములు)గానే ధరించాలి.

భస్మధారణ వలన ఆత్మశుద్ధి అవుతుంది. క్రోధాదులు జయించబడుతాయి. ఇంద్రియనిగ్రహం కలుగుతుంది. శివ సాయుజ్యం ప్రాప్తిస్తుంది. అనగా భస్మధారికి పునర్జన్మ లేదని లింగపురాణంలో పేర్కొనబడింది.

శ్లో॥ సర్వ తీర్తేషు యత్పుణ్యం సర్వ యజ్ఞేషు యత్ ఫలం।
తత్ఫలం కోటి గుణితం భస్మ స్నానాన్న సంశయ:॥

## 5. రుద్రాక్ష :

ఇష్టలింగ ధారణ, భస్మధారణ చేత శోభితుడైన వీరశైవుడు రుద్ర చిహ్న ప్రకటన కొరకు ధరించేది రుద్రాక్ష. శివ జీవైక్యానికి మార్గమును నిర్దేశించేది రుద్రాక్ష. అష్టావరణములలో "రుద్రాక్ష" కూడా ప్రధానమైనది. భక్తులకు రుద్రాక్ష ధారణ అత్యంతావశ్యకం.

రుద్రాక్ష ధారణ వలన జీవ భావం వదిలి వేయబడి, శివైక్య భావం సిద్ధిస్తుంది. అనంత కోటి జీవులలో రుద్రాక్షధారి సర్వోత్తముడు. రుద్రాక్ష ధరించిన భక్తుడు సాక్షాద్దు పరమ శివుడే అవుతాడని ఉపనిషత్తులు పేర్కొన్నాయి.

పరమశివుడు కొన్ని వేల సంవత్సరాలు తపస్సు చేసిన పిమ్మట కన్నులు తెరిచాడు. కన్నులు తెరిచిన వెంటనే నేత్రముల నుండి జలబిందువులు వచ్చాయి. ఆ జలబిందువులు భూమిపై పడి, రుద్రాక్ష వృక్షములైనాయి.

శ్లో॥ వినా భస్మ త్రిపుండ్రీనా వినా రుద్రాక్ష మాలయా।
పూజితో పి మహాదేవో నాభీష్ట ఫలదాయక:॥

భస్మ త్రిపుండ్రములను ధరించకుండా, రుద్రాక్ష మాల ధారణ లేకుండా ఇష్టలింగ పూజ చేయకూడదు. శివుని పూజించే వారు తప్పకుండ భస్మ, రుద్రాక్షలను ధరించాలి. అప్పుడే సకల శుభములు చేకూరుతాయి.

## 6.మంత్రము:

"ఓం నమః శివాయ" అనే ప్రణవ పంచాక్షరీ మంత్రమే మంత్రరాజము. వేదాలలో శివాగమాలలో, పురాణాలలో పంచాక్షరీ మహా మంత్ర వర్ణన ఉన్నది.

అన్ని విద్యలలో వేదమే శ్రేష్టమైన విద్య. దానిలో యజుర్వేదములోని శ్రీ రుద్రాధ్యాయము విశేషమైనది.

**ఆధార గ్రంథాలు**

1. వీరశైవ సాహిత్యం– సామాజిక దృక్పథం డా॥సత్తెనపల్లిబాబు.
2. బసవపురాణము– పాల్కురికి సోమనాథుడు.
3. శ్రీసిద్ధాంత శిఖామణి – శివయోగి శివాచార్య.

* * *

భావవీణ

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

February (1) 2022

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253
UGC Care List Group - 1
Journal under Arts and
Humanities Category




Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989731963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.